'అభివృద్ధి ఎంత ముఖ్యమో...
సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 230

మంగళవారం 11-11-2025

పొట్టి ఆవులు.. గట్టి మేలు!

దేశీ పొట్టి ఆవుల పెంపకంతో సన్నకారు రైతులకు ప్రయోజనాలెన్నో.
-11లో

భారత్ గురి బంగారం

ప్రపంచ షూటింగ్ పోటీల్లో ఒకేరోజు రెండు స్వర్ణాలతో కలిపి 4 పతకాలు
-12లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోమవారం ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంతంలో పేలుడు జరిగిన ప్రదేశంలో సహాయక చర్యలు

ఢిల్లీలో బ్లాస్ట్

ఎర్రకోట సమీపంలో కారులో పేలుడు

9 మంది దుర్మరణం

20 మందికి గాయాలు

- చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు... పేలుడు ధాటికి ధ్వంసమైన వాహనాలు
- ప్రాణభయంతో జనం పరుగులు.. రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి
- అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తామన్న అమిత్ షా.. ఘటనాస్థలం సందర్శన
- క్షతగాత్రులకు ఢిల్లీ లోక్‌నాయక్ జయప్రకాశ్ ఆస్పత్రిలో చికిత్స
- గతంలో పలువురి చేతులు మారిన పేలిన కారు.. గత యజమానుల అరెస్ట్
- ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ బ్రాంచ్, ఎన్ఐఏ బృందాల ముమ్మర దర్యాప్తు

13లో

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై

కోటి గళాల రణభేరి

రేపు రాష్ట్రవ్యాప్తంగా కదం తొక్కనున్న విద్యార్థి లోకం

బాబు సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఉద్యమ కార్యాచరణ

- కొత్త వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ
- రూ.2.5 లక్షల కోట్లు అప్పులు చేస్తూ.. కేవలం రూ.5 వేల కోట్లు వైద్య కాలేజీలకివ్వలేరా బాబూ?
- మెడికల్ కాలేజీలు ఏర్పాటైతే చేరువలో మెరుగైన వైద్యం, మన విద్యార్థుల వైద్య విద్య కలలు సాకారం
- మన విద్యార్థుల ఎంబీబీఎస్ కలలకు కుట్రపూరితంగా గండి కొట్టిన చంద్రబాబు సర్కారు
- ఏపీలో 471 స్కోరు వరకే ప్రభుత్వ కోటాలో సీటు.. తెలంగాణలో 403 స్కోర్‌కే కన్వీనర్ సీటు
- తెలంగాణలో కంటే 120 మార్కులు అధికంగా సాధించినా ఏపీలో బీసీ విద్యార్థులకు తీవ్ర నిరాశే
- కొత్త వైద్య కళాశాలలను బాబు కుట్రపూరితంగా అడ్డుకోవడంతో తీవ్రంగా నష్టపోయిన ఏపీ విద్యార్థులు
- రెండేళ్లలో 2,450 ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయిన రాష్ట్రం.. తెలంగాణలో భవనాలు లేకపోయినా అనుమతులు తెచ్చుకుని మెడికల్ కాలేజీల నిర్వహణ
- ఏపీలో దాదాపుగా అన్ని వసతులతో కాలేజీలు సిద్ధం... కొత్త మెడికల్ కాలేజీలను తీసుకురాకపోగా ఉన్నవాటినే ప్రైవేట్ పరం చేస్తున్న బాబు

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కార్ అనుసరిస్తున్న కక్షపూరిత విధానాలు, ప్రభుత్వ కొత్త వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ బుధవారం తలపెట్టిన నిరసన ర్యాలీలలో కదం తొక్కేందుకు పార్టీలకు అతీతంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, మేధావులు సామాజిక కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించే నిరసన ర్యాలీల్లో పాల్గొనేందుకు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా కదలి వస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండగా 2019లో వైఎస్ జగన్ అధికారం చేపట్టాక ఒకేసారి ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వీటిలో 5 మెడికల్ కళాశాలలను 2023–24లో గత ప్రభుత్వంలోనే ప్రారంభించారు. తద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లను మాజీ సీఎం వైఎస్ జగన్ మన విద్యార్థులకు అదనంగా సమకూర్చారు. ప్రజలకు చేరువలో మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వాస్పత్రులను బోధనాస్పత్రులుగా బలోపేతం చేశారు. అనంతరం గతేడాది చంద్రబాబు గద్దెనెక్కడంతో వైద్య కళాశాలలకు గ్రహణం పట్టుకుంది. 50 సీట్లతో పాడేరులో మెడికల్ కాలేజీ ఎట్టకేలకు ప్రారంభమైనా వంద సీట్లకు కోత పడింది. ఇక పులివెందుల వైద్యకళాశాలకు ఎన్ఎంసీ అనుమతులు ఇచ్చినప్పటికీ, తమకు వద్దంటూ చంద్రబాబు సర్కారు

మిగతా 14వ పేజీలో ▶

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఈసీగా జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

సాక్షి , అమరావతి: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ (ఈసీ)గా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి సోమవారం ఉత్తర్వులిచ్చారు. హైకోర్టు న్యాయమూర్తుల్లో రెండో స్థానంలో ఉన్న న్యాయమూర్తిని న్యాయ సేవాధికార సంస్థ ఈసీగా నియమించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ మేరకు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్‌ను హైకోర్టు సీజే నామినేట్ చేశారు.

పేదలకు సెంటు భూమి ఇవ్వరు

టీడీపీ ఆఫీసులకేమో ఎకరాలకు ఎకరాలు

మచిలీపట్నంలో ఇచ్చిన భూమి విలువ రూ.50 కోట్లు

తిరుపతిలో కేటాయించిన స్థలం ఖరీదు రూ.60 కోట్లు

- గతంలోనూ అత్యంత విలువైన భూములను టీడీపీ కార్యాలయాలకు కట్టబెట్టిన చంద్రబాబు
- డి–పట్టాలు, వాగు పోరంబోకు భూముల్లో మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయం
- 3.65 ఎకరాల్లో స్టార్ హోటల్ మాదిరిగా మంగళగిరిలో పార్టీ కార్యాలయం.. విశాఖలో దసపల్లా భూములను ఆక్రమించి పార్టీ ఆఫీసు..
- విజయవాడలో రూ.50 కోట్ల విలువైన 95 సెంట్ల స్థలం కేటాయింపు
- టీడీపీ కార్యాలయాలకు మున్ముందు వరుసగా రూ.కోట్ల విలువైన భూములు

2లో

ఏడాదికి రూ.వెయ్యే!

టీడీపీ ఆఫీసులకు కారుచౌకగా ప్రభుత్వ భూములు లీజుకు

- మచిలీపట్నంలో 1.60 ఎకరాలు 33 ఏళ్లకు కేటాయింపు
- రవాణా శాఖకు ఇచ్చిన భూమిని రద్దు చేసి మరీ బదిలీ
- లీజు కాలం 66 ఏళ్లకు, అవసరమైతే 99 ఏళ్లకూ పెంపు
- అసైన్డ్ చట్టంలో సవరణలపై ఆర్డినెన్స్ జారీకి ఆమోదం
- రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయాలు

2లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹84	ఫారం వద్ద లైవ్ బర్డ్	108 కిలో	డ్రెస్సింగ్ స్కిన్‌తో	196 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	135 కిలో	స్కిన్ లెస్	223 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

నేను నా చాంబర్ నుండి బయటకి వెళ్లినా 'ఇన్' అనే ఉంచు.. పరిస్థితులు బాగోలేవ్

లడ్డూ ప్రసాదంపై బాబు సర్కారు కుట్ర!

- అబద్ధపు వాంగ్మూలాలతో కుతంత్రం
- అజయ్ కుమార్ సుగంధ్ రిమాండ్ నివేదికే తార్కాణం
- ఎల్లో మీడియాలో రాద్ధాంతం.. కుట్రలను బలపరుస్తూ మంత్రి లోకేశ్ ట్వీట్
- సుప్రీం ఆదేశాలకు విరుద్ధంగా బాబు సర్కారు బరి తెగింపు

10లో

సర్కారీ చిక్కీలో పురుగులు

బాపట్ల జిల్లా ఆలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఘటన

చిన్నారుల తల్లిదండ్రుల ఆందోళన

14లో

పోలీసుల అప్రమత్తం

విజయవాడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో రాష్ట్రంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప, కర్నూలు తదితర నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ఇటీవల విజయనగరంలో ఉగ్రవాదులతో సంబంధాలున్న ఓ యువకుడిని అరెస్టుచేసిన నేపథ్యంలో అక్కడ కూడా పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రధానంగా విశాఖపట్నంలో ఈనెల 14, 15 తేదీల్లో 'పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్' నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. **– సాక్షి, అమరావతి**

శివయ్య మహత్యం

గుండ్లకమ్మ నదిలో సోమవారం ఓ పెద్ద రాతి బండపై చెక్కిన పురాతన శివలింగం, నందీశ్వరుడి రూపాలు బయట పడ్డాయి. పల్నాడు జిల్లా తంగిరాల గ్రామం సమీపంలో గుండ్లకమ్మ నది ప్రవహిస్తోంది. ఇక్కడ నది రెండు పాయలుగా చీలి ఉంటుంది. వరదల సమయంలో మేట వేయడంతో సంవత్సరాలుగా అక్కడ మట్టి దిబ్బలా మారింది. మోంథా తుపాను వల్ల వచ్చిన నీటి ఉధృతికి మట్టి కొట్టుకుపోయింది. దీంతో ఓ రాతిపై చెక్కి ఉన్న శివలింగం, నందీశ్వరుడు రూపాలు కనిపించాయి. కార్తీక సోమవారం కావడంతో మహిళలు పూజలు చేశారు. **– నూజెండ్ల**



కర్షకుడికి తప్పని కష్టం

రాష్ట్రంలోని రైతులను యూరియా యాతన వెంటాడుతూనే ఉంది. అనకాపల్లి జిల్లా చౌడువాడ గ్రామంలో సోమవారం యూరియా పంపిణీ చేస్తున్నారని తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో రైతు సేవా కేంద్రానికి వచ్చారు. అందరూ ఒక్కసారిగా యూరియా కోసం ఎగబడటంతో అధికారులు చేతులెత్తేశారు. దీంతో పంపిణీని వాయిదా వేశారు. ఇక్కడికి 220 యూరియా బస్తాలు వచ్చాయని, రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో సమస్య వస్తుందని పంపిణీని మంగళవారానికి వాయిదా వేసినట్లు ఏవో సరోజిని తెలిపారు. **– కోటవురట్ల**

క్లుప్తంగా...

ఢిల్లీ ఘటనపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: ఢిల్లీ ఎర్రకోట మెట్రోస్టేషన్ వద్ద సోమవారం జరిగిన భారీ పేలుడు ఘటన చాలా దిగ్భ్రాంతికి, బాధకు గురిచేసిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఈ దుర్ఘటనలో మరణించిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని వైఎస్ జగన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

సీపీ బ్రౌన్‌కు వైఎస్ జగన్ నివాళి

సాక్షి, అమరావతి: సీపీ బ్రౌన్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. 'తెలుగు భాషను ప్రేమించి, తెలుగు సాహిత్యాన్ని ముద్రించి, భద్రపరచి, ప్రపంచానికి పరిచయం చేసిన మహానుభావుడు సీపీ బ్రౌన్. ఆయన సమకూర్చిన తెలుగు–ఇంగ్లిష్ నిఘంటువు తెలుగు భాష అభివృద్ధికి శాశ్వతమైన పునాది వేసింది. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నాను' అని వైఎస్ జగన్ సోమవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కృష్ణాపై ఐకానిక్ బ్రిడ్జి డీపీఆర్‌కు రూ.4.81 కోట్లు

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిని, ఎన్–13 రహదారిని విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి(ఎన్‌హెచ్–65)తో ఎన్టీఆర్ జిల్లా మూలపాడు వద్ద కలిపేందుకు కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారీ పనులను రూ.4.81 కోట్లకు నిప్పాన్ కోయి ఇండియా లిమిటెడ్ సంస్థకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏడీసీఎల్) అప్పగించింది. తొలుత 2018, ఫిబ్రవరి 27న అమరావతిని ఎన్–10 రహదారి(లింగాయపాలెం) నుంచి పవిత్ర సంగమం వద్ద విజయవాడ–హైదరాబాద్ హైవేతో కలుపుతూ కృష్ణా నదిపై 3.2 కి.మీ.ల పొడవున ఐకాన్ బ్రిడ్జి నిర్మాణ పనులకు రూ.1,348.09 కోట్ల అంచనా వ్యయంతో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) పద్ధతిలో ఏడీసీఎల్ టెండర్లు పిలిచింది. రూ.1,387 కోట్లకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన ఎల్ అండ్ టీ సంస్థకు పనులను అప్పట్లో అప్పగించింది. ప్రస్తుతం ఆ పనులు రద్దు చేసిన ప్రభుత్వం... ఐకానిక్ బ్రిడ్జి అలైన్‌మెంట్‌ను మార్చేసింది.

మ్యాచింగ్ గ్రాంట్ రూ.46 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా మరణించిన 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలను ఆదుకునేందుకు తన వాటా మ్యాచింగ్ గ్రాంట్ రూ.46 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్.ద్వారకనాథరెడ్డి చొరవతో ఈ నిధులు విడుదల చేశారు. మృతిచెందిన న్యాయవాదుల కుటుంబాలకు ఇప్పటికే ఏపీ న్యాయవాదుల సంక్షేమ నిధి నుంచి రూ.50 కోట్లు చెల్లించామని ద్వారకానాథరెడ్డి చెప్పారు.

సాక్షి
మీకు సాక్షి
దినపత్రిక అందడంలో
ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి
బదులుగా ఇతర దినపత్రికలు
వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు
ఉ. 7.00 గం.ల నుండి
రా. 8.00 గం.ల లోపు
తెలుపగలరు. వెంటనే తగిన
చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం
1800 425 9899

• పేదలకు సెంటు భూమి ఇవ్వరు..

టీడీపీ ఆఫీసులకేమో ఎకరాలకు ఎకరాలు

విజయవాడ గురునానక్ కాలనీ సమీపంలో రూ.50 కోట్ల విలువైన 95 సెంట్ల ఇరిగేషన్ భూమిలో ఏర్పాటు చేసిన టీడీపీ జిల్లా కార్యాలయం →

మచిలీపట్నంలో ఇచ్చిన భూమి విలువ రూ.50 కోట్లు

తిరుపతిలో కేటాయించిన స్థలం ఖరీదు రూ.60 కోట్లు

గతంలోనూ అత్యంత విలువైన భూములను టీడీపీ కార్యాలయాలకు కట్టబెట్టిన చంద్రబాబు

డి-పట్టాలు, వాగు పోరంబోకు భూముల్లో మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయం

సాక్షి, అమరావతి: పేదలకు సెంటు స్థలం ఇవ్వదు కానీ, పార్టీ ఆఫీసులకు మాత్రం రూ.వందల కోట్ల విలువైన భూములు కేటాయించుకుంటోంది చంద్రబాబు ప్రభుత్వం. అధికారం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే వ్యూహంతో టీడీపీ కార్యాలయాల కోసం అత్యంత విలువైన స్థలాలను కారుచౌకగా ఇచ్చేస్తోంది. తాజాగా మచిలీపట్నంలో కట్టబెట్టిన 1.60 ఎకరాల విలువ రూ.50 కోట్లకు పైనే. తిరుపతి రూరల్ మండలం అవిలాలలో ఇచ్చిన రెండెకరాల భూమి విలువ రూ.100 కోట్లు కావడం గమనార్హం. జనవరిలో కడపలోని రూ.50 కోట్ల విలువైన 2 ఎకరాల ఆర్‌అండ్‌బీ స్థలాన్ని టీడీపీ కార్యాలయానికి ధారాదత్తం చేశారు. ఈ భూమికి సంబంధించి వివాదం కోర్టులో ఉన్నా లెక్క చేయకుండా జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేరు మీద లీజుకు ఇచ్చేశారు. అధికారంలోకి వస్తే పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తానన్న చంద్రబాబు ఒక్కరికీ సెంటు స్థలం ఇచ్చిన పాపాన పోలేదు. పైగా జగనన్న కాలనీల్లో గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను వెనక్కి తీసుకునేందుకు ఉవ్విళ్లూరుతూ పేదలలో ఆందోళన రేకెత్తిస్తున్నారు.

మంగళగిరిలో స్టార్ హోటల్ తరహాలో...

చంద్రబాబు ప్రధాన నగరాల్లో అత్యంత విలువైన స్థలాలను టీడీపీ కార్యాలయాల కోసం కేటాయించి అత్యాధునిక భవనాలను కట్టించేశారు. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం 3.65 ఎకరాలలో కోల్‌కతా–చెన్నై జాతీయ రహదారికి ఆనుకుని అత్యంత విలువైన ప్రాంతంలో ఉంది. 2014లో అధికారంలోకి వచ్చాక కేటాయించుకున్నారు. ప్రస్తుత విలువ రూ.150 కోట్లకుపైనే. ఇందులో వాగు పోరంబోకు, కాలువ, రైతులకు అసైన్ చేసిన డి–పట్టా భూములున్నా నిబంధనలకు విరుద్ధంగా 2016లో 99 ఏళ్ల లీజుకు తీసుకున్నారు. దీనిపై హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసులున్నా ఖాతరు చేయలేదు సరికదా... స్టార్ హోటల్ మాదిరిగా దాన్ని నిర్మించారు. గుంటూరు అరండల్‌పేట పిచుకులగుంటలో వెయ్యి గజాల కార్పొరేషన్ స్థలాన్ని టీడీపీ కార్యాలయం కోసం లీజుకుని తీసుకుని పక్కనే ఉన్న 1,500 గజాల స్థలాన్నీ ఆక్రమించి భారీ భవనం కట్టేశారు. మున్సిపల్ స్థలాలను ఎక్కడా లీజుకు ఇచ్చే అవకాశం లేకపోయినా 2015లో చంద్రబాబు అధికార బలంతో ఆ భూమిని తన పార్టీ ఖాతాలో వేసుకున్నారు.

విజయవాడ నడిబొడ్డున రూ.50 కోట్ల భూమి

విజయవాడ నడిబొడ్డున ఖరీదైన ప్రాంతం గురునానక్ కాలనీకి ఆనుకుని ఉన్న 95 సెంట్ల భూమిని 2018లో టీడీపీ కార్యాలయానికి కట్టబెట్టారు. ప్రజావసరాలకు ఉపయోగపడే ఈ సాగునీటి శాఖ స్థలంలో చిన్న కార్యాలయాలుండగా కూల్చేశారు. ఈ స్థలం ప్రస్తుతం రూ.50 కోట్లపైనే ఉంటుంది. ఆటోనగర్ పరిధిలో ఉన్న ఈ స్థలాన్ని వారి నోరు మూయించి మరీ కన్వర్షన్ చేసుకున్నారు.

- శ్రీకాకుళంలో దళితులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఎస్సీ కార్పొరేషన్ సేకరించి అభివృద్ధి చేసిన భూమిని టీడీపీ కార్యాలయం కోసం లీజు పేరుతో లాగేసుకున్నారు. అందులో పెద్ద భవనాన్ని నిర్మించారు. దీని విలువ ఇప్పుడు రూ.40 కోట్లకుపైనే ఉంటుందని అంచనా.
- కాకినాడలో 2 వేల గజాల జిల్లా పరిషత్ స్థలాన్ని 2014లో టీడీపీ కార్యాలయం కోసం తీసుకున్నారు. దీని విలువ రూ.20 కోట్లకుపై మాటే.

విశాఖలో దస్‌పల్లా కొండను ఆక్రమించి..

విశాఖపట్నంలో దస్‌పల్లా కొండను తొలిచి మరీ టీడీపీ కార్యాలయాన్ని నిర్మించారు. దస్‌పల్లా భూముల్లో 2 వేల గజాలను ఏడాదికి రూ.25 వేల చొప్పున 33 ఏళ్ల లీజుకు కేటాయించుకున్నారు. పక్కనే ఉన్న మరో వెయ్యి గజాలను ఆక్రమించి కార్యాలయం నిర్మించారు. టెక్కలి, చిలకలూరిపేటలో 30 సెంట్లు, 20 సెంట్ల విలువైన స్థలాలను ఇలానే పొందారు.

హైదరాబాద్‌లోనూ అంతే...

విలువైన స్థలాలను పార్టీ కార్యాలయాల పేరుతో ఖాతాలో వేసుకోవడంలో చంద్రబాబు ఘనాపాఠి. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌ను ఇలానే నిర్మించారు. ఇప్పుడూ రాష్ట్రంలోని అన్ని జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో విలువైన స్థలాలు పొంది విలాస భవనాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. సోమవారం మచిలీపట్నం, తిరుపతిలో కేటాయింపులు పూర్తవగా, మున్ముందు అన్నిచోట్ల ప్రభుత్వ భూములను పొందేందుకు సిద్ధమవుతున్నారు.

• బాబు సర్కారు భూ పందేరం..

ఏడాదికి రూ.వెయ్యే!

టీడీపీ ఆఫీసులకు కారుచౌకగా ప్రభుత్వ భూములు లీజుకు

- అసైన్డ్ చట్టంలో సవరణలపై ఆర్డినెన్స్ జారీకి ఆమోదం
- క్లీన్ ఎనర్జీ అవసరాలకు 99 ఏళ్లు అసైన్డ్ భూముల దీర్ఘకాలిక లీజు
- లీజుకు ఇచ్చే హక్కు అసైన్డ్‌దారులకు కల్పిస్తూ చట్టంలో సవరణలు
- భవానీ ద్వీపంలో ప్రైవేట్ సంస్థకు భూములు, రాయితీలు
- ఇటీవల ఎస్‌పీబీఐలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం
- అమరావతికి బడ్జెట్ బయట మరో రూ.9 వేల కోట్ల అప్పు
- ఉండవల్లి వద్ద రూ.595 కోట్లతో రెండో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్
- పౌర సరఫరాల సంస్థ రుణాల గరిష్ట పరిమితి రూ.44 వేల కోట్లకు...
- కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించిన మంత్రి పార్థసారథి

సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ కార్యాలయాలకు ప్రభుత్వ భూములను కారుచౌకగా లీజుకు కట్టబెడుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఏడాదికి కేవలం రూ.వెయ్యి చొప్పున 33ఏళ్ల పాటు వీటిని ధారాదత్తం చేయనుంది. ప్రస్తుత ఉత్తర్వుల ప్రకారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల కార్యాలయాలకు ప్రభుత్వ భూముల లీజు కాలం 33ఏళ్లుగా ఉంది. ఈ వ్యవధిని 66 సంవత్సరాలకు, పార్టీలు మనుగడలో ఉంటే 99 ఏళ్లకు పెంచే అవకాశం కల్పించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సోమవారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమాచార మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించిన కేబినెట్ భేటీ వివరాల ప్రకారం...

- కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రవాణా శాఖకు ఇచ్చిన 1.60 ఎకరాల ప్రభుత్వ భూమిని రద్దు చేసి టీడీపీ జిల్లా ఆఫీసుకు కేటాయింపు. తిరుపతి రూరల్ మండలం అవిలాలలో 2 ఎకరాల ప్రభుత్వ భూమి టీడీపీ కార్యాలయానికి కేటాయింపు. వార్షిక రుసుము రూ.వెయ్యి చొప్పున 33 ఏళ్లపాటు లీజు కింద మచిలీపట్నం టీడీపీ జిల్లా అధ్యక్షుడు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ జిల్లా అధ్యక్షుడికి భూమి బదిలీ.
- గుంటూరు జిల్లా ఉండవల్లి పరిధిలోని భవానీ ద్వీపంలో 'అడ్వెంచర్ థ్రిల్ సిటీ' అభివృద్ధికి విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్షియంకు భూమి కేటాయింపు, ప్రోత్సాహకాలు అందించేందుకు ఆమోదం.
- మచిలీపట్నం తల్లపాలెం వద్ద అమ్యూజ్‌మెంట్ పార్క్, రిసార్ట్‌ల అభివృద్ధికి మైరా బే వ్యూ రిసార్ట్స్‌కు భూమి కేటాయింపు, ప్రోత్సాహకాలు.
- క్లీన్ ఎనర్జీకి అవసరమైన అసైన్డ్ భూములను ప్రైవేట్ సంస్థలకు 99 ఏళ్ల దీర్ఘకాలిక లీజుకు ఇచ్చేందుకు 1977 నాటి ఏపీ అసైన్డ్ భూముల (బదిలీ నిషేధం) చట్టంలో సవరణలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల (బదిలీల నిషేధం)–2025 ముసాయిదా బిల్లుకు ఆమోదం. ఆర్డినెన్స్ జారీకి అంగీకారం.
- అమరావతిలో ప్రాజెక్టుల కోసం కొత్తగా బడ్జెట్ బయట రూ.9వేల కోట్లు అప్పు తెచ్చేందుకు సీఆర్‌డీఏకు అనుమతి.
- అమరావతి రాజధాని సిటీలోని ఎల్‌పీఎస్ జోన్ల అభివృద్ధికి రూ.7,500 కోట్లు రుణం పొందేందుకు ఏపీసీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతి.
- రాజధానిలో ముఖ్యమైన మౌలిక సదుపాయాల పనులు వేగవంతానికి ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీపీఎఫ్‌సీఎల్) నుంచి రూ.1,500 కోట్ల రుణం తీసుకునేందుకు అంగీకారం.
- రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ యుటిలిటీల నిర్వహణకు, బొగ్గు, విద్యుత్ కొనుగోలు నిమిత్తం సర్కారుకు అప్పు ఇవ్వడానికి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి లోన్ పొందేందుకు ఏపీపీఎఫ్‌సీఎల్ రూ.1,000 కోట్లకు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చేందుకు అంగీకారం.
- విద్యుత్ సంస్థలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థలు రూ.5 వేల కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వం హామీ ఇస్తూ జారీచేసిన జీవోకు, ఎస్‌బీఐ, యూబీఐ నుంచి ఏపీ డిస్కమ్స్ తీసుకునే రూ.1,150 కోట్ల రుణంపై ప్రభుత్వ గ్యారెంటీకి, ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ కోసం మార్క్‌ఫెడ్ ద్వారా పౌర సరఫరాల సంస్థ రూ.5,000 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తూ జారీచేసిన జీవోకు ఆమోదం.
- ధాన్యం సేకరణ కోసం పౌర సరఫరాల సంస్థ తీసుకునే గరిష్ట రుణ పరిమితి రూ.39 వేల కోట్ల నుంచి రూ.44 వేల కోట్లకు పెంపు.
- కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం విమానాశ్రయాల భూ సేకరణకు హడ్కోరుణం చెల్లించేందుకు హామీతో ప్రభుత్వ 'లెటర్ ఆఫ్ కంఫర్ట్' జారీకి, ఏపీ ఫైర్ సర్వీసెస్ చట్టం–1999లో సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ విడుదలకు ఆమోదం.
- ముగ్గురు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు.
- సీఆర్‌డీఏలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రుల కమిటీ చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యల నిమిత్తం కమిషనర్ అనుమతికి అంగీకారం.
- ఉండవల్లి వద్ద ఫ్లడ్ పంపింగ్ స్టేషన్–2కు రూ.595.01 కోట్లకు పరిపాలన అనుమతి
- అమరావతిలో ల్యాండ్ పూలింగ్ గ్రామాల లే అవుట్‌లో అనుసంధానం పనులను రూ.1,863 కోట్లకు కాంట్రాక్టు ఇచ్చేందుకు అనుమతి.
- ఏపీ ఎలక్ట్రిసిటీ డ్యూటీ చట్టం–1939కు సవరణ చేసే ఆర్డినెన్స్ జారీకి ఆమోదం.
- వివిధ కేటగిరీల కాంట్రాక్టర్ల ద్రవ్య పరిమితులు, వారి రిజిస్ట్రేషన్ ఫీజును, సాల్వెన్సీ సర్టిఫికెట్ మొత్తాన్ని, గత అనుభవం, పనుల విలువను పెంచడానికి ఆమోదం.
- ఏలూరు జిల్లా పోలవరంలోని 15.25 ఎకరాల ప్రభుత్వ భూమి ఏపీ టూరిజం అథారిటీకి ఉచితంగా బదిలీ.
- రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ డేటా లేక్ ప్రాజెక్టు డిజైన్.. అభివృద్ధి, అమలు, ఆపరేషన్లు, నిర్వహణ కోసం సిస్టమ్ ఇంటిగ్రేటర్‌గా నియామకానికి మెస్సర్స్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మూడేళ్ల కాలానికి షెడ్యూల్ విలువ రూ.181 కోట్లతో కోట్ చేసిన సింగిల్ బిడ్‌కు ఆమోదం.
- క్వాంటమ్ మిషన్ నిపుణుల కమిటీ ముందు బిడ్ల సాంకేతిక మదింపును ఉంచి, సమీక్ష, సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని, టెండర్ల విధానాల ప్రకారం ఆర్‌ఎఫ్‌పీ పద్ధతిలో ఏక్యూసీసీ ప్రాజెక్టుకు టెండరింగ్ ప్రక్రియను ప్రారంభించడానికి సాంకేతిక చార్జీలు మినహాయించి రూ.99.62 కోట్లకు అంగీకారం.
- ఇటీవల ఎస్ఐపీబీలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పలు సంస్థలకు భూముల కేటాయింపులు, రాయితీలకు ఆమోదం
- పలు ఎనర్జీ, టిడ్కో ప్రాజెక్టులకు భూముల కేటాయింపునకు గ్రీన్‌సిగ్నల్.

నిందితునికి రూ.10 వేల నష్టపరిహారం చెల్లించండి

విజయవాడ సైబర్ క్రైమ్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో చట్టాన్ని తుంగలో తొక్కి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న పోలీసులకు హైకోర్టు గట్టి షాకిచ్చింది. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు తిరుపతి లోకేశ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు 24 గంటలు లోపు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. అరెస్ట్ చేసినప్పటి నుంచి 24 గంటల్లోపు నిందితుడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాల్సిన బాధ్యత పోలీసులపై ఉందంది. అయితే లోకేశ్ విషయంలో పోలీసులు ఈ బాధ్యతను విస్మరించారని తెలిపింది. ఇది అతని ప్రాథమిక హక్కులను హరించడమే అవుతుందని తేల్చి చెప్పింది. ఇందుకు గాను నష్టపరిహారం పొందేందుకు లోకేశ్ అర్హుడని స్పష్టం చేసింది. చట్ట విరుద్ధంగా వ్యవహరించి, లోకేశ్ ప్రాథమిక హక్కులను హరించినందుకు అతనికి రూ.10 వేలను నష్టపరిహారంగా చెల్లించాలని విజయవాడ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)ను ఆదేశించింది.

రశీదు తీసుకుని రిజిస్ట్రార్‌కు సమర్పించాలి

పరిహారాన్ని లోకేశ్‌కు చెల్లించి అతని నుంచి రశీదు తీసుకుని, దానిని రిజిస్ట్రార్ (జుడీషియల్)కు అందచేయాలని ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. తమ ఆదేశాల మేరకు నష్టపరిహారం చెల్లించారా? లేదా? అన్న విషయాన్ని తదుపరి విచారణ సమయంలో తమకు తెలియచేయాలని రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. తమ ఆదేశాలను ఎస్‌హెచ్‌వో అమలు చేయకుంటే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామంది. తదుపరి విచారణను డిసెంబర్ 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. అయితే తీర్పు కాపీ అందుబాటులోకి రాకపోవడంతో పూర్తి పాఠం తెలియరాలేదు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు పోలీసులు తన కుమారుడు లోకేశ్‌ను అక్రమంగా నిర్బంధించారని, అతన్ని కోర్టు ముందు హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ తిరుపతి భారతి గత ఏడాది నవంబర్‌లో హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున చింతల సుమన్, పి.శశివర్ధన్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం సోమవారం తన తీర్పును వెలువరించింది.

కట్టు తప్పింది మీరే!

- అవినీతిని కేంద్రీకరించి.. మాపై నిందలా?
- సీఎం చంద్రబాబు తీరుపై టీడీపీ ఎమ్మెల్యేల్లో తీవ్ర అసహనం

సాక్షి, అమరావతి: కొందరు టీడీపీ ఎమ్మెల్యేల తీరు ఏమాత్రం బాగోలేదని.. వారిని కట్టడి చేయాల్సిన బాధ్యత ఇన్‌చార్జి మంత్రులదేనని సీఎం చంద్రబాబు ఆదేశించడంపై అంతర్గతంగా వారంతా రగిలిపోతున్నారు. నిజానికి కట్టుతప్పి వ్యవహరిస్తోంది టీడీపీ పెద్దలేననే విమర్శలు పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. పాలన గాలికి వదిలేసి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ డ్రామాకు తెర తీశారనే వాదన సొంత ఎమ్మెల్యేల నుంచే వినిపిస్తోంది. చంద్రబాబు పనితీరే అధ్వానంగా ఉందని ప్రైవేటు సంభాషణల్లో చెబుతున్నారు. మద్యం, ఇసుక దందాను కేంద్రీకృతం చేసి అక్రమాలకు తెరతీశారని పేర్కొంటున్నారు. కమీషన్లు తీసుకుంటూ టూరిజం హోటళ్లను ప్రైవేటుకు కట్టబెడుతున్నారని, కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తూ కాసులు పిండుకుంటున్నారనే చర్చ జరుగుతోంది. ఉర్సా, లులు, ఇండిచిప్ లాంటి సంస్థలకు కారు చౌకగా భూములు కట్టబెడుతున్నారని ఉదహరిస్తున్నారు. ప్రాంతానికి ఒక ఐజీని పెట్టి మరీ మైనింగ్ అక్రమ సొమ్మును వసూలు చేస్తున్నారని, 108, 104 వాహనాల నిర్వహణ టెండర్లను అర్హత లేని వారికి కట్టబెట్టి అక్రమాలకు తెర తీశారని మండిపడుతున్నారు. చంద్రబాబు, ఆయన తనయుడు ఇవన్నీ చేస్తూ తమను నిందించడం ఏమిటనే చర్చ ఎమ్మెల్యేల్లో జోరుగా సాగుతోంది.

ఇన్‌చార్జి మంత్రులదే బాధ్యత..

మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత మంత్రులతో రాజకీయ అంశాలపై సీఎం చంద్రబాబు సోమవారం ప్రత్యేకంగా చర్చించారు. 48 మంది ఎమ్మెల్యేలపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు వస్తున్నాయని అన్నట్లు తెలిసింది. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లోనూ వారు పాల్గొనడంలేదన్నారు. అలాంటి వారిని పిలిచి స్వయంగా తాను మాట్లాడినా మార్పు రాలేదని చెప్పినట్లు తెలిసింది. ఇన్‌చార్జి మంత్రులు తమ పరిధిలోని ఎమ్మెల్యేల బాధ్యతను తీసుకోవాలని, వారిని నియంత్రించాల్సిన బాధ్యత వారిదేనని స్పష్టం చేశారు. ఒక్కో ఇన్‌చార్జి మంత్రికి ఐదుగురు ఎమ్మెల్యేల బాధ్యతను అప్పగిస్తే ఎలా ఉంటుందని చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకుంటూ కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు తమ పార్టీని, నేతలను పరిగణనలోకి తీసుకోవడంలేదని పేర్కొన్నట్లు తెలిసింది.

లడ్డూ విషయంలో తప్పు చేసి ఉంటే టీటీడీ బోర్డు సభ్యులూ బాధ్యులే

మంత్రి కొలుసు పార్థసారథి

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంలో తప్పు చేసి ఉంటే నాటి టీటీడీ చైర్మన్, ఈవోతోపాటు బోర్డు పాలకవర్గ సభ్యులు కూడా బాధ్యత వహించాల్సిందేనని టీటీడీ పాలకవర్గ గత సభ్యుడు, ప్రస్తుత రాష్ట్ర సమాచార శాఖమంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. టీటీడీ బోర్డులో ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు బోర్డులో ఉన్న సభ్యులందరూ సమష్టి బాధ్యత వహించాలన్నారు. అయితే టీటీడీ బోర్డు సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన సమాచారం అప్పటి ఎగ్జిక్యూటివ్ అధికారులు బోర్డు సమావేశంలో పెట్టి ఉంటే.. తప్పకుండా ఆ నిర్ణయాలకు బోర్డు సభ్యులు బాధ్యులవుతారని చెప్పారు. కానీ.. తాను బోర్డు సభ్యుడుగా పనిచేసిన సమయంలో కల్తీ నెయ్యికి సంబంధించిన ల్యాబ్ టెస్టు రిపోర్టులు బోర్డు సమావేశంలో పెట్టలేదన్నారు. టెండర్లలో పాల్గొన్న ఎల్–1, ఎల్–2 బిడ్డర్లు కోట్ చేసిన వివరాలను బోర్డు సమావేశాల్లో పొందుపర్చేవారు తప్ప ఇతర సమాచారం తెలియదన్నారు.

మైనార్టీలపై బాబు సర్కార్ ఉదాసీనత

ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో హోదా లేని వ్యక్తుల నియామకం

- మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఐఏఎస్ పోస్టులో పంచాయతీరాజ్ అధికారి
- వివాదాస్పద వ్యక్తికి వక్ఫ్ బోర్డు సీఈవో పదవి అప్పగింత
- ఉర్దూ అకాడమీకి చైర్మన్, సభ్యుల నియామకం లేదు
- సంక్షేమం, అభివృద్ధికి ముస్లింలను ఆమడ దూరం పెట్టేసిన వైనం
- ఎన్నికల హామీలను అమలు చేయని చంద్రబాబు ప్రభుత్వం
- వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో ముస్లింలకు స్వర్ణ యుగం
- నేడు విజయవాడ తుమ్మలపల్లిలో మైనార్టీ దినోత్సవం

సాక్షి, అమరావతి: ఎన్నికల హామీలను ఒక్కటైనా సక్రమంగా అందించలేదు... సంక్షేమ పథకాల అమలులో తీవ్ర వైఫల్యం... శాఖాపరమైన పోస్టింగుల్లో ఇష్టారాజ్యం... ముస్లిం మైనార్టీల పట్ల పూర్తి ఉదాసీనత...! ఇదీ చంద్రబాబు ప్రభుత్వం తీరు. మొత్తం పరిస్థితి ఇలా ఉండగా మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రభుత్వం జాతీయ మైనార్టీ దినోత్సవం నిర్వహించనుండడంపై ముస్లింలు మండిపడుతున్నారు. 12 హామీలు ఇచ్చి ఒక్కటీ సక్రమంగా అమలు చేయని బాబు... వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు పలికి ముస్లిం మైనారిటీలను తీవ్ర ఆందోళనకు గురి చేశారు. వక్ఫ్ ఆస్తులను లీజు పేరుతో అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలకు తెరలేపారు. ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనాలు ఏడాదిగా బకాయిపెట్టారు. 49,218 మందికి రూ.326 కోట్ల సబ్సిడీ రుణాలిస్తామంటూ ప్రకటించి ఒక్కరంటే ఒక్కరికీ రుణం ఇవ్వలేదు. మరోవైపు బాధ్యతాయుత పోస్టుల్లో సైతం తగిన హోదా లేని వ్యక్తుల నియామకం, క్యాడర్ పోస్టుల్లో నాన్ కేడర్ వ్యక్తులకు బాధ్యతలు అప్పగించి మైనార్టీ సంక్షేమ శాఖను నిర్వీర్యం చేస్తోంది. ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో పైరవీలు చేసుకుని వస్తున్న నాన్ కేడర్ ఉద్యోగులు క్యాడర్ పోస్టుల్లో 'అధికార' దర్పం చెలాయిస్తున్నారు. క్యాడర్ స్థాయి అధికారులైతే తాము చెప్పినట్టు వినరని భావించి ఏరికోరి అనర్హులను అందలం ఎక్కిస్తున్నట్టు స్పష్టమవుతోంది. ఇప్పుడే కాదు, 2014 ఎన్నికల సమయంలోనూ ముస్లింలకు చంద్రబాబు 25 హామీలిచ్చి ఎగ్గొట్టారు. నాలుగేళ్ల పాటు మంత్రివర్గంలో ముస్లింలకు చోటే కల్పించలేదు. గుంటూరు, కర్నూలులో ముస్లిం యువతపై దేశద్రోహం అక్రమ కేసులు పెట్టి వేధించారు.

వైఎస్ జగన్ పాలన స్వర్ణయుగం

4 శాతం రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ముస్లిం యువత ఉన్నత విద్యను ప్రోత్సహించారు దివంగత మహా నేత వైఎస్సార్. తండ్రి కంటే రెండు అడుగులు ముందుకేసిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ముస్లింలను ఆర్థిక, రాజకీయ, సామాజికంగా ముందుకు నడిపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల కింద మైనారిటీలకు డీబీటీ ద్వారా రూ.13,239.49 కోట్లు నేరుగా వారి ఖాతాలకే జమ చేశారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, జగనన్న తోడు వంటి కార్యక్రమాల (నాన్ డీబీటీ)ద్వారా మరో రూ.11,064.88 కోట్ల లబ్ధి చేకూర్చారు. మౌజమ్‌లు, ఇమామ్‌లకు గత చంద్రబాబు ప్రభుత్వం గౌరవ వేతనంగా రూ.3 వేలు, రూ.5 వేలు మాత్రమే ఇవ్వగా, వైఎస్ జగన్ హామీ మేరకు రూ.5 వేలు, రూ.10 వేలకు పెంచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.300.68 కోట్లను గౌరవ వేతనంగా అందించింది. వారికి భరోసా ఇచ్చేలా వన్‌టైమ్ ఫైనాన్షియల్ అసిస్టెన్సీ ఇచ్చింది. తెల్లకార్డుదారులకు స్పెషల్ కోవిడ్ అసిస్టెన్సీగా సుమారు రూ.100 కోట్లు అందించింది. 2019 ఎన్నికల్లో ముస్లింలకు 5 సీట్లు, 4 ఎమ్మెల్సీ పదవులు ఇచ్చి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా, ఉప ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించారు. నామినేటెడ్, స్థానిక సంస్థల పదవుల్లోనూ ప్రాధాన్యం కల్పించారు. పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అక్రమ కేసులను ఎత్తివేశారు.

నియామకాల్లో బాబు సర్కారు ఇష్టారాజ్యం

- ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీగా ఐఏఎస్ అధికారిని నియమించాలి. కానీ, పంచాయతీ రాజ్‌శాఖ నుంచి నాన్ క్యాడర్ అధికారి యాకుబ్ బాషాను నియమించారు.
- అత్యంత కీలకమైన రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్‌గా సీహెచ్ శ్రీధర్ ఒక్కరే ఉన్నారు. ఏపీ హజ్ కమిటీ ఈవోగా ఉన్న గౌస్ పీర్‌కు ఉర్దూ అకాడమీ డైరెక్టర్, నూర్‌బాషా ఫెడరేషన్ ఎండీ పోస్టులు కట్టబెట్టారు. అంటే, ఒకే వ్యక్తికి ఏకంగా రెండు, మూడు బాధ్యతలు అన్నమాట.
- వక్ఫ్ బోర్డు సీఈవో మహ్మద్ అలీ సర్వీస్ రికార్డుల్లో ఇంటర్ విద్యార్హత మాత్రమే ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. పదోన్నతిపై సామాజిక మాధ్యమాల్లో న్యాయవాదులు పోస్టులు పెట్టారు. ఈయన బంధువులు 13 మందికి పైగా వక్ఫ్‌బోర్డులో కీలక స్థానాల్లో ఉన్నారు. అలీ హైదరాబాద్‌లో వక్ఫ్ బోర్డు స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టడం వివాదాస్పదమైంది. తర్వాత ఆ భూమికి లీజు ఖరారు చేసుకున్నట్టు తెలిసింది.
- రాజ్యాంగబద్ధమైన మైనార్టీ కమిషన్ కార్యదర్శి పోస్టుకు ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ హోదా కలిగిన వ్యక్తిని నియమించాల్సి ఉంది. కానీ, తగిన అర్హత లేని నిజాముద్దీన్‌కు బాధ్యతలు అప్పగించారు. కమిషన్‌కు చైర్మన్‌ను లేకపోవడంతో వైస్ చైర్మన్ జాషువా డానియేల్ బాధ్యతలు చూస్తున్నారు. ప్రస్తుతం కమిషన్ కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోయాయి. ఉర్దూ అకాడమీకి చైర్మన్, పాలక వర్గాన్ని కూడా నియమించకపోవడం గమనార్హం.

జగన్ చేసి చూపించారు..

వైఎస్ జగన్ మాట ఇస్తే చేసి చూపిస్తారని ప్రజల్లో నమ్మకం పెంచుకున్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముస్లింలను ప్రోత్సహించారు. శాశ్వత జీవనోపాధి చూపించేలా అనేక పథకాలతో మైనార్టీలకు జగన్ మేలు చేశారు.

–మీర్జా షంషీర్ అలీబేగ్, మాజీ చైర్మన్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్

ముస్లింలను ఎంతకాలం మోసం చేస్తారు బాబూ..?

రాష్ట్రంలోని ముస్లిం సమాజాన్ని ఎంతకాలం మోసం చేస్తారు చంద్రబాబూ..? 2024లో హజ్ యాత్రీకులకు జగన్ నిధులు మంజూరు చేయగా, తర్వాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వలేదు. రూ.లక్ష చొప్పున ఇస్తామని ఆ తర్వాత విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి వెళ్లే వారికే అని మోసం చేశారు. హజ్ కమిటీలో ఇస్లామిక్ ధార్మిక పండితుల స్థానంలో టీడీపీ కార్యకర్తలు పఠాన్ ఖాదర్‌ఖాన్, షేక్ హసన్‌బాషాలను నియమించారు.

–షేక్ గౌస్ లాజమ్, ఏపీ హజ్ కమిటీ మాజీ చైర్మన్

మైనార్టీ దినోత్సవం జరిపే నైతిక హక్కులేదు..

మైనార్టీలకు ఏ మాత్రం మేలు చేయని అసమర్థ చంద్రబాబు ప్రభుత్వానికి మైనార్టీ జాతీయ దినోత్సవాన్ని జరిపే నైతిక హక్కులేదు. బాబు అధికారంలో ఉంటే ఒకలా, ప్రతిపక్షంలో ఉంటే మరోలా వ్యవహరిస్తారు.

–షేక్ నాగుల్ మీరా, రాష్ట్ర అధ్యక్షులు, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి

వైఎస్ జగన్ మేలును ముస్లిం సమాజం మరువదు

వైఎస్ జగన్ చేసిన మేలును ముస్లిం సమాజం ఎప్పటికీ మరువదు. నూర్ బాషా, దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.100 కోట్లిస్తానని 2014, 2024 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు. నామినేటెడ్ పదవుల్లోనూ అన్యాయం చేశారు.

–షేక్ దస్తగిరి, అధ్యక్షుడు, ఏపీ ముస్లిం దూదేకుల జేఏసీ

చంద్రబాబు ఎవరు?

- ఆయనకూ నేనే సమయం ఇవ్వాలి
- అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అనపర్తి : 'చంద్రబాబు ఎవరు? చంద్రబాబుకు కూడా సమయం ఇవ్వాల్సింది నేనే'.. అంటూ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరులో స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు తనకు సమయం కేటాయిస్తే శాసనసభ సమావేశాలకు రావడానికి సిద్ధమని జగన్ అంటున్నారని విలేకర్లు ప్రశ్నించగా.. అయ్యన్న పైవిధంగా వ్యాఖ్యానించారు. జగన్ అసెంబ్లీకి ఎందుకు రావడంలేదంటూ చాలా మంది తనను ప్రశ్నిస్తున్నారని, ఆయన రాకపోతే తనకేం సంబంధమని అసహనం వ్యక్తంచేశారు. జగన్‌మోహనరెడ్డి కేవలం పులివెందుల ఎమ్మెల్యే మాత్రమేనని, సాధారణ ఎమ్మెల్యేలకు ఇచ్చినట్లుగానే ఆయనకు కూడా మాట్లాడే అవకాశం ఇస్తానని స్పీకర్ చెప్పారు.

కార్పొరేట్లకు రూ.వేల కోట్లిస్తారు.. మాకివ్వరా రాయితీలు?

మా రాయితీలు ఇవ్వడానికి డబ్బుండదా!

- సబ్సిడీ బకాయిలు చెల్లించకపోతే ఆత్మహత్యే శరణ్యం
- నిబంధనలకు విరుద్ధంగా రాయితీలు విడుదల చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వం దిగిరాకపోతే విశాఖ సమ్మిట్‌ను అడ్డుకుంటాం
- సచివాలయం వద్ద ధర్నాలో నినదించిన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు

సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు

సాక్షి, అమరావతి: మాకు ఇవ్వాల్సిన రూ.1,200 కోట్ల పారిశ్రామిక బకాయిలు ఇవ్వడానికి డబ్బులు లేవుగానీ.. విదేశీ కార్పొరేట్ సంస్థలకు రూ.వేలకోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఎలా ఇస్తారంటూ దళిత పారిశ్రామికవేత్తలు చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల హామీలో భాగంగా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఇస్తామన్న 100 శాతం పారిశ్రామిక ప్రోత్సాహకాలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాయితీ పూర్తిగా విడుదల చేయాలంటూ రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన దళిత పారిశ్రామికవేత్తలు సోమవారం సచివాలయం వద్ద ధర్నా చేశారు. మంత్రివర్గ సమావేశం జరుగుతున్న సమయంలోనే వీరు నల్ల కండువాలు కప్పుకొని, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రాజకీయరంగు పులిమి రాయితీలను నిలిపేయడాన్ని వారు నిలదీశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ నాయకుడు ఈదుపుగంటి అన్నార్‌బాబు మాట్లాడుతూ.. గత 30 ఏళ్లలో ఎప్పుడూ లేనివిధంగా బకాయిల్లో 20%, 30% శాతం చొప్పున అందులోను కొందరికి మాత్రమే విడుదల చేయడం దారుణమని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలందరికీ 100 శాతం రాయితీలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ విధానంలో కాకుండా కేవలం వారికి కావాల్సిన వారికి మాత్రమే నిధులు విడుదల చేశారని చెప్పారు. ఈ విధంగా నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగిరాకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, శుక్ర, శనివారాల్లో విశాఖపట్నంలో జరగనున్న సదస్సును కూడా అడ్డుకుంటామని చెప్పారు. అవసరమైతే ఆమరణ నిరాహారదీక్ష చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఏడాదిన్నరగా పారిశ్రామిక రాయితీల కోసం ఎదురు చూసి అప్పులపాలయ్యామని, ప్రభుత్వం మొండివైఖరి వీడకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

తప్పులు నిజమే..

ఈ ఆందోళన నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ నేతలు కొందరిని అధికారులు పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ వద్దకు తీసుకెళ్లి చర్చలపేరుతో గతంలో మాదిరిగానే కాలయాపన చేశారు. రాయితీల విడుదలకు సంబంధించి ఏపీఐఐసీ రూపొందించిన జాబితాలో తప్పులు దొర్లాయని యువరాజ్ పేర్కొన్నట్లు జేఏసీ నాయకుడు పినమాల నాగకుమార్ చెప్పారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించకపోతే ఏపీఐఐసీ వద్ద ధర్నా చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ ఆందోళనలో జేఏసీ నాయకులు ఈరా రాజశేఖర్, జంగా త్రిమూర్తులు, చినమౌలాలి, కనపర్తి విజయరాజు, కొడాలి రాంబాబు, అన్ని జిల్లాల నుంచి అధికసంఖ్యలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన నూతన కార్యవర్గం

కొమ్మాది (విశాఖ): కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ 20వ త్రైవార్షిక జాతీయ మహాసభలు సోమవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు విశాఖపట్నం కొమ్మాదిలోని ఓ హోటల్‌లో జరిగిన ఈ సమావేశాల్లో చివరి రోజున నూతన జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా కె.రవికుమార్, అధ్యక్షుడిగా రాజీవ్ నిగం, చైర్మన్‌గా జాకబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడోసారి జనరల్ సెక్రటరీగా ఎన్నికైన రవికుమార్‌ను సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ.. బాధ్యతాయుతంగా పనిచేస్తూ అసోసియేషన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు.

మిట్టల్ స్టీల్‌కు పర్యావరణ అనుమతులపై అభ్యంతరాలు

- రాష్ట్ర పీసీబీ నుంచి వివరణ కోరిన కేంద్రం
- ఉక్కు నిర్మాణ పనులు మరింత ఆలస్యం

సాక్షి, అమరావతి: అర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు పర్యావరణ అనుమతుల మంజూరుపై కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అభ్యంతరాలు తెలిపింది. ఈ ప్లాంట్‌కు తక్షణ అనుమతుల మంజూరుకు నిరాకరించింది. రూ.1.50 లక్షల కోట్లతో ఏడాదికి 8.2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో అర్సెలర్ మిట్టల్ నిప్పాన్ కంపెనీ అనకాపల్లి వద్ద భారీ ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయనున్న విషయం తెలిసిందే. ఈ ప్లాంట్‌కు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని అర్సెలర్ మిట్టల్ గ్రూపు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖను కోరింది. దీన్ని పరిశీలించిన నిపుణుల అంచనాల కమిటీ..ఈ ఉక్కు కర్మాగారానికి కేటాయించిన భూమిని గతంలో ఏపీఐఐసీ పారిశ్రామిక పార్కు పేరిట ఇప్పటికే పర్యావరణ అనుమతులు తీసుకుందని, ఇప్పుడు దీన్ని ఉక్కు కర్మాగారంగా మార్చడంతో కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా మళ్లీ అనుమతి తీసుకోవాలా లేదా అనే దానిపై స్పష్టత తీసుకోవాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)ని కమిటీ ఆదేశించింది. ఆ వివరాలు వచ్చే వరకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయకుండా నిర్ణయాన్ని వాయిదా వేసింది. దీంతో ఈనెల 14న ఉక్కు కర్మాగారం నిర్మాణ పనులు ప్రారంభించాలనుకున్న ప్రభుత్వం ఆశలకు గండిపడింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నిర్ణయంతో అనకాపల్లి ఉక్కు కర్మాగార నిర్మాణ పనులు మరింత ఆలస్యం అవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రాథమిక విద్యను పొందటం అనేది ప్రతి వ్యక్తికీ జన్మతః సంక్రమించే హక్కు అని మనం ఒక్క క్షణం కూడా మర్చిపోకూడదు. విద్య లేకుండా అతడు పౌరుడిగా తన విధులను పూర్తిగా నిర్వర్తించలేదు.
– మౌలానా అబుల్ కలామ్ ఆజాద్

సాక్షి
మంగళవారం, 11 నవంబర్ 2025

‘మంచి’ వాతావరణమేది?

కర్బన ఉద్గారాల తగ్గింపు కోసం పదేళ్ల క్రితం ప్యారిస్ వేదికగా కుదిరిన చరిత్రాత్మక ఒడంబడికను దాదాపు అన్ని దేశాలూ పోటీలు పడి మరీ ఉల్లంఘిస్తున్న తరుణంలో బ్రెజిల్‌లోని బెలేమ్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్–30) సదస్సు సోమవారం ప్రారంభమైంది. ప్యారిస్ ఒడంబడికలో దేశాల వాగ్దానమేమిటో, నెరవేర్చింది ఏ మేరకో చూసి లక్ష్య నిర్దేశం చేయటం కోసం ఏటా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఈ సదస్సు 10 రోజుల పాటు జరుగుతుంది. కానీ విషాదమేమంటే... పెద్దగా ఫలితం లేకుండానే అవి ముగిసిపోతున్నాయి. తీసుకున్న అరకొర నిర్ణయాలైనా అమలుపరిచే నాథుడు కనబడడు. అందువల్లే నిరుడు అజర్‌బైజాన్‌లోని బాకూలో కాప్–29 తరువాత పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఈసారి సదస్సుకు అనేక విధాల ప్రాముఖ్యం ఉంది. ఇంతవరకూ ఎక్కువగా యూరప్ లేదా పశ్చిమాసియా ప్రాంత దేశాల్లో ఈ సదస్సులు నిర్వహించటం రివాజు. అందుకు భిన్నంగా దక్షిణ అమెరికా ప్రాంత దేశాన్ని ఎంపిక చేసుకోవటం ఈసారి ప్రత్యేకత. అది కూడా భూగోళానికి శ్వాసకోశాలుగా పరిగణించే అమెజాన్ అడవుల ముంగిట కొలువుదీరిన నౌకాశ్రయ నగరం బెలేమ్ కావటం గమనించదగ్గది. వాతావరణ మార్పులపై చర్చించటానికి అదైతేనే ప్రతీకాత్మక వేదికవుతుందని నిర్వాహకులు అభిప్రాయపడి ఉండొచ్చు. అత్యంత దారిద్ర్యం, వనరుల దుర్వినియోగం కొట్టొచ్చినట్టు కనబడే బెలేమ్‌ను దేశదేశాల నుంచీ వచ్చే ప్రతినిధులు ప్రత్యక్షంగా వీక్షిస్తే సుస్థిరాభివృద్ధికి మద్దతుగా నిలవాల్సిన ఆవశ్యకతను అంతర్జాతీయ సమాజం గుర్తిస్తుందని కూడా వారు భావించి ఉండొచ్చు.

ప్రపంచం ఇప్పుడు ప్రమాదకర వాతావరణంలోకి ప్రవేశించింది. పారిశ్రామికీకరణకు ముందున్న ఉష్ణోగ్రతలతో పోలిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ 2 డిగ్రీల సెల్సియస్ లోపే పెరుగుదల ఉండేలా... వీలైతే అది 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితమయ్యేలా ప్రయత్నించాలన్నది ప్యారిస్ ఒడంబడిక కృతనిశ్చయం. కానీ 2024కే ఆ 1.5 డిగ్రీల పరిమితి దాటిపోయామని గణాంకాలు చెబుతున్నాయి. పది రోజులపాటు కొనసాగే ఈ సదస్సులో ఏదో అనుకోని అద్భుతం జరిగితే తప్ప ముంచుకురానున్న విపత్తును ఆపటం దుర్లభం. కానీ పరిస్థితి ఆశాజనకంగా లేదు. మాట తప్పడం, సాకులు చెప్పడం అన్ని దేశాలకూ అలవాటైంది.

గత ఏలుబడిలో ప్యారిస్ ఒడంబడిక నుంచి బయటికొచ్చినట్టే ఇప్పుడు కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తప్పుకున్నారు. ఇది ఒకరకంగా మేలేనని వివిధ దేశాలు భావిస్తున్నాయి గానీ, ట్రంప్ తన ‘బెదిరింపు దౌత్యం’తో మున్ముందు అందరినీ తన దారికితెచ్చే ప్రయత్నం చేస్తారు. గత నెలలో జరిగిన పరిణామమే ఇందుకు తార్కాణం. రవాణా నౌకల కాలుష్యాన్ని సంపూర్ణంగా అరికట్టేందుకు 100 దేశాల మధ్య అవగాహన కుదిరి, ఒడంబడికపై సంతకాలు కాబోతుండగా ట్రంప్ టీమ్ సైంధవ పాత్ర పోషించింది. సంతకాలు చేసే దేశాల నావికుల్ని అమెరికా తీరంలో అడుగు పెట్టనీయబోమని విదేశాంగ మంత్రి మార్కో రూబియో వివిధ దేశాలకు స్వయంగా ఫోన్లు చేసి బెదిరించారని ‘న్యూయార్క్ టైమ్స్’ కథనం. ఇక సుంకాలు, ఆర్థిక ఆంక్షలు, వీసా బెదిరింపులు షరా మామూలే. దాంతో అది కాస్తా నిలిచిపోయింది. ఇప్పుడు కాప్–30కి ఆ బెడద తప్పదు.

ట్రంప్ వచ్చాక అమెరికాలో హరిత ఇంధన ప్రాజెక్టులు అటకెక్కాయి. వాతావరణ మార్పు పెద్ద బోగస్ అంటూ శిలాజ ఇంధన ఆధారిత ప్రాజెక్టులకు అనుమతులిస్తున్నారు. వాతావరణ మార్పులపై గతంలో పెద్ద మాటలు మాట్లాడిన బిల్ గేట్స్ ప్లేటు ఫిరాయించారు. ‘మరీ అంత ప్రమాదమేమీ లేద’ంటూ నసుగుతున్నారు. యూరోప్ యూనియన్ డిటో. అక్కడ అందరిదీ తలో దోవ అవుతోంది. కర్బన ఉద్గారాల తగ్గింపులో మన దేశం రికార్డు కూడా ఏమంత మెరుగ్గా లేదు. దక్షిణ అమెరికా, ఆఫ్రికా తీరాల సమీపంలోని వేడి నీటి పగడపు దిబ్బలు కనుమరుగు కావటం ప్రమాద సంకేతమని ఇటీవలే బ్రిటన్‌లోని ఎక్సెటర్ విశ్వవిద్యాలయం చెప్పిన నేపథ్యంలో కాప్–30 చిత్తశుద్ధితో, దృఢంగా వ్యవహరించి నిర్ణయాలు తీసుకుంటేనే భూగోళం పది కాలాలు పచ్చగా ఉండగలదు. లేనట్టయితే ఇక సరిదిద్దుకోవటం సాధ్యపడని ప్రమాదకర స్థితికి చేరుకోవటం ఖాయం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తిక మాసం, **తిథి:** బ.షష్ఠి ఉ.6.16 వరకు, తదుపరి సప్తమి తె.4.48 వరకు (తెల్లవారితే బుధవారం), **నక్షత్రం:** పుష్యమి రా.12.33 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** ఉ.9.03 నుండి 10.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.24 నుండి 9.09 వరకు, తదుపరి రా.10.27 నుండి 11.18 వరకు, **అమృత ఘడియలు:** సా.6.26 నుండి 8.02 వరకు.

సూర్యోదయం : 6.06
సూర్యాస్తమయం: 5.22
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

తట్టుకోవాలి

1974, 1998లలో భారతదేశం అణు బాంబులను పరీక్షించినప్పుడు అనేక దేశాలు మనపై ఆంక్షలు విధించాయి. నేడు మన పరిశోధన, అభివృద్ధి బలమైన స్థాయికి చేరుకున్నాయంటే కారణం... ఆనాడు మనం ఆ ఆంక్షల్ని తట్టుకుని గట్టిగా నిలబడగలగటమే.

– అనిల్ కాకోద్కర్, అణు శాస్త్రవేత్త

మనసు తెరవండి!

సానుభూతి, సత్సంబంధాలు మానవ పురోగతికి మూల స్తంభాలు. సాటి మనిషి పట్ల సద్భావనతో మెలగటం, వారి హృదయంలో స్థానం సంపాదించటం మానవీయ అనుబంధాలను గాఢ పరుస్తాయి. భావోద్వేగాలను పంచుకోవటంలో బిడియ పడాల్సిందేముంది?

– డి.వై. చంద్రచూడ్, మాజీ సీజేఐ

తొలి ప్రయత్నం

మీ మొదటి ప్రయత్నంలో మీరు సాధించిన దానితో పూర్తిగా సంతృప్తి చెందకండి. మీ నైపుణ్యాన్ని నిజాయతీగా విమర్శించేవారి ముందు ప్రదర్శించండి. లోపాలు ఎక్కడున్నాయో వారు మీకు చెబుతారు. మిమ్మల్ని మీరు మెరుగు పరుచుకోవడానికి ఇది చాలా ముఖ్యం.

– రీతూ కుమార్, ఫ్యాషన్ డిజైనర్

మీరు లేకుండానా!



ఆశలకు, కలలకు ఎవరూ అనర్హులు కారు. మధ్యతరగతి వాళ్లమనీ, సాధారణ కుటుంబాల నుంచి వచ్చామనీ నిస్పృహ చెందకుండా యువతీ యువకులు రాజకీయాల్లోకి రావాలి. యువత భాగస్వామ్యం లేకుండా సమాజంలో మార్పన్నది అసాధ్యం.

– రాఘవ్ చద్దా, రాజ్యసభ సభ్యుడు

మెట్లు ఉండవు

విజయానికి ప్రత్యేకంగా మెట్లు ఉండవు. ప్రతి వైఫల్యాన్నీ ఒక మెట్టుగా మనమే అమర్చుకోవాలి. నిరుత్సాహంతో కూలబడిపోవటం సహజమే కానీ, తిరిగి పైకి లేవాలి. సాధించగలం అన్న విశ్వాసమే ఎదురు దెబ్బల నుంచి మెలకువలు నేర్చుకునేలా చేస్తుంది.

– రాబిన్ ఉత్తప్ప, మాజీ క్రికెటర్

నమ్మండి!

బరువు తగ్గటానికి రెండు సింపుల్ టిప్స్. 1. తగ్గేందుకు ప్రయత్నం. 2. తగ్గాలన్న సంకల్పం. చిన్న చిన్న మార్పులే పెద్ద ఫలితాన్ని ఇస్తాయి. రెండు గుప్పెళ్లు భోజనం తగ్గించండి. నడవటానికి ఏ మాత్రం అవకాశం ఉన్నా, డ్రైవింగ్‌ను పక్కన పెట్టేయండి. అలాగే, బరువు తగ్గే భారీ ప్రణాళికలను కూడా!

– బోనీ కపూర్, సినీ నిర్మాత

అమెరికాతో ఆచి తూచి...

విశ్లేషణ

శ్యామ్ శరణ్

ఇండియా, అమెరికా వాణిజ్య ఒప్పందం ఒక కొలిక్కి వచ్చినట్లేనా? సంతకాలు చేయడమే తరువాయి అంటూ ఆరు నెలలుగా వింటున్నాం. అయినా, ఉభయ పక్షాలూ ఆ చివరి ఘట్టం చేరుకోలేకపోతున్నాయి. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు ఇండియా మీద విధించిన 25 శాతం అదనపు సుంకం విషయానికి వద్దాం. ప్రైవేటు రంగ సంస్థలు రష్యా చమురు కొనుగోళ్లను తగ్గించాయి. మరి ఆ 25 శాతం అదనపు సుంకాలను అమెరికా ఎత్తివేస్తుందా? అలాంటి సంకేతాలేమీ లేవు.

చమురు కొనకపోయినా...

ఇండియా–యూఎస్ రక్షణ సహకారం మరో పదేళ్లు కొనసాగుతుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా యుద్ధ వ్యవహారాల మంత్రి పీట్ హెగ్సేథ్ ‘ఏసియాన్’ రక్షణ మంత్రుల సదస్సు సందర్భంగా అక్టోబర్ 31న కౌలాలంపూర్‌లో ప్రకటించారు. దీంతో వాణిజ్య వివాదం త్వరలోనే పరిష్కరం కాగలదన్న ఆశలు చిగురించాయి. ఇండియాకు రక్షణ సామగ్రి సరఫరా చేయడం ద్వారా అమెరికా బిలియన్ల డాలర్లను అర్జిస్తోంది. కాబట్టి మనపై ఆంక్షలు తొలగిస్తుందని అనుకోవడానికి వీల్లేదు. అమెరికా అధ్యక్షుడి లెక్కలు వేరేగా ఉంటాయి. ఇండియా జాగ్రత్తగా అడుగులు వేయాలి. రాబోయే రోజుల్లో ఎస్–500 తరహా రష్యా అత్యాధునిక ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు ట్రంప్ అభ్యంతరం చెప్పరని అనుకోలేం. వాటిని సమకూర్చుకునేట్లయితే తాము ఇండియాకు రక్షణ పరికరాలను, విడిభాగాలను విక్రయించబోమంటూ పేచీ పెట్టరన్న గ్యారంటీ లేదు. చమురు కొనుగోళ్లపై ఆంక్షలు విధిస్తారని అనుకున్నామా?

రష్యా చమురుకు చైనా కూడా భారీ కొనుగోలుదారు. నాటో కూటమి సభ్యులైన టర్కీ, హంగరీ సైతం గణనీయంగా ఆ దేశం నుంచి ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాయి. అయినా, అమెరికా ఇండియాను మాత్రమే వేరు చేసి ఆంక్షల శిక్ష విధించింది. బూసాన్ (దక్షిణ కొరియా)లో ఎపెక్ సదస్సు సందర్భంగా ఇటీవల చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ట్రంప్ చర్చలు జరిపారు. అందులో రష్యా చమురు ప్రస్తావన తేలేదని అన్నారు. ఇండియా మీద ఆంక్షల కత్తి ఝుళిపించిన ట్రంప్ చైనా విషయంలో అలా చేయలేక పోయారు.

ఇటీవలి ‘ఏసియాన్’ సదస్సులో అమెరికా, ఇండియా రక్షణ మంత్రులు

◆ యూరప్, ఇండియాల మధ్య దృఢమైన రక్షణ భాగస్వామ్యం ఉన్నట్లయితే, నిలకడ లేని అమెరికా విధానాలకు విరుగుడుగా అది ఉభయ పక్షాలకూ ఉపయోగపడుతుంది.

ప్రతీకార చర్యలు తీసుకుంటామని చైనా ముందే హెచ్చరించడం అందుకు కారణం కావచ్చు.

‘క్వాడ్’ లేనట్లేనా?

అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం చైనా ముప్పు నుంచి కాపాడుతుందన్న నమ్మకాన్ని పునఃసమీక్షించుకోవాలి. నంబర్ 1, నంబర్ 2 దేశాల నడుమ నెలకొన్న వ్యవస్థాగత పోరు సమసిపోనప్పటికీ, ఇరు దేశాలూ వ్యూహాత్మక సర్దుబాట్లు చేసుకుంటున్నందువల్ల ఇండియా ఎత్తుగడలు ఫలించే అవకాశం తగ్గిపోతుంది. యుక్తమైన దౌత్యవిధానం అనుసరించడం ద్వారానే ఈ ముప్పును ఎదుర్కోవలసి ఉంటుంది.

అమెరికా ఇండో–పసిఫిక్ వ్యూహం యథాతథంగా కొనసాగుతుందనడానికి ఇటీవలి ట్రంప్ ఆసియా పర్యటనే నిదర్శనమని పరిశీలకులు అంటున్నారు. అయితే, ఈ వ్యూహంలో ఇండియా ప్రయోజనాలకు సంబంధించిన ‘క్వాడ్’ అంశం మరుగున పడింది. ఈ ఏడాది అఖరున క్వాడ్ దేశాధినేతల సమావేశం జరగాల్సి ఉంది. ఇది అనుమానమే. ట్రంప్ ఎక్కడా క్వాడ్ ఊసెత్తలేదు. భాగస్వామ్య దేశాలైన ఆస్ట్రేలియా, జపాన్ సైతం ప్రస్తావించక పోవడం గమనార్హం. అవి ట్రంప్ మనసెరిగి మసలుకున్నట్లుంది.

ఒకవేళ ఆస్ట్రేలియా, జపాన్‌లతో ఇండియా తన సహకారాన్ని ముమ్మరం చేసుకుని ఒక త్రైపాక్షిక కూటమి (ట్రయడ్) ఏర్పాటు కోసం ప్రయత్నిస్తోంది అనుకుంటే, దాని ప్రయోజనాలు ఎలా ఉంటాయన్నది మరో ప్రశ్న.

ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ఇండియాకు ఉన్న ఇతర అవకాశాలను చూద్దాం. యూరప్‌తో సన్నిహిత సమగ్ర భాగస్వామ్య ఒప్పందం వీటిలో ఒకటి. యూరప్ రక్షణ పరిశ్రమ భారీ విస్తరణ కోసం నమ్మకమైన విపణి, అగ్రశ్రేణి మానవ వనరులు అవసరం. ఇండియా వీటిని సమకూర్చగలదు. యూరప్, ఇండియాల మధ్య దృఢమైన రక్షణ భాగస్వామ్యం ఉన్నట్లయితే, నిలకడ లేని అమెరికా విధానాలకు విరుగుడుగా అది ఉభయ పక్షాలకూ ఉపయోగపడుతుంది.

ఇండియా బలాలు

అరిగిపోయిన రికార్డులా నేను మళ్లీ చెబుతున్నా. ఉపఖండ సరిహద్దుల భద్రత మన తక్షణ ఆవశ్యకత. పొరుగు దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారానే ఇది సాధ్యపడుతుంది. మనం దక్షిణాసియా వృద్ధికి ఒక కేంద్రకంగా, భద్రత కల్పించే శక్తిగా మారడం ముఖ్యం. అనూహ్యంగా అనిపించినా కాలక్రమంలో పాకిస్తాన్ కూడా ఈ పరిధిలోకి వచ్చి తీరాలి. మన ప్రాంతానికి వాతావరణ మార్పు అతిపెద్ద సవాలు కాబోతోంది. ఈ సంక్షోభాన్ని అధిగమించడం ప్రాంతీయ దేశాల నడుమ సహకారంతోనే సాధ్యమవుతుంది. ఈ విపత్తుపై ఉమ్మడి పోరాటానికి సారథ్యం వహించే శక్తి ఇండియాకు మాత్రమే ఉంది. తూర్పు ఆసియా, ఆగ్నేయ ఆసియా ప్రాంతాల్లోనూ ఇండియా ప్రముఖ పాత్ర వహించాలి. ఇందుకు వీలుగా ఆర్‌సీఈపీ, సీపీటీపీపీ స్వేచ్ఛా వాణిజ్య కూటముల్లో సభ్యత్వం కోసం ప్రయత్నించాలి.

శాస్త్ర సాంకేతిక మానవ వనరులతో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, సంక్షుభిత సమకాలీన ప్రపంచంలో చెక్కు చెదరని రాజకీయ సుస్థిరత... ఈ రెండూ ఇండియా సొంతం. వివేకంతో వినియోగించుకోగలిగితే దేశాన్ని ఇవి వ్యూహాత్మకంగానూ ముందంజ వేయిస్తాయి. చైనాతో సంబంధాలను మెరుగుపరచడంలో వీటి పాత్ర ఉంది. ఏమైనప్పటికీ, విదేశీ విధానంలో, రక్షణ వ్యవహారాల్లో బయటి శక్తుల ప్రమేయం లేకుండా స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోగల ‘వ్యూహాత్మక స్వతంత్రత’ సాధించడానికి... సామర్థ్యం కంటే సంకల్పం ముఖ్యం.

వ్యాసకర్త కేంద్ర విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

సంస్కరణల పథాన్ని స్వాగతిద్దాం!

సందర్భం



బండారు దత్తాత్రేయ

ఏ దేశ అభివృద్ధి అయినా అక్కడి మానవ వనరుల వికాసం మీదే ఆధారపడి ఉంటుంది. ఈ మానవ వనరుల అభివృద్ధికి ప్రధానమైనది ‘విద్య’. బ్రిటిష్ కాలంలో కేవలం వారికి అనుకూలమైన గుమస్తాలను తయారుచేసే విద్యా విధానాన్నే అనుసరించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ మొదటి విద్య శాఖ మంత్రిగా కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆయన జయంతినే ‘జాతీయ విద్యా దినోత్సవం’గా జరుపుకొంటున్నాం.

కేంద్ర పాలకులు 1968లో మొదటి జాతీయ విద్యా విధానాన్ని, 1986లో రెండవ జాతీయ విద్యా విధానాన్ని, 1992లో పరిమిత స్థాయిలో మూడవ జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి అమలు చేశారు. కానీ ప్రపంచ దేశాలతో ప్రత్యేకించి అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా పోటీపడి నైపుణ్యాలతో ముందుకు వెళ్లలేకపోయాము. మానవ వనరుల శాఖను కూలంకషంగా చర్చించి 34 ఏళ్ల తరువాత విద్యా రంగంలో కీలకమైన మార్పులు చేయాలనే తలంపుతో డా॥ కస్తూరి రంగరాజన్ అధ్యక్షతన ‘జాతీయ నూతన విద్యా కమిషన్’ ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ సూచనల ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం ‘నూతన జాతీయ విద్యా విధానం 2020’ (ఎన్‌ఈపీ–2020) ప్రకటించింది. ఇది దేశంలో విద్యారంగానికి సంబంధించి సమగ్రమైన సంస్కరణ. సాంకేతిక విజ్ఞానం, నైతిక విలువలతో కూడిన విద్య, ఉపాధి కల్పన, పారదర్శకత దీని లక్ష్యం.

2035వ సంవత్సరం నాటికి ఉన్నత విద్యాసంస్థల్లో దాదాపు 3 కోట్ల సీట్లు అదనంగా రానున్నాయి. యూజీసీ కోర్సులలో బహుళ ప్రవేశాలు, నిష్క్రమణలు చేర్చారు. దేశ జీడీపీలో 6% నిధులు విద్యా రంగానికి కేటాయించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఇది 4.4% శాతంగా మాత్రమే ఉంది. విదేశీ విద్యా సంస్థలు తమ ప్రాంగణాలను ఇక్కడ ఏర్పాటు చేసుకోవచ్చు. అలాగే విదేశీ విద్యార్థులు భారత్‌కు వచ్చి చదువుకునేలా ప్రోత్సహిస్తారు. ఇప్పటివరకు – కంటెంట్ కేవలం ఆంగ్లం, హిందీలోనే అందుబాటులో ఉండగా ప్రస్తుతం అది 8 భారతీయ భాషల్లో (ఇందులో తెలుగు కూడా ఉంది) అందు బాటులోకి రానుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలను ఒకే వేదిక మీదకు తీసుకువస్తారు. దీనికై ‘నేషనల్ టెక్నాలజీ ఫోరమ్’ను ఏర్పాటు చేస్తారు.

పాఠశాల విద్యను ప్రీ–ప్రైమరీ పాఠ్యాంశాలను ఎన్‌సీఈఆర్టీ అభివృద్ధి చేస్తుంది. 3–6 సంవత్సరాల పిల్లలకు ఆటల కార్యక్రమాల ద్వారా సరళమైన పాఠ్యాంశాలను అమలు చేస్తారు. 1–3 తరగతుల విద్యార్థులకు ప్రాథమిక అక్షరాలను, అంకెలను త్వరగా గుర్తుపట్టి చదివేలా తీర్చిదిద్దుతారు. దీనికై ఒక నేషనల్ మిషన్ ఏర్పాటు చేశారు. ‘కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల’ను ఇప్పుడున్న 8 – 10 తరగతుల నుండి 12వ తరగతి వరకు పొడిగిస్తారు. బోర్డు పరీక్షకు ఉన్న ప్రాధాన్యాన్ని తగ్గిస్తారు. ఏటా ఒకసారి కాకుండా 2 సార్లు పరీక్షలు నిర్వహిస్తారు. 12వ తరగతి ముగించుకొని బయటకు వెళ్లే సమయానికి వాళ్ళు ఏయే నైపుణ్యాలు నేర్చుకున్నారో వాటిని ఒక డేటాబేస్‌లో నిక్షిప్తం చేస్తారు.

ఈ నూతన విద్యా విధానంలో భాగంగా ఏ భాషను కూడా బలవంతంగా రుద్దడం జరగదు. అన్ని స్థాయిల తరగతుల్లో త్రిభాషా సూత్రాన్ని అమలు పరుస్తారు. ప్రస్తుతం ఉన్న 10+2+3 బదులు... 5+3+3+4 ఉండేలా మార్పులు చేస్తారు. 9–12 తరగతుల విద్యార్థులు ఏ మార్కులు వచ్చినా నచ్చిన సబ్జెక్టు తీసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే వాటితో పాటు విద్యార్థులు తమకు నచ్చిన ఫ్యాషన్ డిజైన్, ఆహార తయారీ, తదితర కోర్సులు నేర్చుకోవచ్చు. డిజిటల్ లాకర్ ద్వారా పాత క్రెడిట్స్ అట్టిపెట్టుకొని... చదువు మానేసినా, తనకు వీలైన సమయంలో తిరిగి చదువు కొనసాగించేలా వెసులుబాటు కల్పించారు.

వృత్తి విద్యను 6వ తరగతి నుండే ప్రారంభిస్తారు. దీనిలో ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. యూజీసీ, ఏఐసీటీఈ, జాతీయ ఉపాధ్యాయ మండలి వంటివాటిని విలీనం చేసి మొత్తం విద్యా వ్యవస్థ నియంత్రణకు ఒకే వ్యవస్థ ఏర్పాటు చేస్తారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ఒకే రకమైన నిబంధనలను అమలు చేస్తారు. గుర్తింపు ఆధారంగానే స్వయం ప్రతిపత్తి ఇస్తారు. విద్యార్థులు, అధ్యాపకులకు మార్గదర్శనం చేయడానికి ‘నేషనల్ మిషన్ ఫర్ మెంటరింగ్’ను ఏర్పాటు చేస్తారు.

ఈ సంస్కరణలను సంకుచితమైన రాజకీయ దృక్కోణంలో చూడకుండా అన్ని రాష్ట్రాలూ అమలు చేయడానికి ముందుకు రావాలి. మనమందరం కూడా ఈ సంస్కరణను స్వాగతిద్దాం. అదే మనం అబుల్ కలామ్ ఆజాద్‌కు ఇచ్చే నిజమైన నివాళి.

వ్యాసకర్త మాజీ గవర్నర్
(నేడు ‘జాతీయ విద్యా దినోత్సవం’)

ప్రజాస్వామ్య సౌందర్యం ఇదే!

ఇన్ బాక్స్

న్యూయార్క్ నగరానికి పిన్నవయస్కుడైన జోహ్రాన్ మమ్దానీ ఎన్నిక కావడం చాలా కోణాల్లో శుభ సంకేతం. అంతే కాదు ఒక కొత్త చరిత్ర. వందేళ్ల తర్వాత అతి తక్కువ వయసులో ఎన్నికైన 34 ఏళ్ల ఆ యువకుడు ట్రంప్ విధానాలకు వ్యతిరేకం. దక్షిణాసియా మూలాలు, ఇంకా చెప్పాలంటే భారత మూలాలు కలిగి ఆ నగరంలో అత్యున్నత పదవికి ఎన్నికైన మొదటి వ్యక్తి. అక్కడి వాళ్లు ద్వేషించక పోయినా, అంతగా ఇష్టపడని మతానికి చెందిన వ్యక్తి. సంపన్నులు, పెట్టుబడిదారులు శాసించే రాజకీయ రంగంలో నిలదొక్కుకున్న సాధారణ పౌరుడు. వారికి రుచించని సామ్యవాద భావాలు కలిగిన, ప్రచారం చేసిన యువకుడు. ఇన్ని విశేషాలతో గెలవడమే కాదు, ‘ఆయన ఎన్నికైతే ఫెడరల్ నిధుల్ని న్యూయార్క్‌కు అందనివ్వను’ అని ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు, ప్రత్యర్థి పార్టీ పెద్ద ట్రంప్ నేరుగా భయపెట్టినా ప్రజామోదం పొందిన నాయకుడు. ఆయన గెలుపుతో అమెరికా పౌర సమాజం ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పదనాన్ని మరో మారు చాటింది. కొత్త తరహా రాజకీయాలకు, చైతన్యవంతులైన యువతకు ప్రజాస్వామ్య విధానంలో ఎప్పుడూ చోటు తగ్గదని నిరూపించింది. అత్యంత శక్తిమంతుడైన అధ్యక్షుడు తన స్థాయి తగ్గించుకుని బెదిరింపులకు పాల్పడ్డా, ప్రజల ఆదరణ ముందు అవి తాటాకు చప్పుళ్ళుగానే మిగిలాయి.

జోహ్రాన్ మమ్దానీ

జోహ్రాన్ ప్రజలకు అవసరమైన విషయాలే ప్రచారంలో మాట్లాడాడు. ఎక్కువమందికి తిండి, గూడు, ప్రజారవాణా ఛార్జీలు తడిసిమోపెడయినందున, వాటిపై స్పష్టమైన హామీ లిచ్చాడు. అందరినీ కలుపుకొనిపోయే ధోరణి చూపించాడు. ప్రత్యర్థి తప్పులెంచి వాదించాడు తప్ప అనవసర ప్రసంగాలు చెయ్యలేదు. నిధుల లేమి వల్ల ప్రచారంలో వెనకబడి పోకుండా, సామాజిక మాధ్యమాల్ని, నేరుగా ఓటర్లను కలిసే మార్గాల్ని ఎంచుకున్నాడు. వీటితో బాటు ప్రజలు కూడా ట్రంప్‌కి హితబోధ అవసరం పడిందని భావించారు. ఆయన విధానాల వల్ల పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఫెడరల్ షట్‌డౌన్‌లు ప్రభావం చూపాయి. ఒక రకంగా స్థానికమైనా ఈ ఎన్నికలు ట్రంప్ పాలనపై రెఫరెండం. మిగతా నగరాల్లో కూడా ఇదే తరహాలో ఎన్నికల ఫలితాలు ఆయన పార్టీకి వ్యతిరేకంగానే ఉన్నాయి. పెట్టుబడిదారీ సమాజంలో సామ్యవాద భావాల యువకుడు గెలిచాడని పత్రికలు రాస్తున్నాయి. అయితే అసలు విషయమేమిటంటే ఎప్పుడైనా ప్రజలకు వాదాల కన్నా తమ బాధలు వినేవాడే నాయకుడు! కొంచెం భరోసా ఇస్తే పట్టం కడతారు. ప్రజాస్వామ్యంలోని అందమిదే!

– డా॥ డి.వి.జి. శంకరరావు । పార్వతీపురం మాజీ ఎంపీ

5 లక్షల కొత్త ఉద్యోగాలు

డేటా పాయింట్

కేంద్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య 2022తో పోలిస్తే సుమారు 5 లక్షలు పెరిగింది. ఈ ఏడాది మార్చి ఒకటి నాటికి మొత్తం 36.58 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారని అంచనా.



పని తీరు

జ్యోతిర్మయం

ప్రాణం ఉన్నంతసేపూ ప్రాణి ఏదో ఒక పని చేస్తూనే ఉంటుంది. ఏదో ఒక కర్మను ఆచరిస్తూనే ఉంటుంది. ఆ కర్మల ఆచరణల ధోరణిని బట్టి మనుషులను మూడు తరగతులుగా గుర్తిస్తుంది భగవద్గీత.

చాలామంది పనులలో ఏకాగ్రత చూపరు. ‘గుడ్డెద్దు చేలో పడ్డట్టు’ పని చేశాం అనిపిస్తారు. ఇతరుల దగ్గర నేర్చుకొనే ధ్యాస చూపరు. అయితే అడ్డదారులు తొక్కేందుకు, మోసంతో పరులకు హాని చేస్తూ తమ పనులు పూర్తి చేసేందుకు వెరవరు. వీళ్ళకు వీళ్ళు చేసే పనుల పట్ల స్వాభావికంగా ఉత్సాహం ఉండదు. ఇవాళ, రేపట్లో చేయాల్సిన కర్తవ్యాలను కూడా నెలలపాటు వాయిదా వేస్తుంటారు. ఇది తామస స్వభావుల పని తీరు.

మరికొంతమందిది రాజస స్వభావం. అంటే మహారాజుల పోకడ అని కాదు. ‘రజో’ గుణ ప్రకోపం గల స్వభావం. వీళ్ళకు ‘అది చేయాలి, ఇది చేయాలి, ఏదేదో చేసేయాలి’ అని ఆసక్తి మెండు. పని చేసి, అందుకు ఇబ్బడి ముబ్బడిగా ఫలాన్నీ, కీర్తినీ సంపాదించాలని ఆరాటం, పేరాశ నిజాయతీకీ, చిత్తశుద్ధికీ విలువ ఇవ్వనివ్వదు. పని జరిగితే ‘మా గొప్ప!’ అని కొండెక్కినట్టు పొంగిపోతారు. వైఫల్యం చవిచూస్తే, అపారమైన వేదన అనుభవిస్తారు.

కొద్దిమంది సాత్త్విక స్వభావంతో పని చేస్తారు. ధైర్యంగా, ఉత్సాహంగా, ఏకాగ్రతతో పని చేస్తారు, కానీ ఫలాపేక్షతో నిమిత్తం లేకుండా చేస్తారు. పని సఫలమైనా, విఫలమైనా... మితి మీరే సంతోషంగానీ, చింతగానీ పెట్టుకోరు. ‘పలికించెడి వాడు రామభద్రుడు, నేను నిమిత్తమాత్రుడిని!’ అని నిర్లిప్తతతో, తామరాకు మీద నీటి బొట్టు లాగా ఉంటూ పనులు చేస్తారు.

ఈ మూడు తరగతుల వారిలో ఎవరు ఎక్కువ వివేకవంతులో, ఎవరు దుఃఖానికీ, చింతలకూ ఎక్కువ దూరంగా ఉంటారో వేరుగా చెప్పవలసిన పనిలేదు!

– ఎం. మారుతి శాస్త్రి

దమ్మారో....దమ్

'దమ్మారో దమ్...'
అంటూ విశాఖలో యువతే కాదు...
యాచకులు కూడా గుప్పు...
గుప్పుమంటూ గంజాయి
లాగించేస్తున్నారు. దీనికి సాక్ష్యం
జైలురోడ్డు డౌన్‌లోని గొల్లలపాలెంలో
కొంతమంది నడిరోడ్డు మీదే గంజాయి
సేవిస్తున్నారు. గంజాయి రహిత విశాఖగా
మార్చేస్తున్నామంటూ చంద్రబాబు
ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోంది.
అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి
అందుకు విరుద్ధంగా ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

దేదీప్యమానం... ఇలకైలాసం

శ్రీశైలమహాక్షేత్రం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. కార్తీకమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి వేకువజాము నుంచే స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించుకుని పూజలు చేశారు. పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, హారతి నేత్రపర్వంగా సాగింది. లక్షదీపోత్సవ కార్యక్రమంలో భాగంగా పుష్కరిణి ప్రాంగణమంతా లక్ష దీపాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో వెలిగించారు. సోమవారం సాయంత్రం శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు ఆశీనులను చేయించి అర్చకులు, వేద పండితులు విశేషంగా పూజాదికాలు చేశారు.

– శ్రీశైలం టెంపుల్

123456.. ఫ్యాన్సీ నంబరు కదా.. ఇది చూడగానే పెదవిపై ఓ చిరునవ్వు.. అంతేనా.. చాలామంది కళ్లు కాస్త పెద్దవిగా కూడా అయి ఉంటాయి. ఎందుకంటే లక్షలాది మంది ఈ నంబరును ఆన్‌లైన్ ఖాతాలకు పాస్‌వర్డ్‌గా పెట్టుకున్నారు కాబట్టి. ఈ జాబితాలో మీరూ ఉంటే కచ్చితంగా పాస్‌వర్డ్ మార్చుకోవాల్సిందే. యూకేకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ 'కంపేరిటెక్'ఓ ఆసక్తికర నివేదికను రూపొందించింది. 2025లో డేటా బ్రీచ్ ఫోరమ్స్‌లో లీక్ అయిన 200 కోట్లకుపైగా రియల్ అకౌంట్ పాస్‌వర్డ్స్‌ను కంపేరిటెక్ సేకరించింది. ఆ డేటా ఆధారంగా అత్యధికంగా ఉపయోగించిన పాస్‌వర్డ్స్ జాబితాను విడుదల చేసింది. 123456 పాస్‌వర్డ్‌ను ఏకంగా 76,18,192 మంది తమ ఆన్‌లైన్ ఖాతాలకు ఉపయోగిస్తున్నారు. 12345678ను 36.7 లక్షలు, 123456789ను 28.6 లక్షల మంది వినియోగిస్తున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో admin, 1234 పాస్‌వర్డ్స్ ఉన్నాయి. అత్యధికంగా వినియోగించిన టాప్-100 పాస్‌వర్డ్స్‌లో 53వ స్థానాన్ని India@123 ఆక్రమించింది.

-సాక్షి, స్పెషల్ డెస్క్

123456

76,18,192 మంది వాడుతున్న పాస్‌వర్డ్ ఇదే..

ప్రమాదంలో కోట్లాదిమంది ఆన్‌లైన్ ఖాతాలు

కంపేరిటెక్ తాజా నివేదికలో ఆసక్తికర అంశాలు

కనీసం 12 అక్షరాలు..

పాస్‌వర్డ్ కనీసం 12 అక్షరాలు ఉండాలని మైక్రోసాఫ్ట్ చెబుతోంది. సులభంగా గుర్తించే అవకాశం ఇవ్వకుండా చిన్న, పెద్ద అక్షరాలు, సంఖ్యలు, చిహ్నాల కలయికతో రూపొందించుకోవాలి. కుటుంబ సభ్యులు, వ్యక్తులు, ఉత్పత్తి పేరును పాస్‌వర్డ్‌గా ఉపయోగించకపోవడం మంచిది. తద్వారా మరొకరి చేతుల్లోకి పాస్‌వర్డ్ వెళ్లే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి.

- 65.8% పాస్‌వర్డ్స్ 12 అక్షరాల కంటే తక్కువ ఉన్నాయి
- 3.2% ఖాతాలకు 16 లేదా అంతకంటే ఎక్కువ అక్షరాలను ఉపయోగించారు

2025లో ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వినియోగించిన టాప్-10 పాస్‌వర్డ్స్

పాస్‌వర్డ్	ఆన్‌లైన్ ఖాతాల సంఖ్య
123456	76,18,192
12345678	36,76,487
123456789	28,66,100
admin	19,87,808
1234	17,71,335
Aa123456	14,11,847
12345	13,01,052
password	10,82,010
123	9,59,741
1234567890	6,74,200

బాధితులు కావొద్దు

ఇంటికి తాళం వేసినప్పుడు ఒకటికి రెండుసార్లు లాగి సరిగ్గా పడిందా లేదా అని చూస్తుంటాం. అలాంటిది మన కష్టార్జితం అంతా దాచుకున్న బ్యాంకు ఖాతాలు లేదా పేమెంట్ యాప్స్, జీ-మెయిల్ అకౌంట్స్ వంటి ముఖ్యమైన సాధనాల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలి? ఆన్‌లైన్ పాస్‌వర్డ్‌ను మరొకరు సులభంగా ఊహించగలిగితే, దానిని ఎట్టిపరిస్థితుల్లోనూ వినియోగించకూడదు. ఒకే పాస్‌వర్డ్‌ను ఉపయోగించే వ్యక్తులు ఎక్కువమంది ఉంటే అటువంటి ఖాతాలను హ్యాకర్లు సులభంగా ఛేదించడానికి ఆస్కారం ఉంటుంది. ముఖ్యంగా ఏఐ సాధనాలను సైబర్ నేరస్తులు ఆయుధంగా చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో నెటిజన్లు జాగ్రత్త పడకపోతే బాధితులుగా మిగిలిపోయినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఊహించడం కష్టంగా, దొంగిలించేందుకు వీలులేని క్లిష్టమైన పాస్‌వర్డ్‌ను పెట్టుకోండి అంటూ బ్యాంక్స్, ఆన్‌లైన్ సేవల కంపెనీలు తరచూ చెప్పేది ఇందుకే.

సులభంగా ఊహించేలా..

- చాలా పాస్‌వర్డ్స్‌ను ఆరోహణ లేదా అవరోహణ సంఖ్యలతో.. అంటే వరుస క్రమంలో 12345 లేదా 54321 మాదిరిగా సులభంగా ఊహించేలా ఉంటున్నాయి.
- టాప్-1,000లో నాలుగింట ఒక వంతు పాస్‌వర్డ్స్ పూర్తిగా సంఖ్యలతోనే పెట్టుకున్నారు.
- 123 అంకెలతో 38.6%, 321తో 2%, abc పాస్‌వర్డ్‌తో 3.1% ఖాతాలు ఉన్నాయి.
- 18వ స్థానంలో 111111, 35వ స్థానంలో నిలిచింది.
- 3.9% pass లేదా password, 2.7% admin, 1% welcome అనే పదాలను కలిగి ఉన్నాయి.



డేటా బ్రీచ్ ఫోరమ్స్

యూజర్ల సమాచారాన్ని తస్కరించిన ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు తరచూ డార్క్ వెబ్‌లో కనిపిస్తాయి. ఇవి సైబర్ నేరస్తులు దొంగిలించిన డేటాను పంచుకోవడానికి, కొనుగోలు, విక్రయించడానికి మార్కెట్ ప్లేస్‌లు, చర్చా కేంద్రాలుగా పనిచేస్తాయి. దొంగిలించిన సమాచారంతో సిద్ధంగా ఉన్న మార్కెట్‌ను రహస్యంగా అందించడం ద్వారా చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఈ వేదికలు సులభతరం చేస్తాయి.

ప్యారిస్‌లోని లూవ్ (Louvre) మ్యూజియంలో సెక్యూరిటీ సిస్టమ్‌కు LOUVRE అనే పదం పాస్‌వర్డ్‌గా ఉంది. ఇంత సులభంగా ఉండడం వల్లే దోపిడీ నిమిషాల్లో పూర్తయ్యింది. సుమారు రూ.900 కోట్ల విలువైన ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లిపోయారు.

వృద్ధురాలిపై అఘాయిత్యం

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు సమీపంలోని దేగానిపల్లెలో వృద్ధురాలిపై ఓ యువకుడు ఆదివారం రాత్రి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించి సోమవారం రాత్రి వరకు బాధితురాలి నుంచి మహిళా ఏఎస్‌ఐ వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు వెల్లడయ్యాక కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. బాధితురాలు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... వృద్ధురాలు (60) దేగానిపల్లె శివారులోని ఓ రేకుల ఇంట్లో నివశిస్తోంది. ఈమె భర్త అంధుడు, మూగవాడు కావడంతో ఇంట్లోనే ఉంటాడు. వృద్ధురాలు ఇంట్లో ఉండగా ఆదివారం రాత్రి ఇదేపల్లెకు చెందిన యువకుడు (35) అఘాయిత్యానికి పాల్పడినట్టు బాధితురాలు చెబుతోంది. ఈ విషయం సోమవారం ఉదయం వెలుగుచూడగా, సీఐ గోపాల్‌రెడ్డి దేగానిపల్లెలో బాధితురాలి ఇంటికి వెళ్లి పరిశీలించారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించాక వైద్య పరీక్షల కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఇద్దరు మహిళా వైద్యులు బాధితురాలిని పరీక్షించి అఘాయిత్యానికి పాల్పడిన ఆనవాళ్లు గుర్తించినట్టు సమాచారం. వృద్ధురాలి ఛాతీపైనా, మెడ భాగంలో గాయాలైనట్టు గుర్తించారు.

చెరువులో రోడ్డు వేసిన టీడీపీ నేత

బాలాయపల్లి (సైదాపురం): తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలంలోని కొత్త చెరువులో టీడీపీ నేత షేక్‌బాబు సాహెబ్ చుట్టి గ్రామంలో వ్యవసాయ పొలానికి వెళ్లేందుకు వీలుగా ఏకంగా చెరువులోనే రోడ్డు వేసేశాడు. దీనిపై గ్రామ రైతులు మాట్లాడుతూ..నిండలి గ్రామంలో ఉండే కొందరు సీఎం చంద్రబాబు బంధువులు చుట్టి గ్రామంలోని పొలాలను లీజుకు తీసుకున్నారని, వీటి నిర్వహణను షేక్‌బాబు సాహెబ్ చూస్తుంటాడని చెప్పారు. అయితే ఓ వ్యవసాయ పొలానికి దారి లేకపోవడంతో టీడీపీ అధికారంలోకి రాగానే షేక్‌బాబు సాహెబ్ కొంతమంది రైతులను బెదిరించి చెరువులో గ్రావెల్ రోడ్డు వేశాడని, అడిగితే తమపై దాడి చేస్తున్నాడని చెప్పారు.

గ్రామీణాభివృద్ధికి వాటర్ షెడ్స్ దోహదం

కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని

గుంటూరు వెస్ట్: వాటర్ షెడ్ అంటే చెక్‌డ్యామ్ కాదని భారత గ్రామీణ పునర్నిర్మాణానికి బలమైన ఊతమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని ఐటీసీ హోటల్లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వాటర్ షెడ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం తొలిరోజు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తిపాడు నియోజకవర్గంలోని వెంగళాయపాలెం చెరువు, వాటర్ షెడ్ పునరుద్ధరణను పైలెట్ ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మంగళవారం జరగబోయే జాతీయ వాటర్ షెడ్ మహోత్సవంలో భాగంగా ఈ చెరువును దేశానికి అంకితం చేయబోతున్నామని తెలిపారు. కేవలం 15 రోజుల్లో ఈ స్థాయిలో పనులు పూర్తి చేయించగలిగామన్నారు.

శ్రీవారి పాదాల చెంత మరో అపచారం

మాంసం తిన్న టీటీడీ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది
పోలీసులకు ఫిర్యాదు
ఇద్దరు ఉద్యోగుల తొలగింపు

తిరుమల: తిరుమల క్షేత్రంలో మరోసారి మహా అపచారం చోటుచేసుకుంది. అలిపిరి మెట్ల మార్గానికి సమీపంలోని శ్రీవారి పాదాల మండపం సమీపంలో టీటీడీ అవుట్ సోర్సింగ్ సిబ్బంది కొందరు మాంసం తింటున్న వీడియో సోమవారం వెలుగులోకి వచ్చింది. అందులో.. వారు ఒకచోట కూర్చుని భోజనం చేస్తున్నట్టు.. అందులో మాంసం ఉన్నట్టు గుర్తించారు. ఈ వీడియోను గుర్తుతెలియని భక్తుడు సామాజిక మాధ్యమంలో పెట్టడంతో వెలుగులోకి వచ్చింది. పవిత్రతను కాపాడాల్సిన టీటీడీ సిబ్బందే మాంసాహారం తినడం తీవ్ర వివాదానికి దారితీసింది. మాంసాహారం ఎందుకు తింటున్నారని ప్రశ్నించిన భక్తులపై టీటీడీ సిబ్బంది మండిపడ్డారని సమాచారం.

టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

తిరుమలకు వెళ్లే అలిపిరి మెట్లు మార్గానికి అతి సమీపంలోని శ్రీవారి పాదాల మండపం సమీపంలో టీటీడీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మాంసం తిన్న వారిపై తిరుమల టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ వీడియోలో ఉన్న వ్యక్తులను టీటీడీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులైన రామస్వామి, సరసమ్మగా గుర్తించారు. వీరిద్దరినీ టీటీడీ ఉద్యోగం నుంచి తొలగించింది.

'మరో అపచారం' సంబంధించిన వీడియో కోసం క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

టీటీడీ సిబ్బందే ఇలా చేస్తే..

టీటీడీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది మాంసాహారం తింటున్న దృశ్యాలు కెమెరాల్లో రికార్డు అవుతున్నా.. అక్కడే ఉన్న అధికారులకు విషయం తెలియకపోవడం అనుమానాస్పదంగా మారింది. దీనిపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి ఆశీస్సులతో నడవాల్సిన దారిలో ఇలాంటి అపచారం జరిగేంతగా నియంత్రణ లేని పరిస్థితులు టీటీడీలో నెలకొన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా టీటీడీ విజిలెన్స్ విభాగం ఏం చేస్తోందని భక్తులు ప్రశ్నిస్తున్నారు. మెట్ల మార్గం పవిత్ర ప్రదేశం. అక్కడ మాంసాహారం, మద్యం, ధూమపానం పూర్తిగా నిషేధమని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి.

శివాలయంలో హైకోర్టు జడ్జి పూజలు

గుంటూరు జిల్లా పెదకాకాని శివాలయంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్ కుమార్ కుటుంబ సమేతంగా పూజలు చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన వారు భ్రమరాంబ అమ్మవారిని మల్లేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రం, చిత్ర పటం అందజేశారు. – పెదకాకాని



శ్రీవారి సేవలో ఉపలోకాయుక్త జస్టిస్ రజని

తిరుమల శ్రీవారిని ఏపీ ఉపలోకాయుక్త జస్టిస్ వి.రజని సోమవారం దర్శించుకున్నారు. అధికారులు ప్రత్యే ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

– తిరుమల

పిచ్చికుక్క కరిచిన బాలుడు మృతి

పిఠాపురం: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడు చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం... కొడవలి గ్రామానికి చెందిన కొలిపే నాగేశ్వరరావు, రత్నశ్రీ దంపతుల కుమారుడు భరత్(3)ను గత నెల 16వ తేదీన పిచ్చికుక్క కరిచింది. ఆ బాలుడితోపాటు మరికొందరిని పిచ్చికుక్క కరిచి గాయపరిచింది. వారం దరూ ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. కానీ, భరత్ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

భరత్ ఫైల్

హెచ్ఎస్ఎల్‌కు మినీ రత్న హోదా

సింధియా (విశాఖ): హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌కు భారత ప్రభుత్వం ఇటీవల మినీరత్న హోదాను ప్రకటించిన సంగతి తెలిసిందే. న్యూఢిల్లీలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో గల డిఫెన్స్ పీఎస్‌యూ భవన్ ప్రారంభోత్సవ సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతులమీదుగా హెచ్ఎస్ఎల్ సీఎండీ గిరిదీప్‌సింగ్‌కు మినీరత్న హోదా సర్టిఫికెట్‌ను అందజేశారు. ఆత్మనిర్భర్ భారత్‌ను దృష్టిలో ఉంచుకుని హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థ స్వదేశీకరణ, రక్షణ ఎగుమతులకు కట్టుబడి ఉందని సంస్థ సీఎండీ గిరిదీప్‌సింగ్ అభిప్రాయపడ్డారు. 2015 తర్వాత ఆర్థిక వ్యవస్థలను క్రమబద్ధీకరించడం, సాంకేతికతను అప్‌గ్రేడ్ చేయడం, ఉత్పాదకతను మెరుగుపరచడం వంటి సంస్కరణల వల్ల కఠినమైన ప్రాజెక్ట్‌ల విజయవంతం కావడంతో పాటు శ్రామిక శక్తి పునరుద్ధరణతో కూడిన విలువలు అభివృద్ధి చెందాయని అన్నారు.

తను మరణించి.. విద్యార్థులను బతికించి..

ప్రైవేటు కాలేజీ బస్సుడ్రైవర్‌కు గుండెపోటు

ఆలమూరు: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సు డ్రైవర్ విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో మృతి చెందాడు. తను మరణిస్తున్నానని గుర్తించిన మరుక్షణమే బస్సును ఆపి, అందులోని విద్యార్థులను ప్రమాదం నుంచి కాపాడాడు. ఈ ఘటన అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఆలమూరు మండలంలోని పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులను కళాశాలకు బస్సులో తీసుకెళ్తుండగా 216ఏ జాతీయ రహదారిపై మడికి వద్ద డ్రైవర్ దెందుకూరి నారాయణరాజు (60) తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గుండెపోటు వచ్చిందేమోనని ఆందోళన చెంది బస్సును ఆపి, రహదారిపై దిగి డివైడర్ వద్ద ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. హైవే పెట్రో లింగ్, అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకునేసరికే ఆయన మృతి చెందాడు. బస్సులో 50 మంది విద్యార్థులు ఉన్నారు. మడికి గ్రామానికే చెందిన డ్రైవర్ నారాయణరాజు ఏమాత్రం బస్సు ఆపకపోయినా అందులో ఉన్న విద్యార్థులకు ప్రమాదం సంభవించేదని స్థానికులు చెప్పారు. తన ప్రాణం పోతుందని తెలిసి బస్సును రహదారి పక్కకు ఆపి, విద్యార్థులను రక్షించారని నారాయణరాజును కొనియాడారు.



నారాయణరాజు (ఫైల్)

తూములోకి దూసుకెళ్లిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

రాజుపాలెం: నూతనంగా నిర్మిస్తున్న చప్టా తూములోకి ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దూసుకెళ్లి ఒకవైపునకు ఒరిగిపోయింది. ఈ ఘటన సోమవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలంలో జరిగింది. గుంటూరు-మాచర్ల రహదారిపై రాజుపాలెం మండలంలోని రెడ్డిగూడెం వద్ద చప్టా విస్తరణ పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా చప్టా దిగువన నీరు పారేందుకు తూము నిర్మిస్తున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి గుంటూరు వస్తున్న మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు ఈ చప్టాపైకి రాగానే అదుపు తప్పి వెనుక చక్రాలు తూములోకి వెళ్లి కూరుకుపోయాయి. దీంతో బస్సు ఒకవైపునకు ఒరిగిపోయింది. బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులు భయంతో అద్దాలు పగలగొట్టుకుని బయటకు వచ్చేశారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

తల్లి, తమ్ముడిని హతమార్చిన అన్న

పోలీసులకు సమాచారం ఇచ్చిన నిందితుడు
మానసిక రోగిగా ప్రాథమిక నిర్ధారణ

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఓ వ్యక్తి తల్లి, సోదరుడిని చాకుతో పొడిచి హత్య చేసిన ఘటన సంచలనం రేపింది. సోమవారం తెల్లవారుజామున గునుపూటి మహాలక్ష్మి (60), గునుపూటి రవితేజ(33) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కూరగాయలు కోయడానికి ఉపయోగించే చాకుతో నిందితుడు గునుపూటి శ్రీనివాస్ వారిని కిరాతకంగా పొడిచి హత్య చేశాడు. ఒకటో పట్టణంలోని సుంకర పద్దయ్య వీధిలో మహాలక్ష్మి, పెద్ద కుమారుడు శ్రీనివాస్, చిన్న కుమారుడు రవితేజతో కలిసి నివసిస్తుండగా, కుమార్తె బెంగళూరులో ఉంటున్నారు. మృతురాలి భర్త కోవిడ్ సమయంలో మృతి చెందాడని స్థానికులు తెలిపారు. పెద్ద కొడుకు శ్రీనివాస్ మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో ఇంట్లోనే ఉంటాడని, అప్పుడప్పుడూ మాత్రమే బయటకు వస్తుంటాడని చెబుతున్నారు. శ్రీనివాస్‌కు వివాహం కాలేదు. మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడమే ఈ హత్యలకు కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మహాలక్ష్మి, రవితేజ, నిందితుడు శ్రీనివాస్ (ఫైల్)

హత్య చేసి.. 112కు ఫోన్

హత్య చేసిన అనంతరం శ్రీనివాస్ నేరుగా డయల్ 112కు ఫోన్ చేసి హత్య వివరాలు తెలిపాడు. హుటాహుటిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించగా.. వారిద్దరినీ తానే చంపానని, వాళ్లు దెయ్యాలని పోలీసులకు చెప్పాడు. ఇంట్లో తనను బంధించారని, తన మనసులో ఏం మాట్లాడుకుంటున్నా అది వాళ్లిద్దరికీ తెలిసిపోతోందని, ఎంత పొడిచినా వాళ్లిద్దరూ రక్తపు మడుగులో కొట్టుకోవడం చూస్తే బతికి వచ్చి మళ్లీ తనను ఇబ్బంది పెట్టేలా ఉన్నారని చెప్పాడు. అతని మాట తీరు, చెప్పిన సమాధానాలను బట్టి అతనికి మానసిక పరిస్థితి సరిగా లేదని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

తాళపత్ర గ్రంథాలను లిఖించిన ఎస్వీయూ ఉద్యోగి

తిరుపతి సిటీ: ఎస్వీయూ లీగల్ సెల్ విభాగంలో ఏవో వి.రాఘవేంద్రరావు రెండు తాళపత్ర గ్రంథాలను లిఖించి అబ్బురపరిచారు. వాటిని వర్సిటీ ఓఆర్ఐ సంచాలకులు ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. సహజంగా జ్యోతిష్యంలో నిపుణులైన వారు గతంలో ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థలో పనిచేసేవారన్నారు. ఆ అభిమానం, తపన తాళపత్రాల్లో రాయాలనే ఆసక్తితో వీటిని లిఖించినట్టు చెప్పారు. వీటిలో జైమిని మహర్షి రాసిన 'గౌతమ సంహిత' జ్యోతిష్యానికి వేలూరి సుబ్రమణ్యశాస్త్రి తెలుగులో రాసిన వ్యాఖ్యను తాళపత్ర రూపంలోకి తెచ్చినట్టు చెప్పారు. అలాగే శ్రీ సింగరాచార్య రాసిన 'జాతక రాజీయం' గ్రంథానికి కొంపెల్ల నరసింహశాస్త్రి రాసిన తెలుగు వ్యాఖ్యానాన్ని ఆంగ్లంలోకి తర్జుమా చేసి తాళపత్ర గ్రంథంలో లిఖించినట్టు తెలిపారు. రాఘవేంద్రరావును అధ్యాపకులు అభినందించారు.

తాళపత్ర గ్రంథాలను అందజేస్తున్న రాఘవేంద్రరావు

32 కిలోల గంజాయి స్వాధీనం

వెంటాడి పట్టుకున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని సినీ ఫక్కీ తరహాలో పోలీసులు వెంటాడి పట్టుకున్నట్టు జిల్లా ఎస్పీ సుబ్బనాయుడు చెప్పారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. 'తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారిలోని తువ్వచేనుపల్లి సమీపంలో ఆదివారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. తమిళనాడుకు చెందిన పూర్ణస్వామి సెల్వరాజ్ ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తుండగా చంద్రగిరి పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. కారులో తనిఖీ చేయగా గంజాయి కనపడలేదు. అనుమానంతో పోలీసులు జాగిలం తీసుకొచ్చి కారులో డ్యాష్ బోర్డు, గేర్ బాక్స్ తనిఖీ చేయగా 27 ప్యాకెట్ల గంజాయిని గుర్తించారు. ఇది 32.730 కేజీలు ఉన్నట్టుగా గుర్తించారు. గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, వాహనాన్ని స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

తిరుమలలో ఏఆర్ కానిస్టేబుల్ అక్రమాలు

కేసు నమోదు చేసిన పోలీసులు

తిరుమల: ఏఆర్ కానిస్టేబుల్ హోదాను అడ్డుపెట్టుకుని తిరుమలలో అక్రమాలకు పాల్పడుతోన్న వ్యక్తిపై తిరుమల వన్‌టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. తిరుమల వన్ టౌన్ పీఎస్ సీఐ విజయ్‌కుమార్, విజిలెన్స్ వింగ్ ఏవీఎస్వో నగేష్ తెలిపిన వివరాల మేరకు..తిరుపతి ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్)లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోన్న ప్రసాద్ కర్ణాటకకు చెందిన నలుగురు భక్తులకు తిరుమలలో శ్రీవారి బ్రేక్ దర్శనం చేయిస్తానని చెప్పి రూ.12వేలను ఆదివారం వసూలు చేశాడు. అనంతరం తిరుపతిలో ఎస్ఎస్‌డీ టోకెన్లు వేయించి వారిని తిరుమలకు తీసుకువచ్చాడు. అక్కడ తన హోదాను అడ్డుపెట్టుకుని వీరిని పలు గేట్లు దాటించి ఆలయంలోనికి తీసుకువెళ్లి దర్శనం చేయించాడు. బయటికి వస్తోన్న క్రమంలో అతడిని టీటీడీ విజిలెన్స్ వింగ్ ఏవీఎస్వో నరేష్ బృందం పట్టుకుంది. ప్రసాద్‌పై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఆదివారం రాత్రి కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ఈ విధంగా ఎన్ని రోజులుగా దర్శనానికి తీసుకువెళుతున్నాడనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నం. 14/2025-26, నిట్ నెం.87 నుండి 88/2025-26 తేది : 05.11.2025
సూపరింటెండింగ్ ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు పరిధిలోని వివిధ నియోజకవర్గాలలోని 2 పనులకు అంచనా విలువ : రూ. 151.00 లక్షలతో యం.పి.లాడ్స్ (ఆర్.ఎన్) మరియు సిరికల్చర్ డిపార్ట్‌మెంటు నిధులతో మంజూరైన పనులకు టెండర్లు ది. 18.11.2025 నుండి ఇ-ప్లాట్‌ఫారం ద్వారా కోరబడుచున్నవి. వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in లో చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు
DIPR RO No. 17980/CL/Advt/1/1/2021-22, Dt : 10.11.2025

తిరుమల తిరుపతి దేవస్థానములు : తిరుపతి
చీఫ్ ఇంజనీర్ ఆఫీస్ : తిరుపతి
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.45/D3/CE/TTD/2025-26 Dt: 09-11-2025
TTD ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ యొక్క యాభై రెండు (52) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ-టెండర్లు కోరబడుచున్నవి: SE-II: NIT నం.726 నుండి 746/SE-II/2025-26 (21 పనులు), SE-III: NIT నం.39/SE-III/2025-26 (1 పని), EE-III: NIT నం.87 నుండి 88/EE-III/2025-26 (2 పనులు), EE-VI: NIT నం.143/EE-VI/2025-26 (1 పని), EE-XII: NIT నం.185 నుండి 186/EE-XII/2025-26 (2 పనులు), EE-XIV: NIT నం.149 నుండి 152/EE-XIV/2025-26 (4 పనులు), EE(FMS)-TML: NIT నం.59 నుండి 60/EE(FMS)-TML/2025-26 (2 పనులు), DE(Elec)-I: NIT నం.224 నుండి 234/DE(Elec)-I/2025-26 (11 పనులు), DE(Elec)-II: NIT నం.411 నుండి 418/DE(Elec)-II/2025-26 (8 పనులు), వివరాల కోసం www.tirumala.org కి లాగాన్ చేయండి మరియు పని వివరాల కోసం https://tender.apeprocurement.gov.in కు లాగిన్ చేయండి.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.283) Dt: 10-11-2025 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

హిందూ భూఫలకం చీలుతోందా?

- తాజా భూకంపాలకు ఇదే కారణమా?
- అవుననే సమాధానమిస్తున్న తాజా అధ్యయనం

న్యూఢిల్లీ: భూఉపరితలం మాత్రమేకాదు భూ అంతర్భాగం , అందులోని పొరలు సైతం ఎంతో సంక్లిష్టతతో కూడిన ఒక అమరిక. అలాంటి అమరికలో ఇప్పుడు కొత్తతరహా మార్పులు సంభవిస్తున్నాయని తాజా అధ్యయనంలో తేలింది. హిమాలయ పర్వతాల అడుగున హిందూ భూఫలకం అత్యంత నెమ్మదిగా రెండుగా చీలుతోందని తాజా అధ్యయనం ఒకటి బహిర్గతం చేసింది. కొనల వెంట ఢీకొని, రాపిడి కారణంగా టిబెటన్ భూఫలకం కిందకు హిందూ భూఫలకం వెళ్తోందని అధ్యయనంలో వెల్లడైంది. సంబంధిత పరిశోధన తాలూకు వివరాలు 'ది ప్రీ- ప్రింట్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. హిమాలయాలు, టిబెటన్ భూఫలకాల తీరుతెన్నులను భూ అంతర్గత బలాలు ఏ విధంగా ప్రభావితం చేస్తాయనే కొత్త అంశాలను తెల్సుకునేందుకు ఈ పరిశోధన కొత్త బాటలు వేస్తోంది.

హిమాలయాల ఎత్తును పెంచేస్తూ..

అధ్యయనం ప్రకారం.. హిమాలయాల ఎత్తును మరింత పెంచేస్తూ ఈ హిమాలయాల దిగువన హిందూ భూఫలకం వంగిపోతోంది. యూరేసియా భూఫలకం, హిందూ భూఫలకం ఢీకొనడం వల్లే హిమాలయాలు ఉద్భవించాయని తెల్సిందే. ఇది దాదాపు 5 కోట్ల ఏళ్ల క్రితం మొదలైంది. ఇటీవల కొత్తగా త్రిమితీయ సిస్మిక్ డేటాను సేకరించి విశ్లేషించగా హిందూ భూఫలకం కదలికల్లో వైరుధ్యాలను గుర్తించారు. ముఖ్యంగా 90 నుంచి 92 డిగ్రీల తూర్పు రేఖాంశం పొడవునా హిందూ భూఫలకం టిబెటన్ భూఫలకం కిందకు చొచ్చుకుపోతోంది. అలా వెళ్లే క్రమంలో చీలిపోతోంది. ఇది యాడోంగ్-గులు, కోనా-సాంగ్రి జోన్‌లో జరుగుతోంది. ఇక పశ్చిమహిమాలయా వైపు గమనిస్తే ఇక్కడ పెద్దగా ఎలాంటి మార్పు లేదు. భారత్, టిబెట్ సరిహద్దుల వెంబడి ఉండే యార్లాంగ్-జాంగ్బోకు ఉత్తరాన 100 కిలోమీటర్ల దూరంలో భూగర్భంలో ఈ రెండు పొరలు కలుస్తున్నాయి. తూర్పు వైపున మాత్రం పరిస్థితి వేరేలా ఉంది. హిందూ భూఫలకంలోని దిగువ పొర అయిన లిథోస్ఫిరిక్ మాంటెల్ మరింత లోతుల్లోకి చొచ్చుకుపోతోంది. దీంతో టిబెటన్ లిథోస్ఫిరిక్ విస్తరిస్తోంది. ఈ కారణంగానే హీలియం వాయువు ఉద్గారాలు, లోతుల్లో భూకంపాలు సంభవిస్తున్నాయి. తాజా అధ్యయనం అనేది భూఫలకాల కదలికలను మాత్రమే కాదు కొత్త ప్రాంతాల్లో పర్వతాల ఆవిర్భావ అవకాశాలను వెల్లడిస్తాయని భూగర్భ శాస్త్రవేత్తలు చెప్పారు.

ధాకాలో వరుస పేలుళ్లు

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో సోమవారం వేకువజామున వరుస పేలుళ్లు సంభవించాయి. గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం వెలుపల, దేశ ఆపద్ధర్మ ప్రభుత్వ పాలకుడు యూనస్ మహ్మద్ అనుచరుడికి చెందిన వ్యాపార సంస్థ వద్ద ఈ పేలుళ్లు జరిగాయి. ఇందుకు సంబంధించి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మీర్‌పూర్‌లో ఉన్న గ్రామీణ బ్యాంకు వద్దకు బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు రోడ్డుపై పెట్రోల్ బాంబులను విసిరివెళ్లారు'అని వివరించారు. అదేవిధంగా, మహ్మద్‌పూర్‌లోని ప్రాబర్తన అనే ఆహార ఉత్పత్తుల కంపెనీ ఆవరణలో ఇలాంటి మరో రెండు పేలుళ్లు జరిగాయని పోలీసులు తెలిపారు. ఈ కంపెనీ యజమాని యూనస్ ప్రభుత్వంలో మత్స్యశాఖను పర్యవేక్షిస్తున్న ఫరిదా అఖ్తర్ అనుచరుడని చెప్పారు. అదేవిధంగా, నగరంలో గుర్తు తెలియని వ్యక్తులు మూడు బస్సులకు నిప్పుపెట్టారు. ఈ మూడు ఘటనల్లో ఎవరికీ ఎలాంటి అపాయం సంభవించలేదన్నారు. అనుమానితుడొకరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామన్నారు. ఇతడు పదవీచ్యుత ప్రధాని హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ అనుబంధ విద్యార్థి సంఘ సభ్యుడని చెప్పారు. ఇతడికి గతంలోనూ అనే పేలుళ్లతో సంబంధముందన్నారు. వీటితోపాటు ధన్‌మోండి మార్కెట్ ప్రాంతంలో రెండు చోట్ల పెట్రోల్ బాంబులు పేలాయి. ఢాకా పాతనగరంలో ఓ ఆస్పత్రి వద్ద దుండగులు ఒకరిని కాల్చి చంపారు. కాగా, ఆపద్ధర్మ ప్రభుత్వప్రధాన సలహాదారుగా ఉన్న యూనస్, 1983లో గ్రామీణ బ్యాంకును స్థాపించారు. పేదరికాన్ని తొలగించేందుకు, మహిళల సాధికారతకు పాటుపడుతున్న యూనస్ 2006లో నోబెల్ శాంతి బహుమతి గెలుచుకోవడం తెల్సిందే.

భారీ ఉగ్రకుట్ర భగ్నం

వైద్యుల ముసుగులో విధ్వంస రచన ● వైట్‌కాలర్ ఉగ్రనెట్‌వర్క్ గుట్టురట్టు

- ఒకే చోట 2,913 కేజీల పేలుడు పదార్థాలు స్వాధీనం
- ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మంది అరెస్ట్
- వైద్యరంగంలోని వ్యక్తులపైనా ఉగ్రభావజాలాన్ని రుద్దుతున్న ముష్కరులు
- నిషేధిత జైషే మొహమ్మద్, అన్సార్ ఘజ్‌వాత్-ఉల్-హింద్ ఉగ్రసంస్థలతో సంబంధాలు
- మూడు రాష్ట్రాల ఉగ్రమాడ్యూల్‌ను ఛేదించిన పోలీసుల బృందం

ఢిల్లీలో మతవిద్వేషాలు రెచ్చగొట్టడమే మా లక్ష్యం

ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్)లో మత కల్లోలాలు, విధ్వంసం సృష్టించడమే లక్ష్యంగా దాడులతో తెగబడాలని పాకిస్తాన్, కశ్మీర్‌లోని హ్యాండ్లర్ల నుంచి ఆదేశాలు వచ్చాయని అరెస్టయిన షకీల్, ఆదిల్ విచారణలో బయటపెట్టారు. అయితే ఏఏ లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారో వాళ్లకు ఇంకా ఆదేశాలు రాలేదు. '' ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో వైద్యులను ఉగ్రకోణంలో ఎవరూ అనుమానించబోరు. అందుకే మమ్మల్నే ఈ పనికి ఎంచుకున్నారు. లక్ష్యాలను నిర్దేశించేదాకా వేచి ఉండాలని మాకు ఆదేశాలు అందాయి. ఈ ఉగ్రమాడ్యూల్‌కు పథకరచన పాకిస్తాన్‌లో జరిగింది. ఆదేశాలు మాత్రం కశ్మీర్ హ్యాండ్లర్ల నుంచే వస్తాయి. మేం గతంలో కశ్మీర్‌లో డాక్టర్లుగా పనిచేసిన కాలంలో 2018-2021 భద్రతా బలగాలతో పోరాడి గాయపడిన ఉగ్రవాదులకు చికిత్స చేశాం''అని షకీల్, ఆదిల్ పోలీసు విచారణలో వెల్లడించారు.

శ్రీనగర్/ఫరీదాబాద్: దేశంలో భారీ మారణహోమం సృష్టించేందుకు పన్నాగం పన్నిన ఒక ముష్కరమూక గుట్టుమట్లను మూడు రాష్ట్రాల పోలీసు బృందం విజయవంతంగా ఛేదించింది. గత పక్షం రోజులుగా జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతున్న ముమ్మర సోదాలు, దాడుల్లో ఏకంగా 2,913 కేజీల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఏకే-56 రైఫిల్, ఏకే క్రిన్‌కోవ్ పిస్టల్, ఒక చైనీస్ స్టార్ పిస్టల్, ఇటలీ తయారీ బెరెట్టా పిస్టల్, ఒక సబ్‌మెషీన్ గన్, బుల్లెట్లు, మందుగుండుతోపాటు పేలుడు సంబంధ ముడి సరుకులు, రసాయనాలు, మండే ధాతువులు, ఎలక్ట్రానిక్ సర్క్యూట్లు, బ్యాటరీలు, వైర్లు, రిమోట్ కంట్రోల్స్, టైమర్లు, వాకీటాకీ, మెటల్ షీట్లను పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. నేరమయ డాక్యుమెంట్లతోపాటు ఐఈడీ వంటి పేలుడుపదార్థాల తయారీ విధాన పత్రాలను పోలీసులు పట్టుకెళ్లారు. ఇటీవలికాలంలో ఇంత మొత్తంలో పేలుడు పదార్థాలను కశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పోలీసుల సంయుక్త బృందం స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి. జైషే మొహమ్మద్, అన్సార్ ఘజ్‌వాత్-ఉల్-హింద్ ఉగ్రసంస్థలతో సంబంధాలున్న ముగ్గురు వైద్యులుసహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్‌చేశారు. వీళ్లలో ఒక మహిళా డాక్టర్ సైతం ఉండటం గమనార్హం. వీళ్లకు సంబంధించిన నివాసాలు, అద్దె ఇళ్లు, స్థలాల్లో సోదాల తర్వాత భారీ ఎత్తున పేలుడుపదార్థాల జాడను పోలీసులు కనుగొన్నారు. 350 కేజీల పేలుడు పదార్థం, అసాల్ట్ రైఫిల్, హ్యాండ్‌గన్ జాడను ఆదివారమే కనిపెట్టగా సోమవారం 2,563 కేజీల పేలుడు పదార్థాలను పట్టుకున్నారు. జమ్మూకశ్మీర్‌తోపాటు హరియాణాలోని ఫరీదాబాద్, ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లలో జరిగిన విస్తృతస్థాయి దాడుల్లో వీళ్లందరినీ అరెస్ట్‌చేశారు. అరెస్టయిన ఎనిమిది మందిలో ఏడుగురు కశ్మీరీలే కావడం గమనార్హం. ఆరిఫ్ నిసార్ దార్ అలియాస్ సాహిల్, యాసిర్ ఉల్ అష్రఫ్, మఖ్సూద్ అహ్మద్ దార్ అలియాస్ షాహీద్(నౌగమ్), మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్(షోపియాన్), జమీర్ అహ్మద్ అహంగీర్ అలియాస్ ముత్లాషా(వకురా), డాక్టర్ ముజామిల్ అహ్మద్ ఘనీ అలియాస్ ముసేబ్(పుల్వామా), డాక్టర్ ఆదిల్(కుల్గామ్)లతోపాటు లక్నోకు చెందిన వైద్యురాలు షాహీన్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. అత్యంత గౌరవప్రద వైద్యవృత్తిలోని నిపుణులు, విద్యార్థులను ఉగ్రవాదంలోకి దింపి ముష్కరులు వైట్‌కాలర్ ఉగ్రనెట్‌వర్క్‌ను సృష్టించగా దాని గుట్టుమట్లను విజయవంతంగా ఛేదించామని సోమవారం జమ్మూకశ్మీర్ పోలీసు విభాగం ప్రకటించింది.

2,563 కేజీల పేలుడు పదార్థాలు దొరికింది ఫరీదాబాద్‌లోని ఈ లాడ్జీలోనే

డాక్టర్ ముజామిల్

డాక్టర్ ఆదిల్

పోస్టర్లతో మొదలై.. అరెస్ట్‌ల దాకా..

కశ్మీర్‌కు చెందిన ఒక డాక్టర్ అరెస్ట్‌తో ఈ మొత్తం నెట్‌వర్క్ అంశం వెలుగులోకి వచ్చింది. కుల్గాంలోని వాన్‌పురాకు చెందిన డాక్టర్ ఆదిల్ అహ్మద్ రాటర్ భారత భద్రతాబలగాలను బెదిరిస్తూ శ్రీనగర్, బాన్‌పొరా నౌగామ్‌సహా పలుచోట్ల అక్టోబర్ 19న పోస్టర్లు అంటించాడు. సీసీటీవీ ఫుటేజీ ద్వారా ఇతడిని గుర్తించి పోలీసులు నవంబర్ ఏడో తేదీన అరెస్ట్‌చేశారు. అతడిని విచారించగా కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. కశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఆదిల్‌కు చెందిన లాకర్‌ను తెరవగా అందులో ఏకే-47 రైఫిల్ లభించింది. మరింతగా విచారించగా ముజామిల్ ఘనీ షకీల్ అనే మరోవైద్యుడు సైతం ఈ ఉగ్రకుట్రలో భాగస్వామి అని తేలింది. తర్వాత అతడినీ అరెస్ట్‌చేశారు. షకీల్ ఇచ్చిన సమాచారంతో హరియాణాలోని ఫరీదాబాద్‌లో మూడేళ్లుగా అద్దె కడుతున్న ఒక లాడ్జ్‌లోని గదిలో పోలీసు బృందం ముమ్మర తనిఖీలుచేసి 8 పెద్ద, 4 చిన్న సూట్‌కేసులు, ఒక బకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో ఏకంగా 2,563 కేజీల ఐఈడీ పేలుడుపదార్థాలున్నాయి. దీనిని అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్‌గా భావిస్తున్నారు. వాస్తవానికి షకీల్ కశ్మీర్‌లోని పుల్వామాలోని కోలీవాసి. ప్రస్తుతం ఇతను హరియాణాలోని అల్-ఫలాహ్ మెడికల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో సీనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్నాడు.

యూపీ విద్యాసంస్థల్లో 'వందేమాతరం' తప్పనిసరి

యూపీ సీఎం యోగి వెల్లడి

గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లోని అన్ని పాఠశాలలు, విద్యాసంస్థల్లో వందేమాతరం గీతాలాపన తప్పనిసరి చేయనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. వందేమాతరంను తప్పనిసరి చేయడం వల్ల భావి పౌరుల్లో భారత మాత పట్ల, మాతృభూమి పట్ల భక్తి గౌరవాలు పెంపొందుతాయన్నారు. సోమవారం ఆయన గోరఖ్‌పూర్‌లో ఐక్యతా ర్యాలీని ప్రారంభించి ప్రసంగించారు. గత వారం 'వందేమాతరం' 150 ఏళ్ల వేడుకల ప్రారంభం అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ, 1937లో ఈ గీతంలోని ముఖ్యమైన చరణాలను తొలగించడం దేశ విభజనకు బీజం వేసిందంటూ చేసిన వ్యాఖ్య తీవ్ర చర్చకు దారితీసింది. ఇదే అంశాన్ని మళ్లీ ప్రస్తావించిన యోగి ఆదిత్యనాథ్.. బుజ్జగింపు రాజకీయాల వల్లే కాంగ్రెస్ పార్టీ గతంలో ఈ గీతాలాపనకు అభ్యంతరం వ్యక్తం చేసిందంటూ 1923 నాటి కాంగ్రెస్ సమావేశంలో జరిగిన పరిణామాలను ఉదహరించారు. అప్పుడే దేశ విభజనకు బీజాలు పడ్డాయ న్నారు.

నా గొంతు కోసినా సరే..

నిజమైన ఓటర్ల పేర్లు మాత్రం తొలగించొద్దు!: మమత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి మమతా బెనర్జీ ఓటరు జాబితా సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)ను ఓట్‌బందీగా అభివర్ణించారు. తన గొంతు కోసినా సరే, వాస్తవ ఓటర్ల పేర్ల తొలగింపును అడ్డుకుని తీరుతానన్నారు. రాష్ట్రంలో ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రతి నిజమైన ఓటరు తుది జాబితాలో స్థానం పొందే విధంగా ఈ ప్రక్రియను ఎటువంటి లోపాలు లేకుండా అమలు చేస్తే తప్ప, బిహార్‌లో జరిగినంత సులభంగా బెంగాల్‌లో దీని అమలు సాధ్యం కాదని ఆమె స్పష్టం చేశారు. ఒకప్పటి ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ 'ఈసీ ప్రజల కోసమే తప్ప, ప్రభుత్వం కోసం కాదు'అని చెప్పారంటూ ఆమె గుర్తు చేసుకున్నారు. ఇప్పుడున్న వారు మాత్రం ఎస్ సర్ అని విధేయతతో ఉండటం చూసి విచారం కలుగుతోందని వ్యాఖ్యానించారు. బిహార్‌లో ఎస్ఐఆర్ చేపట్టి, తప్పించుకోగలిగారు, బెంగాల్‌లో మాత్రం అలా తప్పించుకోనివ్వం, మీ ప్రతి చర్యను ప్రశ్నిస్తాం'అంటూ హెచ్చరించారు. ప్రజలకు బదులుగా మీ యజమానిని సంతృప్తి పరచాలని మాత్రమే చూస్తున్నారంటూ ఈసీపై పరోక్షంగా ఆమె మండిపడ్డారు. సిలిగురి జిల్లా ఉత్తర్‌కన్య పట్టణంలో మీడియాతో మాట్లాడారు. మాతో ఆటలాడుకోవాలని అనుకోవద్దు. అది అంత సులువు కాదు. ప్రతి నిజమైన ఓటరు పేరును జాబితాలో చేర్చేలా మేం అత్యంత అప్రమత్తంగా ఉంటాం. బీజేపీ ఆదేశాలను అమలు చేయాలని ఈసీ ప్రయత్నించరాదు. ఇలా అంటున్నందుకు నన్ను శిక్షించాలనుకుంటున్నారా? ఏం చేయగలరు మీరు? నా ఓటు హక్కును లాగేసుకుంటారా? జైలుకు పంపుతారా? అరెస్ట్ చేయిస్తారా? నా గొంతు కోసినా సరే, ప్రజలను ఏమీ అనొద్దు, వారి ఓటు హక్కును లాక్కోవద్దు'అని ఆమె కోరారు. నోట్ల రద్దు నోట్‌బందీ అయినట్లే, ఎస్ఐఆర్ ఓట్‌బందీగా తయారైందని ఆమె వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్‌ను ఈసీ ఇంత హడావుడిగా చేపట్టాల్సిన అవసరం లేనే లేదని మమతా బెనర్జీ పేర్కొన్నారు.

అమిత్‌షా

పట్టణానికో యూసీబీ మన లక్ష్యం

యూసీబీ యాప్‌ల ప్రారంభం సందర్భంగా అమిత్ షా వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలోని ప్రతి పట్టణంలో అదనంగా కనీసం ఒక అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు(యూసీబీ) శాఖను ఏర్పాటు చేయాలని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా నిర్దేశించారు. రెండు లక్షలకు మించి జనాభా కలిగిన పట్టణాల్లో ఐదేళ్లలోగా ఈ అదనపు శాఖలను ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం ఆయన అర్బన్ కోఆపరేటివ్ క్రెడిట్ రంగంపై జరుగుతున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో మాట్లాడారు. దేశంలో నగదు రహిత లావాదేవీలు విస్తృతమవుతున్నందున డిజిటల్ చెల్లింపు విధానాన్ని యూసీబీల్లో కూడా అమల్లోకి తీసుకు రావాలన్నారు. రెండేళ్లలో 1,500 బ్యాంకుల్లో దీనిని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సహకార్ డిజి పే, సహకార్ డిజి లోన్ అనే రెండు మొబైల్ అప్లికేషన్లను ప్రారంభించారు. అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు, కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీల్లో సేవలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు రిజర్వు బ్యాంకు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. ఈ రంగంలో నిరర్థక ఆస్తులను గత రెండేళ్ల కాలంలో 2.8 శాతం నుంచి 0.6 శాతానికి తగ్గించగలిగామన్నారు. సంస్కరణలు అమలు, క్రమశిక్షణ వల్లే ఇది సాధ్యమైందని అమిత్ షా చెప్పారు. ఇదే ఒరవడిని కొనసాగించాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ లిమిటెడ్ (నాఫ్‌కబ్)కు ఆయన పిలుపునిచ్చారు. విజయవంతంగా నడుస్తున్న సహకార పరపతి సంఘాలను యూసీబీలుగా మార్చాలన్నారు. అమూల్, ఇఫ్కోలను ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయెన్స్ ప్రపంచంలోనే రెండు అతిపెద్ద సహకార వ్యవస్థలుగా గుర్తించినందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. సహకార విధానం ఇప్పటికీ ఆచరణీయమేనని ఇది రుజువు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా కర్నాటక న్యాయశాఖ మంత్రి, నాఫ్‌కబ్ గౌరవాధ్యక్షుడు హెచ్‌కే పాటిల్ ప్రసంగిస్తూ.. మూసివేత ప్రమాదంలో ఉన్న 20 యూసీబీలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. లాభదాయకం కాదంటూ మూసివేయడం సరైన విధానం కాదని చెప్పారు.

గిలియానీ తదితరులకు ట్రంప్ క్షమాభిక్ష

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మాజీ వ్యక్తిగత లాయర్ రూడీ గిలియానీ, మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మార్క్ మెడోస్ తదితరులకు క్షమాభిక్ష ప్రకటించారు. 2020 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ శ్రేణులు ఫలితాలను ప్రభావితం చేసేందుకు యత్నించగా సహకరించినట్లు వీరిపై ఆరోపణలున్నాయి. వీరికి అధ్యక్షుడు ట్రంప్ 'సంపూర్ణ, బేషరతు' క్షమాభిక్ష ప్రసాదిస్తూ సంతకం చేశారని ప్రభుత్వ అటార్నీ ఎడ్ మార్టిన్ తన సోషల్ మీడియా ఖాతాలో వెల్లడించారు. ఈ అవకాశం దక్కిన వారిలో సిడ్నీ పావెల్, జాన్ ఈస్ట్‌మన్ అనే లాయర్లున్నారు. వీరితోపాటు 2020 ఎన్నికల్లో ట్రంప్ తరఫున నకిలీ ఓటర్లుగా మారిన రిపబ్లికన్ పార్టీకి చెందిన కనీసం డజను మంది ఉన్నారు. కాగా, ఈ క్షమాభిక్ష ట్రంప్‌నకు వర్తించదని అమెరికా న్యాయశాఖ స్పష్టం చేసింది.

చిన్న పార్టీలకు పెద్ద పరీక్ష..!

- నేటి రెండో దశ పోలింగ్‌లో చిన్న పార్టీలదే పైచేయి
- సీమాంచల్‌లో పట్టుకోసం ఎంఐఎం తహతహ
- జన్ సురాజ్ వైపు యువత మొగ్గు
- చిరాగ్, సహానీ, మాంఝీల సత్తాకు పరీక్ష

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో మంగళవారం జరుగనున్న రెండో దశ ఎన్నికల్లో చిన్న పార్టీలు పెద్ద పరీక్షను ఎదుర్కోనున్నాయి. ఎన్నికలు జరుగనున్న 122 స్థానాలకు గాను చాలాచోట్ల వివిధ కూటముల్లోని చిన్న పార్టీలు సహా స్వతంత్రంగా పోటీ చేస్తున్న పార్టీలు తమ బలాన్ని నిరూపించుకోనున్నాయి. చివరి దశ ఎన్నికల్లో చిన్న పార్టీలు ఏమాత్రం సత్తా చాటుతాయన్న దానిపైనే గెలుపోటములు ప్రభావితమై ఉన్నాయి.

అన్ని పార్టీల్లోనూ ఉత్కంఠ

రెండో దశలోని 122 నియోజకవర్గాలు 20 జిల్లాల్లో విస్తరించి ఉండగా, ఇందులో 101 జనరల్, 19 ఎస్సీ, 2 ఎస్టీ రిజర్వ్ స్థానాలున్నాయి. గత 2020 ఎన్నికల్లో 122 స్థానాల్లో బీజేపీ 42 గెలుచుకోగా, ఆర్‌జేడీ 28, జేడీయూ 20, కాంగ్రెస్ 11, వామపక్షాలు 5, ఎంఐఎం 5 సీట్లను గెలుచుకున్నాయి. ఈ స్థానాల్లో ఎంఐఎం మినహా మిగతా చిన్న పార్టీలేవీ పెద్దగా గెలవలేదు. ఈసారి పరిస్థితి వేరేగా ఉంది. ఇండియా, మహాగఠ్‌బంధన్ కూటముల్లోని చిన్న పార్టీలకు ఎక్కువ సీట్లు కేటాయించారు. ముఖ్యంగా ఎన్‌డీయేలో భాగస్వామ్య పక్షమైన చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్‌జనశక్తి పార్టీ మొత్తంగా 28 స్థానాల్లో పోటీ చేస్తుండగా, రెండో దశ పోలింగ్ జరిగేవి అందులో 15 ఉన్నాయి. వీటిలో ఆరు ఎస్సీ రిజర్వుడు సీట్లు. ఇక్కడ బీజేపీకి బలంగా ఉన్న రాజ్‌పుత్‌లు, జేడీయూకు మద్దతుగా నిలుస్తున్న ఓబీసీ. ఈబీసీ వర్గాలతో పాశ్వాన్ వర్గాన్ని కలుపుకుని ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి. అయితే బీసీ వర్గాల్లో వచ్చిన చీలిక పాశ్వాన్‌కు ఏమాత్రం మద్దతిస్తాయన్నది స్పష్టం కావాల్సి ఉంది. ఇక జతిన్‌రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్తానీ ఆవామ్ మోర్చా (హెచ్ఏఎం) సైతం 6 స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇందులో 4 రిజర్వుడ్ స్థానాలే ఉన్నాయి. ఇందులోనూ టెకారీ స్థానం నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ తన భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. ఈ స్థానంలో గెలిస్తే అనిల్‌కుమార్ మంత్రి పదవి దక్కడం ఖాయమన్న ప్రచారం నేపథ్యంలో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. హెచ్ఏఎం పోటీచేస్తున్న అనేక స్థానాల్లో ఆయనకు పోటీగా మహాగఠ్‌బంధన్‌లోని రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపింది. మాంఝీ వర్గాన్ని ఎదుర్కొనేందుకు ఆర్ఎల్ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహ అన్ని రకాల ప్రణాళికలు వేశారు. ఆ పార్టీ పోటీ చేస్తున్న నాలుగు స్థానాల్లో ఆయన భార్య స్నేహలతను సైతం పోటీలో ఉంచారు. ఇక మహాగఠ్‌బంధన్‌లో ఉన్న వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) సైతం మొత్తం 12 సీట్లలో పోటీ చేస్తుండగా, రెండో దశలో 7 స్థానాలున్నాయి. ఇందులో 5 నియోజకవర్గాల్లో 'మల్లా'కమ్యూనిటీకి చెందిన వారే అధికంగా ఉండటంతో ఇందులో కనీసంగా 5 స్థానాలు గెలుస్తామని కూటమి బలంగా నమ్ముతోంది. ఆర్‌జేడీ నమ్ముకున్న ముస్లిం-యాదవ్ ఫార్ములాకు మల్లాలు తోడైతే ఇక్కడ విజయం ఖాయమని భావిస్తోంది. ఇక బీఎస్పీ అధినేత్రి మాయావతి రెండో దశలో 100 చోట్ల పోటీలో నిలవగా, ఎక్కువగా ఉత్తరప్రదేశ్‌కు సరిహద్దుగా ఉన్న 32 నియోజకవర్గాలనే ఆమె లక్ష్యంగా పెట్టుకొని ప్రచారం చేశారు. కనీసంగా 2 నుంచి 5 స్థానాలు గెలుస్తామని బీఎస్పీ చెబుతోంది. ఇక సీమాంచల్‌లోని 24 స్థానాలకు గానూ గత ఎన్నికల్లో 5 స్థానాల్లో పోటీ చేసి, అన్నింటా విజయం సాధించిన ఎంఐఎం ఈసారి 11 స్థానాల్లో పోటీకి దిగింది. ఇక్కడ అర డజను సీట్లు గెలుస్తామని పార్టీ ధీమాతో ఉంది. ప్రశాంత్‌కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ సైతం 110 చోట్ల పోటీలో ఉంది. ఆయన పార్టీ వైపు ఎక్కువగా యువత, మహిళలు ఆకర్షితులు కావడంతో చాలా నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొంది.

నేడు బిహార్‌లో రెండో దశ పోలింగ్

- 122 సీట్లు..1,302 మంది అభ్యర్థులు
- ఓటేయనున్న 3.7 కోట్ల మంది
- భారీగా భద్రతా ఏర్పాట్లు

పట్నా: బిహార్ అసెంబ్లీకి రెండో విడత పోలింగ్ మరికొద్ది గంటల్లోనే ప్రారంభం కానుంది. సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వంలోని డజను వరకు మంత్రులు సహా 1,302 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరి భవితవ్యాన్ని 122 నియోజకవర్గాల పరిధిలో ఉన్న 3.70 కోట్ల మంది ఓటర్లు తేల్చనున్నారు. వీరిలో 1.75 కోట్ల మంది మహిళలున్నారు. నేపాల్‌తో సరిహద్దులు కలిగిన పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామర్హి, మధుబని, సుపౌల్, అరారియా, కిషన్‌గంజ్ జిల్లాల్లో జరిగే ఈ క్రతువు కోసం యంత్రాంగం భారీగా ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో అత్యధిక జిల్లాలు ముస్లింల ప్రాబల్యమున్న సీమాంచల్ ప్రాంతంలోనివి కావడం గమనార్హం. సంక్లిష్ట కుల, వర్గ సమీకరణాలతో తుది విడత పోలింగ్ అధికార ఎన్డీయేతోపాటు ప్రతిపక్ష ఇండియా కూటమి కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది. అధికారులు 45, 399 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోనివే 40,073 ఉన్నాయి. 3.67 లక్షల ఓటర్లతో అతిపెద్ద నియోజకవర్గం నవాడా జిల్లాలోని హిసువా కాగా, లౌరియా, చన్‌పటియా, రక్సౌల్, త్రివేణిగంజ్, సుగౌలి, బన్‌మఖిల్లో అత్యధికంగా 22 మంది చొప్పున బరిలో ఉన్నారు. మొదటి దశ పోలింగ్‌లో అత్యధికంగా 65 శాతం మంది ఓటేయడం విశేషం.

జెహానాబాద్‌లో పోలింగ్ సామగ్రితో విధుల్లోకి వెళ్తూ సెల్ఫీ

రెండో దశ పోలింగ్‌ను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అధికారులు భారీగా ఏర్పాట్లు చేపట్టారు. మొత్తం 4 లక్షల మంది భద్రతా సిబ్బందిని బందోబస్తు కోసం రంగంలోకి దించారు. 45, 399 పోలింగ్

అత్యంత సమస్యాత్మకం.. 8,491

స్టేషన్లలో 8,491 అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటి వద్ద అదనంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే 50 వేల మంది కేంద్ర సాయుధ బలగాలను మోహరించిన అధికారులు, ఎన్నికల రోజున మరో 50 వేల మందిని రప్పిస్తున్నారు. ఇప్పటికే 60వేల మంది బిహార్ పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. గయాజీలో అత్యధికంగా అత్యంత సమస్యాత్మకమైన 1,084 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వివరించారు. కిషన్‌గంజ్, పుర్నియా, సీతామర్హి, మోతిహారీల్లో అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ బూత్ ఒక్కటీ లేదన్నారు. అదేవిధంగా, 122 నియోజకవర్గాల పరిధిలోని 13,651 శివారు గ్రామాలను సమస్యాత్మకంగా గుర్తించినట్లు వివరించారు.

మరకత లింగానికి పూజలు

ఫిరంగిపురం: వేమవరంలోని కోటి ఒక్క లింగాల ఆలయానికి కార్తిక సోమవారం సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మరకత మహాలింగానికి పూజలు చేశారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతలకు ఎగువ నుంచి 32,060 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 41,343 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 45.6160 టీఎంసీలు ఉంది.

సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు

తెనాలి అర్బన్: పట్టణంలోని సెంట్రల్ లైటింగ్‌కు సోమవారం సిబ్బంది మరమ్మతులు చేశారు. వైకుంఠపురం నుంచి వీఎస్‌ఆర్ కళాశాల వరకు పనులు చేశారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మ నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు సోమవారం భక్తులు విరాళాలు సమర్పించారు. గుంటూరు విద్యానగర్‌కు చెందిన సీహెచ్.రాధిక, సూర్యతేజ, దివిష పేరిట నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

తెలుగు భాషకు శాస్త్రీయ పునాది వేసిన ఘనుడు బ్రౌన్

నరసరావుపేట: తెలుగు భాషకు శాస్త్రీయ పునాది వేసిన దార్శనికుడు సీపీ బ్రౌన్ అని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా కొనియాడారు. ఫిలిప్ బ్రౌన్ జయంతి పురస్కరించుకొని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్‌ఓ ఏకా మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు

దుర్గి: పల్నాడు జిల్లా ధర్మవరం గ్రామంలో తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండ లాగు పోటీలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం శ్రీ హరిహర బాల నాగేంద్ర స్వామి వారి వార్షికోత్సవం సందర్భంగా ఎడ్ల పోటీలను జిల్లా బీజేపీ యువ మోర్చా నాయకులు యెగుటూరి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఆరుపళ్ల విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన ఎడ్ల జతలను ఆయన సత్కరించి, యజమానులకు మెమెంటోలు బహూకరించారు. పోటీలు తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు భారీగా తరలివచ్చారు. వారికి అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త చవిటిశెట్టి వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

ముప్పాళ్ళ: సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధాన రహదారిపై జీబీసీ కాల్వ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. నరసరావుపేట నుంచి సత్తెనపల్లి వైపు వెళుతున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న రాజమండ్రికి చెందిన పార్వతి, జ్యోతీలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు.

అనధికారిక లే అవుట్లు తొలగించిన సీఆర్డీఏ

తాడికొండ: తాడికొండ మండలం లాం గ్రామంలో అనధికారికంగా వేసిన వెంచర్లను సోమవారం సీఆర్డీఏ అధికారులు తొలగించారు. సర్వే నంబర్ 390(పి), 391(పి)లో 2.2 ఎకరాలు, సర్వే నంబర్ 370(పి)లో 1.95 ఎకరాలు, సర్వే నంబర్ 305(పి), 306(పి)లో 1.3 ఎకరాల్లో వేసిన లే అవుట్లను తొలగించారు. జేసీబీ సాయంతో రోడ్లకు గండికొట్టి అనధికారిక లే అవుట్లు అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు.

పెదకాకాని శివాలయం దేదీప్యమానం

- దీపాలు వెలిగించి పూజలు చేసిన మహిళలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు
- స్వామి ఆదాయం రూ. 8.50 లక్షలు

భక్తుల క్యూలైన్

దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

పెదకాకాని మల్లేశ్వరస్వామి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. కార్తిక మాసం మూడవ సోమవారం తెల్లవారుజామున సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. యజ్ఞాల బావి వద్ద స్నానాల అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఓం నమః శివాయ నామంతో ఆలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది. కార్తిక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి స్వామికి నైవేద్యం సమర్పించారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు నాగేంద్ర స్వామికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పర్యవేక్షణలో వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో అంత్రాలయ దర్శనాలు, అభిషేకాలు, ఏకవారాభిషేక పూజలు, అన్నప్రాశనలు, నామకరణలు, రాహుకేతు పూజలు అధికసంఖ్యలో జరిగాయి. అన్నప్రసాద వితరణలో 6 వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఒక్క రోజులో స్వామికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా రూ. 8,50,000 లభించినట్లు డీసీ తెలిపారు.

–పెదకాకాని

టెండర్ల జాప్యం.. రోగులకు శాపం

- జీజీహెచ్ అధికారుల కమీషన్ల కక్కుర్తి
- ఖరారు చేయని మందులు కొనుగోలు టెండర్లు
- బయట కొనుగోలు చేస్తున్న రోగులు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- ఏడాదిగా ఇదే తంతు

గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: పేదల పెద్దాసుపత్రిగా పేరు గడించిన గుంటూరు జీజీహెచ్‌లో మందుల కొనుగోలులో జాప్యంతో రోగులు అవస్థలు పడుతున్నారు. పూట గడవని పేదలు మందులను బయట కొనుక్కోలేక ఆర్థిక ఇబ్బందుతో సతమవుతున్నారు. రెండు నెలల కిందట మందులు, సర్జికల్ వస్తువులు, ల్యాబ్ కిట్లు, ఇంపాట్ల కొనుగోలుకు ఆసుపత్రి అధికారులు టెండర్లు పిలిచారు. వాటిని నేటికీ ఖరారు చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. లోకల్ పర్చేజ్‌లో గత కాంట్రాక్టర్ల నుంచి కొనుగోలు చేసుకుంటూ అధిక మొత్తంలో కమీషన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏపీ ఎంఎస్ ఐడీసీ సంస్థ ద్వారా ప్రభుత్వం టీచింగ్ ఆసుపత్రులకు మందులు, సర్జికల్ వస్తువులు 80 శాతం సరఫరా చేస్తోంది. అత్యవసర చికిత్సలకు అవసరమయ్యే మందులు, సర్జికల్ వస్తువులు 20 శాతం మేరకు ఆసుపత్రుల అధికారులే స్థానికంగా కొనుగోలు చేసుకునేందుకు అనుమతి ఇస్తోంది. వీటి కోసం టెండర్ల ప్రక్రియ జాప్యం వల్ల రోగులు బయట మందులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

ఆగస్టులో టెండర్ల నోటిఫికేషన్

ఇరవై శాతం బడ్జెట్ ద్వారా ఆసుపత్రి అధికారులు మందులు, సర్జికల్, లేబొరేటరీ, బ్లడ్‌బ్యాంకు, కన్జుమల్స్, డిస్పోజల్స్, రీ ఏజెంట్స్, ఇన్‌స్ట్రుమెంట్స్, సూచర్ మెటీరియల్స్ కొనుగోలు చేసేందుకు ఆగస్టు 24న టెండరు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రతి ఏడాది సుమారు రూ. 2కోట్ల నుంచి రూ. 3 కోట్ల మేర లోకల్ పర్చేజ్ బడ్జెట్ గుంటూరు జీజీహెచ్‌కు వస్తుంది. సుమారు 2వేల రకాల మందులు, సర్జికల్ వస్తువులు కొనుగోలుకు టెండర్లు పిలిచారు. సెప్టెంబరు 9న సీల్ టెండర్లను ఓపెన్ చేశారు. 14 మంది వ్యాపారులు దరఖాస్తులు కొనుగోలు చేసినా 11 మంది మాత్రమే టెండర్లు సమర్పించారు. అయితే, ఇందులో ఒకరిని అనర్హత కలిగిన వ్యక్తిగా నిర్ధారించి, పది మంది టెండర్లను అంగీకరించారు. ఈ ప్రక్రియ రెండు నెలలు అయినా పూర్తి కాకపోవడంతో ఆసుపత్రి అధికారుల పని తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

జాప్యంతో బయట కొనుగోళ్లు

టెండర్ల ప్రక్రియ జాప్యంతో స్థానిక మందుల వ్యాపారులతో అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. కొన్ని మందుల సరఫరాకు షార్ట్ టెండర్లు పిలిచారు. అయితే పూర్తి స్థాయిలో అన్ని రకాల మందుల కొనుగోలుకు టెండర్లు ఖరారు కాకపోవడంతో స్థానిక వ్యాపారుల ద్వారా అధిక మొత్తంలో కమీషన్లు తీసుకుంటూ జాప్యానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత్యంతరం లేక రోగులు కొన్నిసార్లు బయట మందులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి తలెత్తుతోంది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఎక్కువ రోజులకు మందులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. టెండర్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి సకాలంలో మందులు, సర్జికల్ వస్తువులు అందేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

త్వరలో ఖరారు

టెండర్ల ప్రక్రియ జాప్యంపై పరిపాలనా అధికారులను వివరణ కోరగా 2వేలకు పైగా మందులు, సర్జికల్ వస్తువులు ఉండటం ద్వారా వాటి స్క్రూట్నీకి అధిక సమయం పట్టిందన్నారు. స్క్రూట్నీ ముగిసిందని, త్వరలోనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి టెండర్లు ఖరారు చేయిస్తామని వెల్లడించారు.

అర్జీల పరిష్కారంలో సంతృప్తి స్థాయి పెరగాలి

భాదితుల సమస్యలు వింటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ప్రజలు నుంచి వివిధ శాఖలకు అందించిన అర్జీలను దరఖాస్తుదారుల సంతృప్తి స్థాయి మెరుగుపరిచేలా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె మాట్లాడారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో సక్రమంగా విచారించి పరిష్కరించాలని తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ దరఖాస్తుదారులకు కచ్చితంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు ముఖ్యమైన అంశాల జాబితాను తయారు చేసుకోవాలని, అడిగినప్పుడు వెంటనే స్పందించేలా ఉండాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సీఎంఓ గ్రీవెన్స్ వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం వచ్చిన 261 అర్జీలను కలెక్టర్‌తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

మళ్లీ వేధిస్తున్నారు.. కాపాడండి !

నాలుగు నెలల కిందట జీజీహెచ్ ఎదుట జీఎంసీ అధికారులు బండిని ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. గతంలో ఇబ్బందిపెట్టిన లలిత కుమారి మళ్లీ నన్ను వ్యాపారం చేసుకోనివ్వడం లేదు. నాకు న్యాయం చేయాలి.

కుమారుడితో రాధిక

దేవుడితో రాజకీయం బాబుకు కొత్తేమి కాదు..

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

పట్నంబజారు: ''తిరుమల తిరుపతి దేవస్థానంలో 1985 నుంచి ఉచిత భోజనం పెడుతున్నారు..నేను ఇప్పుడు వెళ్లి చేశాను కాబట్టి బాగుందని సోషల్ మీడియాలో చెబితే.. తానేదో బీఆర్ నాయుడుని పొగిడినట్లు పచ్చ మీడియాలో చెప్పుకోవడం హాస్యాస్పదం''గా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా కోర్టు వద్ద సోమవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తిరుమలలో ఉచిత భోజనం కోసం భక్తులు రూ.27 వేల కోట్లు చందాలు ఇచ్చారని, కొండపైన దాదాపు 40 సంవత్సరాలుగా ఉచితంగా అన్న ప్రసాదం అందిస్తున్నారని తెలిపారు. ''నేను ఇప్పుడు వెళ్లి భోజనం చేశాను కాబట్టి బాగుందని చెప్పానని, కానీ ఎల్లో మీడియా బీఆర్ నాయుడు ఏదో గొప్పగా పని చేశాడని వాళ్ల చానల్‌లో చూపించుకోవటం సిగ్గుచేట''ని ఖండించారు. బీఆర్ నాయుడు ఏమైనా భక్తుడా..? కేవలం అతను ఒక వ్యాపారవేత్త అని, ఒక రాజకీయ బ్రోకర్ అని ఘాటుగా రాంబాబు వ్యాఖ్యానించారు. దేవుడితో రాజకీయాలు చేయడం చంద్రబాబుకు కొత్తేమి కాదని, అదే దోవలో బీఆర్ నాయుడు కూడా వెళ్తున్నారని మండిపడ్డారు. లడ్డూ ప్రసాదంలో చంద్రబాబు రాజకీయం చేయాలని చూసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. తిరుమల కొండపై వాతావరణం, స్వామి దైవదర్శనం, ఉచిత భోజనం గురించి మాట్లాడితే బీఆర్ నాయుడు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణలు రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిచ్చి వేషాలు వేస్తే.. పరిణామాలు కూడా అంతే ఉంటాయని హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు దేవుడితో రాజకీయాలు చేస్తాడు కాబట్టే.. ఒకసారి అలిపిరిలో ల్యాండ్ మైన్ పేలిందన్నారు. అదే విధంగా వ్యవహరిస్తే.. భగవంతుడు విధించే శిక్ష భయంకరంగా ఉంటుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని రాంబాబు అన్నారు. మెడికల్ కాలేజీలతో చంద్రబాబు ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని విమర్శించారు.

గుంటూరు రైల్వే స్టేషన్‌లో హై అలర్ట్

గుంటూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

కార్లు తనిఖీ చేస్తున్న ఎస్పీ

లక్ష్మీపురం: ఢిల్లీ బాంబు పేలుడు ఘటనతో గుంటూరు రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు హై అలర్ట్ అయ్యారు. జీఆర్పీ సీఐ అంజిబాబు, ఆర్పీఎఫ్ సీఐ వీరబాబు, ఎస్ఐలు, సిబ్బంది డాగ్ స్క్వాడ్స్‌తో కలిసి స్టేషన్‌లో సోమవారం రాత్రి పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు, సామగ్రితో పాటు ప్రయాణికులను తనిఖీ చేశారు. ప్రతి బోగీని పరిశీలించారు. రైల్వే స్టేషన్ తూర్పు, పశ్చిమ వైపు తనిఖీలతో పాటు గస్తీ కూడా ఏర్పాటు చేసినట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు.

పోలీసుల తనిఖీలు

జిల్లావ్యాప్తంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సోమవారం అర్ధరాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ప్రధాన రహదారులు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, వాణిజ్య సముదాయాలు, జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాలని సూచించారు. నగరం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ బ్యాంక్ కూడలి వద్ద జిల్లా ఎస్పీ స్వయంగా వాహన తనిఖీలు చేశారు.

కాంట్రాక్టర్ల గు'బిల్లు'

- అధికారుల నిర్వాకంతో పడకేసిన తెనాలి పట్టణాభివృద్ధి
- టెండర్లలో పాల్గొనేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- కమీషన్లు ఇచ్చినా ముందుకు సాగని బిల్లుల చెల్లింపులు
- పిలిచిన వాటికే మళ్లీ మళ్లీ పిలుస్తున్న అధికారులు
- ఆయోమయంలో కౌన్సిలర్లు

మున్సిపల్ కార్యాలయం

తెనాలి అర్బన్: ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, బిల్లుల చెల్లింపుల జాప్యంతో తెనాలి పట్టణాభివృద్ధి మందకొడిగా సాగుతోంది. 5వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, వివిధ గ్రాంట్ల కింద నిధులు విడుదల అవుతున్నా వాటిని ఉపయోగించుకునే పరిస్థితి కన్పించడం లేదు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు సైతం ఇంజినీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయడంలో విఫలం అయ్యారనే చెప్పవచ్చు. పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. పిలిచిన పనులకే మళ్లీ మళ్లీ టెండర్లు పిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతినెలా జరిగే కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని రెండు నెలల కిందట కౌన్సిలర్లు సూచించారు. నేటికీ ఆ దిశగా అడుగులు పడలేదు.

జిల్లాలోనే ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ

తెనాలి పట్టణం 16.77కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. 55,917 ఇళ్లు ఉన్నాయి. 2.60లక్షల జనాభాతో జిల్లాలోనే ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా పేరుగాంచింది. ప్రతి ఏడాది వివిధ పన్నులు, షాపుల అద్దెల ద్వారా రూ.36 కోట్ల ఆదాయం వస్తోంది. ఇవికాకుండా 15వ ఆర్థిక సంఘం, ఇతర స్పెషల్ గ్రాంట్ల ద్వారా రూ.70కోట్ల వరకు నిధులు సమకూరుతుంటాయి.

ఆ ఇద్దరిదే అక్కడ హవా !

తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ఇంజినీరింగ్ విభాగంలో ఆ ఇద్దరిదే హవా నడుస్తోంది. వారు ఇద్దరు కరుణిస్తేనే బిల్లుల చెల్లింపులు జరిగేది. దీంతో అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్లు ప్రసన్నం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ఇద్దరిలో ఒకరు కంప్యూటర్ ఆపరేటర్ అని తెలుస్తోంది దేవుడు కరుణించిన పూజారి కరుణించలేదన్న చందంగా విభాగంలో పరిస్థితి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఇంజినీరింగ్ విభాగాన్ని శాసిస్తున్నాడంటే అతిశయోక్తి కాదు. అధికారుల సహా అతడి మాట వినాల్సిందే. అతడికి నచ్చిన వారి బిల్లులను మాత్రమే అన్‌లైన్ చేస్తాడని, వాటిని ముందు వరుసలో పెట్టి నిధులు జమ అయ్యేలా చూస్తాడనే ఆరోపణ ఉంది. రెండో వ్యక్తి చెబితేనే సదరు కంప్యూటర్ ఆపరేటర్ అన్‌లైన్ చేస్తుంటారనే ప్రచారం ఉంది.

కమీషన్లు ఇచ్చినా జరగని చెల్లింపులు

మున్సిపల్ కార్యాలయ అధికారులు పనితీరు వివాదాస్పదంగా మారింది. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారి అధిక కమీషన్‌లకు తెరతీశారనే ఆరోపణ వినిపిస్తోంది. కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు వెంటనే జరగాలంటే రెండు శాతం డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. ముందుగా కమీషన్ ఇస్తేనే చెల్లింపులు జరిగేలా అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఒకరిని, ఇంజనీరింగ్ విభాగంలో మరొకరిని ఏజెంటుగా పెట్టుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, డీఈలు, ఆడిట్ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు.. ఇలా అందరికీ ముందుగా కమిషన్ ఇస్తున్నా బిల్లుల చెల్లింపులలో మాత్రం జాప్యం జరుగుతూనే ఉంటుందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

తెనాలికి రానున్న రూ.70కోట్ల నిధులు.

పట్టణ అభివృద్ధి కోసం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలు నిధులను తెస్తున్నారు. దీనిలో భాగంగా స్పెషల్ గ్రాంట్ కింద రూ.35కోట్లు, సీఆర్‌డీఏ గ్రాంట్ రూ.20కోట్లు, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.9కోట్లు, బీపీఎస్ గ్రాంట్ రూ.4కోట్లు త్వరలో రానున్నాయి. వీటికి సంబంధించిన అనుమతులు ఇప్పటికే మున్సిపాలిటీకి అందాయి. వీటిని కూడా సకాలంలో ఇంజినీరింగ్ అధికారులు ఉపయోగించకపోతే వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఇంజినీరింగ్ విభాగంలో సమస్యల్ని పరిష్కరించడంతో పాటు ప్రారంభానికి నోచుకోని పనుల్ని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పనులు వేగవంతం చేస్తున్నాం

టెండర్లలో కాంట్రాక్టర్లు ఎక్కువగా పాల్గొనని మాట వాస్తవం. బిల్లుల చెల్లింపులు కొద్ది రోజుల నుంచి ప్రారంభం అయ్యాయి. దీంతో టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు. పనులు పూర్తయిన వెంటనే నిధి యాప్‌లో బిల్లులు రూపొందించి ఆమోదం తెలపాలని అధికారులను ఆదేశించాం. వాటిలో ఎక్కడా జాప్యం జరగకుండా చూస్తాం.

–పినప శ్రీకాంత్, మున్సిపల్ ఇంజనీర్, తెనాలి.

టెండర్లకు రాం..రాం

గతంలో టెండర్లు వేసిన వెంటనే వాటిని దక్కించుకునేందుకు కాంట్రాక్టర్లు పోటీ పడుతుండేవారు. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

- ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన రూ.3.6 కోట్ల పనులకు సంబంధించిన 40 టెండర్లలో ఒక్క కాంట్రాక్టర్ కూడా పాల్గొనలేదు.
- అక్టోబర్1న పిలిచిన రూ.70లక్షల పనులకు సంబంధించిన 17 టెండర్లలో కేవలం మూడు పనులకే కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు.
- అదే నెల 3న రూ. 1.20కోట్లకు సంబంధించిన 18 పనులకు గాను కేవలం 4 పనులకు టెండర్లు వచ్చాయి.
- అదేనెల 8న రూ.1.71 కోట్లకు సంబంధించిన 18 పనులకు కేవలం ఒక్క టెండరే వచ్చింది.
- దీంతో ఇంజనీరింగ్ అధికారులు గత నెల 31న మరోసారి అవే పనులకు టెండర్లు పిలచారు. ఈనెల 7న రూ.1.8కోట్ల పనులకు సంబంధించిన 24 వనులకు టెండర్లు తెరవగా కేవలం ఎనిమిది దరఖాస్తులే వచ్చాయి.
- ఈనెల 14న రూ.6.99కోట్ల పనులకు 52 టెండర్లు తెరవనున్నారు. దీనిని బట్టి చూస్తే కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	44,605
అమ్మకాలు	42,823
నిల్వ	8,346

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–16,200
నంబరు–5	10,000–14,300
273	10,000– 14,200
341	10,000–16,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–16,000
నంబరు–5	10,000–14,600
341	10,000–17,000
4884	11,000–14,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,700
బాడిగ–355	10,500 – 16,700
ఆర్మూర్	10,000 – 13,500
తాలుకాయలు	5,500 – 8,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,500
బాడిగ – 355	10,000–16,500
దేవనూరు డీలక్స్	10,500–16,000
తాలు	5,300 – 8,200

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 722

కొమ్ములు : 485 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,000	12,500	11,325

కాయలు : 237 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,000	12,675	11,325

మొత్తం అమ్మకాలు : 163.50 క్వింటాళ్లు

–దుగ్గిరాల

నేడు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాక

గుంటూరు మెడికల్: కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం గుంటూరు జిల్లా పర్యటనకు వస్తున్నట్లు బీజేపీ గుంటూరు ఈస్ట్ కన్వీనర్ డాక్టర్ శనక్కాయలు ఉమా శంకర్ తెలిపారు. పర్యటనలో భాగంగా ఆయన గుంటూరు రూరల్ మండలం లోని వెంగళాయపాలెం గ్రామ చెరువుని సందర్శిస్తారని పేర్కొన్నారు. అనంతరం నల్లపాడు లయోల స్కూల్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. గుంటూరు నగరంలో ఐటీసీ వెల్కమ్ గ్రాండ్ హోటల్ నుంచి ఉదయం 8.30 గంటలకు బైకులు, కార్లతో వెంగళాయపాలెం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లోకేష్ జేబులు నింపేందుకే ప్రైవేటీకరణ

కోటి సంతకాల సేకరణలో అంబటి, నూరిఫాతిమా, పోలూరి వెంకటరెడ్డి

కోటి సంతకాల సేకరణలో అంబటి మురళీకృష్ణ

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- జిల్లా కోర్టు వద్ద లీగల్ విభాగం ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : పేదల కడుపులు కొట్టి కుమారుడు లోకేష్ జేబులు నింపేందుకే మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేసేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, నగర అధ్యక్షుడు కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద మెడికల్ కాలేజీల ప్రైవేటీకణను వ్యతిరేస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది.

● **అంబటి రాంబాబు మాట్లాడుతూ** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దానిలో భాగంగా కోటి సంతకాలను సేకరించి, గవర్నర్‌కు అందజేయటం ద్వారా చంద్రబాబు సర్కార్‌కు ఒక హెచ్చరిక జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో జరగనున్న ప్రజా ఉద్యమ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

● **పార్టీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా** మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు ఉచిత వైద్యం దూరం చేసిచేందుకు చంద్రబాబు కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు.

● **పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ** మాట్లాడుతూ చంద్రబాబుది తొలి నుంచి స్వార్థ పూరిత విధానాలనేనని మండిపడ్డారు. పేదల సంక్షేమం, ఆరోగ్యంపై కనీస ఆలోచన లేని వ్యక్తి అని విమర్శించారు. కార్యక్రమంలో లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, లీగల్ విభాగం నేతలు షేక్ షన్ను, వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, కాసు వెంకటరెడ్డి, మంజుల, కళ్లం రమణారెడ్డి, రాజశేఖరెడ్డి, సుదర్శనం క్రాంతికుమార్, శ్యామల, బి. కోటేశ్వరరావు, పి. బాబూరావు, రామాంజనేయులు, చంద్రశేఖర్ రెడ్డి, మండే సురేష్, యువజన విభాగం నగర అధ్యక్షుడు యేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కాలువలో యువకుడి గల్లంతు

గుంటూరు చానల్‌లో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మంగళగిరి టౌన్ : కాలు జారి కాలువలో ఓ యువకుడు గల్లంతైన ఘటన మంగళగిరి నగరంలో సోమవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. తాడేపల్లి క్వారీ రోడ్డుకు చెందిన ఏసు(22) మరో యువకుడితో కలసి మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీ సమీపంలో భవన నిర్మాణ పనులకు వచ్చాడు. ఇద్దరూ మాలధారణలో ఉండడంతో సోమవారం మధ్యాహ్నం సద్దికి ముందు స్నానం చేద్దామని సమీపంలో ఉన్న గుంటూరు చానల్‌కు వెళ్లారు. స్నానం చేస్తుండగా ఏసు కాలుజారి నీటిలో పడి పోయాడు. పక్కనే ఉన్న యువకుడు రక్షించేందుకు ప్రయత్నించగా అతను కూడా నీళ్లలోకి జారిపోతున్న క్రమంలో పైకి వచ్చేశాడు. సమీపంలో ఉన్న కొంతమంది వ్యక్తులకు సమాచారం ఇచ్చాడు.విషయం తెలుసుకున్న మంగళగిరి పట్టణ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి ఏసు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. మరుసటిరోజు ఉదయం గాలింపు చర్యలు చేపడతామని అధికారులు వెల్లడించారు. ఏసుకు తల్లిదండ్రులు లేకపోవడంతో కొంతకాలంగా తాడేపల్లిలోని బంధువుల వద్ద ఉంటూ తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

13 నుంచి టెన్త్ పరీక్ష ఫీజు వసూలు

గుంటూరు ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఈనెల 13 నుంచి 25వ తేదీలోపు పరీక్ష ఫీజును అపరాధ రుసుం లేకుండా చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ షెడ్యూల్ విడుదల చేసినట్లు ఆమె పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు రూ.125 చొప్పున సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. గతంలో ఒకసారి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు మూడు సబ్జెక్టులకు పైబడితే రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాలని సూచించారు. నిర్దేశిత వయస్సు కంటే తక్కువ గల విద్యార్థులు పరీక్ష రాసేందుకు మినహాయింపు కోసం ఏజ్ కాండొనేషన్ ఫీజు రూపంలో రూ.300 చెల్లించాలని ఆమె తెలిపారు.

ఉత్తమ ప్రదర్శనగా తెనాలి ఉపాధ్యాయుల 'రేపేంది'

రేపేంది నాటికలో సన్నివేశం

ఉత్తమ ప్రదర్శన జ్ఞాపికలు అందుకున్న ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల నాటికల పోటీలు

తెనాలి: పల్నాడు జిల్లా నరసరావుపేటలో రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా నిర్వహించిన నాటికల పోటీల్లో తెనాలికి చెందిన ఉపాధ్యాయులు ప్రదర్శించిన 'రేపేంది' నాటిక ప్రథమ స్థానంలో నిలిచింది. చదువు లేకపోతే అనర్థాలు? రేపు ఏంటో తెలియకపోతే ఎలా? అనే సందేశంతో రచయిత దివాకర్‌బాబు రచించిన ఈ నాటికను బెల్లంకొండ వెంకట్ దర్శకత్వంలో ప్రదర్శించారు. స్థానిక ఎన్‌సీఆర్‌ఎం హైస్కూలు చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ ఎమ్మెల్యేగా, ఉపాధ్యాయుడు పాలపర్తి శ్రీనివాసరావు చైర్మన్‌గా, టీఎస్‌ఆర్‌ఎం హైస్కూలు నుంచి సోమరౌతు శ్రీనివాసరావు హెడ్‌మాస్టర్‌గా, వెలగా సుభాష్‌చంద్రబోస్ ఎమ్మెల్యే అసిస్టెంట్‌గా, ఎన్‌ఎస్‌ఎస్ హైస్కూలు విద్యార్థి తన్నీరు విష్ణువర్ధన్ ఎమ్మెల్యే కుమారుడి పాత్రల్లో నటించారు. రాష్ట్రస్థాయిలో తెనాలి ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రథమ స్థానం రావటం గర్వకారణమని పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ నాటిక బృందాన్ని అభినందించారు.

మహిళపై అత్తామామ, మరిది దౌర్జన్యం

బాధితురాలు బాలగురవమ్మ

తాడేపల్లి రూరల్: భర్త చనిపోయిన ఓ మహిళపై అత్తామామ, మరిది ఉన్న కొద్దిపాటి ఆస్తిని ఇవ్వాలంటూ దాడికి పాల్పడ్డారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన దొంత నారాయణ, నాగలక్ష్మి మూడవ కుమార్తె బాలగురవమ్మను అదే జిల్లా కంచర్ల వెంకటేశ్వరరావు, లక్ష్మీదేవీల పెద్ద కుమారుడు శివకృష్ణకు ఇచ్చి 2012లో జరిపారు. ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. శివకృష్ణ అనారోగ్యంతో 2016లో మృతి చెందాడు. ఆయన పేరు మీద ఇల్లు ఉండేది. పుష్కరాల సమయంలో దాన్ని తొలగించి ఉండవల్లిలోని పుష్కర కాలనీలో ప్లాటును కేటాయించారు. అయితే, పూట గడవక పోవడంతో బాలగురవమ్మ అక్కడ నుంచి వెళ్లిపోయింది. అత్తామామలు ఇంటిలో ఉంటున్నారు. కాలనీలో నివాసముంటున్న వారికి ప్రభుత్వం రెగ్యులైజేషన్ చేస్తుందని వీఆర్వో ఫోన్ చేయడంతో మూడు రోజుల కిందట ఇక్కడకు వచ్చింది. అప్పటి నుంచి అత్తామామలు, మరిది ఇంటిలోకి రానీయక పోవడంతో తెలిసిన వారి ఇంట్లో ఉంటోంది. వీఆర్వో పేర్లు నమోదు చేస్తున్నారని తెలియడంతో ఆ ప్రాంతానికి వెళ్లింది.

ఈ సమయంలో అత్తామామలతో పాటు మరిది ఆమెను కొట్టి చీరను లాగి వేశారు. స్థానికులు అడ్డుకోగా వారిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. వీఆర్వో చెబుతున్నా బాలగురవమ్మపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి రావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. జరిగిన సంఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత మహిళ బాలగురవమ్మ తెలియజేసింది.

14 మంది జూదరుల అరెస్టు

చీరాల: పంట పొలాల్లో పేకాట శిబిరాన్ని సోమవారం చీరాల రూరల్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ ద్వారా కనుగొన్నారు. ఈపురుపాలెం ఎస్ఐ ఎ.చంద్రశేఖర్ అందించిన వివరాల మేరకు.. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ, రూరల్ సీఐ సూచనలతో చీరాల మండలం నక్కలవారిపాలెం పొలాల్లో పేకాటాడుతున్న 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.1.69 లక్షల, 14 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

బాధితులకు పోలీసుల రక్షణ

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాధితురాలి సమస్య అలకిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్)లో పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి మొరను ఆలకించారు. రక్షణ కల్పిస్తామని చెప్పారు. చట్ట పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సిబ్బంది ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ రమణమూర్తి (పరిపాలన), డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్), అరవింద్ (గుంటూరు పశ్చిమ) కూడా అర్జీలు స్వీకరించారు.

పొలం డబ్బు ఇవ్వడం లేదు

గతేడాది పొలం కొనుగోలుకు నగరం మండలం వెళ్లా. ఎకరం కొనుగోలు చేసేందుకు అక్కడ మహిళతో బేరం మాట్లాడుకున్నా. రూ.19 లక్షలకు గానూ ముందుగా రూ.7.48 లక్షలు చెల్లించా. అయితే సదరు మహిళ పొలాన్ని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసి విక్రయించింది. ముందుగా ఇచ్చిన రూ.7.49 లక్షలు తిరిగి చెల్లించాలని అడిగితే సరైన సమాధానం లేదు. అంతేగాక బెదిరింపులకు పాల్పడుతోంది.

– ఆర్.ప్రతాప్, అరండల్‌పేట

బెదిరింపుల నుంచి రక్షించండి

నాకు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఒక కుమార్తెపై రూ.50 వేలు డిపాజిట్ చేశారు. రెండో కుమార్తె పేరుపై రూ.50 వేలను బావ, ఈనాడు విలేకరి అయిన సురేష్ డిపాజిట్ చేయలేదు. అతని పేరుపై ఓ బ్యాంక్‌లో వేసుచేకున్నాడు. గతంలో జగనన్న ప్లాట్ కింద స్థలం మంజూరైంది. పత్రాలను బావ సురేష్‌తో పాటు అత్తామావలు ఏకమై బలవంతంగా తీసేసుకున్నారు. కాగితాలు ఇవ్వమని అడిగితే, నా పలుకుబడితో మంజూరైందని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. నగదు, జగనన్న ప్లాట్ పత్రాలను ఇవ్వాలని ప్రాథేయపడినా పట్టించుకోలేదు. పిల్లల ఆధార్, రేషన్ కార్డులు, దుస్తులు, సామాన్లు వారి వద్దనే ఉన్నాయి. వాటిని కూడా ఇప్పించాలని పలుమార్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. బావ సురేష్ ఈనాడు విలేకరి కావడం వల్లే న్యాయం జరగడం లేదు. సమస్యను పరిశీలించి న్యాయం చేయాలి.

– కె.నాగేశ్వరి, ప్రత్తిపాడు మండలం

దొంగతనం చేశానని తప్పుడు కేసు

ఓ ఇంట్లో గత మూడేళ్లుగా పనిచేస్తున్నా. ఈ ఏడాది ఆగస్టులో ఆ ఇంట్లో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆ సమయంలో రూ.8 లక్షలు దొంగలించానని సెప్టెంబర్ 16న స్థానిక పోలీసులకు నాపై ఫిర్యాదు చేశారు. నాపై తప్పుడు కేసు బనాయించారు. రెండు నెలలుగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా. చోరీ ఎవరు చేశారనేది నిర్ధారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– ఎం.సుబ్బాయమ్మ, గౌతమీ నగర్ ఒకటో వీధి, కొరిటెపాడు.

చికిత్సతో కుష్ఠు వ్యాధి పూర్తిగా నయం

- జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా
- ఈ నెల 17 నుంచి 30 వరకు ఉచిత పరీక్షలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీఎంహెచ్ఓ, అధికారులు

గుంటూరు వెస్ట్: కుష్ఠు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని, ప్రభుత్వం కూడా ఉచితంగా మందులు అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 6 గంటల నుంచి 8 ఆశా కార్యకర్తలు, వలంటీర్ల టీమ్ ఇంటింటి సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలో 5,56,616 ఇళ్లను 1,167 టీములు సర్వే చేస్తాయని చెప్పారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి మందులు కూడా ఉచితంగా అందించి చికిత్స చేస్తార ని వివరించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎండిటీ మందులు ఉచితంగా అందిస్తారని తెలిపారు. అనుమానిత లక్షణాలు ఉన్నాయని భావిస్తే ఇంటింటి సర్వే చేయడానికి సిబ్బంది వచ్చినపుడు పరీక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆ ర్వో షేఖ్ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, డీఎంహెచ్ విజయలక్ష్మి, పీడీఆర్ డీఏ విజయలక్ష్మి, డీఈఓ రేణుక, పశుసంవర్ధక శాఖ జేడీఏ సత్యనారాయణ, జిల్లా ఉపాధి అధికారి దుర్గా బా యి, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.వి.రమణ, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

'మీ డబ్బు – మీ హక్కు పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు వెస్ట్: బ్యాంకుల్లో క్లైమ్ చేయని ఆస్తులపై అవగాహన కల్పించడానికి కేంద్ర ఆర్థిక శాఖ 'మీ డబ్బు – మీ హక్కు' పేరుతో దేశ వ్యాప్త ప్రచారం నిమిత్తం రూపొందించిన పోస్టర్‌ను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా జిల్లా రెవెన్యూ అధికారి షేఖ్ ఖాజావలి , డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి , లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డితో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 7,18,055 రిటైల్ ఖాతాల్లో రూ.120 కోట్లు, 24,221 ఇన్స్టిట్యూషన్స్, ఆర్గనైజేషన్ ఖాతాల్లో రూ. 22.02 కోట్లు , 6,672 గవర్నమెంట్ ఖాతాల్లో రూ.7.03 కోట్లు కలిపి మొత్తం రూ. 149.47 కోట్లు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ ఉన్నాయని తెలిపారు. 'మీ డబ్బు – మీ హక్కు' అనే నినాదంతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలతో వస్తే డబ్బులు ఇస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డీఈఓ రేణుక , పశుసంవర్ధక శాఖ జేడీ ఏ. సత్యనారాయణ, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, అధికారులు పాల్గొన్నారు.

ఫొటోలు మార్ఫింగ్ కేసులో వ్యక్తి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్. వెనుక ముసుగులో ఉన్న వ్యక్తి నిందితుడు

పట్నంబజారు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలు మార్ఫింగ్ చేసి అసభ్యకర పోస్టింగ్ పెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్‌లో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ కె.వెంకటప్రసాద్ సోమవారం వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్లా జిల్లా, తంగెళ్లపల్లి మండలం, జిల్లెళ్ల గ్రామానికి చెందిన తుపాకుల సతీష్‌కుమార్ ట్విట్టర్ అకౌంట్ నుంచి సీఎం, డెప్యూటీ సీఎం, రాష్ట్ర విద్యా మంత్రుల గురించి అసభ్యకరంగా ఫొటోలు మార్ఫింగ్ చేసి పెట్టాడు. దీనిపై పాత గుంటూరుకు చెందిన గాలి సతీష్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందించారు. సమావేశంలో ఎస్ఐలు ప్రసాద్, రెహమాన్ పాల్గొన్నారు.

భార్యపై గొడ్డలితో దాడిచేసిన భర్త

దుర్గి: భార్యపై గొడ్డలితో భర్త దాడిచేసిన సంఘటన మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగేండ్ల చిననాగేష్ మద్యానికి బానిసై భార్య మరియమ్మతో తరచూ గొడవ పడుతుండేవాడు. సోమవారం పూటుగా మద్యం తాగి భార్య మరియమ్మతో గొడవపడి గొడ్డలితో దాడి చేశాడు. ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కర్లపాలెం: కారు, ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాలు.. భీమవరం నుంచి బెంగళూరు వెళ్తున్న కారు, బాపట్ల నుంచి సిమెంటు రాళ్ల లోడుతో కర్లపాలెం వస్తున్న ట్రాక్టర్, సత్యవతీపేట వద్ద జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న జయశ్రీకి, ట్రాక్టర్ డ్రైవర్ మంత్రయ్యకు గాయాలయ్యాయి. వీరిని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ముదిరాజుల అభ్యున్నతికి కృషి చేసింది వైఎస్సార్ కుటుంబమే..

వైఎస్సార్ సీపీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్

కువైట్ వన సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్

మాచర్ల రూరల్: ఆర్థికంగా, సామాజిక పరంగా, రాజకీయంగా ముదిరాజుల అభ్యున్నతికి కృషి చేసింది వైఎస్సార్ కుటుంబమేనని వైఎస్సార్ సీపీ ముదిరాజ్ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్‌రావు ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం కువైట్ దేశంలో ముదిరాజ్ వనభోజన మహోత్సవం.. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నో సంవత్సరాల నుంచి సామాజిక పరంగా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న ముదిరాజులను బీసీ – డీ నుంచి 'ఎ' లోకి మార్చేందుకు శ్రీకారం చుట్టిన నేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ అని అన్నారు. కోర్టు అడ్డంకులతో అది ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని, ఆ తరువాత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో నాలుగు అడుగులు ముందుకు వేసి ముదిరాజుల ఆర్థికాభివృద్ధి కోసం ముదిరాజ్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను నియమించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో సుమారు 25లక్షలకు పైగా ముదిరాజులున్నారని, ఇంతవరకు ఏ పార్టీ వారికి రాజకీయంగా, సామాజిక, ఆర్థిక చేయూతనందించలేదన్నారు. ఒక్క వైఎస్సార్ కుటుంబమే ముదిరాజులకు తోడ్పాటునిచ్చిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు దాటుతున్నా ముదిరాజులకు ఎటువంటి రాజకీయ ప్రాధాన్యత కల్పించలేదన్నారు. టీడీపీ, జనసేనల్లో పనిచేస్తున్న ముదిరాజ్ నాయకులకు ఇంతవరకు సరైన గుర్తింపు ఇవ్వకపోవటం ముదిరాజ్‌ల పట్ల వారికున్న చిన్నచూపునకు నిదర్శనమన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఉన్న ముదిరాజ్‌లందరినీ ఐక్యపరచి ఇంత పెద్ద ఎత్తున ముదిరాజ్ కార్తిక వనభోజనాలను కార్యక్రమాలను ఏర్పాటు చేసిన కువైట్ ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు కోడి నారాయణ ముదిరాజ్ సేవలు అమూల్యమని తెలిపారు. కువైట్ ముదిరాజ్ సోదరుల ఐక్యత అందరికీ ఆదర్శమని ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసారి వీరేశ్ ముదిరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తేరాని జయరామ్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

TOURS & TRAVELS

■ ఇండియన్ రైల్వేస్ –శబరిమల మరియు అరుణాచలానికి ప్రత్యేక రైలు, 10.12.25 న ప్రారంభం. రూ. 8,500 – 2SL, 3AC, 2AC, 1AC కలవు. వివరాలకు 93550 21516 www.tourtimes.in

WANTED

■ మంగళగిరి తాడేపల్లి పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు వెంటనే కావలెను. భోజనం సౌకర్యం కలదు. Q:10th, 50సం॥ లోపు వారు సంప్ర: 7337420359, 8500025995

■ గుంటూరు జిల్లా "వన్ లైఫ్ – వన్ కార్డ్" హెల్త్ కేర్ కంపెనీలో 1. హెల్త్ కార్డ్ ప్రమోషన్ కొరకు (కనోపీటెంట్ / Canopy Tent), 2.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, 3.ప్రొక్యూర్మెంట్ మేనేజర్లుగా పని చేయుటకొరకు (స్త్రీలు/పురుషులు) ఉద్యోగులు కావలెను. అర్హత : 10th/ ఇంటర్ / డిగ్రీ. సంప్రదించగలరు : 9030150481, 9494022442

■ కేర్ టేకర్స్ (మెడికల్) జీతం 18వేలు, ఇంటివంట 18 వేలు, వార్డెన్స్ డిగ్రీ పి.జి. జీతం 18వేలు, రిసెప్షనిస్ట్ జీ: 18 వేలు, భోజనం వసతి కలదు. 98854 26486

■ మా సంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ లేడీస్ కావలెను. 10th పాస్/ ఫెయిల్ to PG. ఫోన్: 73307 11162

■ అమరావతిలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను. వెంటనే సంప్రదించండి. శ్రీ రాజరాజేశ్వరి సెక్యూరిటీ సర్వీసెస్. 9346138743, 8008202789

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు [illegible]

Bank of Baroda బ్యాంక్ ఆఫ్ బరోడా
లక్ష్మీపురం బ్రాంచ్
డోర్ నెం.5-87-6, లక్ష్మీపురం మెయిన్ రోడ్, గుంటూరు -522007. ఆంధ్రప్రదేశ్,
ఫోన్ : 0863-2272001, 2272003, Mail:lakshm@bankofbaroda.com

ఋణగ్రహీత & హామీదారుకు డిమాండ్ నోటీసు
(SARFAESI ACT, 2002 లోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్(2) క్రింద)

ఋణగ్రహీత : మెస్సర్స్ మీనాక్షి ఎక్స్‌పోర్ట్స్ తరపున యజమాని : శ్రీ పాల్వాయి హరికృష్ణ, తండ్రి : శ్రీ శ్రీనివాసరావు, డి.నెం.5-76-4-ఎ/1, 4వ లైను, పండరీపురం, గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522002, హామీదారురాలు: శ్రీమతి గద్దం ప్రసన్న లక్ష్మి, భర్త : లేటు శ్రీనివాసరావు, డి.నెం.5-76-4-ఎ/1, 4వ లైను, పండరీపురం, గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522002.

విషయము : బ్యాంక్ ఆఫ్ బరోడా, లక్ష్మీపురం బ్రాంచ్ నుండి మంజూరు చేయబడిన ఋణ సౌకర్యములు గురించి.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు రిజిస్టర్ పోస్ట్ ద్వారా తేది. 18-10-2025న మీకు తిరుగు రశీదులతో కూడిన డిమాండ్ నోటీసు మీచే పొందుపరచబడిన చిరునామాకు జారీచేయబడినది. మీరు చిరునామాలో లేనందున తపాల శాఖ వారిచే బ్రాంచికు తిరుగు వచ్చినందున ఈ పత్రికా ప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది. మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించనందున సదరు అకౌంట్ తేది.17-10-2025 నుండి నిరర్థక ఆస్తిగా(ఎన్‌పిఏ) పరిగణించబడినది.

ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు బకాయి మొత్తం తేది.11-10-2025 నాటికి రూ.4,92,59,070.89 పై॥ (అక్షరాల నాలుగు కోట్ల తొంభైరెండు లక్షల యాభైతొమ్మిది వేల డెబ్బై రూపాయలు మరియు పైసలు యనభై తొమ్మిది మాత్రమే) ప్లస్ ది.12-10-2025 నుండి [illegible] వడ్డీ మరియు ఇతర చార్జీలు మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13(13) నియమానుసారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించిన బ్యాంక్ ఆఫ్ బరోడా వారి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకం, లీజు లేదా ఇతరత్రా లావాదేవిలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) ద్వారా బదిలీ చేయుట నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం జారీచేయబడినది.

ఆస్తి వివరములు :

(గుంటూరు ఎస్ఆర్ఓ. నందలి ది.16-11-2020 నాటి విక్రయ దస్తావేజు నెం.7524/2020 ప్రకారం) గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుంటూరు సిటీ, పండరీపురం, 4వ లైను ఏరియా, మునిసిపల్ పాత వార్డు నెం.2, కొత్త వార్డు నెం.8, బ్లాక్ నెం.1, టి.యస్.నెం.22/3, మునిసిపల్ డోరు నెం.5-76-4/ఎ, పాత అసెస్‌మెంట్ నెం.4414/బి, కొత్త అసెస్‌మెంట్ నెం.1021015930 నందు 500 చ॥గ॥ల లేదా 418.05 చ॥మీ॥ల విస్తీర్ణములో నిర్మించిన గ్రౌండ్, 1వ, 2వ మరియు 3వ అంతస్థులు గల ఆర్‌సిసి డాబా ఇంటికి సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు : [illegible] అక్కయ్య శాస్త్రికి చెందిన ఆస్తి 49'–09", దక్షిణం : దార్ల ధనలక్ష్మి, సంధ్య కుమారి యొక్క ప్రహరీగోడ 91'–06", పడమర : మునిసిపల్ కార్పొరేషన్ రోడ్ 49'–0", ఉత్తరం : పగడాల ముత్యాల నాయుడు మరియు ఇతరులకు చెందిన ఆస్తి 91'–0".

ఈ హద్దుల మధ్యగల 500 చ॥గ॥లు లేదా 418.05 చ॥మీ॥ల విస్తీర్ణము గల స్థలము మరియు అందులో నిర్మించిన గ్రౌండ్, 1వ, 2వ మరియు 3వ అంతస్థులు గల ఆర్‌సిసి భవనము కరెంట్ సర్వీస్ కనెక్షన్ నెం.083442, 088802, 088803, 088804, 088805, 088806 మరియు 088807 అన్ని సౌకర్యములతో సహా గల ఆస్తి.

ప్రస్తుత మరియు భవిష్యత్తులో నిర్మించబోయే అన్ని భవనములు, నిర్మాణములు మరియు సౌకర్యములతో సహా.

స్థలం : గుంటూరు, తేది : 18-10-2025 సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా.

క్లుప్తంగా

250 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని కండ్రికలో సోమవారం వెంకటసాయి పౌండేషన్(న్యూఢిల్లీ), అమెరికా ఫోర్ ప్రింట్ చారిటీ, చిన్న అవుటు పల్లికి చెందిన సిద్ధార్థ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పౌండేషన్ సీఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికా నుంచి వచ్చిన 20 మంది వైద్యులతో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుండె , చర్మ , దంత, కంటి సంబంధ మరియు సాధారణవైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామన్నారు. అనంతరం 250 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. 54మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో అమెరికా ఫోర్ ప్రింట్ చారిటీ సీఈవో నవీన్, గ్రామపెద్దలు చెక్కా హనుమంతురావు, ఎన్. అప్పయ్య, ఎన్.పెద రాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యాయస్థానాల తీర్పులను అమలుచేయండి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా న్యాయస్థానాల తీర్పులు ఇచ్చాయని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నేత కారపాటి స్టీవెన్ అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 342 రోజులుగా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం దీక్షలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏనుగుల సాంబశివరావు, షేక్ సుభాని, ముసలా సాంబశివరావు, అంకయ్య, పిచ్చయ్య, దానయ్య, ఇశ్రాయేల్, దుర్గాభవాని, శారమ్మ, ఇమాంబి, శివకుమారి, సువర్ణ, రిబ్కా తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళలో కుంచనపల్లి విద్యార్థుల ప్రతిభ

కార్తీక రెడ్డి

నాగ అభినందన్

తాడేపల్లి రూరల్: ఫారం ఫర్ ఆర్టిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రకళా పోటీల్లో కుంచనపల్లికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కుంచనపల్లిలోని కష్వి ఆర్ట్ ఇన్స్టిట్యూట్ ప్రతినిధి లక్ష్మీకాంత్, వాణి మాట్లాడుతూ ఆదివారం విజయవాడలో బాలబాలికలకు నిర్వహించిన చిత్రకళ పోటీల్లో సుమారు 500 మంది పాల్గొన్నారని, వీరిలో సబ్ జూనియర్ విభాగంలో కార్తీక రెడ్డి, సీనియర్స్ విభాగంలో టి. నాగ అభినందన్ తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారని తెలిపారు. కష్వి డ్రాయింగ్ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు కళాత్మక విలువలను పెంపొందించుకుని ఎన్నో బహుమతులను గెలుపొందుతున్నారని పేర్కొన్నారు. కార్తీకరెడ్డి, నాగ అభినందన్‌కు అభినందనలు తెలిపారు.

ఫుట్‌బాల్‌లో సత్తాచాటిన పొట్లపాడు విద్యార్థిని

వాసంతి

మేడికొండూరు: పొట్లపాడు గ్రామానికి చెందిన ఇంటూరి వాసంతి జాతీయస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని మేడికొండూరు మండల్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మొఖరాల శ్రీనివాసరావు, కార్యదర్శి మానుకొండ బ్రహ్మాజీ తెలిపారు. ఇంటూరి వాసంతి ఈనెల 18 తేదీలో అనంతపురంలో జరిగే , జాతీయస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో , ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ జూనియర్ బాలికల జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు రావెల జెడ్పీ విద్యార్థులు

రావెల(తాడికొండ): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు రావెల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం అంజలీదేవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలను ఈ నెల 7వ తేదీ శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారన్నారు. విద్యార్థులు ఎ.సింధుప్రియ, ఎన్. వెంకట వాసవి, పి.తేజస్వి, హోమ మహేశ్వరి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం అంజలీదేవి, శిక్షకులు కమల్, ఉపాధ్యాయులు అభినందించారు.

జేబులు నింపుకొనేందుకే ప్రైవేటీకరణ

- ప్రజా ఉద్యమం ర్యాలీని జయప్రదం చేయండి
- పోస్టర్లు ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

పోస్టర్ ఆవిష్కరణలో వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ, మండల నాయకులు ; తాడేపల్లి అంజిరెడ్డి భవన్‌లో నిరసన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

మంగళగిరి టౌన్: పేదలను దోపిడీ చేసి తమ జేబులు నింపుకునేందుకే మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధపడిందని మంగళగిరి పట్టణ, మండల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ విమర్శించారు. మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరు బైపాస్ వెంట ఉన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గంలో సోమవారం ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేష్, వెంకట కృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. పేదలకు వైద్యవిద్యను చేరువ చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకువస్తే చంద్రబాబు సర్కార్ వాటిని పీపీపీ విధానం పేరుతో ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు.

ప్రైవేటీకరణతో వైద్యం, మెడికల్ విద్య దూరం

ప్రైవేటీకరణ చేస్తే పేదలకు ఉచితంగా వైద్యం, విద్యార్థులకు వైద్యవిద్య ఫీజులు అందనంత దూరం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ జరిగితే పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఒకరికి ఆరోగ్యం పాడైనా అప్పుల పాలు కావాల్సి వస్తుందన్నారు. ఈ నెల 12వ తేదీ నియోజకవర్గ వ్యాప్తంగా జరగనున్న ప్రజా ఉద్యమం ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు సయ్యద్ గౌస్, గోపి యాదవ్, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, హర్ష, ప్రదీప్, గోపిరెడ్డి, ఈపూరి ఆదాం, అనిత, మాతంగి బాబు, షబాకర్, రాంబాబు, కిషోర్, పాల శ్రీనివాసరావు, గౌతమి, ఇందిర, ఆంజనేయులు, సురేష్, పద్మ, శంకరరెడ్డి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

దుగ్గిరాల: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ, అన్ని మండల కేంద్రాల్లో, నియోజక వర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపడుతున్నామని దుగ్గిరాల మండల అధ్యక్షుడు టి.శివగోపయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దుగ్గిరాల రైలుపేట వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద మండలంలోని సీనియర్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షుల సమక్షంలో మండల అధ్యక్షులు శివగోపయ్య ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల మహిళా విభాగం పి.సంసోనమ్మ, బీసీ సెల్ నాయకులు ఎన్.వెంకట్రావు, జిల్లా పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎండీ బాజి, మండల పార్టీ కార్యదర్శి ఎన్.కోటేశ్వరరావు, మండల మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ నాగూర్, జిల్లా మైనార్టీ విభాగం నాయకుల షేక్ సుభాని, పేరుకలపూడి సర్పంచి జి.గంగాధర్, దుగ్గిరాల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మోరంపూడి గ్రామ పార్టీ అధ్యక్షులు డి.మహీధర్, కె.ఆర్.కొండూరు గ్రామ అధ్యక్షుల డి. వీర వసంతరావు(బుజ్జి) తుమ్మపూడి గ్రామ అధ్యక్షుడు పృధ్వి, ఎం.నాగరాజు, కె.కిషోర్, డి.జార్జి, కె.రవిబాబు, పి.రామనాథం, బి.అర్జునరావు, ఎం.అశోక్, ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సర్కార్ దిగి రావాలంటే ప్రజా ఉద్యమం తప్పనిసరి

తాడేపల్లి రూరల్: చంద్రబాబునాయుడు సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టాలంటే ప్రజా ఉద్యమం తప్పదని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని దొంతిరెడ్డి అంజిరెడ్డి భవన్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేస్తే రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందిందని, దాన్ని సైతం బాబు సర్కార్ నిర్వీర్యం చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు మెరుగైన వైద్యం, విద్య అందించాలని రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్‌కాలేజీల నిర్మాణం చేపడితే చంద్రబాబు సర్కార్ ఆ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారని, ఆ మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం అయితే ఆ యజమాని కట్టమన్నంత డబ్బులు కట్టాలి. లేకుంటే వైద్యం చేయరన్నారు. ప్రైవేటీకరణను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రజల నుంచి సంతకాలు సేకరించారని, ప్రతి నియోజకవర్గంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేయనున్నామన్నారు. ఈనెల 12వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు మంగళగిరి వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి గాలిగోపురం మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రాలు అందజేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో నేతలు పాటిబండ్ల కృష్ణమూర్తి, రొడ్డ ఎలీషా, ముదిగొండ ప్రకాష్, చిన్నపోతుల దుర్గారావు, మేక వెంకటరామిరెడ్డి, షేక్ జావిద్, మేడ వెంకటేశ్వరరావు (పండు), సయ్యద్ సలాం, నాగ స్రవంతి, నియోజకవర్గ, తాడేపల్లి పట్టణ, మండల వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

తాడికొండలో..

తాడికొండ: పేదలను అణగదొక్కడమే ధ్యేయంగా చంద్రబాబు సర్కారు పని చేస్తోందని తాడికొండ మండల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి అన్నారు. సోమవారం తాడికొండ అడ్డరోడ్డులోని మండల పార్టీ కార్యాలయంలో ఈ నెల 12న తాడికొండలో జరగబోయే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం పోస్టర్‌ను నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ద్వారా పేదవాడికి వైద్యం దూరం చేయడమే లక్ష్యంగా కుట్ర పన్నుతుందనేందుకు జరుగుతున్న పరిణామాలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మండల యువజన, బీసీ, విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు షేక్ అజీస్, దమ్మాటి మోహనరావు, మల్లంపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఫిరోజ్ ఖాన్, గ్రామపార్టీ అధ్యక్షులు దొంతిరెడ్డి సీతారామిరెడ్డి, షేక్ సలీమ్, ఖాజా సాంబిరెడ్డి, నిమ్మగడ్డ రాజేంద్ర, చెన్నకేశవులు, అచ్చియ్య, బొళ్ళ లోకేష్ రెడ్డి, షేక్ ఖలీల్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ప్రాధాన్యం

సమావేశంలో మాట్లాడుతున్న తాడికొండ ఇన్‌చార్జి వజ్రబాబు

తాడికొండ: పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి నాయకుడు, కార్యకర్తకు భవిష్యత్తులో తగిన ప్రాధాన్యముంటుందని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్‌బాబు) అన్నారు. సోమవారం తాడికొండ అడ్డరోడ్డులోని మండల పార్టీ కార్యాలయంలో అనుబంధ విభాగాల అధ్యక్షులు, గ్రామపార్టీ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బూత్ కమిటీల ఎంపికలో గ్రామాల్లో పట్టున్న నాయకులకు ప్రాధాన్యమివ్వడంతో మరింతగా ప్రజలకు చేరువ కావచ్చన్నారు. ఈ నెల 12న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తిచేసి ప్రజా ఉద్యమాన్ని జయప్రదం చేసేందుకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, వివిధ విభాగాల నాయకులు బొంతా శ్రీకాంత్, షేక్ అజీస్, దమ్మాటి మోహనరావు, మల్లంపాఇ చంద్రశేఖర్ రెడ్డి, ఫిరోజ్ ఖాన్, బొజ్జా శ్రీహరి, గ్రామపార్టీ అధ్యక్షులు షేక్ సలీమ్, నిమ్మగడ్డ రాజేంద్ర, దొంతిరెడ్డి సీతారామిరెడ్డి, ప్రసాద్, చెన్నకేశవులు, ఖాజా సాంబిరెడ్డి, అచ్చయ్య, బొళ్ళ లోకేష్ రెడ్డి, షేక్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నేత అంజయ్య మృతి

దుగ్గిరాల: సీపీఎం సానుభూతి పరుడుగా విశిష్ట సేవలు అందించిన కోట అంజయ్య (90) మృతి తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు అన్నారు. సోమవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో అంజయ్య మృతదేహం వద్ద పార్టీ నాయకుల పూలమాలవేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ మక్కెన దుర్గ, కె.జోజి, జి.యోహోను, రాజా, బిక్షాలు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఏసు, అర్జున్ పాల్గొన్నారు.

సీడ్ యాక్సెస్ రోడ్‌కు సన్నాహాలు

- కేఎల్ రావు కాలనీ వాసులతో కమిషనర్ సమావేశం
- 60 గజాల ఇంటి స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం

మాట్లాడుతున్న కమిషనర్ అలీమ్ బాషా తదితరులు

తాడేపల్లి రూరల్: రాజధాని గ్రామాల నుంచి 16వ నంబర్ జాతీయ రహదారికి వెళ్లేందుకు సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణాన్ని సీఆర్డీఏ అధికారులు ప్రతిపాదించారు. ఆ రోడ్డు తాడేపల్లిలోని కేఎల్ రావు కాలనీ, సీతానగరం, మణిపాల్ హాస్పిటల్ మీదుగా 16వ నంబర్ జాతీయ రహదారిని కలుస్తుంది. ఈ మార్గంలో నివాసాలు తొలగించాల్సి ఉండటంతో సోమవారం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా నివాసాలు కోల్పోయే బాధితులతో తాడేపల్లిలోని జోనల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణం కింద మొత్తం 87 నివాసాలను తొలగించాల్సి వస్తోందని, వారికి ఒక్కొక్క నివాసానికి 60 గజాలు స్థలం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ స్థలాలను తాడేపల్లి ప్రకాష్‌నగర్‌లోని యూపీహెచ్‌సీ అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలో 60 సెంట్ల స్థలం ఉందని, అందులో 50 మందికి ఇవ్వడానికి నిర్ణయించారన్నారు. మరో 27 మందికి ఆత్మకూరులోని జగనన్న కాలనీలో ఇవ్వడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ప్లాట్లు ఇచ్చేవారికి లాటరీ పద్ధతిలో తీసి రెండురోజుల్లో అప్పగిస్తారని పేర్కొన్నారు. ఈ లోపు స్థలాలను చదును చేయనున్నామని ఆయన వివరించారు. ప్రస్తుతం కేఎల్‌రావు కాలనీ నివాసముంటున్న ఇళ్లు తొలగించే బాధితుల ఇంటిని బట్టి అధికారులు నష్టపరిహారాన్ని అంచనా వేసి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తారని తెలిపారు. నివాసాలు కోల్పోయే బాధితులు తమ కుటుంబసభ్యులకు పక్కపక్క ప్లాట్లు ఇవ్వాలని కోరగా, లాటరీ పద్ధతిలోనే 60 గజాల ప్లాట్‌ను కేటాయిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

మంత్రి లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలి

చంద్రబాబు సర్కార్, మంత్రినారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు కేఎల్ రావు కాలనీలో ఇల్లు కోల్పోయే బాధితులకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు కోరారు. ఇంటి నిర్మాణానికి కూడా ప్రభుత్వం భవన నిర్మాణ మెటీరియల్ ధరలు పెరిగిన సందర్భంగా దానికి అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న స్థలాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.

కౌలురైతులకు ‘అన్నదాత సుఖీభవ’ వర్తింపజేయాలి

మంగళగిరి టౌన్: కౌలు రైతులందరికి అన్నదాత సుఖీభవ పతకం వర్తింప జేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళగిరి మండల పరిధిలోని కాజా గ్రామ సచివాలయ అధికారులకు సోమవారం రైతాంగ, గ్రామ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. రామారావు మాట్లాడుతూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా పంట రుణాలు కౌలు రైతులకు అందించాలన్నారు. 70శాతం మంది కౌలు రైతులు భూమి సాగుచేసుకుంటున్నారని, ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కూడా కౌలు రైతులకే ఇవ్వాలని కోరారు. కాజా గ్రామ పుల్లయ్యనగర్ ప్రాంతంలో ఎంతోకాలంగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని ఉంటున్నవారికి ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని, గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, చిన్నపాటి వర్షాలకు రోడ్లు చిత్తడిగా మారుతున్నాయని పేర్కొన్నారు. పశ్చిమ బైపాస్ రోడ్ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో మురుగునీరు వెళ్లేందుకు కాజా గ్రామం వైపు మళ్లిస్తున్నారని, దీనికి ప్రత్యామ్నాయ మార్గం చూడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టం కుదించే ప్రయత్నం చేస్తోందని 33 శాతం పైగా నష్టం ఉంటేనే లెక్కింపు చేస్తామని చెప్పడం సరికాదని, శాతంతో పనిలేకుండా నష్టపోయిన ప్రతి ఒక్కరికి పరిహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు ప్రకాష్‌రావు, కోటేశ్వరరావు, పున్నయ్య, వెంకటరావు, ఉమాప్రసాద్ రెడ్డి, కోటేశ్వరి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరులో కోటి సంతకాల సేకరణ

తాడికొండ: పేదలను అణగదొక్కడమే లక్ష్యంగా బాబు సర్కారు తీరు ఉందని తుళ్ళూరు వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. పలు విభాగాల నాయకుల ఆధ్వర్యాన గ్రామంలో కోటి సంతకాల సేకరణ చేశారు. ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో జరిగే నష్టాలను తెలియజేశారు. పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు ఆలోకం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం కార్యదర్శి నేలపాటి నాగేంద్ర, నియోజకవర్గ డాక్టర్స్ వింగ్ అధ్యక్షులు కంతేటి అశోక్, గ్రామ యువజన విభాగం అధ్యక్షులు కంతేటి కిరణ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పసుపు దువ్వ వేలం పాట

దుగ్గిరాల: పసుపు దువ్వ వేలంపాటను బుధవారం నిర్వహిస్తారని దుగ్గిరాల వ్యవసాయ పసుపు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి జె.వి. సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు పసుపు దువ్వ, హక్కు ఆవిష్కరించని బస్తాల వేలం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీ

వేర్వేరు ఘటనల్లో ముగ్గురికి గాయాలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఫిరంగిపురం: ఎదురు ఎదురుగా వస్తున్న రెండు వాహనాలు ఒకదానికొకటి ఢీకొని వాటి డ్రైవర్లకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేట నుంచి గుంటూరు వెళ్తున్న టాటా గూడ్సు వాహనానికి ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయింది. ఆ క్రమంలో గుంటూరు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో రెండు వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. టాటా గూడ్స్ వాహనం అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి పడిపోయింది. ఘటనలో ఆ వాహనాల ఇద్దరు డ్రైవర్లకు తీవ్రగాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ శివరామకృష్ణ సూచనలమేరకు ఏఎస్ఐ పి.జాన్‌ఖాన్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావులు సంఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బాధితులను 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సకోసం తరలించినట్లు తెలిపారు.

దుగ్గిరాల: మోరంపూడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శిరీష కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామంలో సోమవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎదురెదురుగా వెళ్తున్న రెండు బైక్‌లు ఢీ కొనగా మంగళగిరి వెళ్తున్న శిరీష దంపతులు కింద పడ్డారు. ఘటనలో శిరీష కాలు విరిగింది. మరో వాహన చోదకుడు అంబులెన్స్‌కి ఫోన్ చేయగా సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. గాయపడిన వారిని తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నూతన జీఎస్టీతో గందరగోళం

దుగ్గిరాల: కేంద్రం ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీఎస్టీ గందరగోళంగా ఉందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దుగ్గిరాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 కింద సవరించిన ధరలు ప్రకటించినా అవి అమలులోకి రావడం లేదన్నారు. ముఖ్యమైన ప్రాణాధార ఔషధాలపై సైతం జిల్లా వ్యాప్తంగా ఉన్న కొన్ని ప్రైవేటు మెడికల్ షాపులు, ఆసుపత్రులు, ఫార్మసీల్లో ఇప్పటి వరకు పాత ధరలకే అమ్మకాలు సాగిస్తున్నాయని, ధరలు 6.5 శాతం వరకు తగ్గించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ, జిల్లా వ్యాప్తంగా జీఎస్టీ తగ్గించి నిజాయతీగా అమ్మకాలు చేస్తున్న షాపుల నిర్వాహకులను వేళ్ల మీద లెక్కించవచ్చన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరికి తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులకు అభినందన



మేడికొండూరు: పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్ విద్యార్థులు ఈనెల 7, 8, 9 తేదీల్లో వీవీఐటీ వర్సిటీలో జరిగిన బాలోత్సవ్‌లో పలు కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచారు ఇంటెల్ స్కూల్ విద్యార్థులు. ఇంగ్లిష స్పీచ్ జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థిని సాయి దుర్గ, ముఖాభినయం జూనియర్ విభాగంలో మొదటి బహుమతి అక్షర సాయి, ఏకపాత్రాభినయం సీనియర్ విభాగంలో తృతీయ స్థానం వర్షమేఘన, లేఖా రచన సబ్ జూనియర్ విభాగంలో నాలుగవ స్థానం జాహ్నవి, ప్రయోగశాల విభాగంలో నాలుగో స్థానం సాధించిన కార్తికేయ, అజీజ్, మహమ్మద్ సోహెల్‌ను స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయ కుమార్, ప్రిన్సిపల్ కోనూరి అశోకా రాణి జయకుమార్, స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్, స్ఫూర్తి ఫౌండేషన్ కోఆర్డినేటర్ కడియాల శివప్రసాదరావు, డాక్టర్ సీప ప్రసాద్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు వడ్డేశ్వరం విద్యార్థిని

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో జరిగే ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో పోటీలు పల్నాడు జిల్లా వినుకొండ లయోల హైస్కూల్లో ఈనెల 8వ తేదీ శనివారం టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించారన్నారు. ప్రతిభ కనబరిచిన తమ పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని ఎస్. హేమలత అండర్ 14 విభాగంలో ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జరుగనున్నాయని హేమలత పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని వ్యాయామ ఉపాధ్యాయులు మెల్లెంపూడి రవి, నూతక్కి రవి, పి. సతీష్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంఎస్ చైర్మన్ బషీరా, మాజీ సర్పంచ్ షేక్ చిన రంగా షరీఫ్ తదితరులు అభినందించారు.

పిల్లల్లో సృజన వెలికితీయడానికే..

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బాలోత్సవ ప్రతినిధులు, నాయకులు

మంగళగిరి టౌన్ : మంగళగిరి నగరపరిధిలోని అరవింద్ మోడల్ స్కూల్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో జరగనున్న 3వ పిల్లల పండుగ బాలోత్సవ బ్రోచర్‌ను మంగళగిరి రాయల్ బంక్వెట్ హాల్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలోత్సవ నాయకులు మాట్లాడుతూ పిల్లల్లో సృజన వెలికితీసేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బాలోత్సవంలో మూడు విభాగాలుగా, 13 అకడమిక్, 9 సాంస్కృతిక ఈవెంట్లలో 37 రకాల పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ, దుగ్గిరాల, తుళ్లూరు మండల పరిధిలో ఉన్న పాఠశాలల విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బాలోత్సవ నాయకులు మురళీకృష్ణ, నన్నపనేని నాగేశ్వరరావు, వీవీ ప్రసాద్, ఎస్.బాలకృష్ణ, రాజశేఖర్, విజయ మోహనరావు, వల్లభనేని వాణి పాల్గొన్నారు.

ఎరియర్స్‌ను తక్షణమే చెల్లించండి

ఎయిమ్స్ వైద్యశాల వద్ద నిరసన కార్యక్రమంలో కార్మికులు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఎయిమ్స్ వైద్యశాలలో పని చేస్తున్న కార్మికులకు ఎరియర్స్ తక్షణమే చెల్లించాలని యూనియన్ కార్యదర్శి బాలాజీ డిమాండ్ చేశారు. ఎయిమ్స్ గేటు వద్ద కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమం సోమవారానికి 7వ రోజుకు చేరుకుంది. బాలాజీ మాట్లాడుతూ ఎరియర్స్ చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చినా యాజమాన్యం ఇవ్వడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బుచ్చిబాబు, శ్రీనివాసరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన సీపీఎం జిల్లా కార్యదర్శి

వారం రోజులుగా నిరసన ప్రదర్శన చేస్తున్న ఎయిమ్స్ కార్మికులకు సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ సోమవారం మద్దతు తెలిపారు. శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ గతంలో పనిచేసిన సెక్యూరిటీ గార్డులకు, వర్కర్లకు కోర్టు రూ. 69 లక్షలు ఎరియర్స్ చెల్లించాలని తీర్పు ఇచ్చినా నేటికీ చెల్లించకపోవడం దారుణమన్నారు. ఎయిమ్స్ యాజమాన్యం కాంట్రాక్టర్‌ను పిలిపించి యూనియన్ నాయకులతో చర్చించి చెల్లించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు చెంగయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

కౌలురైతు ఆత్మహత్య

- గడ్డిమందు తీసుకోవడంతో జీజీహెచ్‌కు తరలింపు
- అక్కడ చికిత్స పొందుతూ మృతి

చింతకాయల వెంకట్రావు (ఫైల్)

యడ్లపాడు: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా కొత్తపాలెం (పుట్టకోట) గ్రామానికి చెందిన చింతకాయల వెంకట్రావు (72) నాలుగెకరాల భూమిని కౌలుకు తీసుకుని మూడేళ్లుగా పత్తి, జామ సాగుచేశాడు. ఎకరం రూ.20 వేల నుంచి రూ.30వేల చొప్పున కౌలుకు తీసుకుని, అప్పుచేసి పంటకు పెట్టుబడి పెట్టాడు. అయితే దిగుబడులు అంతంత మాత్రంగా రావడంతో అప్పులు పెరిగిపోయాయి. మొత్తంమీద రూ.11 లక్షల వరకు అప్పులు తేలాయి. అవి తీర్చే మార్గం కనిపించక.. వారికి సమాధానం చెప్పలేక వెంకట్రావు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో ఈనెల 7న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయన్ను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్‌ఐ టి. శివరామకృష్ణ కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య మల్లేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రశ్నిస్తే ప్రాణం తీసేందుకు యత్నం

- గిరిజన యువకుడిపై దాడికి పాల్పడిన టీడీపీ నేతలమీద చర్యలు తీసుకోండి
- జాతీయ ఎస్టీ కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి ఫిర్యాదు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)/వెంకటాచలం: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలానికి చెందిన గిరిజన యువకుడు బదనాపూరి గోపాల్‌పై టీడీపీ నేతలు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురించి తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ‘టీడీపీ నేతలు ప్రెస్‌మీట్‌లో చెప్పిన అంశాలను ప్రశ్నించడంతో జీర్ణించుకోలేక అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న గోపాల్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారు. కత్తితో గొంతు కోయడానికి యత్నించారు. మెడ, ఎడమ తొడపై తీవ్ర గాయాలు చేశారు. ప్రశ్నిస్తే గొంతులు కోస్తారా? ఈ దాడి పూర్తిగా కుల వివక్షతో ప్రేరేపితమైంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఇలాంటి దారుణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గోపాల్‌పై దాడి కేవలం ఒక వ్యక్తిపై దాడి మాత్రమే కాదు... సమాజంలోని గిరిజన హక్కులపై దాడిగా భావిస్తున్నాం. కుల వివక్షతో ప్రేరేపితమైన ఈ చర్యను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. జాతీయ ఎస్టీ కమిషన్ వెంటనే విచారణ ప్రారంభించి నిందితులను కఠినంగా శిక్షించేలా చూడాలి. బాధితుడు గోపాల్, అతని కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించడంతోపాటు తక్షణ పరిహారం చెల్లించాలి.’ అని ఎంపీ గురుమూర్తి కోరారు.

అక్రమ కేసులో డీఎస్పీ ఎదుట హాజరైన వైఎస్సార్‌సీపీ నేతలు

విచారణకు హాజరవుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీహరి, మధుసూదన్

కర్నూలు(టౌన్): కర్నూలు శివారులోని చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు నమోదుచేసిన అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరి, పార్టీ సోషల్ మీడియా ప్రతినిధి మధుసూదన్‌రెడ్డి సోమవారం కర్నూలు డీఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. బస్సు ప్రమాద ఘటనలో 27 మంది సోషల్ మీడియా ప్రతినిధులకు నోటీసులు ఇవ్వగా, వారందరినీ పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధులు శ్యామల, కారుమూరి వెంకటరెడ్డిని విచారించారు. తాజాగా శ్రీహరి, మధుసూదన్‌రెడ్డిని డీఎస్పీ బాబు ప్రసాద్ గంట పాటు విచారించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీకి భూమిపూజ

తాడికొండ: రాజధాని అమరావతిలోని పిచ్చుకలపాలెంలో 12 ఎకరాల్లో నిర్మించనున్న ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎం.ఎస్.కె.ప్రసాద్) నిర్మాణానికి సోమవారం భూమిపూజ జరిగింది. భూమిపూజలో రిటైర్డ్ క్రికెటర్ ఎం.ఎస్.కె. ప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

‘ఎస్‌ఐఆర్ నిలిపివేయాలి’

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్)ను రాష్ట్రంలో అమలు చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం అధ్యక్షతన విజయవాడలో సోమవారం పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. సమావేశ తీర్మానాన్ని రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విడుదల చేశారు.

లడ్డూ ప్రసాదంపై బాబు సర్కారు కుట్ర!

అజయ్ కుమార్ సుగంధ్ రిమాండ్ నివేదికే తార్కాణం

సాక్షి అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం ప్రాశస్త్యానికి కళంకం తీసుకొచ్చే కుట్రలకు చంద్రబాబు ప్రభుత్వం మరింత పదును పెట్టింది. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేందుకు బరి తెగించింది. అందుకోసం పరస్పర విరుద్ధ ఆరోపణలు, అవాస్తవాలు, అభూత కల్పనలు జోడించి న్యాయస్థానాలను బురిడీ కొట్టించేందుకు కూడా తెగబడుతుండటం తీవ్ర విభ్రాంతి కలిగిస్తోంది. టీటీడీ నెయ్యి వివాదంలో సిట్ తాజాగా అరెస్టు చేసిన సుగంధ్ ఆయిల్ కంపెనీ ప్రతినిధి అజయ్ కుమార్ సుగంధ్ రిమాండ్ నివేదికే అందుకు తాజా తార్కాణం. ఆ రిమాండ్ నివేదికలోని అంశాలను ఎల్లో మీడియాతోపాటు వివిధ మీడియా సంస్థలకు ముందుగానే లీక్ చేసి రాద్ధాంతం చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం తన కుట్రలను నిస్సిగ్గుగా బయట పెట్టుకుంది. ఆ దుష్ప్రచార కథనాలను మంత్రి నారా లోకేశ్ తన ‘ఎక్స్’ ఖాతాలో పోస్టు చేయడం గమనార్హం. అంటే పక్కా కుతంత్రంతోనే ఈ దుష్ప్రచార కుట్రలకు ప్రభుత్వం బరి తెగించిందన్నది స్పష్టమవుతోంది. తిరుపతి పోలీసులు అరెస్టు చేసిన అజయ్ కుమార్ సుగంధ్‌ను నెల్లూరు ఏసీబీ న్యాయస్థానంలో హాజరు పరచగా ఈ నెల 21 వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఈ సందర్భంగా పోలీసులు సమర్పించిన రిమాండ్ నివేదిక సాక్షిగా బయటపడిన ప్రభుత్వ కుట్ర ఇలా ఉంది..

జంతువుల కొవ్వు అన్నారు.. కాదు కాదు రసాయనాలంటున్నారు!

తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు ప్రభుత్వం బరి తెగించి దుష్ప్రచారానికి పాల్పడిందన్నది ఈ రిమాండ్ నివేదిక బయటపెట్టింది. గత ఐదేళ్లలో లడ్డూ ప్రసాదానికి వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించి భక్తుల మనోభావాలను దెబ్బ తీశారు. అదే నిరాధార ఆరోపణలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎల్లో మీడియా పదేపదే ఉద్ఘాటించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నించిన విషయం తెలిసిందే. కాగా నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని ఎన్‌డీడీబీ ల్యాబ్ నివేదిక స్పష్టం చేయడంతో ప్రభుత్వ కుట్ర బెడిసికొట్టింది. సీఎం చంద్రబాబు ఆరోపణలను ఖండిస్తూ అప్పటి టీటీడీ ఈవో శ్యామలరావు కూడా కల్తీ నెయ్యిని లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించలేదని స్పష్టం చేయడం గమనార్హం. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఈవోపై ఒత్తిడి తెచ్చి ఆయన మౌనం దాల్చేలా చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం మరో కుతంత్రానికి ఈ రిమాండ్ నివేదిక ద్వారా కుట్ర పన్నింది. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో ఈస్ట్, ఇతర రసాయనాలు కలిపారని తాజాగా పేర్కొంది. జంతువుల కొవ్వు ఆరోపణలు బెడిసికొట్టడంతో

నెయ్యిపై దుష్ప్రచారం చేసేందుకు రసాయనాలు, రిఫైన్డ్ ఆయిల్ కలిపారనే వాదనను తెరపైకి తెచ్చినట్లు స్పష్టమవుతోంది. అందుకోసం దర్యాప్తు పేరుతో సాక్షులను వివిధ డెయిరీ సంస్థల ప్రతినిధులను బెదిరించి అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు చెప్పినట్లుగా అబద్ధపు వాంగ్మూలాలు ఇవ్వకపోతే అక్రమ కేసులో ఇరికిస్తారనే భయంతోనే డెయిరీ ప్రతినిధులు వారి ఒత్తిడికి తలొగ్గినట్లు తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి.

భోలే బాబా డెయిరీపై భిన్న వాదనలు..

లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేయాలనే లక్ష్యంతో చంద్రబాబు ప్రభుత్వం భోలే బాబా డెయిరీపై పరస్పర విరుద్ధ ఆరోపణలతో తన కుట్రలను బయటపెట్టుకుంటోంది. ఏపీ భవన్ ఉద్యోగి చిన్న అప్పన్నను పోలీసులు వైవీ సుబ్బారెడ్డి పీఏగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. ఆయన భోలే బాబా డెయిరీని బెదిరించి రూ.50 లక్షలు లంచం అడిగారని ఆరోపించారు. అందుకు ఆ డెయిరీ నిరాకరించడంతో టీటీడీ జీఎంపై ఒత్తిడి తెచ్చి బ్లాక్ లిస్టులో పెట్టించారని పేర్కొన్నారు. మరో రెండు డెయిరీలు (ప్రీమియర్ డెయిరీ, ఆల్ఫా డెయిరీలు) నుంచి లంచం తీసుకుని వాటికి అదే ఏడాది నెయ్యి కాంట్రాక్టు ఇప్పించారని ఆరోపించారు. అయితే భోలేబాబా డెయిరీని కాదని, ఆ రెండు డెయిరీలకు నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇప్పించినట్లు ఆరోపణలు చేశారు. ఆయన వ్యక్తిగత బ్యాంకు లావాదేవీలను వక్రీకరిస్తూ, వాటిని ఆధారంగా చూపించేందుకు తాపత్రయపడ్డారు. కానీ అదే సమయంలో చిన్న అప్పన్న గతంలో ప్రస్తుత టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వద్ద పీఏగా పని చేశారన్న వాస్తవాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. పోలీసులు భోలేబాబా డెయిరీని టీటీడీ బ్లాక్ లిస్టులో పెట్టిందని పేర్కొనడం గమనార్హం. అంటే భోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి సరఫరాను వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే టీటీడీ నిలిపివేసిందని స్పష్టమవుతోంది. భోలే బాబా డెయిరీ రైతుల నుంచి ఒక్క చుక్క కూడా పాలు సేకరించలేదని సిట్ పేర్కొంది. కానీ అదే డెయిరీ యూపీలో 60 వేల మంది పాడి రైతుల నుంచి పాలు సేకరించి పాల ఉత్పత్తులు తయారు చేస్తోందని అదే సిట్ పూర్తి భిన్నమైన వాదన వినిపించింది. భోలే బాబా డెయిరీ పేరుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచార కుట్ర బెడిసికొట్టడంతో అజయ్ కుమార్ సుగంధ్ రిమాండ్ రిపోర్టులో సిట్ కొత్త కట్టుకథను వినిపించింది. భోలే బాబా డెయిరీ సుగంధ్ ఆయిల్ ప్రొడక్ట్స్ ద్వారా కల్తీ నెయ్యిని సరఫరా చేసినట్లు కొత్త కట్టుకథ సృష్టించింది. అందులో వివిధ ప్రైవేట్ డెయిరీల పాత్ర ఉన్నట్లు కూడా పేర్కొంది. ఆ మేరకు హర్ష్ ట్రేడింగ్ కంపెనీ, హర్ష్ డెయిరీ ప్రొడక్ట్స్ తదితర పేర్లను పేర్కొంది. అంటే ఆ కంపెనీ ప్రతినిధులను బెదిరించి అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేసేందుకు పక్కాగా పన్నాగం పన్నినట్లు స్పష్టమవుతోంది.

సుప్రీం తీర్పునూ బేఖాతర్ చేస్తూ...

రాజకీయాల్లోకి కనీసం భగవంతుడినైనా దూరంగా ఉంచాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం చంద్రబాబు సర్కార్ బేఖాతర్ చేస్తోంది. సుప్రీం కోర్టు పరిధిలో ఉన్న ఈ కేసులో, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఎల్లో మీడియా ద్వారా రాద్ధాంతం చేస్తోంది. అజయ్‌కుమార్ సుగంధ్ రిమాండ్ రిపోర్టును న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోకముందే ఎల్లో మీడియాకు చేరడం అందుకు నిదర్శనం. ఎల్లో మీడియా, కొన్ని ఇంగ్లీషు పత్రికలు, వెబ్‌సైట్లలో దుష్ప్రచార కథనాలను సోమవారమే వైరల్ చేయడం విభ్రాంతి కలిగిస్తోంది. టీటీడీ లడ్డూ ప్రసాదానికి కళంకం ఆపాదించేలా మీడియా చానళ్లలో చర్చా గోష్టి నిర్వహించింది. ఆ దుష్ప్రచార కథనాలను మంత్రి నారా లోకేశ్ తన ‘ఎక్స్’ ఖాతాలో పోస్టు చేయడం గమనార్హం. అంటే పక్కా పన్నాగంతోనే ప్రభుత్వం, ఎల్లో మీడియా లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారానికి తెగబడినట్లు స్పష్టమవుతోంది. ఈ అంశంపై న్యాయస్థానం విచారణ, తీర్పుతో నిమిత్తం లేకుండా ప్రజలను తప్పుదారి పట్టించడమే చంద్రబాబు ప్రభుత్వం లక్ష్యమన్నది తేటతెల్లమవుతోంది.

తిరుమల లడ్డూపై చంద్రబాబుది దుర్మార్గ ప్రచారం

మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు ధ్వజం

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూపై చంద్రబాబు దుర్మార్గమైన ప్రచారానికి ఒడిగడుతున్నారని.. చంద్రబాబు, లోకేశ్ ఆలయాలను అడ్డం పెట్టుకుని నీచమైన రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఎంతో పవిత్రమైన లడ్డూలో జంతు కొవ్వు అంటూ అసత్య ప్రచారం చేశారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు చీవాట్లు పెట్టినా తీరు మార్చుకోని చంద్రబాబు ఇప్పటికీ ఆలయాలను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. కోట్లాది మంది హిందువుల మనోభా

వాలను చంద్రబాబు దెబ్బతీస్తున్నారని చెప్పారు.

చంద్రబాబును దేవుడు కూడా క్షమించడు

తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేస్తున్న చంద్రబాబును ప్రజలే కాకుండా.. ఆ దేవుడు కూడా క్షమించడని అంబటి రాంబాబు మండిపడ్డారు. పవిత్ర క్షేత్రమైన టీటీడీని కూడా అడ్డం పెట్టుకుని చంద్రబాబు అత్యంత నీచమైన రాజకీయాలకు దిగటం దారుణమన్నారు. పవిత్రమైన తిరుమల లడ్డూలో కల్తీ అంటూ చంద్రబాబు చేసిన ఆరోపణలపై తీవ్ర ఆవేదన చెందిన టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అసలు వాడని నెయ్యిని వాడినట్టుగా సీఎం అయినంత మాత్రాన చంద్రబాబు ఎలా చెబుతారని సుప్రీం కోర్టు చీవాట్లు పెట్టిందన్నారు. సీఎం చంద్రబాబు ఇలా మాట్లాడకూడదని చెప్పి.. విచారణ జరిపించాలని కోరిందని చెప్పారు. సీబీఐ విచారణ జరపాలని వైవీ సుబ్బారెడ్డి కోరితే.. సుప్రీం కోర్టు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్ వేసి దర్యాప్తు చేయాలని ఆదేశించిందని, భగవంతుడిని రాజకీయాల్లోకి లాగొద్దని.. వీటికి దూరంగా పెట్టాలని, టీటీడీని రాజకీయాల్లో లాగొద్దని.. కేవలం నెయ్యిలో కల్తీ కలిసిందా? లేదా? అన్నది తేల్చండని సుప్రీంకోర్టు చెప్పిందని వివరించారు.

అయినా చంద్రబాబు తీరు మారలేదు

ఇవన్నీ వదిలేసిన చంద్రబాబు తన అనుకూల అధికారులతో సిట్ ఏర్పాటు చేసి.. విచారణ పేరుతో ఎవరో ఒకరిని పట్టుకుని బెదిరిస్తూ తాను లక్ష్యంగా చేసుకున్న వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు చెప్పాలని వేధిస్తున్నారని అంబటి పేర్కొన్నారు. టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డిపై దుష్ప్రచారం చేస్తూ తనకు అనుకూలమైన ఎల్లో మీడియాలో కథనాలు రాయించడం మొదలుపెట్టారని, తమ వేధింపుల కోసం ముందుగా ఒక వ్యక్తిని ఎంచుకున్నట్టు ఈ కేసులో కూడా చినఅప్పన్నను పట్టుకుని మే నెలలో విచారణకు పిలిచారని గుర్తు చేశారు. సిట్ అధికారులు జూన్ 6న అతడిని విచారించారని.. ఆ వెంటనే చినఅప్పన్న ఒక వీడియో విడుదల చేశారని తెలిపారు. ఆ వీడియోలో సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి పేరు చెప్పమని సిట్ అధికారులు తనపై దౌర్జన్యం చేసిన విషయాన్ని చినఅప్పన్న తెలియజేసిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. చిన అప్పన్న 2018 వరకు వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా పనిచేశాడని, ఆ తర్వాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దగ్గర పనిచేశాడని గుర్తు చేశారు. మరి వాళ్ల పేర్లు ఎందుకు బయటపెట్టడం లేదని నిలదీశారు. వేమిరెడ్డి దంపతులు ఇప్పుడు చంద్రబాబు పక్కనే ఉన్నారు కాబట్టే వారి పేర్లు ప్రస్తావించరని అంబటి పేర్కొన్నారు. ప్రస్తుతం టీడీపీలో మంత్రిగా ఉన్న కొలుసు పార్థసారథి గతంలో టీడీపీ పర్చేజింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నారని గుర్తు చేశారు.

భోలేబాబాను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది వైవీ సుబ్బారెడ్డి

భోలేబాబా డెయిరీపై ఫిర్యాదు అందిన వెంటనే అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెంటనే ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టడమే కాకుండా వేగంగా స్పందించి దర్యాప్తు చేయాలని ఆదేశించిన మాట వాస్తవం కాదా అని ‘ఎక్స్’ వేదికగా లోకేశ్‌ను అంబటి రాంబాబు ప్రశ్నించారు. ఆరోపణలు వచ్చిన వెంటనే ఆ సమస్యను బయటపెట్టి వారికి తలుపులు పూర్తిగా మూసేసినప్పుడు.. సుబ్బారెడ్డి అదే కంపెనీతో చేతులు కలిపాడని ఎలా చెప్తారని ప్రశ్నించారు. చంద్రబాబు పవిత్ర తిరుమల లడ్డూ నెయ్యిలో ఎటువంటి ఆధారాలు లేకుండా జంతువుల కొవ్వు కలిపారంటూ అత్యంత దురుద్దేశంతో బాధ్యతారాహిత్యంగా ఎందుకు ఆరోపించారో లోకేశ్ సమాధానం చెప్పాలన్నారు. ‘ఇప్పుడు కూడా విషపూరిత ప్రచారాన్ని తిరిగి ప్రారంభించింది. టీడీపీకి చెందిన నకిలీ మీడియా హ్యాండిళ్లన్నీ నిరాధారమైన వాదనలను పునరావృతం చేస్తున్నాయి. ఒకే సమయంలో కాపీ పేస్ట్ సందేశాలు పోస్ట్ చేస్తుండటం వీరి కుట్రను బహిర్గతం చేస్తోంది.’

వారి పింఛన్‌ను పెంచాల్సిన అవసరం ఉంది..

కారుణ్య మరణం కోరిన పిటిషనర్లపై హైకోర్టు అభిప్రాయం

పూర్తి నివాస వివరాలకు ఆదేశాలు

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా, రాయపూడి గ్రామానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు నెల్లూరి శేషగిరమ్మ, మానసిక వికలాంగురాలైన ఆమె మనుమరాలు శ్యామలకు అందుతున్న రూ.6 వేల పింఛన్‌ను మరింత పెంచాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. అలాగే శేషగిరమ్మ, శ్యామల ఉంటున్న ఇల్లు.. రాజధాని నిర్మాణాలకు అడ్డంకిగా ఉందా?... తదితర వివరాలను తమ ముందుంచాలని సీఆర్‌డీఏను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తమ బాగోగులను చూడాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని, లేని పక్షంలో తమకు కారుణ్య మరణం ప్రసాదించాలని కోరుతూ వీరి తరఫున పిటిషన్ దాఖలయిన సంగతి తెలిసిందే. కాగా, పిటిషనర్ల తరఫు న్యాయవాది బి.బాలయ్యను ఉద్దేశించి హైకోర్టు సోమవారం ఘాటు వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కారుణ్య మరణం అభ్యర్థనతో ఎలా పిటిషన్ దాఖలు చేస్తారని ప్రశ్నిస్తూ, ఇలాంటి వ్యాజ్యాలను దాఖలు చేసి ప్రచారం కోసం కోర్టును వేదికగా చేసుకోవద్దని హితవు పలికారు.

నేపథ్యం ఇదీ...

శేషగిరమ్మకు గతంలో ఎకరన్నర భూమి ఉండేది. దీనిలో 1.45 సెంట్ల భూమిని ప్రభుత్వం మత్యకారులకు కేటాయించింది. మిగిలిన ఐదు సెంట్ల భూమి సీఆర్‌డీఏ అధికారులు తీసుకున్నారు. దీంతో శేషగిరమ్మ, మతిస్థిమితం లేని మనుమరాలి పరిస్థితి దుర్భరంగా మారింది. తమ నుంచి తీసుకున్న 5 సెంట్ల భూమిని తమకు ఇవ్వాలని, లేని పక్షంలో తమకు కారుణ్య మరణం ప్రసాదించాలని కోరుతూ వారు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును మానవీక కోణంలో పరిశీలించిన న్యాయమూర్తి గత విచారణ సందర్భంగా తన సొంత కారులో డ్రైవర్‌నిచ్చి రూపేష్ అనే న్యాయవాదిని ఆ వృద్ధురాలు, ఆమె మనుమరాలు ఉంటున్న రాయపూడి గ్రామానికి పంపారు. వారి పరిస్థితిని పూర్తిగా తెలుసుకుని నివేదిక ఇవ్వాలని ఆ న్యాయవాదిని ఆదేశించారు. వారి పునరావాసం, బాగోగుల కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారో పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని, సీఆర్‌డీఏను ఆదేశించారు.

అందెశ్రీ ఇక లేరు

సాక్షి, హైదరాబాద్/లాలాపేట/మద్దూరు (హుస్నాబాద్): తెలంగాణ సాహితీ దిగ్గజాలలో ఒకరిగా గుర్తింపు పొందిన ప్రజా, ప్రకృతి కవి, గాయకుడు అందెశ్రీ (64) సోమవారం ఉదయం హఠాన్మరణం చెందారు. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్ లాలాపేటలోని తన ఇంట్లో కుప్పకూలిన అందెశ్రీని కుటుంబ సభ్యులు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. సిద్దిపేట జిల్లాకు చెందిన అందెశ్రీకి భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం ఉదయం ఘట్‌కేసర్ మండలంలోని ఎన్‌ఎఫ్‌సీ ప్రాంతంలో అధికార లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. అందెశ్రీ మృతి పట్ల ప్రధాని మోదీ, తెలంగాణ మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తదితర ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అందెశ్రీ సిద్ధిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామానికి చెందిన అందె ఎల్లమ్మ, బొడ్డయ్య దంపతులకు 1961 జూలై 18న రెండో సంతానంగా జన్మించారు. అసలు పేరు అందె ఎల్లయ్య. శృంగేరి మఠానికి చెందిన స్వామి శంకర్ మహరాజ్ ఎల్లయ్య ప్రతిభను గుర్తించి, పేరును అందెశ్రీగా మార్చారు. అందెశ్రీ చదువుకోనప్పటికీ కవిత్వాన్ని అలవోకగా చెప్పేవారు. ‘మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు..’ అన్న పాట ఆయనకు మంచి పేరుతెచ్చిపెట్టింది. తెలంగాణ ఉద్యమంపై రాసిన ‘జయ జయహే తెలంగాణ’ గీతం ఆ రాష్ట్ర గేయంగా ఎంపికైంది. ఆయన సినిమా లకూ పాటలు రాసి అనేక పురస్కారాలు పొందారు.

తెలుగు సాహిత్యానికి తీరని లోటు : మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. తెలంగాణ మాండలిక సాహిత్యంలో అందెశ్రీ ప్రత్యేకతను చాటారని తెలిపారు. అతి సామాన్య కుటుంబంలో జన్మించి, గొర్రెల కాపరిగా జీవన ప్రస్థానాన్ని ప్రారంభించి, భవన నిర్మాణ కార్మికుడిగా కూడా పని చేసిన అందెశ్రీ ఎలాంటి పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారని కొనియాడారు. అందెశ్రీ మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

నిబంధనలు సడలించి పంటలు కొనుగోలు చేయాలి

రైతు సంఘం నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్



కంకిపాడు: నిబంధనలు సడలించి, వరి, పత్తి, ఇతర పంటలు కొనుగోలు చేయాలని రైతు సంఘం నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని పునాదిపాడులో పర్యటించిన కేంద్ర బృందానికి సోమవారం ఆయన వినతిపత్రమిచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొంథా తుపానుతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు సడలించి వరి, పత్తి, ఇతర పంటలను కొనుగోలు చేయాలని కేంద్ర బృందానికి విన్నవించామన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ 2005లోని సెక్షన్ 11, 12ను కేంద్రం తొలగించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సమయంలో రైతులను ఆర్థిక సహాయం అందించే నిబంధనలు తొలగించడం దుర్మార్గమన్నారు.

‘పవర్’పై ప్రైవేటు పెత్తనం

విద్యుత్ సంస్థలపై అజమాయిషీ చెలాయిస్తున్న ఓ సంస్థ

- కీలక నేత తాలూకా అంటూ అధికారులను హడలెత్తిస్తున్న వైనం
- సమీక్షల్లో నేరుగా పాల్గొంటూ టెండర్ పత్రాలు తయారీ
- ఎవరికి దక్కాలో వారికి అనుకూలంగా నిబంధనలు తయారు
- రూ.50 లక్షల కాంట్రాక్టు నుంచి రూ.100 కోట్లపైగా ప్రతిదీ దిశానిర్దేశం

అధికారిక సమావేశంలో ఉన్నతాధికారులతో పాటు కూర్చున్న ప్రైవేటు సంస్థ ప్రతినిధి

సాక్షి, అమరావతి: ఉద్యోగుల బదిలీల్లో కొందరు, ఉన్నత పదవుల నియామకాల్లో మరికొందరు అందినంత దోపిడీ.. కాంట్రాక్టుల్లో ఇంకొందరు భారీగా కమీషన్లు వసూలు...! కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి విద్యుత్ సంస్థలను దోచుకుంటున్న తీరు ఇది...! ఈ దందాలో అనేకమంది అనేక విధాల ప్రయత్నాలు... వీరిలో రాజకీయ నేతలు, ఉన్నతాధికారులతో పాటు ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు కూడా ఉన్నారు..! తాజాగా ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లలో ఓ ప్రైవేటు సంస్థ ప్రతినిధి అన్నీ తానే అయి ఉన్నతాధికారులను శాసిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏకంగా అధికారిక సమీక్షల్లో నేరుగా పాల్గొంటూ, ప్రభుత్వంలోని కీలక నేత తాలూకా అని చెబుతూ హడలెత్తిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పని కాకుంటే బదిలీనే బహుమానం...

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్)లో ఇటీవల జరిగిన ఓ అధికారిక సమీక్షలో ఉన్నతాధికారులతో పాటు ఓ వ్యక్తి దర్జాగా కూర్చున్నారు. ఆయనను చూసిన ఇతర అధికారులు, సిబ్బంది ఎవరో ఉన్నతాధికారి అని భ్రమపడ్డారు. కానీ, ఆయన ప్రైవేటు కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధి. సీఎండీ కార్యాలయం నుంచి నేరుగా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనే స్థాయిలో విద్యుత్ సంస్థల్లో పవర్ పెంచుకున్నారు ఆ వ్యక్తి.


j.Deliverables

- System Landscape Document (As-Is/To-Be); Infrastructure & Integration Blueprints.
- Detailed Migration Plan, Test Strategy, Cutover Runbook, and Rollback Plan.
- Configuration Baselines (VMware, RHEL for Oracle Databases), Security Hardening Checklist, and Go-Live Readiness Report.

k. Support Services During Post Go-Live Stabilization (PGLS) Period

Post Go Live Stabilization Support will start from the date of Go [illegible] shall engage the same technical & functional consultants that w[illegible] during the stabilization period after Go-Live. During this period, t[illegible] services through both on-site support and remote resources. One [illegible] onsite, and this consultant will be the single point of contact (S[illegible] activities in APSPDCL in addition to providing support to the [illegible] provide functional support and maintenance of all IT/OT Solution[illegible] be responsible for supporting and rectifying all issues identified.

L. Application Managed Services (SOC)

The Bidder would provide all-inclusive Application Managed Se[illegible] years (SOC) after completion of from Go-Live/as mentioned in [illegible] HANA and BW HANA and Billing and collections applications [illegible] services. Application Management services can delivered throug[illegible] onsite and remote resources.

టెండర్ పత్రం ప్రైవేటు సంస్థ రూపొందించినట్లుగా నిరూపిస్తున్న ఈ-ప్రొక్యూర్మెంట్ పోర్టల్

ఇందుకోసం రాష్ట్రంలోని ఓ మంత్రి పేరును వాడుకుంటున్నాడని చెబుతున్నారు. ప్రస్తుతం ఆ మంత్రి చెప్పిందే అన్ని శాఖల్లో జరుగుతోంది. దీంతో ఆయన తాలూకా అని చెబుతున్న ప్రైవేటు వ్యక్తికి అధికారులు అంతే విలువ ఇస్తున్నారు. ఈ ఒక్క డిస్కంలోనే కాదు, మిగిలిన రెండు డిస్కంలలోనూ ఓ ప్రైవేట్ సంస్థ ప్రతినిధులే పెత్తనం చెలాయిస్తున్నారు. టెండర్ల తయారీ, ఒప్పంద పత్రాలను రూపొందించడం వంటివి ఈ సంస్థ చేతుల మీదుగానే జరుగుతోంది. దీనికి చెందిన ‘చౌదరి’ అనే వ్యక్తి వివిధ శాఖల్లో లాబీయింగ్ చేస్తూ పారిశ్రామికవేత్తలు, డిస్కంల ఉన్నతాధికారుల మధ్య వారధిగా వ్యవహరిస్తున్నారని సమాచారం. కొన్ని సందర్భాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేలా ఉన్నతాధికారులను ఒత్తిడి చేస్తున్నాడని విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు అనుకూలంగా టెండర్లు విడుదల చేయించేందుకు యత్నించడం, అది జరగకపోతే బదిలీ చేయిస్తామని బెదిరించడం అతడికి పరిపాటిగా మారిందని డిస్కం వర్గాలు అంటున్నాయి.

విజిలెన్స్ వెన్నువిరిచి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ సంస్థల్లో అక్రమాలను, అవినీతిని పసిగట్టి చర్యలు తీసుకునే ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగాన్ని నిర్వీర్యం చేసింది. మొక్కుబడి విభాగంగా మార్చేసింది. ఇప్పటికీ ఆ శాఖకు రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారి లేరు. ఒకవేళ విజిలెన్స్ ఉండి ఉంటే... చౌదరి వ్యవహారంపై దృష్టిసారించి ఉండేవారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆయన ఓ బ్యాంకు ఐటీ మాజీ ఉద్యోగి

గతంలో చౌదరి ఓ బ్యాంకు ఐటీ విభాగంలో పనిచేశాడని, అవినీతి ఆరోపణల వల్ల తొలగించారని సమాచారం. ప్రస్తుతం విద్యుత్‌తో పాటు అనేక శాఖల్లో పెత్తనం చెలాయిస్తున్నాడు. ప్రైవేటు సంస్థకు చెందిన చౌదరి తెలంగాణలో ఉంటూ, ఏపీ డిస్కంలపై అజమాయిషీ చేస్తున్నాడు. రూ.50 లక్షల కాంట్రాక్టు నుంచి రూ.100 కోట్లపైగా ప్రతిదీ ఆయన కనుసన్నల్లోనే జరుగుతోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

అక్కడే అన్ని వ్యవహారాలు

కొందరు ప్రముఖులు, బడా బాబులతో హైదరాబాద్‌లో చౌదరి సమావేశమవుతాడని, అక్కడే వివిధ కంపెనీల ప్రతినిధులతో ఒప్పందాలపై చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఇటీవల ఓ సంస్థతో చౌదరి నివాసంలోనే ఒప్పందం కుదుర్చుకుందని, ఆ టెండర్ పత్రాలనూ డిస్కం సిబ్బంది కాకుండా చౌదరి స్వయంగా రూపొందించాడనే ఆరోపణలున్నాయి. టెండర్ పత్రం పూర్తిగా ప్రైవేటు సంస్థకు అనుకూలంగా, ఇతర పోటీదారులు పాల్గొనే అవకాశం లేకుండా రూపొందించారని, దీనిలో కొందరు అధికారులు, చౌదరి బాగా నే లాభపడ్డారని సమాచారం. తాజాగా ఓ డిస్కంలో డిజాస్టర్ రికవరీ ప్రాజెక్టుకు టెండర్ విడుదలైంది. దానినీ చౌదరి వ్యక్తులే రూపొందించారని తెలిసింది. ఈ-ప్రొక్యూర్మెంట్ పోర్టల్‌లో పెట్టిన టెండర్ డాక్యుమెంట్ ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోంది.

● నివాళి

"జన్మనిచ్చిన తల్లిదండ్రులను వదిలేసి
యుగధర్మమిది అంటూ జగమేలబోతారు.
అమ్మనాన్నలు కాస్త అన్నమడిగితే చాలు
కన్నబిడ్డలె రోజు కన్నెర్ర చేస్తారు.
అరె ముసలితనమది ముసిరి
ఉసురుదీస్తూ ఉంటే
పిసరంత దయలేక కసిరి ఛీ కొడతారు.
మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు"...
- అందెశ్రీ

'మాయమై పోతున్నడమ్మా మనిషి'...
అని మనిషి కోసం వెతుకులాడినా
'కొమ్మ చెక్కితే బొమ్మరా అది కొలిచి మొక్కితే అమ్మరా'...
అని ప్రకృతిని ఆరాధించినా
'జయజయహే తెలంగాణ' అని తెలంగాణ తల్లికి
జ్యోతలు అర్పించినా అందెశ్రీకే సాధ్యం.
జనజీవన గాథలను పాటగా మలచిన
అమర కవి అందెశ్రీకి నివాళి...

బతుకును గానం చేసిన కవి

పాటల మాగాణంగా వాసికెక్కిన తెలంగాణలో ఒక ధిక్కార గొంతుక అందెశ్రీ. అక్షరాలు రాని దశ నుండి ఒక రాష్ట్రానికి రాష్ట్ర గీతం అందించే దశకు ఎదిగిన కవి ఆయన. తెలంగాణ నేలన వందలాదిమంది పాటకవులు ఉన్నారు. అందరూ తమ తమ స్వ జనస్థాయుల్లో కృషి చేశారు. కాని వారిలో అందెశ్రీ తనదైన శైలితో కోట్లాది హృదయాలను గెలుచుకున్నాడు. చదవడం, రాయడం రాకముందే పాటలు అల్లి పాడడం మొదలు పెట్టిన ఆయనది జానపదుల శైలి. ఆ శైలినే మొదట కొనసాగించాడు. తర్వాత తనకు తెలిసిన జీవితాన్ని పాటల్లోకి ఒంపుతూ వెళ్లాడు. అట్లా ఆయన పాటల నిండా తనదైన ముద్ర పరుచుకుని ఉంది.

అందెశ్రీ పాటల్లో సామాజిక సమస్యల మీద రాసిన పాటలది సగపాలు. తెలంగాణ ఉద్యమం మీద రాసిన పాటలది సగపాలు. సామాజిక సమస్యల మీద అందెశ్రీ రచించిన పాటల్లో పల్లెతనం ఆవహించుకుని ఉంటుంది. పల్లె బతుకును పాటగా అల్లడం ద్వారా ఆయన ఈ మట్టి మీద, మనుషుల మీద తనకున్న ఎడతెగని ప్రేమ, మమకారాన్ని అక్షరాల్లో చూపిస్తాడు. పూర్వ వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తిలో జన్మించిన అందెశ్రీకి పల్లెను పట్టుకోవడంలో తనదైన దృష్టి ఉంది. తెలంగాణ పల్లెల్లో ఉండే మానవ సంబంధాలను అర్థం చేసుకుని తనకున్న దళిత జీవిత అస్తిత్వం నుండి వాటిని పాటలుగా మలిచాడు. తాను రాసిన 'సూడా సక్కాని తల్లి, సుక్కల్లో జాబిల్లి' పాటలో పల్లెల్లో కులవృత్తుల భాగస్వామ్యాన్ని గానం చేశాడు. సబ్బండ కులాలు ఎట్లా గ్రామ స్వరాజ్యంలో పాలుపంచుకుంటాయో వర్ణించాడు. చేతివృత్తులకు శిరస్సు వంచి నమస్కరించాడు. అలాంటి చేతి వృత్తులు గ్లోబలైజేషన్ నేపథ్యంలో విధ్వంసానికి గురైనప్పుడు ఆయనే 'కొమ్మ చెక్కితే బొమ్మరా...అది కొలిచి మొక్కితే అమ్మరా...' అంటూ ధిక్కారాన్ని పలికించాడు. అంతర్జాతీయ కుట్రలను ఎండగట్టాడు.

'భాష మీద దాడి చేసిరి
బతుకు మీద దాడి చేసిరి
తరతరాలుగా భరతజాతిని బహువిధాలుగ బాధపెడితిరి
ఎవరి నమ్మకాలు వారివి
ఎక్కిరించే హక్కులెకడివి?
అగ్గికి చెదలెట్ల పడుతది?
నిగ్గదీసి అడుగుతున్నా'అంటూ నిలదీశాడు.

తెలంగాణ గ్రామాల్లో ఉండే వెనుకబడిన కులాల జీవనం మీద కూడా అందెశ్రీ పాటలు రాశాడు.

'తలమీద సుట్టా బట్టా
ఆ పైనా పంద్లా తట్టా
పంద్లు పంద్లోయని
పల్లెంత తిరుగుకుంటూ
బజార్ల కూసోనమ్మిబతుకెళ్ల
దీసుకున్నా'అంటూ 'తెనుగోల్ల ఎల్లమ్మ' బతుకును పాటల్లో అద్భుతంగా చిత్రించాడు అందెశ్రీ.

ఇక మాదిగల సాంస్కృతిక జీవనంలో భాగమైన డప్పు పాత్రను అత్యద్భుతంగా వర్ణించాడు.

'మాదిగయ్యల మేథ నుండి
పురుడు పోసుకున్నది
మానవ జాతులను ఎపుడూ మేలు
కొలుపుతుంటది' అంటూ డప్పు ఇప్పటికీ గ్రామాల్లో పోషించే పాత్రను గొప్పగా ఆవిష్కరించాడు. డప్పు మీద అందెశ్రీ రాసిన ఈ పాట అత్యంత తాత్విక గాఢతను కలిగి ఉంది. 'ఊరిలో ఏ సావుకైనా ముందే ఉంటానంటది... ఏడుపెందుకు లోకమందున ఎవరు బతుకుతరంటది' అంటాడాయన ఆ పాటలో తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ రాసిన ఏ పాటకు ఆ పాటే ప్రత్యేకమైంది. 'సూడు తెలంగాణ సుక్కనీరు లేనిదానా'అంటూ తెలంగాణ అరవయేండ్ల దు:ఖానికి గొంతుకను ఇచ్చి మోసినవాడు అందెశ్రీ. అలాగే ఉద్యమ కాలంలో 'జై బోలో తెలంగాణ...' అంటూ తాను రాసిన పాట తెలంగాణ ప్రజానీకాన్ని ఉర్రూత లూగించింది. అందెశ్రీ రాసిన తెలంగాణ పాటల్లో తలమానికమైంది 'జయజయహే తెలంగాణ...' పాట. ఈ పాట తెలంగాణ ఉద్యమ కాలంలోనే ప్రజలే దీనిని రాష్ట్ర గీతంగా భావించారు. స్కూళ్లు, ఆఫీసుల్లో ఈ పాటను పాడుకుని దిన చర్యను ప్రారంభించారు. అట్లా తెలంగాణ వచ్చిన పదేళ్ల తరువాత అధికారికంగా ఇదే గీతాన్ని రాష్ట్ర గీతంగా తెలంగాణ సర్కార్ ప్రకటించింది. ఈ పాట నుండి తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఎలుగెత్తి చాటాడు అందెశ్రీ. ముఖ్యంగా ఇందులో వాడిన భాష పండిత భాష. బాగా చదువుకున్న పండితుల కంటే తాను ఏ మాత్రం తక్కువకాదని నిరూపించుకునేలా ఈ పాటలో పద ప్రయోగాలు చేశాడు.

అటు పల్లె పాటలైనా, ఇటు పండిత పాటలైన మెప్పించి, ఒప్పించగలిగే శక్తి ఆయన పాటలకే ఉందంటే అతిశయోక్తి కాదు. అందెశ్రీ రచించిన పాటల్లో ఎక్కువగా పాపులర్ అయిన పాటల్లో ఒకటి 'మాయమై పోతున్నడమ్మా... మనిషన్న వాడు' పాట. ఈ పాటలో అందెశ్రీ ఆధునిక కాలంలో మృగ్యమై పోతున్న మానవ విలువల మీద ఒక హెచ్చరిక లాంటి స్వరాన్ని వినిపించాడు. తాను జీవించిన కాలాన్ని పాటతో వెలిగించిన ఈ పాటల ప్రజాకవి, ధిక్కారమే తన చిరునామాగా జీవించాడు. పాట ఉన్నంత కాలం అందెశ్రీకి మరణం లేదు.

- డా. పసునూరి రవీందర్,
తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యులు

● ఆర్ట్ అండ్ కల్చర్

ఆరోజు ఆ అర్ధరాత్రి ఏం జరిగిందో తెలుసా?!

హేమాంగిని దత్ మజుందార్ పుస్తకాలలో స్త్రీ పాత్రలు బలంగా ఉంటాయి. పిల్లలు ఎంతో ఆసక్తిగా చదివేలా చేస్తాయి. ఆమె తాజా పుస్తకం స్క్రాచ్ అండ్ స్నిఫ్ క్రానికల్స్... బెంగాలీ అయిన హేమాంగిని మజుందార్ కోల్‌కతాతో పాటు ముంబై, న్యూయార్క్, ఆస్టిన్, బహ్రెయిన్‌లలో నివసించింది. ప్రస్తుతం సింగపూర్‌లో ఉంటుంది. బెంగాలీ వంటకాలతో పాటు ఎన్నో వంటకాలపై ఆమెకు అవగాహన ఉంది.



'నాకు ఒక ప్రదేశంలో ఆహారం సౌకర్యవంతంగా ఉంటే, ఆ ప్రదేశంలో నేను నిజంగా స్థిరపడ్డానని అనుకుంటాను. బెంగాలీ సంచారిగా ఆహారం అనేది నా మూలాలను, ఇంటిని గుర్తు తెస్తుంది. నేను ఏదైనా నగరాన్ని విడిచి వెళుతున్నప్పుడు ఇంట్లో కొంత భాగాన్ని వదిలి వెళుతున్నట్లు అనిపిస్తుంది' అంటుంది మజుందార్. ఆహారం అనేది ఆమె రచనాప్రక్రియలో భాగం అయింది. ఆహారపదార్థాలతో భావోద్వేగ బంధం ఆమెను పుస్తక రచనకు పురికొల్పింది. హేమాంగిని పుస్తకం చదివిన వాళ్లు...

'పుస్తకం చదివినట్లుగా లేదు. విందు ఆరగించినట్లుగా ఉంది' అంటారు చమత్కారంగా. వందల సంవత్సరాలు వెనక్కి వెళ్లి ఆ కాలాన్ని తన రచనల్లోకి తీసుకురావడం అంటే మజుందార్‌కు ఇష్టం. 'ది స్క్రాచ్ అండ్ స్నిఫ్ క్రానికల్స్' అలాంటి రచనే. చారిత్రాత్మక పట్టణం నేపథ్యంగా సాగే నవల. చందానగర్ అనేది ఒకప్పుడు కోల్‌కతా వెలుపల ఫ్రెంచ్ కాలనీగా ఉండేది. వోలీ ఛటర్జీ అనే మహిళ చందానగర్‌లో తన పూర్వీకులకు చెందిన ఎస్టేట్‌లో నివసించడానికి వెళుతుంది. అక్కడ ఒక అర్ధరాత్రి ఆమెకు వింత అనుభవాలు ఎదురవుతాయి.

వోలి తనకు ఉన్న ప్రత్యేక శక్తులతో ఇన్వెస్టిగేషన్ మొదలుపెడుతుంది. 'మహిళలు ఎదుర్కొంటున్న అదృశ్య యుద్ధాలు' అంశంపై 'ది స్క్రాచ్ అండ్ స్నిఫ్ క్రానికల్స్' రాసింది హేమాంగిని మజుందార్.

● మార్పు

వేటాడిన కళ్లే కాపాడుతున్నాయి!

ఒడిశాలోని మంగళజోడి అనే గ్రామం ఒకప్పుడు పక్షుల వేటకు ప్రసిద్ధి చెందింది. దేశ,విదేశాలకు చెందిన పక్షులను గ్రామస్తులు వేటాడేవారు. అలాంటి గ్రామం కాస్త పక్షుల స్వర్గధామంగా మారింది. బూడిద తల స్వాంప్‌హెన్, నల్ల రెక్కల స్టిల్ట్, ఎరుపు వాట్లేడ్ లాప్వింగ్, మీసపు టెర్న్, కార్మోరెంట్, ఐబిస్, చిన్న ఎగ్రెట్, ఉదా రంగు హెరాన్, నల్ల డ్రోంగో...ఇలా ఎన్నో పక్షులను వేటాడేవారు. ఈ పక్షుల మాంసం కోసం గ్రామం చుట్టు పక్కల ఎన్నో రెస్టారెంట్లు వెలిశాయి అంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవచ్చు. 'వైల్డ్ ఒడిషా' అనే స్వచ్ఛంద సంస్థ ఈ గ్రామంలో అడుగు పెట్టే వరకు పరిస్థితి భయానకంగానే ఉండేది. 'మాటలతో మార్పు తేవచ్చు' అని బలంగా నమ్మిన ఈ సంస్థకు మొదట ప్రతికూలత ఎదురైంది. ఆ తరువాత మాత్రం వేటగాళ్ల ఆలోచనల్లో మార్పు తీసుకురావడంలో విజయం సాధించింది. 'మేము వేటాడం. వేటాడనివ్వం' అని ప్రతినబూనరు గ్రామస్తులు. కట్ చేస్తే...మంగళజోడి అంటే భయపడే పక్షులు చాలా ఇష్టంగా ఆ ఊరుకు వస్తున్నాయి. మంగళజోడి అనేది పర్యాటక గ్రామంగా మారింది.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
నవంబర్ 10న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,22,910	1,24,220	1,23,220	1,25,750	1,22,600	1,24,470
బంగారం (22 క్యారెట్లు)	1,11,230	1,11,850	1,12,950	1,16,340	1,12,790	1,14,100
వెండి	1,55,000	1,51,600	1,67,000	1,54,100	1,54,500	1,67,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
విశాఖ కార్తె : నవంబర్ 6 నుంచి

17న జడ్చర్లలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

సుభాష్ పాలేకర్ ప్రకృతి సేద్య పద్ధతులపై మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలోని చంద్ర ఫంక్షన్ హాల్లో ఈ నెల 17న ఉదయం 10 గం. నుంచి సా. 4 గం. వరకు రైతులకు అవగాహన సదస్సు జరుగుతుంది. దేశీయ విత్తన ప్రాధాన్యత, మిరప, వరి, అరటి, పసుపు పంటల్లో మంచి దిగుబడి సాధించే ప్రకృతి సేద్య విధానాలపై పలువురు నిపుణులు శిక్షణ ఇస్తారు.

ముఖ్య వక్తలు: సేవ్ విజయరామ్, ప్రకృతివనం ప్రసాద్, చందూల్ కుమార్ రెడ్డి, ఐజా శ్రీనివాస్, అరటి రాంబాబు, రాజ వర్ధన్ రెడ్డి, గణపతి రెడ్డి శిక్షణ ఇస్తారు. ప్రవేశం ఉచితం, అందరూ ఆహ్వానితులే. వివరాలకు: 93935 67567, 98492 67486, 63091 11427.

4 వేల లీటర్ల పాల దిగుబడినిచ్చే 'ఫ్రైస్వాల్'!

హోల్‌స్టీన్ ఫ్రైసియన్, సాహివాల్ జాతుల కలయికతో రూపొందిన సంకరజాతి కొత్త ఆవుల జాతి 'ఫ్రైస్వాల్'. ఇప్పటికి ఉన్న గోజాతులన్నిటికన్నా అత్యధికంగా ఒక ఈత కాలంలో 4 వేల కిలోల పాల దిగుబడినివ్వటం దీని ప్రత్యేకత. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్)కు అనుబంధంగా మీరట్‌లోని కేంద్రీయ పశు పరిశోధనా సంస్థ (సీఐఆర్‌సీ) మిలటరీ ఫామ్స్ సర్వీస్ సంయుక్తంగా ఈ కొత్త పాడి పశుజాతిని రూపొందించాయి. ఇందులో హెచ్.ఎఫ్. గుణాలు 62.5%, సాహివాల్ గుణాలు 37.5% ఉంటాయి. అధిక పాల దిగుబడినిచ్చే హెచ్.ఎఫ్. గుణాలతో పాటు దేశంలోని వివిధ వ్యవసాయ వాతావరణ పరిస్థితులకు తట్టుకొని మంచి ఫలితాలను ఇవ్వగలిగిన దేశీ గోజాతి సాహివాల్ లక్షణాలను ఫ్రైస్వాల్ పుణికిపుచ్చుకుంది. ఈనిన తర్వాత 300 రోజుల్లో 4% కొవ్వు కలిగిన 4 వేల కిలోల పాల దిగుబడిని ఫ్రైస్వాల్ ఆవు ఇస్తుందని ఐసీఏఆర్ ప్రకటించింది. పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచే లక్ష్యంతో ఫ్రైస్వాల్ జాతి అభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా 42 మిలటరీ ఫామ్స్‌లో పరిశోధనలు జరిగాయి. సైనికులకు మేలైన పాలను అందించేందుకు దేశవ్యాప్తంగా ఏర్పాటైన మిలటరీ డెయిరీ ఫామ్స్ సరికొత్త సంకరజాతి గోజాతుల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాయి. కొత్త పశు జాతిని అభివృద్ధి చెయ్యటం కోసం శాస్త్రవేత్తలు సుమారు 4 దశాబ్దాల పాటు శ్రమించారు. 1984 సెప్టెంబర్ 4న ప్రారంభమైన ఫ్రైస్వాల్ పరిశోధనలు కొద్ది నెలల క్రితమే పూర్తయ్యాయి. ఈ పరిశోధన ప్రాజెక్టు కోసం రూ. 800 కోట్లు ఖర్చయ్యాయి. ఈ బ్రీడ్ ఆవులు తెలుగు రాష్ట్రాలకు కొత్త కాదు. చాలా సంవత్సరాల నుంచి 'హెచ్ఎఫ్ సాహివాల్' అనే పేరుతో ఈ ఆవులు రైతులకు అందుబాటులో వున్నాయి. అయితే ఈ బ్రీడ్‌కు కొత్తగా 'ఫ్రైస్వాల్' అని పేరును ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.

పుంగనూరు జాతి పశువులతో ప్రధాని నరేంద్ర మోదీ (ఫైల్)

పొట్టి ఆవులు గట్టి మేలు!

ఆరోగ్యదాయకమైన ఏ2 పాల ఉత్పత్తులకు, సంప్రదాయ మిఠాయిలకు నగర వినియోగదారుల్లో పెరుగుతున్న ఆదరణ

నగర పరిసరాల్లో చిన్న, సన్నకారు రైతులకు దేశీ పొట్టి ఆవుల పెంపకంతో ప్రయోజనాలెన్నో

దేశీ పొట్టి గోజాతులపై మరింత లోతైన పరిశోధనలతో మరింత ప్రయోజనం ఉంటుందంటున్న నిపుణులు

మన వ్యవసాయంలో కీలకమైనది పశువుల పెంపకం. అనాది కాలం నుంచి సామాజిక-ఆర్థిక చట్రంలో ఇది అంతర్భాగం. దేశీ ఆవుల్లో విశిష్టమైనవి పొట్టి ఆవులు. వేచూర్, కాసరగోడ్ డ్వార్ఫ్, పుంగనూర్, నదిపతి, మల్నాడ్ గిడ్డ వంటి మినియేచర్ ఆవులకు తక్కువ మేతే సరిపోతుంది. పోషకాలతో పాటు ఔషధ విలువలు కలిగిన పాలను ఇస్తాయి. ప్రతికూల వాతావరణాల్లో చక్కటి ఫలితాలనిచ్చే సామర్థ్యం వీటి సొంతం. సంకరజాతులు, విదేశీ గోజాతులతో పోల్చినప్పుడు పొట్టి ఆవుల పాలకు మెరుగైన జీర్ణశక్తి, వ్యాధి నిరోధకత ఉన్నాయని చెబుతారు. ఈ సుగుణాల కారణంగా నగర పరిసర ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు పాడి రైతులకు ఇవి ఎంతో అనువైనవి. స్థానికులకు ఆహార భద్రత, ఉపాధి, ఆదాయాన్నిచ్చే భారతీయ పొట్టి గోజాతులపై లోతైన పరిశీలన..

ప్రపంచంలోనే అత్యధిక పాల ఉత్పత్తిదారైన మన దేశంలో ఏటా 23 కోట్ల టన్నులకు పైగా పాలు ఉత్పత్తి అవుతున్నాయి. అయితే, మన దేశంలో పాడి పరిశ్రమ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. దాణా ధర పెరుగుదల.. పశుగ్రాసం కొరత.. పాడి పశువుల ఆరోగ్యం, సంతానోత్పత్తి, ఉత్పాదకతలపై వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావం.. పెద్ద విస్తీర్ణంలో భూమి అవసరం కావటం.. ప్రత్యేక సుగుణాలున్న పాల ఉత్పత్తులపై వినియోగదారుల ఆసక్తి పెరుగుతుండటం.. ఈ సవాళ్లలో ముఖ్యమైనవి. సంకరజాతి, విదేశీ జాతుల ఆవులు అధిక దిగుబడినిచ్చేవి అయినప్పటికీ, చిన్న రైతులు వాటిని అరకొర వనరులతో పెంచేటప్పుడు ఎక్కువగా వేడి ఒత్తిడికి, రుగ్మతలకు గురవుతుంటాయి.

అయితే, దేశీ పొట్టి ఆవుల పెంపకంతో ఈ సవాళ్లన్నిటినీ చిన్న రైతులు అధిగమించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులకు అనుగుణమైన ఆరోగ్యకరమైన, స్థానిక దేశీ పాడి ఉత్పత్తులను ఇష్టపడే రైతులు, వినియోగదారులకు దేశీ పొట్టి ఆవులు ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి. చిన్న డెయిరీ రైతులకు పొట్టి దేశీ ఆవుల పెంపకం అనేక విధాలుగా ఉపయోగకరమని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

పుంగనూరు: పొట్టి గో జాతుల్లో ప్రత్యేకమైనది పుంగనూరు. ఈ ఆవుల ఎత్తు 70–90 సెంటీమీటర్లు. ఇవి ఆంధ్రప్రదేశ్‌లోని కరువు పీడిత చిత్తూరు జిల్లాకు బాగా అనుకూలంగా ఉంటాయి. పాలలో అసాధారణంగా అధిక కొవ్వు (8%) ఉంటుంది. రోజుకు 3–5 లీటర్ల దిగుబడినిస్తాయి. మెరుగైన నాణ్యతతో కూడిన నెయ్యి, కోవా తయారీకి ఈ పాలు ఉపయోగిస్తాయని జాతీయ పశు వనరుల బోర్డు తెలిపింది. అంతరించే ముప్పును ఎదుర్కొంటున్న ఈ జాతి ఆవులు చాలా తక్కువ సంఖ్యలోనే ఉన్నాయి. అయితే, పరిరక్షణకు కృషి జరుగుతోంది.

నదిపతి నానో : ఆంధ్రప్రదేశ్ గోశాలల్లో కనిపించే నదిపతి నానో ఆవు ఎత్తు 60సెం.మీ.లోపే! రోజుకు అర లీ. నుంచి ఒకలీటరు పాల దిగుబడి. కొవ్వు 4–5%. ప్రొటీన్ ఎక్కువ.

దేశీ పొట్టి ఆవులతో ఉపయోగాలేంటి?

- భారతీయ దేశీ ఆవుల పాలలో ఏ2 బీ కెసీన్ ఉంటుంది. అందువల్ల, పాలు మెరుగ్గా జీర్ణం కావాలని, కడుపులో అసౌకర్యం ఉండదని ఆశించే వినియోగదారులకు ఈ పాలు నచ్చుతాయి. ఈ గుణం మార్కెటింగ్‌లో ఉపయోగకరం.
- ఫ్రీరాడికల్స్‌ను నిర్మూలించే గుణం హోల్‌స్టీన్–ఫ్రీసియన్ సంకరజాతి ఆవు పాలలో కన్నా వేచూర్, కాసర్‌గోడ్ డ్వార్ఫ్ వంటి పొట్టి ఆవు పాలలో ఎక్కువని పరిశోధనల్లో తేలింది. బయోయాక్టివ్ పెప్టైడ్లు, యాంటీఆక్సిడెంట్ విటమిన్లు ఎక్కువగా ఉండటమే అందుకు కారణం. ఔషధ గుణాలున్న పాల ఉత్పత్తులను కోరుకునే మార్కెట్లలో విక్రయానికి ఈ గుణం ఉపయోగకరం.
- వెచూర్, కాసర్‌గోడ్ డ్వార్ఫ్ ఆవుల పాలల్లో ఈ-కోలి, సాల్మొనెల్లా వంటి క్రిములను అరికట్టే గుణాలు ఉన్నట్లు పరిశోధనల్లో వెల్లడైంది. పెరుగు ఉత్పత్తికి, ప్రోబయోటిక్ రిచ్ దేశీ పాల ఉత్పత్తుల తయారీకి ఈ గుణం ఉపయోగపడుతుంది.
- పొట్టి ఆవుల బరువు తక్కువ కావటం వల్ల అధిక ఉష్ణోగ్రతను మెరుగ్గా తట్టుకోగలుగుతున్నాయి.
- తక్కువ నాణ్యమైన గడ్డిని తిని మెరుగ్గా జీర్ణం చేసుకోగల శక్తి కాసర్‌గోడ్ పొట్టి ఆవులకు ఉందని పరిశోధనల్లో తేలింది. కరువు పీడిత పేద రైతులు కూడా దేశీ ఆవులను పెంచుకోగలగటానికి ఇదే కారణం.
- సంకరజాతి ఆవులతో పోల్చినప్పుడు దేశీ ఆవులు చిన్న రైతులకు అనువైనవి. తక్కువ మేత అవసరం, ఎక్కువ రోగనిరోధకశక్తి, తక్కువ వైద్య ఖర్చుల వల్ల అధిక లాభం వస్తుంది.
- ఏ2 నెయ్యి, ప్రొబయోటిక్ యోగర్ట్, సంప్రదాయ మిఠాయిలు వంటి ఔషధ గుణాలున్న సాంప్రదాయ ఆహారోత్పత్తులకు నగర ప్రాంతాల్లో గిరాకీ ఎక్కువగా ఉందని ఎఫ్ఎస్ఎస్ఏఐ అధ్యయనంలో తేలింది. అత్యధికంగా 8% కొవ్వు గల పుంగనూరు ఆవు పాలు, యాంటీఆక్సిడెంట్లుండే వెచూర్, కాసర్‌గోడ్ డ్వార్ఫ్ గోజాతుల పాలకు వాణిజ్యపరమైన విలువ ఉంది.
- వాతావరణంలో వేడి, మేత కొరత వంటి ప్రధాన సమస్యలను అధిగమించడానికి దోహదపడే గొప్ప సంపదగా దేశీ పొట్టి గోజాతులు. పర్యావరణ అనుకూల / సేంద్రియ పాడి పరిశ్రమ అభివృద్ధికి ఈ గోజాతులు ఉపకరిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ దిశగా ప్రభుత్వం వాల్యూచెయిన్ పైలట్ ప్రాజెక్టుల ద్వారా అధ్యయనాలు చేపట్టాల్సి ఉంది.
- అయితే, పరిశోధనలు మరింత లోతుగా జరగాల్సి ఉంది. దేశీ గోజాతులు, పొట్టి ఆవులు వివిధ రకాల మేపులతో సాధించే పాల దిగుబడిపై విస్తృత అధ్యయనాలు జరగాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఎవరేమి చెయ్యాలి?

- చిన్న రైతులు తమకున్న పరిమిత భూకమతాలు, పరిమిత వనరుల దృష్ట్యా దేశీ పొట్టి ఆవులను పెంచుకోవటం మేలు. ఇవి తక్కువ పాలు ఇచ్చినప్పటికీ అధిక ఆదాయాన్ని ఇవ్వగలుగుతాయని గుర్తించాలి.
- సహకార సంఘాలు వారసత్వ సంపదైన దేశీ పొట్టి ఆవుల పాలు, నెయ్యిని గ్రామాల్లో సేకరించి, బ్రాండింగ్ వ్యూహాలతో విక్రయాలు పెంచాలి.
- పాలకులు దేశీ పొట్టి గోజాతుల జన్యు అభివృద్ధికి, మార్కెటింగ్ సదుపాయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. జాతుల పరిరక్షణకు, లాభదాయకతకు దోహదమవుతుంది.
- పరిశోధకులు ప్రతి దేశీ పొట్టి గోజాతులకు సంబంధించి ప్రత్యేక ప్రయోజనాలతో కూడిన ఆహారోత్పత్తుల అభివృద్ధి, వాటి ద్వారా చేకూరే ఆరోగ్య ప్రయోజనాలపై పరిశోధనలు చెయ్యాలి.
- ఈ చర్యల ద్వారా దేశీ పొట్టి గోజాతుల పరిరక్షణతో పాటు పర్యావరణహితమైన, ఆరోగ్యదాయకమైన రీతిలో పాడి పరిశ్రమకు సరికొత్త భాష్యం చెప్పినట్లు అవుతుంది. ఆదాయం,ఆరోగ్యంతోపాటు భారతీయ సంప్రదాయ పశు సంపదకు ఇది గౌరవాన్ని కూడా పెంచుతుందని కేరళ వెటర్నరీ యానిమల్ సైన్సెస్ యూనివర్సిటీ పరిశోధకురాలు దీప్తి అంటున్నారు.

కాసరగోడ్ డ్వార్ఫ్: ఇది 96–107 సెం.మీ. ఎత్తుండే కేరళ గోజాతి. కోస్తా వాతావరణానికి అనువైనది. అణకువగా ఉంటుంది. పాల దిగుబడి రోజుకు 1.2–1.5 లీటర్లు. ప్రొటీన్ 3.8%. కొవ్వు 4–4.5%. వేచూర్ పాలలో కన్నా ఈ పాలలో ఎక్కువ యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయని నిరూపితమైంది.

వేచూర్: కేరళ దేశీ పశుజాతుల సుసంపన్న వారసత్వానికి వేచూర్ నిదర్శనం. ప్రపంచంలోనే అతి చిన్న పశు జాతుల్లో ఒకటిగా (87–90 సెం.మీ. ఎత్తు) ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) గుర్తించింది. వేచూర్ జాతి పొట్టి ఆవులకు అధిక వేడిని తట్టుకునే శక్తి ఉంది. పాల దిగుబడి రోజుకు 2–3 లీటర్లు. పాలలో 4.5–5.5% కొవ్వుతో పాటు ఘనపదార్థాలు ఎక్కువ. నెయ్యి, ప్రోబయోటిక్ పెరుగు, సాంప్రదాయ మిఠాయిలు వంటి ప్రీమియం ఉత్పత్తుల తయారీకి ఈ పాలు అనువైనవి. ఈ–కోలి, సాల్మొనెల్లా వంటి క్రిములను నియంత్రించే యాంటీ బాక్టీరియల్ శక్తి కూడా ఈ పాలలో ఉందని నిరూపితమైంది.

మల్నాడ్ గిడ్డ: కర్ణాటకకు చెందిన మల్నాడ్ గిడ్డ ఆవు 90 సెం.మీ. ఎత్తుంటుంది. కొండ కోనల్లో తిరిగి రకరకాల గడ్డి మేయటం దీనికి ఇష్టం. ఫ్రీ రేంజ్ ఆవు పాలలో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, బయోయాక్టివ్ మెటబొలైట్లు ఎక్కువ. పరాన్నజీవులు, గాలికుంటు వ్యాధికి నిరోధకత కలిగి ఉంటుంది.

ఫైనల్లో జ్యోతి సురేఖ బృందం

ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్ మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో... పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో భారత జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఈ టోర్నీ జరుగుతోంది. సోమవారం జరిగిన మహిళల కాంపౌండ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, దీప్షిక, ప్రీతికలతో కూడిన భారత జట్టు సెమీఫైనల్లో 234-227 పాయింట్ల తేడాతో బోనా అక్తర్, కుల్సుమ్ అక్తర్, పుష్పిత జమాన్‌లతో కూడిన బంగ్లాదేశ్ జట్టును ఓడించింది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో భారత్ 235-225తో వియత్నాం జట్టుపై గెలిచింది. గురువారం జరిగే ఫైనల్లో దక్షిణ కొరియాతో భారత్ తలపడుతుంది. మరో వైపు అతాను దాస్, యశ్‌దీప్, రాహుల్‌లతో కూడిన భారత పురుషుల రికర్వ్ జట్టు సెమీఫైనల్లో 5-3 (54-52, 58-58, 54-56, 57-52) సెట్‌ల తేడాతో ఇల్ఫాత్, దాస్తాన్, యెరెమెంకోలతో కూడిన కజకిస్తాన్ జట్టుపై గెలిచింది. అంతకు ముందు తొలి రౌండ్‌లో భారత్ 6-2తో తుర్క్‌మెనిస్తాన్ జట్టుపై, క్వార్టర్ ఫైనల్లో 6-0తో మలేసియాపై విజయం సాధించింది. గురువారం జరిగే ఫైనల్లో దక్షిణ కొరియాతో టీమిండియా ఆడుతుంది. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత ఆర్చర్లు బొమ్మదేవర ధీరజ్, అతాను దాస్, రాహుల్, యశ్‌దీప్ మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

కరణ్

అభిషేక్

తమిళనాడుపై ఆంధ్ర పైచేయి

రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో నాలుగు వికెట్ల తేడాతో విజయం

తిప్పేసిన సౌరభ్, విజయ్ ● అభిషేక్ రెడ్డి, కరణ్ అర్ధ సెంచరీలు

సాక్షి, విశాఖపట్నం: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో పటిష్టమైన తమిళనాడు జట్టుపై తమ అజేయ రికార్డును ఆంధ్ర జట్టు నిలబెట్టుకుంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా తమిళనాడుతో జరిగిన జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. ఈ సీజన్‌లో ఆంధ్ర జట్టుకిది వరుసగా రెండో విజయం కావడం విశేషం. రంజీ ట్రోఫీలో ఆంధ్ర, తమిళనాడు జట్లు ఎనిమిదిసార్లు ముఖాముఖిగా తలపడ్డాయి. నాలుగు మ్యాచ్‌ల్లో ఆంధ్ర నెగ్గగా... మరో నాలుగు మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి. తమిళనాడుతో పోరులో మొదట ఆంధ్ర బౌలర్లు, లక్ష్యఛేదనలో బ్యాటర్లు సత్తా చాటారు. సోమవారం ఆటలో 7 వికెట్లు పడగొట్టిన ఆంధ్ర... బ్యాటింగ్‌లో 201 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి మూడే రోజుల్లో మ్యాచ్‌ను ముగించింది. ఓవర్‌నైట్ స్కోరు 102/3తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన తమిళనాడు 70.3 ఓవర్లలో 195 పరుగులకే కుప్పకూలింది. సౌరభ్ (4/46), విజయ్ (2/16), పృథ్వీరాజ్ (2/31) తమిళనాడును దెబ్బ కొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో 5 పరుగుల ఆధిక్యం ఉన్న తమిళనాడు జట్టు... ఆంధ్ర ముందు 201 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీన్ని ఛేదించేందుకు రెండో ఇన్నింగ్స్ ఆడిన ఆంధ్ర 41.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసింది. అభిషేక్ రెడ్డి (70; 11 ఫోర్లు), కరణ్ షిండే (51; 8 ఫోర్లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. ఆంధ్ర స్వల్ప వ్యవధిలో 4 వికెట్లను కోల్పోయినా... అశ్విన్ హెబ్బర్ (21 నాటౌట్; 2 ఫోర్లు), సత్యనారాయణ రాజు (20 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. ఈ నెల 16 నుంచి జంషెడ్‌పూర్‌లో జరిగే తదుపరి మ్యాచ్‌లో జార్ఖండ్‌తో ఆంధ్ర ఆడుతుంది.

భారత్ గురి బంగారం

- 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో భారత్‌కు రెండు స్వర్ణాలు
- సామ్రాట్, వరుణ్, శ్రవణ్ బృందానికి పసిడి పతకం
- వ్యక్తిగత విభాగంలో స్వర్ణం గెలిచిన సామ్రాట్ రాణా
- వరుణ్ తోమర్ ఖాతాలో కాంస్య పతకం

పతకాలతో వరుణ్, సామ్రాట్, శ్రవణ్

కైరో: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మూడో రోజు భారత షూటర్లు అదరగొట్టారు. రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యంతో కలిపి మొత్తం నాలుగు పతకాలు సాధించారు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో భారత్‌కు మొత్తం మూడు పతకాలు లభించాయి. ముందుగా టీమ్ విభాగంలో సామ్రాట్ రాణా, వరుణ్ తోమర్, శ్రవణ్ కుమార్‌లతో కూడిన భారత బృందం 1754 పాయింట్లతో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. క్వాలిఫయింగ్‌లో సామ్రాట్ రాణా 586 పాయింట్లు, వరుణ్ తోమర్ 586 పాయింట్లు, శ్రవణ్ 582 పాయింట్లు స్కోరు చేశారు. 10 పాయింట్ల షాట్‌లను వరుణ్‌తో (26) పోలిస్తే ఒక్క షాట్ ఎక్కువ కొట్టడంతో సామ్రాట్ (27)కు క్వాలిఫయింగ్‌లో టాప్ ర్యాంక్ దక్కింది. వరుణ్‌కు రెండో స్థానం లభించింది. వీరిద్దరితో పాటు మరో ఆరుగురు షూటర్లు ఫైనల్‌కు అర్హత సాధించారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సామ్రాట్ 243.7 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచి బంగారు పతకాన్ని గెలిచాడు. హు కాయ్ (చైనా; 243.3 పాయింట్లు) రజత పతకం సాధించగా... వరుణ్ తోమర్ (భారత్; 221.7 పాయింట్లు) కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు.

ఇషా బృందానికి రజతం

మరోవైపు మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్, పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గిన మనూ భాకర్, ప్రస్తుత ప్రపంచ నంబర్‌వన్ సురుచి సింగ్‌లతో కూడిన భారత జట్టు టీమ్ విభాగంలో 1740 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెల్చుకుంది. క్వాలిఫయింగ్‌లో ఇషా సింగ్ 583 పాయింట్లు, మనూ భాకర్ 580 పాయింట్లు, సురుచి 577 పాయింట్లు స్కోరు చేశారు. క్వాలిఫయింగ్‌లో ఇషా నాలుగో స్థానంలో, మను ఆరో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకోగా... సురుచి 14వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు దూరమైంది. వ్యక్తిగత విభాగంలో మాత్రం ఇషా, మనూ భాకర్‌లకు నిరాశ ఎదురైంది. వీరిద్దరు పతకాలు నెగ్గలేకపోయారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో ఇషా 159.2 పాయింట్లతో ఆరో స్థానంలో, మనూ 139.5 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచి పతకానికి దూరమయ్యారు. మూడో రోజు పోటీలు ముగిశాక భారత్ 3 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి 9 పతకాలతో రెండో స్థానంలో ఉంది.

రజత పతకాలతో మను, ఇషా, సురుచి

తొమ్మిదేళ్లకే...

జాతీయ కార్టింగ్ చాంపియన్‌గా అర్షి

న్యూఢిల్లీ: జాతీయ కార్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఢిల్లీకి చెందిన 9 ఏళ్ల అర్షి గుప్తా విజేతగా నిలిచింది. తద్వారా ఈ టైటిల్ అందుకున్న తొలి అమ్మాయిగా కొత్త ఘనత సాధించింది. బెంగళూరులో జరిగిన ఈ పోటీల్లో మిక్స్‌డ్ గ్రిడ్ మైక్రో మ్యాక్స్ క్లాస్‌లో అర్షి పోటీ పడింది. 8-12 ఏళ్ల వయసు ఉన్న రేసర్ల కోసం జరిగిన మైక్రో మ్యాక్స్ క్లాస్‌లో ఆమె ప్రిఫైనల్, ఫైనల్ రేస్‌లలో గెలిచింది. నేషనల్ కార్టింగ్ లైసెన్స్ పొందిన అత్యంత పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందిన అర్షి ఏడాది క్రితమే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం ప్రారంభించింది. నిలకడగా రాణిస్తూ మద్రాస్ ఇంటర్నేషనల్ కార్టింగ్ రౌండ్ 3లో విజయం, ఆ తర్వాత కోయంబత్తూర్‌లో డబుల్ సాధించింది. సెప్టెంబర్‌లో శ్రీలంకలో జరిగిన ఆసియా పసిఫిక్ మోటార్‌స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో కూడా నాలుగో స్థానంలో నిలిచింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'మన ఫిట్‌నెస్ ఇంకా మెరుగవ్వాలి'

- జట్టులో ఏడెనిమిది మంది ఆల్‌రౌండర్లు ఉండాలి
- టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఫిట్‌నెస్ స్థాయి పరంగా చూస్తే భారత జట్టు ఇంకా ఎంతో దూరం ప్రయాణించాల్సి ఉందని, మన టీమ్ ఈ విషయంలో అత్యుత్తమ స్థాయిని అందుకోలేదని భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వ్యాఖ్యానించాడు. 'టి20 ప్రపంచకప్‌లో ఇది చాలా కీలకంగా మారుతుంది. మనం చాలా చురుగ్గా ఉండాలి, ఇదే విషయాన్ని ఆటగాళ్లతో చర్చించాం కూడా. డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లంతా నిజాయితీగా తమ అభిప్రాయాలు చెప్పారు. ఎంత ఫిట్‌గా మానసికంగా అంతే చురుగ్గా ఉంటాం. ఎందుకంటే తీవ్ర ఒత్తిడి ఉండే మ్యాచ్‌లో మానసికంగా కూడా ప్రశాంతంగా ఉండేందుకు ఇది కూడా అవసరం. వరల్డ్ కప్‌కు ముందు అలాంటి స్థాయిని అందుకునేందుకు మనకు ఇంకా మూడు నెలల సమయం ఉంది' అని గంభీర్ అన్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై టి20 సిరీస్ విజయం పట్ల కోచ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ తాము కొన్ని కొత్త తరహాలో ప్రణాళికలు రచిస్తే, అవన్నీ సఫలమయ్యాయని గంభీర్ అన్నాడు. పవర్‌ప్లేలోనే బుమ్రాతో మూడు ఓవర్లు వేయించడం కూడా అలాంటిదేనని అతను చెప్పాడు. 'తొలి ఆరు ఓవర్లలో మూడు బుమ్రావే కావడం మంచి ప్రణాళిక. ఇది చాలా బాగా పని చేసింది. ఆరంభంలోనే మూడు మంచి ఓవర్లు పడితే ప్రత్యర్థిపై ఒత్తిడి పెరుగుతుంది. ఆ తర్వాత ఎలాగూ స్పిన్నర్లు వస్తారు' అని కోచ్ విశ్లేషించాడు. బౌలింగ్ విషయంలో మన జట్టుకు కనీసం 7-8 ప్రత్యామ్నాయాలు ఉంటే మంచిదన్నాడు. 'దూబే, అక్షర్, సుందర్ లాంటి ఆల్‌రౌండర్లు టీమ్‌లో ఉండటం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. గతంలో ఆరుకు మించి బౌలింగ్ ప్రత్యామ్నాయాలు ఉండకపోయేవి. ఇప్పుడు అంతకు మించి మనకు అవకాశం ఉంటోంది' అని కోచ్ చెప్పాడు. మరో వైపు వ్యక్తిగత ప్రదర్శనలకంటే జట్టు విజయాలే తనకు ముఖ్యమని కోచ్ పునరుద్ఘాటించాడు. 'మ్యాచ్ ఓడాక మన జట్టులో బాగా ఆడిన వారిని ప్రశంసించడంలో అర్థమే లేదు. నేను వ్యక్తిగత రికార్డులకంటే టీమ్ గెలవడం గురించే ఆలోచిస్తాను. ఎవరైనా బాగా ఆడితే మంచిదే కానీ జట్టు గెలిస్తేనే నాకు సంతోషం. అందుకే వన్డే సిరీస్‌లో ఓటమి నిరాశకు గురి చేసింది' అని గంభీర్ అన్నాడు.

గంభీర్, సూర్యకుమార్

సాక్షి సినిమా

కామెడీ ఎంటర్‌టైనర్

● సందీప్ కిషన్

ప్రముఖ తమిళ హీరో విజయ్ తనయుడు జాసన్ సంజయ్ డైరెక్టర్‌గా పరిచయమవుతున్న సంగతి తెలిసిందే. సందీప్ కిషన్ హీరోగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న ఈ సినిమాకి 'సిగ్మా' అనే టైటిల్ ఖరారు చేశారు మేకర్స్. ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, అన్బు థాసన్, యోగ్ జాపీ, సంపత్ రాజ్, కిరణ్ కొండ, మహాలక్ష్మి, సుదర్శనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'సిగ్మా' అనే టైటిల్ ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. బంగారం, నోట్ల కట్టల మధ్య కూర్చొని చేతికి బ్యాండేజ్ కడుతున్నట్లు కనిపించారు సందీప్. జాసన్ సంజయ్ మాట్లాడుతూ–''యాక్షన్, అడ్వెంచర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'సిగ్మా'. ఈ టైటిల్, కాన్సెప్ట్ 'సిగ్మా' అనే స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ట్రెజర్ హంట్, హీస్ట్, కామెడీ అంశాల మేళవింపుతో ఈ సినిమా ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని అందిస్తుంది. ఒక పాట చిత్రీకరణ మిగిలి ఉంది. త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ ప్రారంభించి వేసవి ప్రారంభంలో సినిమా విడుదల చేయనున్నాం'' అని తెలిపారు. ''తొలి సినిమా దర్శకునిగా జేసన్ సంజయ్ 65 రోజుల్లో 95శాతం షూటింగ్ పూర్తి చేయడమంటే అసాధారణ విజయమే'' అన్నారు లైకా ప్రొడక్షన్స్ సీఈఓ తమిళ్ కుమారన్. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: కృష్ణన్ వసంత్.

కాలాన్నే శాసిస్తూ...

● శ్రుతీహాసన్

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' (వర్కింగ్ టైటిల్) అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీలోని 'గ్లోబ్ ట్రోటర్' పాటను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ఈ సాంగ్‌కి చైతన్య ప్రసాద్ సాహిత్యం అందించగా, హీరోయిన్ శ్రుతీహాసన్, కాలభైరవ పాడారు. ''కాలాన్నే శాసిస్తూ.. ప్రతిరోజూ పరుగేలే, వేగాన్నే శ్వాసిస్తూ.. పెనుగాలై తిరిగేలే.., ఖండాలే దాటేస్తూ.. కగరాజై వాలే.. రా రా.. రా రా.. ధీర.. ధ్రువతార..' అంటూ ఈ సాంగ్ మొదలవుతుంది. 'సంచారి.. సంచారి.. నినదించే రణభేరి.., 'సంహారి.. సంహారి... మృత్యువుపై తన స్వారీ'' అంటూ ఈ పాట సాగుతుంది. ఈ సినిమాకు ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 మార్చిలో విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది.

కొత్త సినిమా చూసిన అనుభూతి కలిగింది

- నాగార్జున

● రామ్‌గోపాల్ వర్మ, నాగార్జున

''శివ' సినిమా మాకు చాలా వ్యక్తిగతం. పదేళ్ల క్రితమే 4కే చేశాం. అయితే అప్పుడు డాల్బీ జరగలేదు. ఏదో లాభం వస్తుందని ఈ సినిమా విడుదల చేయడం లేదు. 'శివ' ఓ మ్యాజిక్. 4కె డాల్బీ అట్మాస్‌లో రీ రిలీజ్ వెర్షన్ చూస్తున్నప్పుడు కొత్త సినిమా చూసిన అనుభూతి కలిగింది. అన్నపూర్ణ స్టూడియోస్ 50ఏళ్ల సందర్భంగా 'శివ' రీ రిలీజ్ కావడం హ్యాపీగా ఉంది'' అని అక్కినేని నాగార్జున తెలిపారు. ఆయన హీరోగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'శివ'. అన్నపూర్ణ స్టూడియోస్‌పై అక్కినేని వెంకట్, యార్లగడ్డ సురేంద్ర నిర్మించిన ఈ సినిమా 1989 అక్టోబర్ 5న విడుదలైంది. అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఇయర్స్ సందర్భంగా ఈ నెల 14న ఈ సినిమాని రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన ఈ మూవీ స్పెషల్ ప్రీమియర్ షో అనంతరం జరిగిన ప్రెస్‌మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ–''శివ'కి ఇంత ఆదరణ, కల్ట్ ఫాలోయింగ్ ఉంటుందని, 36 ఏళ్ల తర్వాత రీ రిలీజ్ కోసం కలుస్తామని నేను కలలో కూడా అనుకోలేదు. ఈ సినిమా కోసం రాము(రామ్‌గోపాల్ వర్మ) అప్పుడు ఎంత ఇష్టపడి చేశాడో రీ రిలీజ్ కోసం కూడా ఆరు నెలల నుంచి అంతే ఇష్టంతో వర్క్ చేశారు. మణిరత్నంగారితో నేను 'గీతాంజలి' సినిమా చేసిన తర్వాత 'శివ' కథతో రాము నా వద్దకు వచ్చారు. ఇద్దరు దర్శకులు కూడా మాస్టర్స్. వారి సెన్సిబిలిటీస్ నాకు ఇష్టం. రెండు సినిమాలు చాలా అద్భుతంగా ఆడాయి. 'శివ' సినిమాకి సీక్వెల్ చేసే అంత కరేజ్, గట్స్ నాగచైతన్య, అఖిల్‌కి ఉన్నాయని అనుకోవడం లేదు (నవ్వుతూ)'' అని తెలిపారు. **రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ–** ''శివ' రీ రిలీజ్‌లో సౌండ్ క్యాలిటీ బాగుందని చెప్పడం చాలా ఆనందంగా ఉంది. నేను మళ్లీ 'శివ' సినిమా తీస్తే అది కేవలం నాగార్జునతోనే. అయితే ముందుగా నేను బయట ఒక హిట్ సినిమా తీసిన తర్వాతే నాగార్జునని అప్రోచ్ అవుతాను'' అని చెప్పారు.

కొందరు హీరోలు నో చెప్పారు

- 'మధుర' శ్రీధర్‌రెడ్డి

● శ్రీధర్, హరిప్రసాద్

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్‌పై 'మధుర' శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా 'మధుర' శ్రీధర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ–''సంతాన ప్రాప్తిరస్తు' స్క్రిప్ట్‌ని కొందరు పేరున్న హీరోలకు వినిపించాం. కథలో హీరోకు స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉంటుంది. ఈ కారణం చేత తమ ఇమేజ్‌కు ఇబ్బంది అవుతుందంటూ నో చెప్పారు. కొత్త అబ్బాయితో వెళితే ఎలాంటి ఇమేజ్ ఇబ్బందులు ఉండవని విక్రాంత్‌ను తీసుకున్నాం. మేల్ ఫెర్టిలిటీ సమస్య నేపథ్యంగా సాగే ఈ సినిమాలో ఎక్కడా అభ్యంతరకరమైన డైలాగ్స్ లేవు. మా సినిమా చూశాక ఫెర్టిలిటీ ఇష్యూస్‌తో బాధపడుతున్న వారికి ఒక ధైర్యం వస్తుంది. కరోనా పరిస్థితుల తర్వాత ప్రేక్షకుల అభిరుచులు మారాయి. నాలుగేళ్ల క్రితం అయితే ఈ సినిమా ట్రైలర్‌ను మా కుటుంబ సభ్యులకే చూపించలేకపోయేవాడిని. ఇప్పుడు మా అబ్బాయిలు, మా ఫ్యామిలీ మెంబర్స్ కూడా చూడగలుగుతున్నారు. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించిన తర్వాత ఫేక్ ఫెర్టిలిటీ సెంటర్స్ నేపథ్యంతో 'సంతాన ప్రాప్తిరస్తు 2' చేయాలనుకుంటున్నాం. మన నేటివ్ సినిమాల్లో కంటెంట్ బాగుంటే అదే గ్లోబల్ స్థాయికి వెళ్తుంది. పాన్ ఇండియా అవుతుంది. కరోనా తర్వాత ఓటీటీ డీల్స్ విషయంలో మార్పులు వచ్చాయ. కొన్ని కారణాల వల్ల పేమెంట్స్ తగ్గిస్తున్నారు. భవిష్యత్‌లో నా దర్శకత్వంలో మళ్లీ సినిమా ఉండొచ్చు. కొత్త ఫిల్మ్‌మేకర్స్ మా మధుర ఆడియో పాటలను వినియోగించుకుంటే నేను డబ్బులు చార్జ్ చేయడం లేదు'' అని అన్నారు. నిర్మాత నిర్వి హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ–''ఐటీ రంగం నుంచి వచ్చిన నేను 'సంతాన ప్రాప్తిరస్తు' తో నిర్మాతగా పరిచయం కావడం సంతోషంగా ఉంది'' అని తెలిపారు.

ఆన్సర్ ఇవ్వలేకపోయారు!


● రవితేజ

రవితేజ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే టైటిల్ ఖరారైంది. రవితేజ కెరీర్‌లోని ఈ 76వ సినిమాకు కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తుండగా ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్, జీ స్టూడియోస్ పతాకాలపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానుంది. కాగా, 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా టైటిల్ గ్లింప్స్‌ను సోమవారం రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో రామసత్యనారాయణ పాత్రలో నటిస్తున్నారు రవితేజ. ''నా జీవితంలోని ఇద్దరు ఆడాళ్లు నన్ను రెండు ప్రశ్నలు అడిగారు. సమాధానం కోసం చాలా ఆలోచించాను. గూగుల్, ఏఐ, చాట్ జీపీటీ, జెమిని.. ఇలా అన్నింటినీ అడిగాను. మే బి వాటికి పెళ్లి కాకపోవడం వల్ల నన్ను ఇంకా కన్ఫ్యూజ్ చేశాయి. అనుభవం ఉన్న మగాళ్లని ముఖ్యంగా మొగుళ్లని అడిగాను.. ఆశ్చర్యపోయారే తప్ప ఆన్సర్ మాత్రం ఇవ్వలేకపోయారు. అలాంటి ప్రశ్న మిమ్మల్ని ఏ ఆడవాళ్లు అడగకూడదని, పెళ్లయిన వాళ్లకి నాలాంటి పరిస్థితి ఎదురవకూడదని కోరుకుంటూ.. మీ ఈ రామసత్యనారాయణ చెప్పేది ఏమిటంటే.. భర్త మహాశయులకు విజ్ఞప్తి'' అంటూ రవితేజ చెప్పిన డైలాగ్స్ ఈ వీడియోలో ఉన్నాయి. ఈ మూవీకి సంగీతం: భీమ్స్.

క్రైమ్ కామెడీ

● రాశీ సింగ్, రాజ్‌తరుణ్, అజయ్, శ్రీనివాస్, బ్రహ్మాజీ

రాజ్ తరుణ్, రాశీ సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రం 'పాంచ్ మినార్'. గోవింద రాజు సమర్పణలో కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పీ పతాకంపై మాధవి, ఎమ్ఎస్ఎమ్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 21న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ రెడ్డి, నితిన్ ప్రసన్న, రవి వర్మ, సుదర్శన్, కృష్ణతేజ, నంద గోపాల్ ఈ చిత్రంలోని ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర.

డిసెంబరులో దండోరా

● బిందు మాధవి

శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో లౌక్య ఎంటర్‌టైన్మెంట్స్‌పై రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మిస్తున్నారు. ఈ సినిమాని డిసెంబరు 25న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండలు జరుగుతున్నాయనే అంశాలతో 'దండోరా' తెరకెక్కిస్తున్నాం. తెలంగాణ నేపథ్యంతో సాగే గ్రామీణ ప్రేమకథా చిత్రం ఇది. పురాతన ఆచారాలు, సంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే చక్కటి హాస్యం, భావోద్వేగాలు, వ్యంగ్యం.. వంటి అంశాలు కూడా ఉంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, రాధ్య, అదితి భావరాజు ఇతర పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: మార్క్ కె రాబిన్.

ఎర్రకోట సమీపంలో ఓ కారులో పేలుడుతో ఎగసిపడుతున్న మంటలు

ఘటనాస్థలి వద్ద సహాయక చర్యల దృశ్యం

పేలుడులో ఛిద్రమైన మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

ఢిల్లీలో బ్లాస్ట్

న్యూఢిల్లీ: హస్తినలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం భారీ పేలుడు సంభవించింది. లాల్ ఖిలా మెట్రోస్టేషన్ ఒకటో నంబర్ గేటు సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్ పడటంతో ఆగిన హ్యుందాయ్ ఐ20 కారులో జరిగిన భారీ పేలుడు ధాటికి కారులోని ముగ్గురుసహా మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. పక్కన ఉన్న ఆరు కార్లు, రెండు ఇ–రిక్షాలు, ఆటోలు సైతం తీవ్రస్థాయిలో ధ్వంసమయ్యాయి. దీంతో మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరందరినీ హుటాహుటిన సమీపంలోని లోక్‌నాయక్ జయప్రకాశ్ ఆస్పత్రిలో చేర్పించారు. పేలుడు ధాటికి సమీప మార్కెట్‌లోని ప్రజలు, రోడ్లమీద ఉన్న వ్యక్తులు ప్రాణభయంతో పరుగులుతీశారు. తీవ్రస్థాయి పేలుడు కారణంగా మృతదేహాలు ఛిద్రమై చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో అక్కడ భీతావహ వాతావరణం నెలకొంది. మంటలు, హాహాకారాలు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా శ్మశానవైరాగ్యం అలముకుంది. ఢిల్లీ సమీప ఫరీదాబాద్‌లో 2,900 కేజీల పేలుడు పదార్థాలను జమ్మూకశ్మీర్, హరియాణా, యూపీ పోలీసుల బృందం స్వాధీనంచేసుకున్న కొన్ని గంటలకే ఢిల్లీలో భారీ పేలుడు సంభవించడం యాధృచ్ఛికం కాదని దర్యాప్తు వర్గాలు అనుమానం వ్యక్తంచేస్తున్నాయి. ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పేలుడు ఘటనతో కేంద్రం అప్రమత్తమైంది. ఢిల్లీలో హైఅలర్ట్ ప్రకటించారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఢిల్లీకి దారితీసే అన్ని రహదారులపై ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎర్రకోట, పార్లమెంట్, మెట్రో స్టేషన్లు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయా లు, ఎయిర్‌పోర్ట్, రైల్వే స్టేషన్ల వద్ద భద్రతను కట్టు దిట్టంచేశారు. జనసమ్మర్ధ ప్రాంతాల్లో సోదాలను పెంచారు. లాడ్జిలలోనూ తనిఖీలు చేపట్టారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఢిల్లీ పోలీస్, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ), నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్ఎస్‌జీ), ఫోరెన్సిక్ బృందాలు ఘటనా స్థలికి చేరుకున్నాయి. ఆధారాలను ఫోరెన్సిక్ బృందాలు సేకరిస్తున్నాయి. ఘటన జరిగిన తీరును అక్కడి ప్రత్యక్ష సాక్షులను అడిగి తెల్సుకుంటున్నారు పేలుడు తర్వాత మంటలు, దట్టమైన పొగ అలుముకున్న ఆ ప్రాంతంలో మంటలను రాత్రి ఏడున్నరకల్లా ఆర్పేశామని ఢిల్లీ అగ్నిమాపక శాఖ తెలిపింది. అయితే ఇది ఉగ్రదాడి అని వార్తలొస్తున్నా ఇప్పటిదాకా ఏ ఉగ్రసంస్థా ఈ పేలుడుకు బాధ్యులము తామేనని ప్రకటించుకోలేదు.

ట్రాఫిక్ సిగ్నల్ వద్ద పేలుడు

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం సరిగ్గా సాయంత్రం 6 గంటల 52 నిమిషాలకు లాల్‌ఖిలా మెట్రోస్టేషన్ ఎదురుగా ఉన్న సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఎర్రలైట్ పడటంతో కొన్ని వాహనాలు ఆగాయి. అదే సమయంలో ఐ20 మోడల్ కారు వెనుకభాగం ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయింది. దీంతో పక్కనే ఉన్న ఛాందిని చౌక్ మార్కెట్‌లోని జనం భయంతో పరుగులు తీశారు. పేలుడు ధాటికి సమీప వాహనాలు సైతం మంటల్లో కాలిపోయాయని ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీశ్ గోల్చా మీడియాతో చెప్పారు. ఘటనపై మంత్రి అమిత్ షాతో మాట్లాడారు. ఘటన వివరాలను ప్రధాని మోదీ అమిత్‌షాను అడిగి తెల్సుకున్నారు. ఛాందిని చౌక్ మార్కెట్ సమీపంలోనే పేలుడు సంభవించడంతో జనం రద్దీని కట్టడిచేసేందుకు మంగళవారం మార్కెట్‌ను మూసేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సంజయ్ భార్గవ చెప్పారు.

ఘటనాస్థలి వద్ద బాంబ్ స్క్వాడ్, అగ్నిమాపక సిబ్బంది తనిఖీలు

మృతదేహాల్లో కానరని బాంబు శకలాలు

పేలిన కారులో ముగ్గురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతులు, గాయపడిన శరీరభాగాల్లోకి ఎలాంటి మేకులు, చిన్నపాటి ఇనుపగుండ్లు దూసుకెళ్లలేదు. ఉగ్రవాదులు ఉపయోగించే ఐఈడీ తరహా పేలుడుపదార్థంలో ఇలాంటి వాటిని చొప్పించి పేలుడు విస్తృతి ఎక్కువగా ఉండేలా, పెద్దసంఖ్యలో జనం మరణించేలా కుట్ర పన్నుతారు. కానీ ఈ ఘటనలో ఎలాంటి మేకులు, బాల్ బేరింగ్‌లు, చిన్న వైర్ల జాడ కనిపించలేదు. కానీ ఘటనాస్థలిలో ఒక బుల్లెట్‌ను కనుగొన్నారు. రసాయన పదార్థంకారణంగా సంభవించే కాలిన గాయాలు సైతం మృతదేహాలపై లేవు. దీంతో ఏ తరహా పదార్థం పేలిందనే అంశంపైనా పోలీసులు దర్యాప్తు మొదలెట్టారు. ఢిల్లీ నేర విభాగం, ప్రత్యేక విభాగం, జాతీయ దర్యాప్తు సంస్థలకు చెందిన బృందాలు వేర్వేరు కోణాల్లో దర్యాప్తును ముమ్మరంచేశాయి. పేలిన కారు అంతకుముందు ప్రయాణించిన మార్గాల్లోని సీసీటీవీ ఫుటేజీలను చెక్ చేస్తున్నారు. ఘటనాస్థలిలో ఘటన జరిగినప్పుడు అక్కడ క్రియాశీలకంగా ఉన్న మొబైళ్ల తాజా లొకేషన్లనూ సరిచూస్తున్నారు. రిమోట్ కంట్రోల్ ద్వారా సమీ పం నుంచే బాంబును పేల్చి ఉంటారన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. పేలుడుకు కొన్ని సెకన్ల ముందు ఒకవేళ అక్కడి పాదచారులు సెల్ఫీ వీడియోలు, ఫొటోలు తీసుకుంటే వాటిని తమకు అందజేసి దర్యాప్తునకు సహకరించాలని పోలీసు విభాగం పౌరులను కోరింది. ఈ పేలుడు అధిక–ఉష్ణోగ్రతను వెదజల్లే విస్ఫోటనం కాకుండా యాంత్రిక లేదా రసాయనిక విస్ఫోటనం అయి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. అందుకే నైట్రేట్లు లేదా టీఎన్‌టీ వంటి జాడను వెతుకుతున్నారు.

ఆస్పత్రులకు పోటెత్తిన బాధితుల కుటుంబసభ్యులు

పేలుడు ఘటనలో తమ వారు ప్రాణాలు కోల్పోయారన్న వార్త తెలిసి కుటుంబసభ్యులు, బంధువులు హుటాహుటిన మార్చురీలు, ఆస్పత్రులకు చేరుకుని దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు. క్షతగాత్రుల కుటుంబసభ్యులు, స్థానికులు, మీడియా ప్రతినిధులతో ఆస్పత్రి ప్రాంగణం నిండిపోయింది. తమ వారిని ఐసీయూలో చేర్పించారని, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ఏ విషయాలు చెప్పట్లేరని పలువురు కుటుంబసభ్యులు ఆస్పత్రి ముందు ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రహోం మంత్రి అమిత్ షా సైతం లోక్‌నాయక్ జయప్రకాశ్ ఆస్పత్రికి వచ్చి క్షతగాత్రుల ఆరోగ్యంపై వాకబు చేశారు. స్వల్ప గాయాలైన క్షతగాత్రులను ఓదార్చారు. ఘటన జరిగిన తీరును ప్రధాని మోదీకి వివరించారు. తర్వాత ఘటనాస్థలికి రాత్రి పదిన్నర ప్రాంతంలో అమిత్ షా చేరుకున్నారు. పేలుడు జరిగిన తీరును అక్కడి దర్యాప్తు అధికారులు అమిత్ షా వివరించారు.

అమెరికా ఎంబసీ తమ పౌరులకు అలర్ట్

పేలుడు ఘటనపై ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం వెంటనే స్పందించింది. ఎర్రకోట వంటి జనం విపరీతంగా గుమిగూడే ప్రాంతాలకు వెళ్లకూడదని తమ పౌరులకు అమెరికా ఎంబసీ సోమవారం ఒక భద్రతా అలర్ట్‌ను పంపించింది. స్థానిక యంత్రాంగం సూచనలు, సలహాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ జనసమ్మర్ధ ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించింది. మరోవైపు పేలుడు ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్‌చేశారు.

అన్ని దారులు పుల్వామాకే!

ఢిల్లీ పేలుడుకు మూలాలు పుల్వామాలో ఉన్నాయని వార్తలొస్తున్నాయి. దీనికి బలం చేకూర్చే సిద్ధాంతాలు వెలువడుతున్నాయి. సోమవారం కశ్మీర్, హరియణా, యూపీ సంయుక్త ఆపరేషన్‌లో పట్టుబడిన ఒక వైద్యుడు పుల్వామాకు చెందిన వ్యక్తే. 2019 ఫిబ్రవరి 14న సైనిక వాహనశ్రేణిపై దాడి జరిగింది పుల్వామాలోనే. ఇక ఢిల్లీ పేలుడు ఘటనలో కారు యజమాని తారిఖ్ సైతం పుల్వామాకు చెందిన వ్యక్తే.

కశ్మీర్ వాసి పేరిట కారు రిజిస్ట్రేషన్ !

పేలిన కారు హరియాణాలో హెచ్‌ఆర్26సీఈ 7674 నంబర్‌తో రిజిస్టర్ అయినట్లు గుర్తించారు. కారు యజమాని నదీం ఖాన్‌ను గురుగ్రామ్‌లో అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అయితే ఇటీవల ఈ కారు పలువురు యజమానులు చేతులు మారినట్లు తెలుస్తోంది. అయితే చివరిసారిగా కశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన తారిఖ్ అనే వ్యక్తి దీనిని కొనుగోలుచేసినట్లు తెలుస్తోంది. అయితే కారు క్రయ, విక్రయల సమయాల్లో తప్పుడు గుర్తింపు పత్రాలు, డాక్యుమెంట్లను వినియోగించారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే 2013 మోడల్ ఐ20 తెలుపు రంగు కారుకు గతంలో యజమాలుగా ఉన్న ఎండీ సల్మాన్, దేవేందర్‌లనూ పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. గురుగ్రామ్‌లోని శాంతినగర్‌కు చెంది సల్మాన్ ఈ కారును ఏడాదిన్నర క్రితం ఢిల్లీలోని ఓఖ్లా ప్రాంతానికి చెందిన దేవేందర్‌కు విక్రయించాడు. తర్వాత ఈ కారును అంబాలా నగరంలో మరొకరు కొన్నారు.

ఎటు చూసినా రక్తపు ముద్దలు

"శక్తివంతమైన పేలుడు దెబ్బకు కొద్దిసేపు మా చెవులు గిల్లుమన్నాయి. అసలేం జరిగిందో చూసేలోపే అంతటా మంటలు. చుట్టూతా ముక్కలైన మృతదేహాలు శరీరభాగాలు. కొన్ని ముక్కలు వాహనాలపై, మరొకొన్ని రోడ్లమీద పడ్డాయి. అంతటా రక్తపు మరకలు. మంటలు అంతెత్తున ఎగసిపడ్డాయి. పేలుడు ధాటికి ఎంతో ఎత్తున ఉండే హైమాస్ట్ వీధిదీపాలు సైతం పగిలిపోయాయి. దుకాణాల, మెట్రో స్టేషన్ గాజు ప్యానెళ్లు సైతం బద్దలయ్యాయి. సమీప వాహనాలు, అందులోని వాహనాదారులకు సైతం మంటలు అంటుకున్నాయి"అని ప్రత్యక్ష సాక్షి, 36 ఏళ్ల అమిత్ ముద్గల్ భయంభయంగా చెప్పారు. ముగ్గురు పురుషులు ముక్కలై పడి ఉన్నారని మరో ప్రత్యక్ష సాక్షి భూపిందర్ సింగ్ చెప్పారు. "చాలా మంది చేతులు, వేళ్లు తెగి పడ్డాయి. ఒక కారు స్టీరింగ్ చక్రం విరిగిపోయింది. తోపుడు బళ్లు నడిపేవాళ్లు, ట్యాక్సీ డ్రైవర్లు మంటల్లో చిక్కుకుపోయారు. వాళ్లు బతకడం కష్టమే"అని మరో ప్రత్యక్ష సాక్షి ఇర్ఫాన్ చెప్పారు. "పేలుడు జరిగిన సెకన్లలోనే అక్కడంతా ఎర్రని పొగ అలుకుముంది. అక్కడున్న వారంతా భయంతో తలోదిక్కు పారిపోయారు. గాయాలతో కింద పడిన చాలా మందిని నేను అప్పటికే వచ్చిన అంబులెన్సుల్లోకి ఎక్కించా"అని ఆయన అన్నారు. "నేనో ఆటో రిక్షా డ్రైవర్‌ను. సిగ్నల్ వద్ద నా ఆటోకు ముందువైపు కొంచెం దూరంలో ఓ కారు ఆగింది. దాని వెనుకభాగంలోనే పేలుడు సంభవించింది"అని నుదుటికి గాయమైన డ్రైవర్ చెప్పారు. "పేలుడు తీవ్రతకు నా దుకాణంలోని వస్తువులన్నీ ఒక్కసారిగా కంపించాయి"అని సమీప దుకాణదారుడు వివరించారు. పేలుడు శబ్దం కిలోమీటర్ దూరంలో ఉన్న జామా మసీదు దాకా వినపడింది. పేలుడు ఘటనపై పుకార్లను ప్రచారం చేయొద్దని, సంయమనం పాటించాలని ఢిల్లీవాసులకు సీఎం రేఖా గుప్తా విజ్ఞప్తిచేశారు.

సాక్షి బిజినెస్

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
319	82
83,535	25,574

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,455	▲	450
డోజోన్స్	47,211	▲	224
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,797	▲	115
డాక్స్	23,982	▲	412
షాంఘై	4,019	▲	21
నికాయ్	50,912	▲	635

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.25	89.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.37	117.31
€	యూరో	ఎస్‌బీఐ	101.15	103.93
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.11	58.54
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.25	59.14
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.21	69.05
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.77	24.26
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.27	24.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.58	13.41

బంగారం, వెండి ర్యాలీ

రూ.1,300 పెరిగిన పుత్తడి ● రూ.2,460 లాభపడిన వెండి

న్యూఢిల్లీ: కొనుగోళ్ల మద్దతుతో బంగారం, వెండి ధరలు **సోమవారం** బులియన్ మార్కెట్లో లాభపడ్డాయి. పుత్తడి 10 గ్రా**ములకు (99.9** స్వచ్ఛత) రూ.1,300 పెరిగి రూ.1,25,900కు చేరింది. **వెండి కిలోకి** రూ.2,460 పెరిగి రూ.1,55,760 స్థాయిని తాకింది. **అంతర్జాతీయ** మార్కెట్లోనూ స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 83 డాలర్లు ఎగసి **(2 శాతం)** 4,083 డాలర్ల స్థాయిని చేరింది. స్పాట్ వెండి ఔన్స్‌కు **3 శాతానికి** పైగా పెరిగి 49.93 డాలర్లకు చేరుకుంది. ''అమెరికా **స్థూల ఆర్థిక** డేటా బలహీనంగా ఉండడంతో, యూఎస్ ఫెడ్ **వచ్చే నెల** భేటీలో రేట్ల తగ్గింపును చేపడుతుందన్న **అంచనాలు** పెరిగాయి. దీంతో పెట్టుబడులకు డిమాండ్ పెరిగిం**ది''అని** హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియ**ర్ అన**లిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. డాలర్ బలహీనత, అ**మెరికా** ప్రభుత్వం కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కావడ**ం బం**గారం, వెండి ధరలు పెరిగేందుకు మద్దతునిచ్చినట్టు **ఎల్**కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ వైస్ ప్రెసిడెంట్ జతీన్ త్రి**వేది** తెలిపారు. అమెరికాలో కన్జ్యూమర్ సెంటిమెంట్ మూ**డు**న్నరేళ్ల కనిష్టానికి పడిపోయిందన్న డేటా సైతం ధర**ల** పెరుగుదలకు కారణంగా పేర్కొన్నారు.

డేటా సెంటర్లకు ఆకర్షణీయ కేంద్రంగా భారత్

● నిర్మాణ వ్యయం ముంబైలో ఎంతో చౌక
● టర్నర్, టౌన్‌సెండ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: డేటా సెంటర్లకు భారత్ ప్రపంచంలోనే ఎంతో ఆకర్షణీయ కేంద్రంగా ఉన్నట్టు టర్నర్ అండ్ టౌన్‌సెండ్ డేటా సెంటర్ కన్‌స్ట్రక్షన్ కాస్ట్ ఇండెక్స్ నివేదిక తెలిపింది. డేటా సెంటర్ల నిర్మాణ వ్యయం పరంగా ముంబై ప్రపంచంలో రెండో చౌక కేంద్రంగా ఉన్నట్టు వెల్లడించింది. ఒక వాట్ సామర్థ్యం గల డేటా సెంటర్ నిర్మాణానికి ముంబైలో 6.64 డాలర్లు ఖర్చవుతోందని, ప్రపంచవ్యాప్తంగా 52 ప్రాంతాల్లో ముంబైకి 51వ ర్యాంక్ దక్కినట్టు తెలిపింది. ఒకటో ర్యాంక్ వస్తే, మెగావాట్ డేటాసెంటర్ నిర్మాణానికి అత్యధిక వ్యయం అవుతున్నట్టు, 52 వస్తే అతి చౌక అని అర్థం చేసుకోవాలి. టోక్యో, సింగపూర్, జూరిచ్ ప్రాంతాల్లో మెగావాట్ నిర్మాణ వ్యయం ముంబై కంటే రెట్టింపు స్థాయిలో ఉన్నట్టు ఈ నివేదిక ఆధారంగా తెలుస్తోంది. దీంతో డేటా సెంటర్ పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయంగా ఉన్నట్టు పేర్కొంది. ముంబైలో విద్యుత్ టారిఫ్‌లు కిలోవాట్ హవర్‌కు 6.71 సెంట్లుగా ఉందని, షాంఘై కంటే 50 శాతం చౌక అని తెలిపింది. దీంతో డేటా సెంటర్ల నిర్వహణ వ్యయాలు ముంబైలో తక్కువని తేల్చింది.

నిల్వ సామర్థ్యం 3 శాతమే

ప్రపంచంలో 20 శాతం డేటా భారత్‌లో ఉత్పత్తి అవుతుండగా, డేటా సెంటర్ సామర్థ్యంలో కేవలం 3 శాతమే భారత్‌లో ఉందని తెలిపింది. డేటా స్టోరేజీ కోసం భారత్ విదేశీ హోస్టింగ్(నిల్వ)పై ఎక్కువగా ఆధారపడుతోందని, దీంతో స్థానికంగా సామర్థ్య విస్తరణకు అపార అవకాశాలున్నట్టు ఈ నివేదిక తెలిపింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో జపాన్, సింగపూర్‌తోపాటు భారత్ డేటా సెంటర్ మార్కెట్లుగా ఉన్నాయని.. భారత్‌లో డేటా సామర్థ్యాల నిర్మాణానికి 156 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమని పేర్కొంది.

తక్కువ నిర్మాణ వ్యయానికి తోడు డేటా స్టోరేజీ డిమాండ్ నేపథ్యంలో డేటా సెంటర్ల పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా కొనసాగుతుందని టర్నర్ అండ్ టౌన్‌సెండ్ ఎండీ సుమిత్ ముఖర్జీ తెలిపారు. వ్యయపరమైన అనుకూలతలు ఉన్నప్పటికీ.. అవసరమైనంత విద్యుత్, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసుకోవాల్సిన సవాళ్లున్నట్టు చెప్పారు. ఇంధన వినియోగం పరంగా మరింత అనుకూలమైన డేటా సెంటర్ డిజైన్లపై సంస్థలు దృష్టి పెట్టాలని, తద్వారా విద్యుత్‌కు సంబంధించి రిస్కును తగ్గించుకోవచ్చని నివేదిక సూచించింది. ఏఐ పరివర్తన ప్రయోజనాలను పూర్తి స్థాయిలో అందుకునేందుకు విద్యుత్, నీటి సరఫరాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది.

బజాజ్ ఫైనాన్స్ లాభం జూమ్

క్యూ2లో రూ. 4,948 కోట్లు

న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ **దిగ్గజం బజాజ్** ఫైనాన్స్ **ప్రస్తుత ఆర్థిక** సంవత్సరం(2025–26) రెండో **త్రైమాసికంలో** పటిష్ట ఫలి**తాలు సాధించి**ంది. కన్సాలి**డేటెడ్ ప్రాతిప**దికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర **లాభం 23 శాతం** జంప్‌చేసి **రూ. 4,948 కోట్ల**ను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో **రూ. 4,014 కోట్లు** ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా **రూ. 17,095 కోట్ల** నుంచి రూ. 20,181 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ **ఆదాయం 22 శాత**ం పుంజుకుని రూ. 10,785 కోట్లకు చేరింది. గత **క్యూ2లో రూ. 8,838** కోట్ల నికర వడ్డీ ఆదాయం అందుకుంది. మొత్తం **వ్యయాలు సైతం రూ**. 11,697 కోట్ల నుంచి రూ. 13,576 కోట్లకు పెరి**గాయి. అయితే మొండి**రుణాల కారణంగా స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీ**ఏలు) 1.06 శాతం నుంచి** 1.24 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.46 శాతం నుం**చి 0.6 శాతానికి పెరిగా**యి. కనీస మూలధన నిష్పత్తి 21.23 శాతంగా **నమోదైంది. నిర్వహణలో**ని ఆస్తులు(ఏయూఎం) 24 శాతం వృద్ధితో **రూ. 4,62,261 కోట్లకు చేరా**యి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1.8 శాతం బలపడి రూ. 1,085 వద్ద ముగిసింది.

నష్టాలలోనే వొడాఫోన్ ఐడియా

క్యూ2లో రూ. 5,524 కోట్లు

న్యూఢిల్లీ: మొబైల్ రంగ కంపెనీ వొడాఫోన్ ఐడియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర నష్టం తగ్గి రూ. 5,524 కోట్లకు పరిమితమైంది. భారీ రుణ భారంతో సవాళ్లు ఎదుర్కొంటున్న కంపెనీ గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 7,176 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం టర్నోవర్ రూ. 10,932 కోట్ల నుంచి స్వల్ప(2 శాతం) వృద్ధితో రూ. 11,195 కోట్లకు చేరింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 9 శాతం మెరుగుపడి రూ. 180ను తాకింది. గత క్యూ2లో రూ. 166 ఏఆర్‌పీయూ సాధించింది. కస్టమర్లు అప్‌గ్రేడ్ కావడం, టారిఫ్‌ల పెంపు ఇందుకు దోహదపడ్డాయి. 2025 సెప్టెంబర్‌కల్లా కంపెనీ రుణ భారం రూ. 2,02,951 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1 శాతం నీరసించి రూ. 9.5 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఇళ్ల అమ్మకాలు @ రూ.2.98 లక్షల కోట్లు | ఆడి క్యూ3, క్యూ5 లిమిటెడ్ ఎడిషన్

సరికొత్తగా పేటీఎం యాప్

న్యూఢిల్లీ: చెల్లింపు సేవల సంస్థ పేటీఎం తాజాగా తమ ఫ్లాగ్‌షిప్ యాప్ సరికొత్త వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. కృత్రిమ మేధ(ఏఐ) సహాయంతో యూజర్ల రోజువారీ లావాదేవీలను క్రమబద్ధీకరించే విధంగా దీన్ని తీర్చిదిద్దారు. దేశీ యూజర్లతో పాటు 12 దేశాల్లోని ప్రవాస భారతీయులు కూడా మరింత వేగవంతంగా, స్మార్ట్‌గా చెల్లింపులు జరిపేందుకు తోడ్పడే 15 కొత్త ఫీచర్లు, వినూత్న ఇంటర్‌ఫేస్ ఇందులో ఉన్నట్లు కంపెనీ తెలిపింది. తరచుగా జరిపే లావాదేవీలకు పొదుపు కోణాన్ని కూడా జోడించేలా ప్రతి చెల్లింపుపై యూజర్లకు డిజిటల్ గోల్డ్ రూపంలో రివార్డులిచ్చే విధంగా 'గోల్డ్ కాయిన్స్' ఫీచరును ప్రవేశపెట్టినట్లు వివరించింది. నెలవారీ ఖర్చుల వర్గీకరణ, యూపీఐతో అనుసంధానించిన బహుళ బ్యాంకు ఖాతాల్లో నిల్వలను ఒకే చోట చూపించడం, 'హైడ్ పేమెంట్' ఆప్షన్, వాట్సాప్ మెసేజీలు.. కాంటాక్టుల నుంచి బ్యాంక్..ఐఎఫ్ఎస్‌సీ వివరాలను ఆటోమేటిక్‌గా పూరించే మేజిక్ పేస్ట్ టూల్, అంతర్గతంగా కాల్క్యులేటర్ మొదలైన కొత్త ఫీచర్లను యాప్‌లో పొందుపర్చినట్లు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో విజయ్ శేఖర్ శర్మ తెలిపారు.

ఐటీ, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్

● కలిసొచ్చిన అంతర్జాతీయ సానుకూల సంకేతాలు
● మూడు రోజుల నష్టాల నుంచి గట్టెక్కిన సూచీలు

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం లాభంతో ముగిసింది. ఐటీ, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 319 పాయింట్లు పెరిగి 83,535 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 82 పాయింట్లు బలపడి 25,574 వద్ద నిలిచింది. దీంతో సూచీల మూడు రోజుల నష్టాలకు బ్రేక్ పడినట్టైంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 538 పాయింట్లు పెరిగి 83,754 వద్ద, నిఫ్టీ 161 పాయింట్లు ఎగసి 25,653 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. అమెరికా చరిత్రలోనే అత్యంత సుదీర్ఘంగా.. 40 రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌కు తెరపడే సూచనలు కనిపిస్తుండడంతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. కొరియా 3%, హాంకాంగ్ 1.5%, జపాన్ 1.3%, చైనా అరశాతం లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 1.5% పెరిగాయి. అమెరికా స్టాక్ సూచీలు 1% లాభంతో ట్రేడవుతున్నాయి.

➤ ఐటీ, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్, కన్జూమర్ డ్యూరబుల్స్ మెటల్, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

➤ సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.34 కోట్ల నికర లాభాన్ని ప్రకటించడంతో నైకా కంపెనీ షేరు 6% పెరిగి రూ.261 వద్ద స్థిరపడింది.

మెప్పించని లెన్స్‌కార్ట్

డిస్కౌంటుతో లిస్టయిన లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ షేరు కనిష్టాల నుంచి తేరుకొని స్వల్ప లాభంతో గట్టెక్కింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.390)తో పోలిస్తే 3% డిస్కౌంటుతో రూ.402 వద్ద లిస్టయ్యింది. మార్కెట్లోని ప్రతికూల సంకేతాల ప్రభావంతో ఇంట్రాడేలో 11.52% క్షీణించి రూ.356 వద్ద కనిష్టాన్ని తాకింది. కనిష్ట స్థాయి వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాల నుంచి గట్టెక్కింది. స్వల్ప లాభంతో రూ.403 వద్ద స్థిరపడింది. మార్కెట్ విలువ రూ.69,967 కోట్లుగా నమోదైంది.

క్లుప్తంగా...

విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్

- ఈ నెలాఖరు నుంచి రైలు ప్రారంభం
- విజయవాడ-చెన్నై రైలు నరసాపురం వరకు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి మరో వందేభారత్ రైలును రైల్వే శాఖ మంజూరు చేసింది. విజయవాడ–బెంగళూరు వందేభారత్ రైలు ఈ నెలాఖరుకు పట్టాలు ఎక్కనుంది. ఈ మేరకు రూట్ మ్యాప్, షెడ్యూల్‌ను రైల్వే శాఖ ఖరారు చేసింది. మంగళవారం మినహా మిగిలిన 6 రోజులు ప్రయాణించే ఈ రైలులో విజయవాడ నుంచి ఎస్ఎంవీటీ (బెంగళూరు) 9 గంటల్లో చేరుకోవచ్చు. ఈ రైలుకు తెనాలి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, కృష్ణరాజపురంలో హాల్ట్‌లు కల్పించింది. మొత్తం 8 బోగీలు ఉండే ఈ రైలులో 7 ఏసీ చైర్‌కార్ బోగీలు, ఒక ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ ఉంటాయి. ఈ రైలు (20711) విజయవాడలో ఉదయం 5.15 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు బెంగళూరు చేరుతుంది. అలాగే, రైలు (20712) బెంగళూరులో మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి రాత్రి 11.45 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. కాగా, ఇప్పటికే ప్రారంభించిన విజయవాడ– చెన్నై సెంట్రల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడిగించారు. గుడివాడ, భీమవరంలో హాల్ట్‌లు కల్పించారు.

తప్పుల తడకగా ఎంబీబీఎస్ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియను చంద్రబాబు ప్రభుత్వం తప్పులతడకగా మార్చేసింది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి మూడో విడత కన్వీనర్ సీట్ల కేటాయింపు జాబితాను ఆదివారం హెల్త్ వర్సిటీ ప్రకటించింది. అయితే సీటు కేటాయింపులో తేడా రావడంతో ఆదివారం ప్రకటించిన కేటాయింపులను హోల్డ్ చేస్తున్నామని సోమవారం వర్సిటీ ఒక ప్రకటన జారీ చేసింది. సీట్ల కేటాయింపు తప్పుల తడకగా చేపట్టినట్టు విద్యార్థుల నుంచి ఫిర్యాదులు రావడంతో వర్సిటీ పునఃసమీక్షలో పడినట్టు తెలిసింది. తొలుత మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల్లోపు విద్యార్థులందరూ కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు. దీంతో గడువు ముగిసేలోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలనే లక్ష్యంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సీట్లు కేటాయించిన కళాశాలలకు ప్రయాణమయ్యారు. వీరంతా మార్గమధ్యంలో ఉండగానే కేటాయింపులను హోల్డ్ చేసినట్టు ప్రకటన వెలువడింది. దీంతో విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారింది. మూడో దశ కేటాయింపుల్లో మంగళగిరి ఎన్ఆర్ఐ కళాశాలలో బీసీ విభాగంలోని విద్యార్థికి ఎన్‌సీసీ కోటాలో సీట్ ఇచ్చారు. వర్సిటీ ప్రకటించిన సీట్ మ్యాట్రిక్స్ ప్రకారం ఎన్ఆర్ఐలో బీసీ ఎన్‌సీసీ విభాగం సీట్లే లేవని ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు రెండో దశ కౌన్సెలింగ్‌లో ఓసీ విద్యార్థినికి కర్నూలు మెడికల్ కళాశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్(బీఎస్‌జీ) విభాగంలో సీటు ఇచ్చారు. వాస్తవానికి సదరు విద్యార్థి కంటే నీట్‌లో తక్కువ చేసిన వారికి ఓపెన్ కేటగిరిలో సీటు దక్కింది. ఈ నేపథ్యంలో బీఎస్‌జీ కింద కాకుండా ఓపెన్ కేటగిరిలోనే సీట్ కేటాయించాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వర్సిటీ చేసిన పొరపాటు కారణంగా బీఎస్‌జీ విభాగంలోని ఓ విద్యార్థికి నష్టం వాటిల్లిందనే విమర్శలు ఉన్నాయి. ఇలా కౌన్సెలింగ్ ప్రక్రియలో వెలుగు చూడని తప్పులు అనేకం దొర్లాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రివైజ్డ్ సీట్ల కేటాయింపు జాబితాను సోమవారం రాత్రి వర్సిటీ విడుదల చేసింది. విద్యార్థులు 13 తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు కళాశాలల్లో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

మోంథా తుపానుతో రూ.6,384 కోట్ల నష్టం

సాక్షి, అమరావతి: మోంథా తుపాను వల్ల రాష్ట్రంలో రూ.6,384 కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందానికి నివేదించింది. కేంద్ర ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని, రూ.901.4 కోట్ల తక్షణసాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. మోంథా తుపాను నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీ బసు, కేంద్ర వ్యవసాయ, రైతుసంక్షేమ శాఖ సంచాలకుడు డాక్టర్ కె.పొన్నుస్వామిల నేతృత్వంలోని ఎనిమిదిమంది సభ్యుల కేంద్రబృందం సోమవారం రాష్ట్రానికి వచ్చింది. ఈ బృందం తొలుత వెలగపూడి సచివాలయంలోని ఆర్టీజీఎస్‌కి వచ్చింది. తుపాను కలిగించిన నష్టం గురించి రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్‌జైన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వారికి వివరించారు. రాష్ట్రంలోని 24 జిల్లాల్లో నష్టం జరిగిందని, వ్యవసాయరంగానికి తుపాను తీవ్రనష్టం కలిగించిందని తెలిపారు. కోతదశకు వచ్చిన పంటలను తుపాను ముంచెత్తిందని, రైతులకు జీవనాధారమైన పంటల్ని నీట ముంచి కోలుకోలేని దెబ్బతీసిందని చెప్పారు. 1.61 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మినుము, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. 6,250 హెక్టార్లలో ఉద్యానపంటలు, 17.72 హెక్టార్లలో మల్బరీ తోటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. మత్స్యకారులు కూడా బాగా దెబ్బతిన్నారన్నారు. 3,063 హెక్టార్లలో చేపల చెరువులు ధ్వంసమయ్యాయని చెప్పారు. 4,566 ఇళ్లు దెబ్బతిన్నాయని, 1,853 పాఠశాలలకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కోటి గళాల రణభేరి

▶ మొదటి పేజీ తరువాయి

అడ్డుపడి లేఖ రాసింది. చంద్రబాబు కక్షపూరిత విధానాలతో రెండేళ్లలో రాష్ట్రం ఏకంగా 2,450 ఎంబీబీఎస్ సీట్లను కోల్పోయింది. రూ. లక్ష కోట్ల విలువైన సంపద లాంటి ప్రజల ఆస్తులను పచ్చ కార్పొరేట్ గద్దలకు దోచిపెట్టడం కోసం చంద్రబాబు పీపీపీ కుట్రలు పన్నారు. ఏకంగా 10 కొత్త వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని నిర్ణయించారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఉద్యమ కార్యాచరణ రూపొందించింది. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంగా నానాటికి ఉధృతం అవుతోంది. నిజానికి కేవలం రూ.ఐదు వేల కోట్లు ఖర్చు చేస్తే 10 కొత్త వైద్య కళాశాలలు ప్రభుత్వ రంగంలోనే పూర్తై అందుబాటులోకి వస్తాయి. కేవలం 17 నెలల్లోనే చంద్రబాబు సర్కార్ రూ.2.50 లక్షల కోట్ల అప్పులు చేసింది. అందులో కేవలం రూ. ఐదు వేల కోట్లను ఈ మెడికల్ కాలేజీల కోసం ఖర్చు చేయడానికి చంద్రబాబుకు మనసు రాకపోవడంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతోంది.

తెలంగాణలో భవనాల్లేకపోయినా..

2025–26 విద్యా సంవత్సరంలో తెలంగాణలో కొడంగల్ వైద్య కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) 50 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేసింది. ఈ వైద్య కళాశాల, బోధనాస్పత్రికి శాశ్వత భవనాలను అక్కడి ప్రభుత్వం ఇప్పటి వరకూ నిర్మించకపోయినా కొడంగల్‌కు 15 కి.మీ దూరంలో ఉండే తాండూర్ ప్రభుత్వాస్పత్రిని బోధనాస్పత్రిగా, నర్సింగ్ కళాశాల భవనాలను తాత్కాలిక తరగతి గదులుగా చూపించి ఎన్ఎంసీ నుంచి అనుమతులు రాబట్టారు. అలాగే గతేడాది తెలంగాణలోని మహేశ్వరం వైద్య కళాశాలకు ఎన్ఎంసీ 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేసింది. కళాశాల, బోధనాస్పత్రి శాశ్వత నిర్మాణాలు అందుబాటులోకి వచ్చే వరకూ తాత్కాలిక భవనాల్లోనే అకడమిక్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

జగన్ చొరవతో సకల వసతులతో భవనాలు నిర్మించినా..

వైఎస్ జగన్ ప్రభుత్వం 2024–25 విద్యా సంవత్సరంలో ఐదు కొత్త వైద్య కళాశాలలు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంది. పులివెందుల వైద్య కళాశాల, బోధనాస్పత్రిని నిర్మించి ప్రారంభించారు. మార్కాపురం, మదనపల్లె, ఆదోని కళాశాలల్లో తొలి ఏడాది తరగతులు ప్రారంభించడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల అనంతరం గద్దెనెక్కిన చంద్రబాబు ప్రభుత్వం ఈ కళాశాలలు ప్రారంభించకుండా అడ్డుపడింది. రాష్ట్రంలో 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభించాల్సి ఉండగా 2025–26 విద్యా సంవత్సరంలో ఒక్క కళాశాలకు కూడా అనుమతుల కోసం దరఖాస్తు చేయలేదు.

2,450 మంది వైద్య విద్యకు దూరం

వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టగా వాటిలో ఐదు కాలేజీలను 2023–24లోనే ప్రారంభించి 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా సమకూర్చారు. గత ప్రభుత్వ కృషితో పులివెందులకు 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరైనా చంద్రబాబు అడ్డుకుని రద్దు చేయించారు. గత విద్యా సంవత్సరం 700 మెడికల్ సీట్లు రాష్ట్రానికి అదనంగా సమకూరకుండా అడ్డుకున్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం ఈ విద్యా సంవత్సరంలో మరో 7 కొత్త వైద్య కళాశాలలు కూడా ప్రారంభమై మొత్తం 1,750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా రావాల్సి ఉండగా వాటిని రాబట్టకపోగా ప్రైవేట్‌పరం చేస్తున్నారు. రెండేళ్లలో 2,450 మంది విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసిన ప్రభుత్వం వారి కలలను ఛిద్రం చేసింది.

మెరుగైన మార్కులు సాధించినా నిరాశే..

తెలంగాణలో తాత్కాలిక వసతులతోనే వైద్య కళాశాలలను ప్రారంభిస్తూ రెండేళ్లలో తొమ్మిది కొత్త మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తేగా.. ఏపీలో మాత్రం చంద్రబాబు ప్రభుత్వ దుర్మార్గ విధానాలతో రెండేళ్లలో 2,450 ఎంబీబీఎస్ సీట్లను మన విద్యార్థులు నష్టపోయారు. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం కోసం విద్యార్థుల జీవితాలతో చంద్రబాబు సర్కారు చెలగాటం ఆడింది. 2025–26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ ప్రభుత్వ కోటా మూడో రౌండ్ కౌన్సెలింగ్ ముగిశాక తెలంగాణలో నీట్ యూజీ–2025లో 403 స్కోర్‌తో రెండు లక్షలకు పైబడి ఆలిండియా ర్యాంక్ సాధించిన విద్యార్థికి ప్రభుత్వ కోటా సీటు దక్కింది. ఇదే కేటగిరీలో ఏపీలో ఎస్వీయూ రీజియన్‌లో 471, ఏయూలో 487 స్కోర్ వద్దే ప్రభుత్వ కోటా సీట్ల కేటాయింపు ఆగిపోయింది. ఈ లెక్కన ఓపెన్ కేటగిరీలో తెలంగాణాతో పోలిస్తే 84 మార్కులు అధికంగా సాధించినప్పటికీ ఏపీ విద్యార్థులకు ప్రభుత్వ కోటా సీటు దక్కలేదు.

రెండేళ్లలో తెలుగు రాష్ట్రాలకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలలు

(తెలంగాణ)		(ఏపీ)	
కళాశాల	సీట్లు	కళాశాల	సీట్లు
భువనగిరి	50	పాడేరు	50 (దరఖాస్తు చేసింది 150కి)
మహేశ్వరం	50	పులివెందుల	0 (50 సీట్లు మంజూరైనప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం వద్దని లేఖ రాసింది)
కుత్బుల్లాపూర్	50	మదనపల్లె	(ఎన్ఎంసీ సీట్లివ్వడానికి సిద్ధంగా ఉన్నా మోకాలడ్డిన బాబు ప్రభుత్వం)
గద్వాల	50	మార్కాపురం	(ఎన్ఎంసీ సీట్లివ్వడానికి సిద్ధంగా ఉన్నా మోకాలడ్డిన ప్రభుత్వం)
నారాయణపేట	50	ఆదోని	(ఎన్ఎంసీ సీట్లివ్వడానికి సిద్ధంగా ఉన్నా మోకాలడ్డిన ప్రభుత్వం)
నర్సంపేట	50		
ములుగు	50		
మెదక్	50		
కొడంగల్	50		

ఏపీలో ప్రారంభించడానికి కనీసం దరఖాస్తు చేయని కళాశాలలు ఇవే

- పెనుకొండ
- అమలాపురం
- బాపట్ల
- పిడుగురాళ్ల
- నర్సీపట్నం
- పాలకొల్లు
- పార్వతీపురం

మూడు రౌండ్ల కౌన్సెలింగ్‌లు ముగిసే సమయానికి ప్రభుత్వ కోటా ఎంబీబీఎస్ సీట్లలో కటాఫ్‌లు ఇలా

రిజర్వేషన్	ఏపీలో ఏయూ	ఏపీలో ఎస్వీయూ	తెలంగాణ
ఓపెన్	487	471	403
బీసీ–ఏ	461	443	338
బీసీ–బీ	448	446	395
బీసీ–సీ	459	427	341
బీసీ–డీ	480	440	398
బీసీ–ఈ	403	446	394
ఎస్సీ1	322	278	126
ఎస్సీ2	407	405	351
ఎస్సీ3	424	415	367

బీసీ కోటాలో 120కి పైగా ఎక్కువ మార్కులున్నా..

కొత్త కళాశాలల్లో సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని వంద రోజుల్లో రద్దు చేసి మెరిట్ విద్యార్థులకు సీట్లన్నీ కేటాయిస్తామనే వాగ్దానాలతో గద్దెనెక్కిన టీడీపీ కూటమి సర్కారు విద్యార్థులకు వెన్నుపోటు పొడిచింది. ఏకంగా 10 వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టాలని నిర్ణయించింది. ముందస్తు ప్రణాళిక ప్రకారం కళాశాలలను ప్రభుత్వ రంగంలో ప్రారంభించకుండా బీసీ, ఎస్సీ లాంటి రిజర్వేషన్ వర్గాలకూ తీరని ద్రోహం తలపెట్టింది. కొత్తగా సీట్లు రాష్ట్రంలో పెరగకపోవడంతో తెలంగాణ విద్యార్థుల కంటే 120 మార్కులకు పైగా ఎక్కువ స్కోర్ చేసినా మన విద్యార్థులకు ఏపీలో ప్రభుత్వ కోటా సీట్లు దక్కలేదు. తెలంగాణాలో బీసీ–ఏ విభాగంలో 338 స్కోర్ చేసిన వారికి ప్రభుత్వ కోటాలో మెడికల్ సీట్ రాగా, ఏపీలో ఏయూలో 461, ఎస్వీయూలో 443 స్కోర్ల వరకే సీట్లు వచ్చాయి. అంటే 105–123 మార్కులు అదనంగా కటాఫ్ ఉంది. మిగిలిన రిజర్వేషన్ విభాగాల్లోనూ తెలంగాణాలో కంటే ఏపీలో కటాఫ్‌లు 50 నుంచి వంద మార్కుల మేర అధికంగానే ఉన్నాయి. దీంతో పిల్లలను యాజమాన్య కోటా కింద రూ. లక్షలు ఖర్చు చేసి చదివించలేని నిరుపేద, మధ్యతరగతి తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు. ధైర్యం చేసి లాంగ్ టర్మ్ కోచింగ్‌కు పంపినా వచ్చే ఏడాదైనా రాష్ట్రంలో సీట్లు పెరుగుతాయనే నమ్మకం లేదని నిస్పృహ వ్యక్తం చేస్తున్నారు.

చేరువలో వైద్య విద్య..

కొత్తగా ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుతో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య పెరుగుతుంది. దీనివల్ల ఎక్కువ మంది వైద్య విద్య చదువుకునేందుకు ఆస్కారం ఉంటుంది. సామాన్య, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు సైతం చేరువలో వైద్య విద్య అభ్యసించే అవకాశం కలుగుతుంది.

– కె.లహిత, వైద్య విద్యార్థి, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం

ఉచితంగా మెరుగైన వైద్యం

ప్రభుత్వ వైద్య కళాశాలలు ఎక్కువగా ఏర్పాటైతే ఆ ప్రాంత ప్రజలకు చేరువలో మెరుగైన వైద్య సేవలందుతాయి. న్యూరో మెడిసిన్, న్యూరో సర్జరీ, పల్మనాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ లాంటి సూపర్ స్పెషాలిటీ సేవలు ఉచితంగా లభిస్తాయి. వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదు.

– బి.రతుల్‌రామ్, వైద్య విద్యార్థి, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం

రోడ్డెక్కిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

- ఎస్‌బీటీ అండ్ ఎస్‌సీవీ కళాశాల ఆస్తులు తిరిగి ప్రైవేటు యాజమాన్యానికే
- 101 మంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరం
- అదే పేరుతో కొనసాగించాలని కోరుతున్న విద్యార్థులు

ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళుతున్న విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రోడ్డెక్కారు. కళాశాల, కళాశాల ఆస్తులను తిరిగి ప్రైవేటు యాజమాన్యానికి అప్పగిస్తూ జీఓ జారీ చేయటం విద్యార్థుల భవితను ప్రశ్నార్థకం చేసింది. దీంతో తమకు న్యాయంచేయాలని కోరుతూ విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పల్నాడు కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కళాశాలను అదేపేరుతో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు

అసలేం జరిగిందంటే..: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తూ 2023లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కళాశాలను గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో స్వాధీనం చేసుకున్న ఎస్‌బీటీ అండ్ ఎస్‌సీవీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. గతంలో ఇదే ప్రాంగణంలో జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాల నిర్వహించారు. వారికి సొంత భవనాలు సమకూరటంతో సదరు ప్రాంగణాన్ని డిగ్రీ కళాశాలకు కేటాయించారు. అయితే తిరిగి చంద్రబాబు ప్రభుత్వం రావటంతో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కళాశాల, కళాశాల ఆస్తులను తిరిగి కోర్టు ఉత్తర్వుల మేరకు శ్రీ త్రికోటేశ్వరస్వామి ఎడ్యుకేషనల్ సొసైటీ(పాత యాజమాన్యం)కి అప్పగిస్తూ జీఓ జారీ చేసింది. దీంతో సొసైటీ ప్రతినిధులు తమ కళాశాలను, ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయటంతో కళాశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్ గందరగోళంగా మారింది. కళాశాల పేరు ఎస్‌బీటీ అండ్ ఎస్‌సీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా నమోదు కావటంతో ఇప్పుడు తమను వేర్వేరు కళాశాలల్లో చేరమనటంతో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలో 101 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సంబంధించిన రికార్డులన్నీ ఇదే కళాశాల పేరుతో ఉండటంతో హఠాత్తుగా వేరే కళాశాలకు బదిలీ చేస్తే తాము నష్టపోతామని విద్యార్థులు చెబుతున్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలగా, రాష్ట్ర ఉన్నత విద్యామండలి గుర్తింపుతో విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేరుతోనే స్కాలర్‌షిప్‌లు ఇతర సదుపాయాలు పొందుతున్నారు. సచివాలయం బయోమెట్రిక్ ట్యాగ్ సైతం ఎస్‌బీటీ అండ్ ఎస్‌సీవీ ప్రభుత్వ కళాశాల పేరుతోనే ఉన్నాయి. కళాశాలను పాత యాజమాన్యానికి అప్పగించి తమను వేరే కళాశాలకు మార్చినట్లయితే తాము నష్టపోతామని వాపోతున్నారు. తృతీయ సంవత్సరం పూర్తి చేసే వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అదే పేరుతో కొనసాగించాలని కోరుతున్నారు.



సర్కారీ చిక్కీలో పురుగులు

చుండూరు (కొల్లూరు): బాపట్ల జిల్లా చుండూరు మండలం ఆలపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉపాధ్యాయులు పంపిణీ చేసిన చిక్కీలలో పురుగులు దర్శన మిచ్చాయి. వాటిని విద్యార్థులు ఇంటికి తీసుకువెళ్లారు. తల్లిదండ్రులు చిక్కీలపై ఉన్న కవర్‌ను తొలగించి విద్యార్థులకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో పురుగులు కనిపించడంతో నిశ్చేష్టులయ్యారు. ప్యాకెట్‌లోంచి తీసిన చిక్కీలోబతికున్న పురుగు బయటకు వస్తుండటం చూసిన తల్లిదండ్రులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం, చిక్కీలు అందించాల్సిన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంభించడం, చిక్కీల నాణ్యతను విద్యాశాఖాధికారులు పరిశీలించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నారులు పురుగులను గమనించకుండా ఆరగించి ఉంటే వారి పరిస్థితి ఏమిటన్న సందేహాలు తల్లిదండ్రులలో వ్యక్తమవుతున్నాయి. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామంటూ ప్రగల్భాలు పలుకుతున్న సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ మాటల కోటలు దాటుతుంటే.. విద్యార్థులకు ఇస్తున్న చిక్కీలలో పురుగులు బయటకొస్తున్నాయని పలువురు వ్యాఖ్యానించారు.

స్కూల్‌లో విద్యార్థిని అనుమానాస్పద మృతి

- హాస్టల్ గదిలో ఉరివేసుకున్న స్థితిలో గుర్తించిన మరో విద్యార్థిని
- కడప శివారు ఊటుకూరులో ఘటన
- పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంపై విద్యార్థిని బంధువుల ఆగ్రహం
- యాజమాన్యం తీరుపై మండిపడ్డ డీఈవో

రిమ్స్ మార్చురీ నుంచి మృతదేహాన్ని తీసుకొస్తున్న బంధువులు

చింతకొమ్మదిన్నె: వైఎస్సార్ జిల్లా కడప శివారులోని చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు రింగు రోడ్డు సర్కిల్ వద్ద ఉన్న ఓ ప్రయివేట్ రెసిడెన్షియల్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని కె.జస్వంతి (14) సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండూరు మండలం పాలూరు గ్రామానికి చెందిన కె.రవిశంకరరెడ్డి, లక్ష్మీదేవి దంపతుల పెద్దకుమార్తె జస్వంతి ఓ ప్రయివేట్ స్కూల్ హాస్టల్‌లో ఉంటోంది. ఉదయం 6.40 గంటల సమయంలో జస్వంతి తాను ఉంటున్న గదికి గడియ వేసుకుంది. అదే గదిలో ఉంటున్న మరో విద్యార్థిని పాలు తాగేందుకు మెస్ వద్దకు వెళ్లి 6.55 గంటల సమయంలో రూం వద్దకు వచ్చి కిటికీలోంచి చూడగా చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది గది తలుపుల్ని పగులగొట్టి లోనికి వెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న జస్వంతిని కడప నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. దీంతో రిమ్స్ ఆస్పత్రికి విద్యార్థిని మృతదేహాన్ని తరలించారు.

యాజమాన్యం తీరుపై మండిపడ్డ డీఈవో

విద్యార్థిని జస్వంతి మృతి చెందిన విషయం తెలిసి విచారణ నిమిత్తం జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ పాఠశాలకు రాగా.. సిబ్బంది పాఠశాల తాళాలు తెరవలేదు. అరగంటకు పైగా వేచి డీఈవో వేచి ఉండాల్సిన పరిస్థితి కల్పించారు. దీంతో ఆయన పాఠశాల ప్రిన్సిపాల్‌పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం డీఈఓ వచ్చినా స్పందించరా, మీ తీరు ఏమిటో దీనిని బట్టి అర్థమవుతోంది అని మండిపడ్డారు. డీఈవో వెంట మండల విద్యాధికారులు సుబ్బరాయుడు, రమాదేవి ఉన్నారు.

ఏం జరిగిందో చెప్పని పాఠశాల యాజమాన్యం

ఉదయం 7.55 గంటల సమయంలో విద్యార్థిని కళ్లు తిరిగి కిందపడిపోయినట్టు ఆమె తండ్రి రవిశంకర్‌రెడ్డికి స్కూల్ ప్రిన్సిపాల్ ఫోన్‌చేసి చెప్పారు. బాలిక తల్లిదండ్రులు రిమ్స్ మార్చురీ వద్దకు చేరుకోగా.. బిడ్డ మృతి చెందిందని చెప్పడంతో తీవ్రంగా రోదించారు. సుమారు రెండు గంటలు పైగా మార్చురీ వద్ద వేచి ఉన్నప్పటికీ పాఠశాల యాజమాన్యం బిడ్డ ఎలా మృతి చెందిందనే విషయం చెప్పలేదని బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు ఆవేదన చెందారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యానికి నిరసనగా నినాదాలు చేస్తూ బాలిక మృతదేహంతో పాఠశాలకు వచ్చే ప్రయత్నం చేశారు. పోలీసులు వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ వద్దకు చేరుకుని వాహనాలను రహదారికి అడ్డుగా ఉంచి అడ్డుకున్నారు. దీంతో బాలిక బంధువులు, పోలీసుల మధ్య దాదాపు గంటసేపు వాదోపవాదాలు, తోపులాటలు జరిగాయి. చివరకు పోలీసులు పోస్టుమార్టం జరిగితేనే వాస్తవాలు తెలుస్తాయని విద్యార్థిని బంధువులకు నచ్చజెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పదో తరగతి పరీక్ష ఫీజుల షెడ్యూల్ విడుదల

- ఈ నెల 13 నుంచి 25 వరకు గడువు
- రూ.500 ఆలస్య రుసుంతో వచ్చే నెల 15 వరకు అవకాశం

సాక్షి, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల (ఎస్ఎస్‌సీ–2026) ఫీజు చెల్లింపునకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. అన్ని పాఠశాలలు రెగ్యులర్, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థుల పరీక్ష ఫీజును ఈనెల 13 నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు చెల్లించవచ్చని పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు. రూ.50 ఆలస్య రుసుంతో డిసెంబర్ 3 వరకు, రూ.200 ఫైన్‌తో 10వ తేదీ, రూ.500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 15వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఈ తేదీలలో ఏవైనా ప్రభుత్వ సెలవు దినాలు ఉంటే తదుపరి పని దినాన్ని గడువు తేదీగా పరిగణిస్తారు. విద్యార్థుల ఫీజును https://bse.ap.gov.inలలో అందుబాటులో ఉన్న స్కూల్ లాగిన్ ద్వారా మాత్రమే చెల్లించాలని పేర్కొన్నారు. మాన్యువల్ నామినల్ రోల్స్ సమర్పించాల్సిన అవసరం లేదన్నారు.

పరీక్ష ఫీజు రుసుం ఇలా..

- రెగ్యులర్ విద్యార్థులు (అన్ని సబ్జెక్టులకు) రూ.125
- మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125
- మూడు సబ్జెక్టుల వరకు రూ.110
- వృత్తి విద్యా కోర్సులకు అదనంగా రూ.60
- వయసు మినహాయింపు కోసం రూ.300

మార్చిలో 'పది' పరీక్షలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చిలో నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మార్చి నెల రెండు లేదా మూడో వారం నుంచి ప్రారంభించాలని యోచిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. మార్చి 16, 21 తేదీలతో టైంటేబుల్‌ను సిద్ధం చేసినట్టు తెలిసింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

నూతన అక్రిడిటేషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మీడియా రిలేషన్స్ పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి పార్థసారథి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు 2026–2027 సంవత్సరాలకు నూతన అక్రిడిటేషన్లను ఈ నెలాఖరులోగా జారీ చేస్తామని సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన మీడియా రిలేషన్స్ పోర్టల్(వైబ్‌సైట్)ను సోమవారం ఆయన సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. గతంలో జారీ చేసిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు ఈ నెల 30వ తేదీతో ముగియనుందని చెప్పారు. ఈ నేపథ్యంలో రానున్న రెండేళ్ల కాలానికి నూతన అక్రిడిటేషన్ల జారీ కోసం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ల కోసం అర్హులైన జర్నలిస్టులు వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పోర్టల్‌లో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి, ఇతర విధివిధానాలను మంగళవారం విడుదల చేస్తామని చెప్పారు.

గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారిగా వీరపాండియన్

11 శాఖల అధికారులతోనూ కమిటీ

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్ 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణ ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. 11 శాఖల కార్యదర్శులతో ప్రత్యేక కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటుచేసింది. డీజీపీతో పాటు దేవదాయ, జలవనరులు, మున్సిపల్, రెవెన్యూ, యువజనులు క్రీడలు, రవాణా, రహదారులు–భవనాలు, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, విద్యుత్, ఆర్థిక శాఖల కార్యదర్శులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం రెండు వేర్వేరు జీఓలు జారీచేశారు. గోదావరి పుష్కరాల నిర్వహణకు ఈ ఏడాది జూన్‌లోనే ప్రభుత్వం 12 శాఖల మంత్రులతో ఓ కమిటీని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. మంత్రుల కమిటీ తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా పుష్కరాలను సజావుగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ కార్యదర్శుల కమిటీ ఎప్పటికప్పుడు విధివిధానాలు రూపొందిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. మంత్రుల కమిటీతో పాటు కార్యదర్శుల కమిటీ నిర్ణయాలు, రూపొందించిన పాలసీల అమలు బాధ్యత పుష్కరాల ప్రత్యేకాధికారిదని తెలిపింది.

గోడౌన్లు సిద్ధం చేసుకోవాలి

రైస్ మిల్లర్ల ప్రతినిధులతో మంత్రి నాదెండ్ల

సాక్షి, అమరావతి : ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు అనంతరం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిల్వ కోసం అవసరమైన గోడౌన్లను ముందుగానే సిద్ధంచేసుకోవాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం రైస్ మిల్లర్ల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. డ్రయర్ ఉన్న రైస్ మిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి గోడౌన్ వద్ద నిరంతర నిఘా ఉండేలా ఏఐ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. అలాగే, జిల్లాల వారీగా రైస్ మిల్లర్లు 1 : 2 బ్యాంక్ గ్యారంటీలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సుమారు 35 బ్యాంకులు సేవలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి సౌరభ్ గౌర్, పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మహాశిల్పంపై విధానపత్రం విడుదలకు డిమాండ్

సాక్షి, అమరావతి: విజయవాడలో నెలకొల్పిన అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాజెక్ట్ నిర్వహణ, అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణపై చంద్రబాబు సర్కారు విధానపత్రం విడుదల చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను సోమవారం సచివాలయంలో మాల్యాద్రి, పినమాల నాగకుమార్, శ్వేత బుడమేరుతో కూడిన బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విజయవాడలో 125 అడుగుల కాంస్య విగ్రహం(సామాజిక న్యాయ మహాశిల్పం) ఏర్పాటు చేసిందని, 8 ప్రధాన అంశాలతో పొందుపరిచిన ఆ ప్రాజెక్ట్‌లో మిగిలిన పనులు పూర్తి చేయాలని కోరారు. దాని నిర్మాణం, నిర్వహణ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. న్యాయ మహాశిల్పం పర్యవేక్షణకు అధికారులు, పౌర సంస్థల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. సీఎం చంద్రబాబు సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి సత్వర చర్యలు చేపట్టాలని కోరారు.

ఉల్లి రైతుకు కూటమి దగా

- మద్దతు ధరతో ఉల్లిగడ్డలు కొని రెండు నెలలు
- అమ్మిన 10 రోజుల్లోనే నగదు బ్యాంకు ఖాతాలకు జమచేస్తామని హామీ
- గత సెప్టెంబర్ 20వ తేదీతో నిలిచిపోయిన మద్దతు కొనుగోళ్లు
- 1,60,237 క్వింటాళ్లకు మద్దతు బకాయి
- ఇప్పటి వరకు 14,491 క్వింటాళ్లకు రూ.1.54 కోట్ల చెల్లింపులు
- మద్దతు చెల్లింపుల కోసం మార్క్‌ఫెడ్ చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- అతీగతీ లేని హెక్టారుకు రూ.50 వేల పరిహారం

పత్తికొండ మండలంలో ఉల్లి పంటను దున్నేస్తున్న రైతు (ఫైల్)

'మద్దతు' కరువై.. పరిహారం దూరమై!

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ఉల్లిగడ్డలను మద్దతు ధరతో కొనుగోలు చేయడాన్ని గత సెప్టెంబర్ 20వ తేదీ నాటికే ముగించింది. మద్దతుకు మంగళం పలికి నెలన్నర దాటినప్పటికీ చెల్లింపులు లేకపోవడం పట్ల రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కూటమి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో ఉల్లిగడ్డలు అమ్ముకున్న రైతులు నగదు చెల్లింపులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మద్దతు చెల్లింపులను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం చూస్తే రైతుల పట్ల ఏస్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారో అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయం, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 10 రోజుల్లోపే నేరుగా బ్యాంకు ఖాతాలకు నగదు విడుదల చేస్తామని మంత్రి టీజీ భరత్ హామీ ఇచ్చారు. ఇప్పుడు రెండు నెలలు గడుస్తున్నా మంత్రి కూడా మౌనం వహించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు చెల్లింపులు 250 మందికి మాత్రమే!

మార్క్‌ఫెడ్ నేరుగా 1,200 మంది రైతుల నుంచి 69,320 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులను మద్దతు ధర రూ.1200లతో కొనుగోలు చేసింది. మరో 2,500 మంది రైతుల నుంచి వ్యాపారులు 90,917 క్వింటాళ్లు కొన్నారు. మొత్తంగా రూ.18 కోట్ల విలువ చేసే 1,60,237 క్వింటాళ్లకు రూ.1,200తో పాటు వ్యత్యాసం మొత్తం చెల్లించాల్సి ఉంది. కొనుగోలు ప్రక్రియను సెప్టెంబర్ 20తోనే ముగించిన ప్రభుత్వం చెల్లింపులను విస్మరించింది. సెప్టెంబర్ నెల 15వ తేదీ నాటికి 250 మంది రైతులకు సంబంధించి 14,491.02 క్వింటాళ్లకు రూ.1,54,35,360 చెల్లింపులు చేశారు. ఆ తర్వాత ఇప్పటి వరకు చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి. 3,700 మంది రైతులు మద్దతు ధరతో ఉల్లి గడ్డలు అమ్ముకుంటే కేవలం 250 మందికి మాత్రమే చెల్లింపులు జరగడం గమనార్హం.

హెక్టారుకు రూ.50 వేల పరిహారం ఎప్పుడో..

- కూటమి ప్రభుత్వం ఉల్లిగడ్డలను మద్దతు ధరతో కొనుగోళ్లను మూన్నాళ్ల ముచ్చటగా ముగించింది.
- ఆర్థిక భారం తగ్గించుకునేందుకు హెక్టారుకు రూ.50 వేలు ప్రకారం పరిహారం చెల్లిస్తామని ప్రకటించింది.
- పరిహారం చెల్లించాలంటే రైతులు ఉల్లి సాగు చేసినట్లు ఈ–క్రాప్‌లో నమోదు కావాల్సి ఉంది.
- ఈ నెల 8వ తేదీ వరకు ఈ–క్రాప్ బుకింగ్‌కు అవకాశం ఉంది.
- ఆ తర్వాత జాబితాలను సోషల్ ఆడిట్‌కు పెట్టనున్నారు.
- ఈ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు పరిహారం కోసం ఉద్యాన శాఖ నివేదిక పంపే పరిస్థితి లేదు.
- ఈ–క్రాప్ బుకింగ్ ప్రకారం జిల్లాలో ఉల్లి 25వేల హెక్టార్లలో సాగయింది.
- ఈ ప్రకారం పరిహారం కింద రైతులకు రూ.125 కోట్లు చెల్లించాల్సి ఉంది.
- మద్దతు ధరతో కొనుగోలు చేసిన ఉల్లికి రూ.16 కోట్లు చెల్లించడానికి నెలల తరబడి జాప్యం చేస్తున్న ప్రభుత్వం పరిహారం చెల్లించేందుకు ఇంకెంత కాలం తీసుకుంటుందోనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉల్లి పంటను గొర్రెలకు వదిలేసిన దృశ్యం

రెండు నెలలైనా డబ్బు జమ కాలేదు

ఆరు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాం. అధిక వర్షాల కారణంగా పంట దెబ్బతినడంతో 4.50 ఎకరాల్లోని ఉల్లి పంటను దున్నేశాం. మిగిలిన ఎకరన్నర భూమిలో పండిన 72 క్వింటాళ్ల ఉల్లిగడ్డలను గత సెప్టెంబర్ 8న కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకానికి తీసుకెళ్లాం. వ్యాపారులు క్వింటా రూ.198 ప్రకారం కొన్నారు. మద్దతు ధర రూ.1,200 కాగా.. వ్యత్యాసం రూ.1,002 ప్రకారం రూ.72,144 బ్యాంకు ఖాతాకు 10 రోజుల్లో విడుదలవుతాయని చెప్పారు. ఇప్పటికి రెండు నెలలవుతున్నా ఆ ఊసే లేదు. రైతులను మోసం చేయడం సరికాదు.

– బి.రామలింగడు, లింగందిన్నె, గోనెగండ్ల మండలం

రూ.1.54 లక్షలు రావాల్సి ఉంది

నేను నాలుగు ఎకరాల్లో ఉల్లి సాగు చేశా. ఎకరాకు రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టా. సెప్టెంబరు 8న కర్నూలు మార్కెట్‌కు ఉల్లిని తీసుకెళ్తే ఒక లాట్ క్వింటాలు ధర రూ,359, మరో లాట్ క్వింటాలుకు రూ.409 ధరతో వ్యాపారులు కొన్నారు. మద్దతు ధర రూ.1200 ఉండగా.. వ్యాపారులు కొన్న ధరను మినహాయించి బ్యాలెన్స్ అమౌంటు నేరుగా బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని అధికారులు చెప్పారు. మాకు మద్దతు కింద రూ.1.54 లక్షల వరకు రావాల్సి ఉంది. రెండు నెలలు గడచినప్పటికీ బ్యాలెన్స్ మొత్తం బ్యాంకు ఖాతా జమ కాలేదు.

– చిన్నమద్దిలేటి, ఈర్లదిన్నె, సి.బెళగల్ మండలం

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎంపిక

సాక్షి, అమరావతి: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎంపికైందని అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ జంషీద్, ఆర్థిక కార్యదర్శి ప్రేమ్‌సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా పి.అశోక్‌కుమార్ రెడ్డి (అనంతపురం), వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సీకే వెంకట్‌నాథ్‌రెడ్డి (కడప), కె.గోవిందరెడ్డి (అనంతపురం), కె.వాసు (నెల్లూరు), అసోసియేట్ అధ్యక్షుడిగా పి.రెడ్డిశేఖర్‌రెడ్డి (చిత్తూరు), ఎ.రాధా కృష్ణారెడ్డి (అనంతపురం), ఎస్వీ రమణారెడ్డి (కడప), అధికార ప్రతినిధిగా బి.రఘురామిరెడ్డి (నెల్లూరు), ఉపాధ్యక్షులుగా ఎం.మహేష్ (ప్రకాశం), జి.చంద్రశేఖర్ (ప్రకాశం), వీవీ రామిరెడ్డి (ప్రకాశం), ఎస్.ప్రసాద్‌రెడ్డి (ప్రకాశం), ఎస్.డేనియల్ (నెల్లూరు), బి.సురేంద్ర (నెల్లూరు), టీఎన్ విశ్వనాథరెడ్డి (చిత్తూరు), టీవీ రమణారెడ్డి (అన్నమయ్య), జి.వెంకటరమణ (అనంతపురం), పి.రవీంద్రారెడ్డి (సత్యసాయి), డి.శివయ్య (సత్యసాయి), వై.జగన్‌మోహన్‌రెడ్డి (కడప), కె.జగదీశ్వర్‌రెడ్డి (కర్నూలు), కె.రేణుకారావు (బాపట్ల), సీహెచ్ రవి (గుంటూరు), టి.సాంబశివరావు (కృష్ణా), డి.శివశంకర్ (కృష్ణా), ఎం.వెంకటరావు (ఎన్టీఆర్), కె.దుర్గారావు (తూర్పు గోదావరి), వి. కామేశ్వరరావు (కాకినాడ), కార్యదర్శులుగా జి.తిరుపతిరెడ్డి (ప్రకాశం), ఎం.శివారెడ్డి (ప్రకాశం), ఎన్.అరుణకుమారి (ప్రకాశం), బి.వెంకటేశ్వర్లు (నెల్లూరు), వై.దేవరాజు (నెల్లూరు), పి.బాబు (చిత్తూరు), పి.వేణుగోపాల్‌రెడ్డి (చిత్తూరు), ఎం.శివశంకర్‌రెడ్డి (అన్నమయ్య), కె.గంగాధర్‌రెడ్డి (అనంతపురం), జె.రాజేష్ (సత్యసాయి), జి.సురేష్‌రెడ్డి (కడప), ఎస్.శ్రీనివాసులరెడ్డి (కర్నూలు), ఎస్.విజయ్‌కుమార్ (గుంటూరు), బి.శ్రీనివాసరావు (కృష్ణా), డి.ప్రసాద్ (కృష్ణా), టి.జగదీశ్వరరెడ్డి (ఎన్టీఆర్), ఎస్.శ్రీనివాసులు (ఏలూరు), జి.శారద (ఏలూరు), జి.జయబాబు (తూర్పు గోదావరి), ఆడిట్ కమిటీ సభ్యులుగా జీవీ రెడ్డి (ప్రకాశం), సి.గంగాధర్‌రెడ్డి (సత్యసాయి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు.

దేవుడిని అడ్డం పెట్టుకుని బాబు సర్కారు మరో డ్రామా

- ఆలయాల్లో తొక్కిసలాటలు జరుగుతుంటే.. 2019–24 మధ్య దాడులపై మంత్రుల కమిటీ
- భవిష్యత్‌లో తొక్కిసలాటలు నివారించే చర్యలపైనా కమిటీకి బాధ్యత అప్పగింత
- కమిటీ సభ్యులుగా మంత్రులు ఆనం, అనిత, అనగాని నియామకం

సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలనాపగ్గాలు చేపట్టాక రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా 10 నెలల కాలంలో ఆలయాల్లో మూడు భారీ దుర్ఘటనలు జరిగి 22 మంది అమాయక భక్తులు చనిపోయారు. ఈ నేపథ్యంలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై అభాండాలు వేసేందుకు కూటమి ప్రభుత్వం మరో కొత్త డ్రామాకు తెరలేపింది. ఇందులో భాగంగానే 2019–24 మధ్య కాలంలో ఆలయాల్లో దాడుల తరహా ఘటనలపై ముగ్గురు మంత్రులతో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. భవిష్యత్‌లో ఆలయాల్లో తొక్కిసలాటల తరహా ఘటనలు జరగకుండా చేపట్టాల్సిన నివారణ చర్యలు, తీసుకుంటున్న చర్యలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను ఈ కమిటీలో సభ్యులుగా నియమించింది. దేవదాయ శాఖ ఎక్స్–అఫీషియో సెక్రటరీ మంత్రుల కమిటీకి కన్వీనర్‌గా.. లా అండ్ ఆర్డర్ డీజీపీ, దేవదాయ శాఖ కమిషనర్ కమిటీకి సహాయకులుగా వ్యవహరిస్తారని ఆ ఆదేశాల్లో పేర్కొంది. ఈ ఏడాది జనవరి 8న తిరుమల ఆలయ చరిత్రలోనే తొలిసారి వైకుంఠ ఏకాదశి దర్శన టికెట్ల క్యూలైన్‌లో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృత్యువాత పడ్డారు. ఆ ఘటన జరిగిన నాలుగు నెలలకే ఏప్రిల్ 30న సింహాచలంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ చందనోత్సవం సందర్భంగా క్యూలైన్ పక్కన ఉన్న గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందారు. ఆరు నెలల అనంతరం నవంబర్ 1న కార్తీక ఏకాదశి సందర్భంగా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట జరిగిన 9 మంది భక్తుల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిటీ ఏర్పాటు చేసిన బాబు సర్కారు 2019–24 మధ్య కాలంలో ఆలయాల్లో చోటుచేసుకున్న ఘటనలపై కమిటీ అంటూ కలరింగ్ ఇస్తూ కొత్త డ్రామాకు తెరలేపింది

అందెశ్రీ మృతికి సీపీఐ సంతాపం

సాక్షి, అమరావతి: ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ హఠాన్మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. అందెశ్రీ తనకు ఎదురైన సమస్యలను, తన జీవితాన్ని ప్రభావితం చేసిన సంఘటనలను కవితలు, రచనలుగా మలిచి ఎంతో మందిని ప్రభావితం చేశారని కొనియాడారు. ఎన్నో ఉద్యమ గీతాలు రాసిన అందెశ్రీ మరణం సాహిత్య రంగానికి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మంత్రి 'డోలా'తో యునిసెఫ్ ప్రతినిధుల భేటీ

సాక్షి, అమరావతి : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామితో యునిసెఫ్ ప్రతినిధులు సోమవారం భేటీ అయ్యారు. వెలగపూడి సచివాయలంలో జరిగిన ఈ భేటీలో.. రాష్ట్రంలోని అంబేడ్కర్ గురుకులాల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యతపై ఉపాధ్యాయులకు శిక్షణ, పోషకాహారం తయారీపై వంట మనుషులకు శిక్షణ తదితర అంశాలపై చర్చించారు. వాటికి అవసరమైన సాంకేతిక సహకారం అందించే అంశంపైనా చర్చ జరిగింది. ఈ భేటీలో యూనిసెఫ్ ప్రతినిధులు జిలాలెం, సాలిమాతోపాటు ఎస్సీ గురుకులాల సంస్థ కార్యదర్శి వి. ప్రసన్న వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

13 లక్షల ఎకరాలు కొట్టేసేందుకు కుట్ర

అసైన్డ్ భూములపై నిషేధం ఎత్తివేత నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి : దళితులు, బలహీనవర్గాలకు చెందిన అసైన్డ్ భూములను అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించుకున్న పెత్తందారులకు దొడ్డిదారిన 99 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడానికి వీలుగా 9/77 అసైన్డ్ చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఏపీ వ్యవసాయ శాఖ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ సవరణతో దాదాపు 13 లక్షల ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైన అసైన్డ్ భూములపై ఉన్న నిషేధాన్ని ఈరోజు ఎత్తివేస్తూ వాటిని పెద్దలకు కట్టబెట్టనున్నారని చెప్పారు. దీనివల్ల.. లక్షలాది దళిత, బలహీన వర్గాల కుటుంబాలు అసైన్డ్ భూములపై తమ హక్కులు కోల్పోతారని ఆయన చెప్పారు. ఈ నిర్ణయంతో టీడీపీ కూటమి ప్రభుత్వం పేదలకు తీవ్రమైన ద్రోహం చేసిందన్నారు. రాష్ట్ర కేబినెట్ ఆమోదాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నేడు గుంటూరుకు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ రాక

వాటర్‌షెడ్ మహోత్సవ్ సదస్సుకు హాజరు

సాక్షి, న్యూఢిల్లీ : గుంటూరులో సోమవారం ప్రారంభమైన 'వాటర్ షెడ్ మహోత్సవ్'కు కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మంగళవారం హాజరుకానున్నారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన నీరు, నేల సంరక్షణ కార్యకలాపాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో, ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వాటర్‌షెడ్ మహోత్సవ్‌ను గుంటూరు లయోలా పబ్లిక్ స్కూల్ గ్రౌండ్స్‌లో రెండ్రోజులపాటు నిర్వహిస్తోంది. ఈ సదస్సులో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై) 2.0 వాటర్‌షెడ్ అభివృద్ధి, అమలు పురోగతిని సమీక్షిస్తారు.

అక్రమ అరెస్ట్‌లకు భయపడే ప్రసక్తే లేదు

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలూరి సాంబశివారెడ్డి

వెంకటాచలం: చంద్రబాబు ప్రభుత్వం మోపుతోన్న తప్పుడు కేసులకు, అరెస్ట్‌లకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా చెముడుగుంటలోని సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎన్నారై మాలపాటి భాస్కర్‌రెడ్డితో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఆలూరి సాంబశివారెడ్డి సోమవారం ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ..సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారన్న కారణంగా ఎన్నారై భాస్కర్‌రెడ్డిపై అక్రమ కేసు పెట్టి జైలుకు పంపడం దారుణమన్నారు. తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఏపీకి వచ్చిన భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేసి కక్ష సాధించడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొందరిని టార్గెట్ చేసి అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని ఆరోపించారు. భాస్కర్ రెడ్డి తండ్రి కర్మక్రియలు ఇంకా పూర్తి కాలేదని, ఇలాంటి పరిస్థితుల్లో అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. భాస్కర్‌రెడ్డి జైల్లో కూడా చాలా ధైర్యంగా ఉన్నాడని, మరోసారి వైఎస్ జగన్‌ను సీఎం చేసేందుకు అందరూ కలిసి కట్టుగా కృషి చేద్దామని అంటున్నారని చెప్పారు.

పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

రెండు వారాలు వాయిదా వేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఇరువురు టీడీపీ నేతల హత్య కేసులో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట రామిరెడ్డిపై బనాయించిన అక్రమ కేసు విషయంలో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిన్నెల్లి సోదరులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు దీనికి నిరాకరించడంతో సుప్రీంను ఆశ్రయించారు. వీరికి సుప్రీం మధ్యంతర రక్షణ కల్పించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ముందుకు సోమవారం మరోసారి ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. ఏపీ ప్రభుత్వం నుంచి తగు సూచనలు తీసుకోవాల్సి ఉందని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తదుపరి విచారణను ధర్మాసనం రెండువారాలకు వాయిదా వేసింది.

రేపటి ర్యాలీలను జయప్రదం చేద్దాం

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం పిలుపు



రవిచంద్ర

సాక్షి, అమరావతి : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన ర్యాలీలను విజయవంతం చేద్దామని రాష్ట్రంలోని విద్యార్థి లోకానికి ఆ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. రవిచంద్ర సోమవారం పిలుపునిచ్చారు. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేలా జరిగే ఈ ర్యాలీలో రాష్ట్రంలోని విద్యార్థిలోకం అంతా పాల్గొంటుందని ఆయన చెప్పారు. దీన్ని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. అందరి భాగస్వామ్యంతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆందోళనలు, ర్యాలీలతో జాతీయస్థాయిలో చర్చ జరిగి చంద్రబాబు ప్రభుత్వం దిగివస్తుందన్నారు. ఈ పోరాటంలో కలిసి వచ్చే విద్యార్థి, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్లు.. ఇలా అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని రవిచంద్ర చెప్పారు. సోషల్ మీడియా, డిజిటల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాలని ఆయన విద్యార్థులను కోరారు. అన్ని తరగతుల వారినీ ఒక్క తాటిపైకి తీసుకొచ్చి ర్యాలీలు విజయవంతం చేయాలన్నారు.

వీఈఆర్ అభివృద్ధికి ప్రణాళిక

- రోడ్లు సరిగా లేవని ఫీడ్‌బ్యాక్
- శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు రాష్ట్రపతి, ప్రధాని
- సమీక్ష సమావేశాల్లో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు ఉన్న విశాఖ ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్) అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో వచ్చే పెట్టుబడులు, పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం పాలసీలను రూపొందించాలని సూచించారు. ఆయన సోమవారం సచివాలయంలో వీఈఆర్ అభివృద్ధిపై సమీక్షించారు. సీఎం మాట్లాడుతూ వీఈఆర్ గ్లోబల్ ఎకనామిక్ హబ్‌గా మారుతుందని చెప్పారు. రీజియన్‌లోని పోర్టులను రైల్వేలైన్లతో అనుసంధానం చేయనున్నట్టు తెలిపారు. ఈ పోర్టుల నుంచి హింటర్ ల్యాండ్‌లోని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాల కార్గో కూడా రవాణా జరిగేలా చూడాలని సూచించారు. మూలపేట పోర్టు నుంచి దుగరాజపట్నం పోర్టు వరకు షిప్ బిల్డింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇక్కడ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు ప్రకటించిన వివిధ ప్రాజెక్టుల ద్వారా 15 బిలియన్ డాలర్లు, ప్రైవేటు కార్పొరేట్లు, సంస్థల ద్వారా 85 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన విశాఖ ఎకనామిక్ రీజియన్ అథారిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులు సీఎంను కోరారు.

ముందు అవగాహన.. ఆ తర్వాతే చలానా

రోడ్డు ప్రమాదాల నివారణపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. నిబంధనల ఉల్లంఘనలపై అవగాహన కల్పించిన తర్వాతే చలానాలు విధించాలన్నారు. ఆయన సోమవారం సచివాలయంలో ఆర్టీజీఎస్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా హెల్మెట్లు, సీట్‌బెల్ట్ లేకుండా వాహనాలు నడిపే వారికి అవగాహన కల్పించడంతోపాటు వారు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనే మెసేజ్‌లు ఫోన్లకు పంపాలని సూచించారు. ఆ తర్వాత కూడా వారు నిబంధనలను ఉల్లంఘిస్తుంటే అప్పుడు చలానాలు వేయాలని చెప్పారు. రోడ్లు సరిగా లేవనే ఫీడ్‌బ్యాక్ వస్తోందని చెప్పారు. రోడ్లపై గుంతల్లేకుండా వెంటనే మరమ్మతులు పూర్తిచేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా జాబ్ మేళాలు నిర్వహించాలని సూచించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, రైతులకు సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. రెండున్నర నెలల్లో రిజిస్ట్రేషన్ సేవల్లో మార్పులు కనిపించాలని చెప్పారు.

పుట్టపర్తికి 19న ప్రధాని, 22న రాష్ట్రపతి రాక

శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తికి ఈ నెల 19న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వస్తున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అధికారికంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీఎస్ కె.విజయానంద్, ఆర్థిక, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, పర్యాటక, ఐటీ, మున్సిపల్, పరిశ్రమలు, వ్యవసాయ, ప్రణాళికాశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు 50 ఎంఎస్‌ఎంఈ పార్కులకు శ్రీకారం

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 50 ఎంఎస్‌ఎంఈ పార్కుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు సీఎం చంద్రబాబు చేయనున్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెదఈర్లపాడులో 20 ఎకరాల్లో రూ.7 కోట్లతో అభివృద్ధి చేసిన ఎంఎస్‌ఎంఈ పార్కును ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఇక్కడ నుంచి వర్చువల్‌గా మిగతా వాటి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు.

మనల్ని ఏకతాటిపైకి తెచ్చిన గేయం వందేమాతరం: సీఎం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారతీయులందరినీ ఏకతాటిపైకి తెచ్చిన గేయం వందేమాతరం అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సాంస్కృతిక శాఖ సోమవారం నిర్వహించిన వందేమాతరం 150 వసంతాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. ఆడిటోరియంలో ఉన్న ఆహూతులతో కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చిన్న కారణాలు పెద్ద భయాలు

• ఫోబియా

భయం అనేది ఒక స్వాభావికమైన ఉద్వేగం. అది ప్రతి జీవితో పాటు మానవులందరిలో ఉండేదే. మనకు ముప్ప తెచ్చిపెట్టే అంశాల పట్ల భయం ఉండటం వల్లనే ఆ ప్రమాదాల నుంచి దూరంగా వెళ్తారు. అందువల్లనే మనుగడ సాధ్యమవుతుంది. ఇలా చూసినప్పుడు అన్ని జీవులతో పాటు మానవ మనుగడను సుసాధ్యం చేసే సహజమైన ఉద్వేగం అది. అయితే కొందరిలో ఆ భయం మోతాదులు చాలా ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు ఓ బొద్దింక వల్ల ఎలాంటి ప్రమాదం లేకపోయినా కొందరు దానికి భయపడతారు. ఇంకొందరు గోడ మీది బల్లిని చూస్తే చాలు వణికిపోతారు. ఇలా ఉండాల్సినంత కాకుండా ఈ భయం అర్థం లేకుండా పెరిగిపోతూ, దాని వల్ల యాంగ్జైటీ పెరిగిపోతూ... ఆ భయం మన రోజువారీ వ్యవహారాలకు సైతం అడ్డం పడేటంతగా పెరిగిపోయి ఏ పనీ చేయలేనంతగా ఆందోళన కలిగిస్తుంటే దాన్ని 'ఫోబియా' గా అభివర్ణిస్తారు. గతంలో కంటే ఇప్పుడు ఫోబియాలకు మంచి చికిత్స ప్రక్రియలే అందుబాటులో ఉంది. ఈ ఫోబియాల గురించి అవగాహన కోసం ఈ కథనం.



ఒక కేస్ స్టడీ : ఇటీవలే సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం అమీన్‌పూర్‌కు చెందిన మనీషా అనే గృహిణి చీమలంటే భయంతో ఆత్మహత్య చేసుకుంది. ఇక ఈ చీమలతో పాటు బతకడం నా వల్ల కాదంటూ సూసైడ్ నోట్ రాసి మరీ ఆమె ఈ ఘాతుకానికి ఒడిగట్టిందంటూ వార్తలు వచ్చాయి. ఇలా చీమల పట్ల ఉండకూడని భయానికి సైకియాట్రీలో ఉన్న పేరు 'మిర్మెకో ఫోబియా'.

ఏమిటీ ఫోబియాలు?

ఒక్కమాటలో చెప్పాలంటే అంతగా భయపడకూడని అంశాల పట్ల కూడా తీవ్రమైన భయం ఉండటమే 'ఫోబియా' అని చెప్పవచ్చు. ఈ భయాల తీవ్రతలు చాలా మందికి వేర్వేరుగా ఉంటాయి. ఉదాహరణకు కొందరికి ఎత్తైన ప్రదేశాలంటే భయం. మరికొందరికి అన్నివైపులా మూసి ఉండే ప్రదేశాలు... అంటే లిఫ్టుల వంటి చోట్ల భయంగా ఉంటుంది. ఇంకొందరికి హైవేల పై డ్రైవింగ్ అంటే విపరీతమైన ఆందోళన. ఇలా చాలామందిలో చాలారకాల భయాలుంటాయి. పాములూ, కీటకాలూ, సూదులూ అంటే అర్థం లేని భయాలుంటాయి. అంతెందుకు... 'మన్మథుడు' సినిమాలో హీరోకి నీళ్లపై నిర్మించిన వంతెనపై నడవడం కూడా తనకు భయమంటూ చెబుతాడు. ఇలా చాలా మందికి చాలావాటి పట్ల అంటే... ఎరుగుతున్న కీటకాలంటే (ఉదా గబ్బిలాలు), పాకుతుండే పాములంటే... ఆఖరికి సూది వాడాలన్నా అది గుచ్చుకుంటుందేమోనని కొందరికి భయమే. ఇలా ఏ అంశం గురించైనా అర్థం లేని భయాలు కలుగుతుండవచ్చు. కొందరిలో ఇవి చిన్నప్పట్నుంచీ ఉంటే... మరికొందరిలో పెద్దయ్యాక అభివృద్ధి చెందుతుంటాయి.

నిర్హేతుకమైన ఈ భయాల ప్రభావాలు ఇలా...

అకారణమైన ఈ భయాలు కొందరిలో వాళ్ల పనులను వాళ్లు చేసుకోనివ్వనంతగా దుష్ప్రభావాన్ని చూపుతాయి. చాలామంది తాము చేయాల్సిన పనిని వాయిదా వేయడం లేదా దాన్నుంచి తప్పుకుని తిరగడం చేస్తూ సమస్య నుంచి దూరంగా పారిపోతుంటారు. ఇది జీవితంలో ఎన్నో ఆనందాలను దూరం చేస్తుంది లేదా సులభంగా జరిగిపోయే పనులనూ జరగకుండా అడ్డుపడుతుంటుంది. ఉదాహరణకు ఓ ఆఫీసులో ఉద్యోగం చేసే వ్యక్తికి ఎత్తులంటే భయం. అతడు ఉద్యోగం చేసే ఆఫీసు ఏ పదో అంతస్తులోనో ఉంటే... మంచి వేతనం వచ్చే ఉద్యోగాన్ని కూడా తేలిగ్గా వదిలేసుకుంటాడు. అలాగే మరో వ్యక్తికి ఎత్తైన ఫ్లై ఓవర్ అంటే భయం. దాంతో ఫ్లై ఓవర్ ఎక్కితే కేవలం రెండు కిలోమీటర్లలో అధిగమించే దూరాన్ని... అదనంగా మరో పది కిలోమీటర్లు ప్రయాణించి చేరుతాడు. నిజానికి చూసేవారికి ఈ భయాలు అర్థం లేనివిగా కనిపిస్తాయి. పైగా ఇలాంటి చిన్నకారణాలతో పెద్ద పెద్ద ప్రయోజనాలు కోల్పోతారా అని ఆశ్చర్యం వేస్తుంది. కానీ ఫోబియాలతో బాధపడేవారికి అదే జీవన్మరణ సమస్య.

ఈ ఫోబియాల (భయాల) విస్తృతి ఎంతంటే...

ఈ లోకంలో పుట్టిన ప్రతి వ్యక్తిలోనూ అన్ని రకాల భయాలూ అంతో ఇంతో ఉండనే ఉంటాయి. నిజానికి ఈ భయాలకు ఏ వ్యక్తి కూడా అతీతుడు కాడు. ఉదాహరణక బల్లి మీద పడితే ఎవరైనా మొదట ఆందోళన చెందుతారు. కాకపోతే ఆ తర్వాత వెంటనే సర్దుకుంటారు. కానీ మనలోని 29% మందిలో ఏదో ఒక అంశం పైన 'ఫోబియా'లు ఉండనే ఉంటాయి. అందునా పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ ఫోబియాలు రెట్టింపు మందిని బాధిస్తుంటాయని అంచనా.

భయం, ఫోబియాల మధ్య తేడా...

ఏదైనా ఆందోళన గొలిపే పరిస్థితుల్లో భయం కలగడమనేది చాలా సహజమైన ప్రక్రియ. ప్రమాదకరమైన ఆ పరిస్థితులనుంచి బయటపడటానికీ లేదా వాటి నుంచి దూరంగా పరుగెత్తడానికి భయం అవసరం కూడా. నిజానికి భయం కలగడం ఒక రక్షణాత్మకమైన చర్య. ఏవైనా ప్రాణాంతకమైన పరిస్థితుల్లో దాన్ని ఎదుర్కోడానికీ లేదా వీలుకాని పక్షంలో దాన్నుంచి దూరంగా పారిపోవడానికి ఈ భయం తోడ్పడుతుంది. దీన్నే ఫైట్ ఆర్ ఫ్లైట్ మెకానిజమ్‌గా చెబుతారు. జీవులన్నింటి మనుగడకూ ఇదే అంశం దోహదపడుతుంది. ఇదీ భయం వల్ల కలిగే ప్రయోజనం.

కానీ ఫోబియాలో ఇలా జరగదు. అక్కడ వాస్తవంగా లేని ప్రమాదాన్ని సైతం బాధితులు ఊహిస్తూ ఉంటారు. ఉదాహరణకు చాలా భయంకరమైన కుక్క ఎదురైనప్పుడుఅది కరుస్తుందేమో అని భయపడటం సహజం. కానీ ఒకవేళ అది పెంపుడు కుక్క అయినప్పటికీ భయపడటంలో అర్థం ఉండదు. అలాగే పాము కనిపిస్తే భయం కలగడం సహజం. అయితే టీవీ స్క్రీన్ మీద పాము కనిపించినా లేదా పాము బొమ్మ చూసినా భయపడటం అంటే అది 'ఫోబియా'కు సూచన అని అర్థం. ఇక్కడ డాగ్స్ వల్ల కలిగే అనవసర భయాలను 'సైనో ఫోబియా' (గ్రీక్ భాషలో సైనో అంటే కుక్క అని అర్థం) అనీ, పాముల వల్ల కలిగే భయాన్ని 'ఒఫిడియో ఫోబియా' లేదా 'ఓఫియో ఫోబియా' అంటారు. కొన్నిసార్లు దాన్నే 'హెర్పెటో ఫోబియా' అని కూడా అంటారు. అంటే 'ఒఫిడియో ఫోబియా'లో పాములంటే భయమైతే 'హెర్పెటో ఫోబియా'లో పాము జాతికే చెందిన బల్లులూ, బల్లి లాంటి ఇతర జీవుల భయాలను కలుపుకుని 'హెర్పెటో ఫోబియా' అంటారు. ఇక ఈ భయాలు ఎంత విచిత్రంగా ఉంటాయంటే అరుదుగా కొందరికి స్నానం చేయడమన్నా భయముంటుంది దీన్ని 'ఆల్బుటోఫోబియా' అనీ, పసుపురంగుకు భయపడటాన్ని 'గ్జాంథో ఫోబియా' అనీ, చివరకు అద్దంలో చూసుకోడానికి బయపడటాన్ని 'స్పెక్ట్రోఫోబియా' అని అంటారు.



భయాలు ఎలా మొదలవుతాయంటే...

సాధారణంగా చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు వాళ్లలో చాలా అనవసరమైన భయాలు ఉంటాయి. వయసు పెరుగుతున్న కొద్దీ అవి తగ్గుతూ పోతుంటాయి. ఉదాహరణకు పిల్లలందరికీ చీకటి అంటే భయం. అయితే వయసు పెరుగుతున్నకొద్దీ ఆ భయాన్ని వారు క్రమంగా అధిగమిస్తారు. ఒకవేళ అధిగమించనంత దాన్ని పూర్తిగా ఫోబియా అనడానికి వీలు కాదు. అయితే ఏదైనా భయం వల్ల మనం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కోవడం, దానివల్ల మన రోజువారీ పనులకూ, సామాజిక జీవనానికీ, పిల్లల్లోనైతే స్కూల్ జీవితానికీ, నిద్రకు ఆటంకం కలిగితే దాన్ని ఫోబియాగా గుర్తించి, దానికి అవసరమైన చికిత్స అందించాల్సి ఉంటుంది.

ఏయే వయసు పిల్లల్లో ఎలాంటి భయాలు..?

పిల్లల్లో సాధారణంగా కొన్ని కొన్ని వయసుల్లో కొన్ని విషయాలంటే భయం ఎక్కువగా ఉండవచ్చు. అవి...

- **0 – 2 ఏళ్ల పిల్లల్లో ...** పెద్ద శబ్దాల పట్ల, అపరిచితులతో, తల్లిదండ్రులనుంచి విడిగా ఉండాల్సి రావడం వల్ల, పెద్ద పెద్ద వస్తువులంటే, కొన్ని జంతువుల పట్ల భయం ఉంటుంది.
- **3 – 6 ఏళ్ల పిల్లల్లో ...** దెయ్యాలు, భూతాల వంటి అభూత కల్పనాత్మక పాత్రలంటే భయంతో పాటు ఒంటరిగా పడుకోవాల్సి రావడం, వింత శబ్దాలంటే భయం కలుగుతుంది.
- **7 – 16 ఏళ్ల పిల్లల్లో ...** ఇలాంటి పిల్లల్లో అభూతకల్పనాత్మకమైన అంశాల కంటే వాస్తవ విషయాలపట్ల భయం కలుగుతుంది. అంటే ఆడుతున్నప్పుడు గాయాలవుతాయనే భయాలు, జబ్బు చేసినప్పుడు కలిగే భయాలు, స్కూల్లో పెర్ఫార్మెన్స్ తగ్గుతున్నప్పుడూ, ప్రకృతి విలయాలు, ఇతరత్రా ప్రకృతి విపత్తులు, ఉత్పాతాలంటే భయాలుంటాయి.

ఫోబియాలు కలగడానికి కారణమయ్యే అంశాలు :

ఫోబియాలను కలిగించడానికి కారణమయ్యే అంశాలు ఇవీ అంటూ నిర్దిష్టంగా చెప్పడానికి కుదరదు. అయితే చాలా సందర్భాల్లో కొన్ని భయాలు పెద్దల నుంచి పిల్లలకు వస్తుంటాయి. ఇలా కుటుంబాల్లో వంశపారంపర్యంగా వస్తుండవచ్చు. ఈ భయాలకు సాంస్కృతిక అంశాలూ కారణం కావచ్చు. తల్లిదండ్రులకు ఒక తరహా భయాలు ఉంటే అవి పిల్లలకు వచ్చే అవకాశాలు మూడింతలు ఎక్కువ. పిల్లల పట్ల మరీ ఎక్కువ రక్షణాత్మకంగా వ్యవహరించే తల్లిదండ్రుల పిల్లలతో పాటు... మరీ ఏమాత్రం పట్టించుకోకుండా వదిలేసిన తల్లిదండ్రుల పిల్లల్లోనూ ఫోబియాలు వచ్చే అవకాశాలు ఎక్కువ. ఏదైనా ఒక భయంకరమైన పరిస్థితిని ఎదుర్కొనలేక దాన్ని అధిగమించే ప్రయత్నంలో తీవ్రమైన ఒత్తిడి అనుభవించి, అప్పటికీ అధిగమించని వారిలో ఫోబియాలు అభివృద్ధి చెందే అవకాశాలు మరీ ఎక్కువ.

డాక్టర్ పులి వనజారెడ్డి
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్

సాధారణంగా మనలో ఉండే భయాలు, ఫోబియాలు :

సాధారణంగా మనందరిలో భయాలూ, ఫోబియాలను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి...

- **జంతువుల పట్ల ఫోబియా...** చాలామందికి పాములు, తేళ్ల వంటి విషజీవులన్నా, సాలెపురుగులూ లేదా ఇతర కీటకాలూ, ఎలుకలు, కుక్కలు, బొద్దింకలు, గబ్బిలాలంటే భయంగా ఉంటుంది.
- **కొన్ని రకాల పరిసరాల కారణంగా వచ్చే ఫోబియా...** ఉదాహరణకు ఎత్తుకు ఎక్కాక కిందికి చూడటం వల్ల, తుఫానుల్లో చిక్కుకోవడం, విశాలమైన జలరాశి మధ్యన ఉన్నప్పుడు ఆ అనంతమైన నీటిని చూడటం వల్ల, చిమ్మచీకటిలో ఉండిపోవాల్సి రావడం పట్ల భయాలు కలుగుతాయి.
- **కొన్ని పరిస్థితుల వల్ల కలిగే ఫోబియాలు:** కొన్ని పరిస్థితుల్లో మనకు చాలా భయంగా ఉంటుంది. ఉదాహరణకు... అన్నివైపులా మూసుకుపోయి ఉన్నట్లుండే పరిసరాల పట్ల... అంటే ఉదాహరణకు ఊపిరాడనట్టుగా ఉండే ఇరుకు గదులు, లిఫ్టుల్లో చిక్కుకుపోవడాల పట్ల (క్లాస్ట్రోఫోబియా), వేగంగా డ్రైవింగ్ చేస్తున్న సమయాల్లో, గుహల్లోకి ప్రవేశించినప్పుడు, బ్రిడ్జ్‌పైకి వెళ్లినప్పుడు.
- **గాయం, రక్తం, ఇంజెక్షన్ వంటి భయాలు :** చాలామంది ఇంజెక్షన్ వంటి వాటికి భయపడుతుంటారు. లేదా ఎవరికైనా జబ్బుగా ఉండటం లేదా తాము చనిపోతామేమో లాంటి భయాల వంటివి ఉంటాయి.

ఫోబియా లక్షణాలు...

ఏదైనా భయం కాస్తా ఫోబియాగా రూపొందినప్పుడు మొదట తీవ్రమైన ఉద్విగ్నత (యాంగ్జైటీ) కలిగి అది కాస్తా మరింత తీవ్రమైన (ప్యానిక్ అటాక్) రూపం తీసుకుంటుంది. దీన్ని 'ఫుల్‌బ్లోన్ ప్యానిక్ ఎటాక్'గా చెప్పవచ్చు. మనం ఏదైనా విషయానికీ లేదా అంశానికీ భయపడుతుంటే... దానికి మనం ఎంత దగ్గరగా ఉంటే భయం అంతగా తీవ్రమవుతుంది. ఇక ఈ భయం తీవ్రత ఎంత ఎక్కువగా ఉంటే దాన్ని అధిగమించడం లేదా దాన్నుంచి బయటపడటం అంతే కష్టమవుతుంది. ఈ ఆందోళన / భయం / ఉద్విగ్నత (యాంగ్జైటీ) తాలూకు లక్షణాలు రెండు రకాలుగా కనిపిస్తాయి. అవి...

భౌతికంగా కనిపించే లక్షణాలు : ● ఊపిరి పీల్చుకోవడం కష్టం కావడం ● గుండె వేగం పెరగడం ● చెమటలు పట్టడం ● ఛాతీలో నొప్పి లేదా ఛాతీ బిగదీసుకుపోవడం ● వణుకు ● నిద్రవస్తున్నట్లు లేదా కళ్లు తిరుగుతున్నట్లు అనిపించడం ● కడుపులో తిప్పినట్లుగా / దేవినట్లుగా ఉండటం. ● ఒంట్లోంచి వేడి ఆవిరులు బయటకు వస్తున్న భావన.

ఉద్వేగపూరితమైన లక్షణాలు : ● యాంగ్జైటీ ఎక్కువ కావడం ఆ తర్వాత ప్యానిక్ అటాక్‌గా మారడం ● స్థలం లేదా పరిస్థితుల నుంచి పారిపోవాలన్న బలమైన కాంక్ష ● తనపై తాను అదుపు కోల్పోవడం ● కాసేపట్లో చచ్చిపోతామేమోన్న భావన ● మితిమీరి స్పందిస్తున్నామని తెలిసినా దాన్ని నియంత్రించుకోలేని శక్తి.

ఫోబియాల దుష్ప్రభావాలిలా : ఫోబియాలకు చికిత్స చేయించకుండా వదిలేస్తే అవి వ్యక్తిగత జీవితాన్ని దుర్భరం చేస్తాయి. వాటిని దాచిపెట్టినా సరే... దాని ఫలితాలు జీవితాన్ని చాలా తీవ్రంగా ప్రభావితం చేయవచ్చు. ఉదాహరణకు విమాన ప్రయాణం అంటే భయం ఉంటే దాన్ని దాచితే జీవితంలో చాలా కోల్పోవచ్చు. అలాగే కొన్ని ఫోబియాల వల్ల వ్యక్తిగత జీవితంలో స్నేహితులను, బంధువులకు దూరం కావడం, ఉద్యోగం కోల్పోవాల్సి రావడం వంటి తీవ్రపరిణామాలు సంభవించవచ్చు. ఫోబియా ఉన్నవారు వాటిని అధిగమించదలచినప్పుడు క్రమంగా మెరుగుదల కనిపిస్తుంది తప్ప... అకస్మాత్తుగా అంతా చక్కబడదు. మిగతా వారిలో పోలిస్తే ఆల్కహాల్ అలవాటు ఉన్నవారికి ఫోబియాలకు గురయ్యే అవకాశాలు పదింతలెక్కువ. ఇక అలాగే ఫోబియాలు ఉన్నవారు ఆల్కహాల్‌కు అలవాటు పడే అవకాశాలూ రెండింతలెక్కువ. ఒక్కోసారి ఫోబియా వల్ల కలిగే యాంగ్జైటీ (ఉద్విగ్నత) ప్రమాదకరమైన పరిస్థితికి, కొన్నిసార్లు గుండెజబ్బులకు దారితీయవచ్చు.





ఫోబియా వర్గీకరణ ఇలా...

సైకియాట్రిస్టులు ఫోబియాలను సాధారణంగా మూడు రకాలుగా వర్గీకరిస్తుంటారు.

1. సామాజిక ఫోబియా (సోషల్ ఫోబియా) : సాధారణంగా ఇవి అందరిలోనూ ఉండే సహజ భయాలే అయినా కొందరిలో మితిమీరి ఉంటాయి. ఉదాహరణకు కొందరు నలుగురిలో మాట్లాడటానికి చాలా ఎక్కువగా భయపడుతుండవచ్చు. అలాగే మరికొందరు బయట తినడం అనే విషయం పట్ల తీవ్రంగా ప్రతిస్పందిస్తూ దాని వల్ల కలిగే పరిణామాలను అతిగా ఊహించుకుంటారు. సాధారణంగా సోషల్ ఫోబియాలు చికిత్సకు ఒక పట్టాన తేలిగ్గా లొంగవు. సామాజిక ఫోబియాలు తమకు చిన్నప్పుడు ఎదురైన సామాజిక అవమానాల కారణంగా కలుగుతాయి. సాధారణంగా పదవ ఏటి కంటే ముందు ఎదురైన సామాజిక అవమానాల కారణంగా ఏర్పడ్డ భయాలు కొందరిలో కాలక్రమేణా తొలగిపోవచ్చు. కానీ యుక్తవయసులో తమ స్నేహితుల నిరాదరణకు గురైన కారణంగా ఏర్పడ్డ భయాలు అంత తేలిగ్గా తొలగిపోవు. కొందరిలో అవి వయసుతో పాటు పెరుగవచ్చు.

2. నిర్దిష్ట ఫోబియాలు (స్పెసిఫిక్ ఫోబియాస్): ఈ ఫోబియాలు నిర్దిష్టంగా ఫలానా అంశం వల్ల కలుగుతుండే భయాలు అని చెప్పవచ్చు. ఉదాహరణకు పాములు, నీళ్లు, ఎత్తులు, లిఫ్ట్, విమానప్రయాణం, వ్యాధుల పట్ల భయం మొదలైనవి.

3. అగారోఫోబియా : ఇది ఇంటికి దూరంగా ఉన్నప్పుడు లేదా మనకు సురక్షితంగా ఉన్న స్థలానికి దూరంగా ఉన్నప్పుడు కలిగే తీవ్రమైన భయాలు అని చెప్పవచ్చు.

ప్యానిక్ అటాక్ అంటే...

ఏదైనా ఫోబియాకు గురై భయపడటంలోని తీవ్రత తారస్థాయికి చేరినప్పుడు కలిగే మానసిక స్థితిని ప్యానిక్ అటాక్‌గా చెప్పవచ్చు. ఇది కలిగినప్పుడు కనిపించే లక్షణాలివి... తమకు భయంగొలిపే ప్రదేశం / అంశం / పరిస్థితి నుంచి దూరంగా పారిపోవాలన్న బలమైన కాంక్ష ● తీవ్రమైన భయం ● గుండెవేగంలోని తీవ్రత చాలా ఎక్కువగా పెరగడం ● శ్వాస అందకపోవడం ● వణుకు ● ఒక్కోసారి స్పృహతప్పడం ● చనిపోయినట్లుగా అనుభూతి చెందడం.

ఫోబియాలూ... చికిత్స :

ఫోబియాకు సమర్థమైన చికిత్స సైకోథెరపీ (కౌన్సెలింగ్). దీనితో పాటు కొన్నిసార్లు కొన్ని మందులు కూడా ఉపయోగించాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఈ రెండూ అవసరమవుతాయి.

మొదట స్వయంసహాయం...

ఫోబియాల విషయానికి వస్తే స్వయంసహాయ పద్ధతులు చాలా బాగా పనిచేస్తాయి. అయితే ఒకవేళ వాటి వల్ల రోగి యాంగ్జైటీ తగ్గక ప్యానిక్ అటాక్స్ వస్తూనే ఉంటే అప్పుడు నిపుణుల సహాయం కావాలి. ఇప్పుడు శుభవార్త ఏమిటంటే... గతంతో పోలిస్తే ఫోబియాల చికిత్సతో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి.

రిలాక్సేషన్ టెక్నిక్స్ అభ్యాసం చేయడం...

మనకు ఏదైనా విషయంలో భయం వేయగానే ఉద్విగ్నత (యాంగ్జైటీ) కలుగుతుంది. దాని వల్ల కొన్ని గుండెవేగం పెరగడం, ఊపిరి ఆడనట్లుగా ఉండటం (సఫొకేటింగ్) వంటి భౌతిక లక్షణాలు కనిపిస్తాయి. వీటి వల్ల మన భయం మరింతగా పెరిగినట్లయి, నిరాశలోకి కూరుకుపోతారు. అందుకే యాంగ్జైటీని అధిగమించే ప్రయత్నంలో భాగంగా రిలాక్సేషన్ టెక్నిక్స్‌ను నేర్చుకుని, వాటిని అభ్యాసం చేయడం వల్ల క్రమంగా ఉద్విగ్నతను, ప్యానిక్ ఫీలింగ్స్‌ను ఎదుర్కోవచ్చు. రిలాక్సేషన్ టెక్నిక్స్‌లో బలంగా ఊపిరి పీల్చడం (డీప్ బ్రీతింగ్), ధ్యానం, యోగా వంటి వాటితో ఉద్విగ్న పరిస్థితుల్లోనూ స్థిమితంగా ఉండటం ప్రాక్టీస్ చేయవచ్చు.

ప్రతికూల ఆలోచనలను అధిగమించడం...

వాస్తవానికి ఒక ఫోబియా స్థితిలో అసలు భయం కంటే... దాని వల్ల కలిగే ప్రతికూల (నెగెటివ్) ఆలోచనల వల్లనే ఎక్కువగా భయం కలుగుతుంది. ఉదాహరణకు ఒక బ్రిడ్జ్‌పై వెళ్తుంటే... అది బాగానే ఉన్నా... ఒకవేళ కుప్పకూలితే అన్న ఆలోచన కలగగానే ఆ అనంతర పరిణామాలను ఊహించడం వల్ల కలిగే భయమే ఎక్కువ. కాబట్టి ఇలాంటి అనవసరమైన ప్రతికూల ఆలోచనలను దూరం చేసుకుంటే భయాలు కలగవు. కొన్ని సాధారణ ఆలోచనలనూ వదులుకోవాలి. ఏదైనా సంఘటన తర్వాత మనకూ అది జరుగుతుందనే ఆలోచన రావడం సహజమే అయినా అదేపనిగా వాటి గురించే ఆలోచించకూడదు. ఉదాహరణకు ఇటీవల బస్సు దహనం సంఘటనలూ, బస్సు ప్రమాదాలూ వరసగా చోటు చేసుకున్నాయి. దాంతో మనం ఎక్కే బస్సు కూడా ప్రమాదానికి లోనవుతుందేమో అన్న ఆలోచన రావడం సహజం. కానీ అదే నెగెటివ్ ఆలోచన మనను ఆవరించకుండా చూసుకోవాలి. అలాగే మనం విమాన ప్రయాణం చేస్తూ ఉంటే... ఇటీవల గుజరాత్‌లో కూలినట్టుగా అది కుప్పకూలిపోతోందేమోనని ఆలోచనను మనల్ని ఆవరించకుండా చూసుకోవాలి.

కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (సీబీటీ) : ఫోబియాలను గణనీయంగా తగ్గించేందుకు ఉపయోగపడే చికిత్స ప్రక్రియ కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ. సీబీటీ అంటే ఒకరకమైన కౌన్సెలింగ్. దీనితో పాటు మందులు కూడా వాడాల్సిన అవసరం ఉంటుంది. ఉదాహరణకు యాంటీ డిప్రెసెంట్స్, బీటా బ్లాకర్ మెడిసిన్స్, బెంజోడయాజిపైన్స్ వంటి మందులతో పాటూ సీబీటీ చేయాల్సి ఉంటుంది.

చివరగా... కౌన్సెలింగ్, కాగ్నిటివ్ థెరపీ, రిలాక్సేషన్ టెక్నిక్స్‌లతో పాటు అవసరాన్ని బట్టి మందులు, ఇతర ప్రక్రియలన్నింటి సహాయంతో చేసే చికిత్సలు... వీటన్నింటి సహాయంతో ఇప్పుడు ఫోబియాలను దాదాపుగా పూర్తిగా తగ్గించడం సాధ్యమే.

నిర్వహణ: యాసీన్

ఆడి క్యూ3, క్యూ5 లిమిటెడ్ ఎడిషన్

ముంబై: జర్మన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి... క్యూ3, క్యూ5 సిగ్నేచర్ లైన్ కార్లు ఆవిష్కరించింది. అయిదు ఎక్స్‌టీరియర్ రంగుల్లో లభ్యమయ్యే ఈ రెండు మోడళ్లు పరిమితంగా లభించనున్నాయి. డ్రమటిక్ వెల్కం ప్రొజెక్షన్ కోసం ఆడి రింగ్స్ ఎంట్రీ ఎల్‌ఈడీ ల్యాంపులు అమర్చారు. బ్రాండ్ గుర్తింపు పెంచేలా విలక్షణమైన ఆడి రింగ్స్ డెకాల్స్, డైనమిక్ వీల్ హబ్ క్యాప్‌లు, బెస్పోక్ క్యాబిన్ వాతావరణం కోసం ఫ్రాగ్రన్స్ డిస్పెన్సర్ జోడించారు. మెటాలిక్ కీ కవర్ ప్రీమియం టచ్ అనుభూతినిస్తుంది. స్పోర్టీ ఇంటీరియర్ యాక్సెంట్‌ను అందించే స్టెయిన్‌లెస్ స్టీల్ పెడల్ కవర్లు ఉన్నాయి. ఆడి క్యూ3 ధర రూ.52.31 లక్షలు, ఆడి క్యూ3 స్పోర్ట్‌బ్యాక్ ధర రూ.53.55 లక్షలు, ఆడి క్యూ5 ధర రూ.69.86 లక్షలుగా నిర్ణయించారు. ''భారత్‌లో ఆడి క్యూ3, ఆడి క్యూ5 మోడళ్లు ఆడి 'క్యూ' పోర్ట్‌ఫోలియోకు మూలస్తంభాలు ఉన్నాయి. ఈ సిగ్నేచర్ లైన్‌తో రిఫైన్డ్ పనితీరు, అధునాతన ఫీచర్లను అందిస్తున్నాము'' అని ఆడి ఇండియా అధిపతి బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు.

న్యూమరస్ నుంచి ఎన్-ఫస్ట్ ఈవీ బైక్

ప్రారంభ ధర రూ. 64,999

బెంగళూరు: ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ న్యూమరస్ మోటర్స్ తమ రెండో ఈవీ టూవీలర్ **ఎన్-ఫస్ట్**ను ఆవిష్కరించింది. వేరియంట్‌ను బట్టి తొలి 1,000 మంది కొనుగోలుదారులకు దీని ప్రారంభ ధర రూ. 64,999గా ఉంటుందని సంస్థ వ్యవస్థాపకుడు శ్రేయాస్ శిబులాల్ తెలిపారు. ఇటలీకి చెందిన డిజైన్ హౌస్ వీల్యాబ్‌తో కలిసి దీన్ని తీర్చిదిద్దినట్లు వివరించారు. వేరియంట్‌ని బట్టి 91 కి.మీ. నుంచి 109 కి.మీ. వరకు దీని రేంజి ఉంటుంది. 5–8 గంటల్లో సున్నా స్థాయి నుంచి 100 శాతం వరకు చార్జింగ్ అవుతుంది.

కోటక్ సెక్యూరిటీస్ జీరో బ్రోకరేజీ ఏపీఐలు

న్యూఢిల్లీ: కోటక్ సెక్యూరిటీస్ సంస్థ తమ రిటైల్ ట్రేడర్లకు జీరో బ్రోకరేజ్, జీరో ఫీజు ఫీచర్లతో ట్రేడ్ ఏపీఐలను ప్రవేశపెట్టింది. ఈ ఆల్గో ఆధారిత ఏపీఐలతో 50 మిల్లీ సెకన్లలోపే ఆర్డర్లు ఎగ్జిక్యూట్ అవుతాయని, కోటక్ నియో ట్రేడర్లు..డెవలపర్లకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని సంస్థ తెలిపింది. సాధారణంగా రిటైల్ ఆల్గో ట్రేడింగ్‌కి సంబంధించి ఫిన్‌టెక్ సంస్థలు సబ్‌స్క్రిప్షన్ ఫీజులను, బ్రోకరేజీలు ఏపీఐ యూసేజీ ఫీజులు, బ్రోకరేజీలను వసూలు చేస్తాయని.. కానీ తాము మాత్రం వీటిని విధించడం లేదని పేర్కొంది. సురక్షితమైన విధంగా అల్గోరిథమ్ ట్రేడింగ్‌ని రిటైల్ ట్రేడర్లకు కూడా అందుబాటులోకి తేవాలన్న సెబీ మార్గదర్శకాలకి అనుగుణంగా దీన్ని రూపొందించినట్లు సంస్థ వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-11-2025

విశాఖ	585–00
చిత్తూరు	623–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600–00
విజయవాడ	600–00
రిటైల్ ధర (డజను)	6.50.00
హైదరాబాద్	590–00
వరంగల్	592–00
రిటైల్ ధర	84.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,515.00	2.59
BAJFINANCE	1,086.60	1.88
HCLTECH	1,540.00	1.82
COALINDIA	381.55	1.48
ASIANPAINT	2,651.90	1.46

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	4,284.00	-7.42
MAXHEALTH	1,099.80	-3.13
TATACONSUM	1,141.20	-2.23
APOLLOHOSP	7,534.00	-1.41
ETERNAL	301.8	-1.4

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,144
ఎన్ఎస్ఈ	1,01,318
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,42,116
ఎఫ్ఐఐ	- 4,115
డీఐఐ	+ 5,805

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	60.04	$	59.75
బ్రెంట్	63.95	$	63.83

ఇళ్ల అమ్మకాలు @ రూ.2.98 లక్షల కోట్లు

టాప్-7 నగరాల్లో 7 శాతం వృద్ధి ● అనరాక్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: ఇళ్ల అమ్మకాలు దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) సంఖ్యా పరంగా తక్కువ నమోదు కాగా, విలువ పరంగా వృద్ధి కనిపించింది. అమ్మకాలు 1.93 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో విక్రయాలు 2.27 లక్షల యూనిట్లతో పోల్చి చూస్తే 15 శాతం తగ్గాయి. కానీ, ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ఇళ్ల అమ్మకాల విలువ 2.98 లక్షల కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో విక్రయాల విలువ రూ.2.79 లక్షల కోట్లుగా ఉంది. అంటే విలువ పరంగా 7 శాతం వృద్ధి కనిపించింది. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద విక్రయాల విలువ క్రితం ఆర్థిక సంవత్సరం కంటే 19 శాతం అధికంగా రూ.6.65 లక్షల కోట్లుగా ఉండొచ్చని అనారక్ ఈడీ ప్రశాంత్ ఠాకూర్ అంచనా వేశారు. సగటు ధరలు, అపార్ట్‌మెంట్ సగటు పరిమాణం ఆధారంగా ఈ అంచనా వ్యక్తం చేశారు. 2024–25లో దేశవ్యాప్తంగా ఏడు ప్రముఖ నగరాల్లో ఇళ్ల అమ్మకాలు 4,22,765 యూనిట్లు కాగా, వీటి విలువ రూ.5.59 లక్షల కోట్లుగా ఉన్నట్టు చెప్పారు. 2023–24లో అమ్మకాలు గరిష్ట స్థాయికి చేరిన అనంతరం ఎన్నో ప్రతికూలతల మధ్య ఆ

తర్వాత కొంత నెమ్మదించినట్టు పేర్కొన్నారు.

ధరల పెరుగుదల వల్లే..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇళ్ల అమ్మకాల విలువ అధికంగా నమోదు కావడం వెనుక ధరలు పెరగడాన్ని కారణంగా అనరాక్ నివేదిక పేర్కొంది. అలాగే, ప్రీమియం అపార్ట్‌మెంట్ల అమ్మకాలు మెరుగ్గా ఉన్నట్టు తెలిపింది. స్పెక్యులేటివ్ కొనుగోళ్లకు బదులు వాస్తవ, వినియోగ ఆధారిత కొనుగోళ్ల డిమాండ్ ప్రస్తుతం కొనసాగుతున్నట్టు సర్వమ్ ప్రాపర్టీస్ సహ వ్యవస్థాపకుడు ధావల్ హెమానీ తెలిపారు. రియల్ ఎస్టేట్‌లో తదుపరి వృద్ధి అమ్మకాల పరిమాణం కంటే విలువ ఆధారితంగానే ఉంటుందని రియల్ స్టేట్ రంగ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ 'గోల్డెన్ గ్రోత్ ఫండ్' సీఈవో అంకుర్ జైన్ తెలిపారు. డెవలపర్లు ఎక్కువ ప్రాజెక్టుల కంటే.. నాణ్యత, సకాలంలో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అప్పగించడంపై దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు.

నెఫ్రోకేర్ ఐపీవోకి సెబీ ఓకే..

- క్లీన్ మ్యాక్స్ ఇష్యూకి కూడా ఆమోదం
- రెండు ఇష్యూల పరిమాణం రూ. 5,553 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న డయాలిసిస్ సేవల సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్, పునరుత్పాదక విద్యుత్ సేవల సంస్థ క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూలకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదముద్ర వేసింది. ఈ రెండు సంస్థలు మొత్తం రూ.5,553 కోట్లు సమీకరించనున్నాయి. ఇరు కంపెనీలు సెబీకి ఆగస్టులో ప్రాస్పెక్టస్‌లు దాఖలు చేయగా .. అక్టోబర్, నవంబర్‌లో సెబీ నుంచి క్లియరెన్సులు వచ్చాయి. ప్రాస్పెక్టస్‌ల ప్రకారం నెఫ్రోప్లస్ బ్రాండ్ పేరిట సేవలందించే నెఫ్రోకేర్ హెల్త్ తాజా షేర్ల జారీ ద్వారా రూ. 353.4 కోట్లు సమీకరించనుంది. ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో 1.27 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. తాజా షేర్ల జారీతో సమీకరించిన నిధుల్లో రూ. 129.1 కోట్లను కొత్త డయాలిసిస్ క్లినిక్‌లను ప్రారంభించేందుకు, రూ. 136 కోట్ల మొత్తాన్ని రుణాలను చెల్లించివేసేందుకు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించుకోనుంది.

క్లీన్ మ్యాక్స్ ఐపీవో రూ. 5,200 కోట్లు..

ప్రాస్పెక్టస్ ప్రకారం క్లీన్ మ్యాక్స్ రూ. 5,200 కోట్లు సమీకరించనుంది. ఇందులో తాజా షేర్ల జారీ ద్వారా రూ. 1,500 కోట్లు సమకూర్చుకోనుండగా, ప్రమోటర్లు..ఇతర ఇన్వెస్టర్లు ఓఎఫ్ఎస్ విధానంలో రూ. 3,700 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనున్నారు. రూ. 1,125 కోట్ల మొత్తాన్ని రుణాల చెల్లింపునకు, మిగతాది ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించుకోనుంది. 2010లో ప్రారంభమైన క్లీన్ మ్యాక్స్ పారిశ్రామిక కస్టమర్లకు సౌర, పవన, హైబ్రిడ్ విద్యుత్ సరఫరా సేవలు అందిస్తోంది.

'బిర్లానూ' చేతికి క్లీన్ కోట్స్

డీల్ విలువ రూ. 120 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సీకేఏ బిర్లా గ్రూప్‌లో భాగమైన 'బిర్లానూ' (గతంలో హెచ్ఐఎల్) సంస్థ నిర్మాణ రంగ రసాయనాలు, కోటింగ్స్ తయారీ కంపెనీ క్లీన్ కోట్స్‌ను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 120 కోట్లుగా ఉండనుంది. కన్‌స్ట్రక్షన్ కెమికల్స్ వ్యాపార విభాగాన్ని విస్తరించేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ తెలిపింది. క్లీన్ కోట్స్ 1999లో ప్రారంభమైంది. భారత్‌తో పాటు 27 దేశాల్లో పారిశ్రామిక, చమురు..గ్యాస్, నీటి నిర్వహణ ప్రాజెక్టులకు ఉత్పత్తులను అందిస్తోంది. రిటైల్ సెగ్మెంట్లో మరింతగా విస్తరించేందుకు, సంక్లిష్టమైన ప్రాజెక్టులకు అత్యుత్తమ సొల్యూషన్స్ అందించేందుకు ఈ డీల్ తోడ్పడుతుందని 'బిర్లానూ' ప్రెసిడెంట్ అవంతి బిర్లా తెలిపారు. వచ్చే మూడేళ్లలో తమ పోర్ట్‌ఫోలియోను రెట్టింపు చేసుకునేందుకు సహాయకరంగా ఉంటుందని ఎండీ అక్షత్ సేథ్ చెప్పారు.

హైదరాబాద్‌లో స్ట్రాటెజ్ ఇన్నోవేషన్ హబ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్టూడెంట్ హౌసింగ్ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ స్ట్రారెజ్ తమ కార్యకలాపాలను హైదరాబాద్‌లో విస్తరించింది. తాజాగా గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ని ప్రారంభించింది. ఏఐ, డేటా ఇంటెలిజెన్స్ ధారిత ఆవిష్కరణలపై ఇది ప్రధానంగా దృష్టి పెడుతుందని సంస్థ చైర్మన్ ట్రావిస్ నైప్ తెలిపారు. భారత్‌లో ప్రస్తుతం 40కి పైగా ఉన్న తమ సిబ్బంది సంఖ్యను 200 పైచిలుకు పెంచుకోనున్నట్లు వివరించారు. ఆస్ట్రేలియా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్ట్రారెజ్.. అమెరికా, కెనడా తదితర దేశాల్లో 1,100 పైగా సంస్థలకు సేవలు అందిస్తోంది.

వ్యవసాయంలో పరిశోధనలను ప్రోత్సహించాలి

బడ్జెట్‌పై నిపుణుల సూచనలు

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగంలో పెరిగిపోతున్న వాతావరణ పరమైన సవాళ్లను అధిగమించేందుకు వీలుగా పరిశోధన, అభివృద్ధికి (ఆర్అండ్‌డీ) మరిన్ని నిధుల సాయం అందించాలంటూ కేంద్ర ఆర్థిక శాఖకు నిపుణులు సూచించారు. ఈ దిశగా విధానపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నిర్వహించిన బడ్జెట్ ముందస్తు సమావేశంలో వ్యవసాయ రంగం, ఆర్అండ్‌డీ సంస్థల నుంచి 12 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వ్యవసాయ రంగం ప్రస్తుత స్థాయి నుంచి మరింత ప్రగతి సాధించేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యల గురించి వారు తమ సూచనలు అందించారు. వ్యవసాయరంగ కార్యదర్శి దేవేష్ చౌదరి, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ ఎంఎల్ జట్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. సమావేశం సానుకూలంగా జరిగినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వ్యవసాయం, అనుబంధ రంగాలు ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను నిపుణులు ప్రస్తావించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్య క్రమంలో చర్యలు తీసుకోవాలని కోరినట్టు వెల్లడించాయి. వ్యవసాయంలో ఆర్అండ్‌డీకి వాస్తవ నిధుల కేటాయింపులు గత రెండు దశాబ్దాల కాలంలో తగ్గినట్టు ఈ సమావేశంలో పాల్గొన్న భారత్ క్రిషక్ సమాజ్ చైర్మన్ అజయ్ వీర్ జఖార్ తెలిపారు. పంటల బీమాను తిరిగి సమీక్షించాలని, చాలా మంది రైతులు దీని విషయంలో అసంతృప్తిగా ఉన్నట్టు చెప్పారు. వ్యవసాయ ముడి పదార్థాల విక్రయ వివరాలను వర్తకులు ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసే విధానం ఉండాలని కోరారు. అలాగే, కనీస మద్దతు ధరలను ప్రకటిస్తున్న పంట ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలు విధించాలని అభిప్రాయపడ్డారు.

ప్రముఖ ఆర్థికవేత్తలతోనూ భేటీ

మరోవైపు ప్రముఖ ఆర్థికవేత్తలైన సాజిద్ చినాయ్, నీలకాంత్ మిశ్రా, ధర్మకృతి జోషి, రిధమ్ దేశాయ్, సోనల్ వర్మ, ఇందిరా రాజారామన్ తదితరులతోనూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. 2026–27 బడ్జెట్‌కు సంబంధించి ప్రముఖ ఆర్థికవేత్తలతో ఇది తొలి సమావేశమని ఆర్థిక శాఖ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ప్రకటించింది.

కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు

జిందాల్ స్టెయిన్‌లెస్.. పటిష్ట పనితీరు

32 శాతం పెరిగిన లాభం

న్యూఢిల్లీ: జిందాల్ స్టెయిన్‌లెస్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో పటిష్ట పనితీరు నమోదు చేసింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 32 శాతం పెరిగి రూ.808 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.609 కోట్లుగానే ఉంది. ఇదే కాలంలో ఆదాయం 12 శాతం వృద్ధి చెంది రూ.9,824 కోట్ల నుంచి రూ.10,982 కోట్లకు చేరింది. 6,48,050 టన్నుల అమ్మకాలను కంపెనీ సాధించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో విక్రయాలు 5,64,627 టన్నులుగా ఉన్నాయి. ఇండస్ట్రియల్ పైపులు, ట్యూబులు, లిఫ్టులు, ఎలివేటర్లు, మెట్రో, రైల్వే కోచ్‌లు, వ్యాగన్ల నుంచి స్థిరమైన డిమాండ్ కొనసాగినట్టు కంపెనీ తెలిపింది. వైట్‌గూడ్స్ విభాగం నుంచి సైతం డిమాండ్ పుంజుకున్నట్టు పేర్కొంది. పోటీ ధరలకే, మెరుగైన సేవలతో తమ మార్కెట్ వాటాను కాపాడుకున్నట్టు కంపెనీ ఎండీ అభ్యుదయ జిందాల్ తెలిపారు. ఎల్అండ్‌టీ నుంచి యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైళ్ల కోసం గాను హై నైట్రోజన్ స్టీల్ ప్లేట్ల సరఫరా కాంట్రాక్టును జిందాల్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ (అనుబంధ సంస్థ) దక్కించుకున్నట్టు చెప్పారు.

బీఎస్ఈలో కంపెనీ షేరు ధర ఒక శాతం నష్టంతో రూ.723 వద్ద ముగిసింది.

ఎస్‌జేవీఎన్ లాభం నేలచూపు

క్యూ2లో రూ. 308 కోట్లు

న్యూఢిల్లీ: జల విద్యుత్ రంగ పీఎస్‌యూ ఎస్‌జేవీఎన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 30 శాతం క్షీణించి రూ. 308 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 440 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,108 కోట్ల నుంచి రూ. 1,078 కోట్లకు నీరసించింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 529 కోట్ల నుంచి రూ. 658 కోట్లకు పెరిగాయి. ఈ ఏడాది నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్స్‌లో భాగంగా 1,500 మెగావాట్ల నాప్తా ఝక్రీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ భవిష్యత్ ఆదాయం లేదా ఆర్వోఈ సెక్యూరిటైజేషన్ ద్వారా రూ. 1,000 కోట్లవరకూ సమీకరించేందుకు కంపెనీ బోర్డు అనుమతించినట్లు ఎస్‌జేవీఎన్ వెల్లడించింది. అంతేకాకుండా సిపన్ కుమార్ గార్గ్‌ను సీఎఫ్‌వోగా ఎంపిక చేసినట్లు పేర్కొంది. గార్గ్ 2024 ఆగస్ట్ 17నుంచి టీహెచ్‌డీసీ ఇండియాలో ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఫలితాల నేపథ్యంలో ఎస్‌జేవీఎన్ షేరు బీఎస్ఈలో 0.8 శాతం నీరసించి రూ. 84 వద్ద ముగిసింది.

కేపీఐటీ టెక్నాలజీస్ లాభం డౌన్

క్యూ2లో రూ. 169 కోట్లు

న్యూఢిల్లీ: ఆటో రంగ సంబంధిత సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ కేపీఐటీ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 17 శాతం క్షీణించి రూ. 169 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 204 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 8 శాతం ఎగసి రూ. 1,588 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 1,471 కోట్ల టర్నోవర్ అందుకుంది. ఈ కాలంలో 23.2 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్ కుదుర్చుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. 334 మంది ఉద్యోగులను జత చేసుకోవడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 12,879కు చేరినట్లు తెలియజేసింది. కేర్‌సాఫ్ట్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్ బిజినెస్ కొనుగోలుని పూర్తి చేసినట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో కేపీఐటీ షేరు బీఎస్ఈలో 3.5 శాతం జంప్‌చేసి రూ. 1,193 వద్ద ముగిసింది.

ఇమామీ లాభం క్షీణత

- క్యూ2లో రూ. 148 కోట్లు
- షేరుకి రూ. 4 డివిడెండ్

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ రంగ దేశీ దిగ్గజం ఇమామీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 30 శాతం క్షీణించి రూ. 148 కోట్లకు పరిమితమైంది. జీఎస్‌టీ రేట్ల సవరణలు, అధిక వర్షాలు తాత్కాలికంగా కొన్ని ప్రొడక్టుల అమ్మకాలను దెబ్బతీసినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కోల్‌కతా కంపెనీ రూ. 211 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 891 కోట్ల నుంచి రూ. 799 కోట్లకు నీరసించింది. మొత్తం వ్యయాలు రూ. 640 కోట్ల నుంచి రూ. 620 కోట్లకు తగ్గాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 4 చొప్పున తొలి మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు రికార్డ్ డేట్ ఈ నెల 14కాగా.. డిసెంబర్ 9కల్లా చెల్లించనుంది. ప్రస్తుతం కొన్ని ప్రొడక్టులపై జీఎస్‌టీ రేట్లు 18 శాతం, 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గడం కంపెనీ అమ్మకాలపై సానుకూల ప్రభావం చూపుతున్నట్లు ఇమామీ వైస్ చైర్మన్, ఎండీ హర్ష వి.అగర్వాల్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో ఇమామీ షేరు బీఎస్ఈలో 2.3 శాతం లాభపడి రూ. 526 వద్ద ముగిసింది.

బజాజ్ కన్జ్యూమర్ లాభం జూమ్

రూ.42 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ సంస్థ బజాజ్ కన్జ్యూమర్ కేర్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.42 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.32 కోట్లతో పోల్చి చూస్తే 33 శాతం వృద్ధి నమోదైంది. ఆదాయం ఇదే కాలంలో రూ.234 కోట్ల నుంచి రూ.265 కోట్లకు పెరిగింది. వ్యయాలు సైతం రూ.204 కోట్ల నుంచి రూ.221 కోట్లకు పెరిగాయి. ఆపరేటింగ్ మార్జిన్ 13.9 శాతం నుంచి 17.8 శాతానికి బలపడింది. కంపెనీకి చెందిన పాపులర్ బ్రాండ్ 'ఆల్మండ్ డ్రాప్స్' హెయిర్ ఆయిల్ అమ్మకాలు విలువ పరంగా రెండంకెల వృద్ధిని చూశాయి. కోకోనట్ ఆయిల్ అమ్మకాలు ఒక అంకె వృద్ధికి పరిమితమయ్యాయి.

బీఎస్ఈలో కంపెనీ షేరు ధర సోమవారం 2 శాతం నష్టపోయి రూ.296 వద్ద స్థిరపడింది.

వీమార్ట్ రిటైల్ నష్టాలు తగ్గాయ్

క్యూ2లో రూ. 9 కోట్లు

న్యూఢిల్లీ: రిటైల్ రంగ కంపెనీ వీమార్ట్ రిటైల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర నష్టాలు భారీగా తగ్గి రూ. 9 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 57 కోట్ల నికర నష్టం ప్రకటించింది. ప్రధానంగా రిటైల్ బిజినెస్ పుంజుకోవడం సానుకూల ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. మొత్తం టర్నోవర్ సైతం రూ. 661 కోట్ల నుంచి రూ. 807 కోట్లకు జంప్ చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 711 కోట్ల నుంచి రూ. 814 కోట్లకు పెరిగాయి. రిటైల్ ట్రేడ్ ఆదాయం రూ. 651 కోట్ల నుంచి 23 శాతంపైగా వృద్ధితో రూ. 800 కోట్లను అధిగమించింది. డిజిటల్ మార్కెట్ ఆదాయం మాత్రం రూ. 13 కోట్ల నుంచి రూ. 8.5 కోట్లకు క్షీణించింది.

ఫలితాల నేపథ్యంలో వీమార్ట్ షేరు బీఎస్ఈలో 5 శాతంపైగా పతనమై రూ. 776 వద్ద ముగిసింది.

జ్యోతి సింగ్ నాయకత్వంలో...

మహిళల జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీ బరిలోకి భారత్

న్యూఢిల్లీ: మూడు పుష్కరాలుగా ఊరిస్తున్న ఫైనల్ బెర్త్‌ను ఈసారైనా అందుకోవాలనే లక్ష్యంతో... అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) మహిళల జూనియర్ ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు బరిలోకి దిగనుంది. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 13 వరకు చిలీలోని సాంటియాగో నగరంలో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. ఈ టోర్నీలో పోటీపడే 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు జ్యోతి సింగ్ నాయకత్వం వహించనుంది. చీఫ్ కోచ్‌గా భారత జట్టు మాజీ సభ్యుడు తుషార్ ఖాండేకర్ వ్యవహరిస్తాడు. 'ప్రస్తుతం భారత జట్టు ఆట తీరుతో సంతృప్తిగా ఉన్నాను. కొన్నాళ్లుగా తీవ్రంగా సాధన చేశాం. డిఫెన్స్ లోపాలను సరిదిద్దుకోవడంపై దృష్టి పెట్టాం' అని తుషార్ ఖాండేకర్ వ్యాఖ్యానించాడు. పూల్ 'సి'లో ఉన్న భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను డిసెంబర్ 1న నమీబియాతో... డిసెంబర్ 3న జర్మనీతో... డిసెంబర్ 5న ఐర్లాండ్‌తో ఆడుతుంది.

భారత మహిళల హాకీ జట్టు: నిధి, హర్షారాణి మింజ్ (గోల్‌కీపర్లు), మనీషా, లాల్‌థాన్‌లువాలంగి, సాక్షి శుక్లా, పూజా సాహూ, నందిని (డిఫెండర్లు), సాక్షి రాణా, ఇషిక, సునెలితా టొప్పో, జ్యోతి సింగ్ (కెప్టెన్), ఖైడెమ్ షిలీమా చాను, బినిమా ధన్ (మిడ్ ఫీల్డర్లు), సోనమ్, పూర్ణిమ యాదవ్, కనిక సివాచ్, హీనా బానో, సుఖ్‌వీర్ కౌర్ (ఫార్వర్డ్స్), ప్రియాంక యాదవ్, పార్వతి టొప్నో (రిజర్వ్).

'స్పోర్ట్స్ సిటీ'గా నెహ్రూ స్టేడియం

కొత్తగా పునర్ నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధం



న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని పూర్తిగా కూల్చేసి పునర్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. అత్యాధునిక వసతులతో సిద్ధం చేసి దానిని 'స్పోర్ట్స్ సిటీ'గా మార్చనున్నారు. అన్ని రకాల ప్రధాన క్రీడలకు కేంద్రంగా దీనిని రూపుదిద్దాలనే ప్రణాళిక సిద్ధమైందని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. స్టేడియానికి సంబంధించి ప్రస్తుతం 102 ఎకరాల స్థలం అందుబాటులో ఉంది. పూర్తి ఖర్చు, ఎప్పటిలోగా పూర్తి చేయాలనే అంశంపై త్వరలోనే స్పష్టత రానుంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) సహా ఇప్పుడు స్టేడియంలోనే ఉన్న కార్యాలయాలన్నీ మరో చోటుకు తరలించనున్నారు. ఖతర్, ఆస్ట్రేలియాలలో ఉన్న స్పోర్ట్స్ సిటీ నమూనాలను నెహ్రూ స్టేడియం నిర్మాణం కోసం పరిశీలిస్తున్నారు. 1982లో ఆసియా క్రీడల సందర్భంగా నిర్మించిన ఈ స్టేడియాన్ని 2010లో కామన్వెల్త్ క్రీడల కోసం రూ.900 కోట్లతో ఆధునీకరించారు.

320 మంది అసిస్టెంట్ కోచ్‌ల ఎంపిక...

దేశవ్యాప్తంగా 320 మంది అసిస్టెంట్ కోచ్‌లను ఎంపిక చేసేందుకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సిద్ధమైంది. 25 రకాల క్రీడాంశాల్లో వీరిని నియమించేందుకు చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. 'సాయ్' కేంద్రాల్లో వీరిని నియమిస్తారు. అంతర్జాతీయ ఈవెంట్లలో పతకాలు సాధించే లక్ష్యంతో 'మెడల్ స్ట్రాటజీ' అంటూ రూపొందించిన ప్రణాళికల్లో భాగంగా ఈ కోచ్‌లను నియమిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ 320 మందిలో 50 శాతం మహిళలకు అవకాశం కల్పిస్తున్నారు.

టైటిల్‌కు చేరువగా...

- బ్రెజిలియన్ గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన లాండో నోరిస్
- మెక్‌లారెన్ డ్రైవర్‌కు ఈ సీజన్‌లో ఏడో విజయం
- సహచరుడు ఆస్కార్ పియాస్ట్రి నుంచే గట్టి పోటీ
- అద్భుతంపై వెర్‌స్టాపెన్ ఆశలు



నోరిస్

సావోపాలో: క్వాలిఫయింగ్‌లో కనబరిచిన జోరును ప్రధాన రేసులోనూ కొనసాగించిన మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ లాండో నోరిస్ ఈ సీజన్‌లో ఏడో విజయాన్ని అందుకున్నాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన బ్రెజిలియన్ గ్రాండ్‌ప్రి ఫార్ములావన్ రేసులో లాండో నోరిస్ విజేతగా నిలిచాడు. నిర్ణీత 71 ల్యాప్‌ల రేసును 'పోల్ పొజిషన్' నుంచి ప్రారంభించిన నోరిస్ అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 32 నిమిషాల 01.596 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. మెర్సిడెస్ డ్రైవర్ కిమి ఆంటోనెల్లి (మెర్సిడెస్) రెండో స్థానాన్ని పొందగా... డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) మూడో స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. మెర్సిడెస్‌కు చెందిన జార్జి రసెల్‌కు నాలుగో స్థానం, మెక్‌లారెన్‌కు చెందిన ఆస్కార్ పియాస్ట్రి ఐదో స్థానం పొందారు. ప్రపంచ మాజీ చాంపియన్, ఫెరారీ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ 37 ల్యాప్‌ల తర్వాత రేసు నుంచి నిష్క్రమించగా.. చార్లెస్ లెక్‌లెర్క్ (ఫెరారీ) ఐదో ల్యాప్‌లో, గాబ్రియేల్ బొర్టోలెటో (స్టేక్ ఎఫ్1 టీమ్) తొలి ల్యాప్‌లోనే వైదొలిగారు. తాజా విజయంతో నోరిస్ తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ సాధించేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు. ప్రస్తుతం లాండో నోరిస్ 390 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉండగా... నోరిస్ సహచరుడు పియాస్ట్రి 366 పాయింట్లతో రెండో స్థానంలో, వెర్‌స్టాపెన్ 341 పాయింట్లతో మూడో స్థానంలో, జార్జి రసెల్ 276 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నారు. ప్రపంచ టైటిల్ నోరిస్, పియాస్ట్రి, వెర్‌స్టాపెన్‌లలో ఒక్కరికే దక్కే అవకాశముంది. ఈ సీజన్‌లో మరో మూడు రేసులు మిగిలి ఉన్నాయి. గరిష్టంగా 75 పాయింట్లు అందుబాటులో ఉన్నాయి. నోరిస్, పియాస్ట్రి మధ్య 24 పాయింట్ల వ్యత్యాసం... నోరిస్, వెర్‌స్టాపెన్ మధ్య 49 పాయింట్ల వ్యత్యాసం ఉంది. ఈ నేపథ్యంలో చివరి మూడు రేసుల్లో నోరిస్, పియాస్ట్రి టాప్-10లో నిలవకుండా... వెర్‌స్టాపెన్ తప్పనిసరిగా రెండు రేసుల్లో విజేతగా నిలిచి, మరో రేసులో టాప్-10లో నిలిస్తేనే వరుసగా ఐదో ఏడాది అతని ఖాతాలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ చేరుతుంది. సీజన్‌లోని తదుపరి మూడు రేసులు వరుసగా నవంబర్ 23న లాస్ వేగస్ గ్రాండ్‌ప్రి... నవంబర్ 30న ఖతర్ గ్రాండ్‌ప్రి... డిసెంబర్ 7న అబుదాబి గ్రాండ్‌ప్రి జరుగుతాయి.

బ్రెజిలియన్ గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	ల్యాప్‌లు	సమయం	వ్యత్యాసం	పాయింట్లు
1	నోరిస్	మెక్‌లారెన్	71	1:32:01.596 సెకన్లు	-	25
2	ఆంటోనెల్లి	మెర్సిడెస్	71	1:32:11.984 సెకన్లు	10.388 సెకన్లు	18
3	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	71	1:32:12.346 సెకన్లు	10.750 సెకన్లు	15
4	జార్జి రసెల్	మెర్సిడెస్	71	1:32:16.863 సెకన్లు	15.267 సెకన్లు	12
5	పియాస్ట్రి	మెక్‌లారెన్	71	1:32:17.345 సెకన్లు	15.749 సెకన్లు	10
6	బియర్మన్	మనీగ్రామ్	71	1:32:31.226 సెకన్లు	29.630 సెకన్లు	8
7	లాసన్	రేసింగ్‌బుల్స్	71	1:32:54.238 సెకన్లు	52.642 సెకన్లు	6
8	హద్జార్	రేసింగ్‌బుల్స్	71	1:32:54.469 సెకన్లు	52.873 సెకన్లు	4
9	హుల్కెన్‌బర్గ్	స్టేక్ ఎఫ్1	71	1:32:54.920 సెకన్లు	53.324 సెకన్లు	2
10	గ్యాస్లీ	అల్పైన్	71	1:32:55.510 సెకన్లు	53.914 సెకన్లు	1

నాలుగో టి20 వర్షార్పణం

నెల్సన్: న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్ల మధ్య సోమవారం జరగాల్సిన నాలుగో టి20 మ్యాచ్ వర్షార్పణమైంది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 6.3 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 38 పరుగులు చేసింది. ఈ దశలో వచ్చిన వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. చివరిదైన ఐదో టి20 మ్యాచ్‌లో డ్యూనెడిన్‌లో గురువారం జరుగుతుంది. తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ 7 పరుగులతో నెగ్గగా... రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్ 3 పరుగులతో... మూడో మ్యాచ్‌లో 9 పరుగులతో విజయం సాధించింది.

రన్నరప్ వీర్ చోత్రాని

న్యూఢిల్లీ: సెయింట్ జేమ్స్ ఎక్స్‌ప్రెషన్ ఓపెన్ అంతర్జాతీయ స్క్వాష్ టోర్నీలో భారత ప్లేయర్ వీర్ చోత్రాని రన్నరప్‌గా నిలిచాడు. అమెరికాలోని స్ప్రింగ్‌ఫీల్డ్‌లో ఈ టోర్నీ జరిగింది. ప్రపంచ 15వ ర్యాంకర్ లియోనెల్ కార్డెనాస్ (మెక్సికో)తో జరిగిన ఫైనల్లో ప్రపంచ 51వ ర్యాంకర్ వీర్ 11-13, 11-4, 4-11, 3-11తో పోరాడి ఓడిపోయాడు.

రాణించిన రాహుల్ సింగ్, హిమతేజ

- 293 పరుగుల ఆధిక్యంలో హైదరాబాద్
- రాజస్తాన్‌తో రంజీ మ్యాచ్

సాక్షి, హైదరాబాద్: రాజస్తాన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోరుకే కట్టడి చేసిన హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో తడబడింది. రంజీ ట్రోఫీ గ్రూప్ 'డి'లో సొంతగడ్డపై జరుగుతున్న ఈ మ్యాచ్‌లో 221/5 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన రాజస్తాన్ 94.4 ఓవర్లలో 269 పరుగుల వద్ద ఆలౌటైంది. సోమవారం ఆటలో 48 పరుగులు మాత్రమే చేసిన రాజస్తాన్ మిగతా సగం (5) వికెట్లను కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు కునాల్ సింగ్ రాథోడ్ (83; 8 ఫోర్లు, 1 సిక్స్), అజయ్ సింగ్ (58; 6 ఫోర్లు, 1 సిక్స్) అవుటైన కాసేపటికి రాజస్తాన్ ఇన్నింగ్స్ కుప్పకూలేందుకు ఎంతో సేపు పట్టనేలేదు. తనయ్ త్యాగరాజన్ (3/64), సీవీ మిలింద్ (3/44), పున్నయ్య (2/39), అనికేత్ రెడ్డి (2/59) సమష్టిగా దెబ్బతీశారు. హైదరాబాద్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 95 పరుగుల ఆధిక్యం లభించింది.

అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన హైదరాబాద్ తడబడింది. ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్ (12), అభిరథ్ రెడ్డి (14) నిరాశపరిచారు. ఈ దశలో కెప్టెన్ రాహుల్ సింగ్ (66 బంతుల్లో 59; 8 ఫోర్లు), హిమతేజ (70 బంతుల్లో 41; 3 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను కుదుటపరిచే ప్రయత్నం చేశారు. ఫిఫ్టీ పూర్తయిన తర్వాత రాహుల్ నిష్క్రమించాడు. హిమతేజ, వరుణ్ గౌడ్ జట్టు స్కోరును 150 పరుగులు దాటించారు. 159 స్కోరు వద్ద వాళ్లిద్దరు అవుటయ్యారు. కాసేపటికి రాహుల్ రాదేశ్ (7), సీవీ మిలింద్ (10)లు కూడా పెవిలియన్ చేరడంతో హైదరాబాద్ 35 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయింది. మూడో రోజు ఆట నిలిచే సమయానికి హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 62 ఓవర్లలో 7 వికెట్లకు 198 పరుగులు చేసింది. ప్రస్తుతం 293 పరుగుల ఆధిక్యంలో ఉంది. నేడు ఆటకు ఆఖరి రోజు కాగా చేతిలో 3 వికెట్లున్నాయి.

ప్రాక్టీస్‌కు వేళాయె...

శుక్రవారం నుంచి భారత్, దక్షిణాఫ్రికా తొలి టెస్టు

కోల్‌కతా: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా సొంతగడ్డపై టెస్టు సిరీస్‌కు భారత్ సన్నద్ధమవుతోంది. గురువారం నుంచి ఈడెన్ గార్డెన్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ దక్షిణాఫ్రికాతో జరిగే తొలి టెస్టుకు ముందు వరుసగా మూడు రోజుల పాటు టీమ్ ప్రాక్టీస్‌లో పాల్గొంటుంది. ఆస్ట్రేలియాలో టి20 సిరీస్ ఆడిన టెస్టు జట్టు సభ్యులు గిల్, బుమ్రా, అక్షర్, సుందర్, కోచ్ గంభీర్ ఆదివారం రాత్రి కోల్‌కతాకు చేరుకున్నారు. ఇప్పటికే భారత్‌లో ఉన్న ఇతర సభ్యులు కూడా విడివిడిగా తమ స్వస్థలాల నుంచి వచ్చి జట్టు సభ్యులతో కలుస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎలాంటి ప్రాక్టీస్ జరగలేదు. నేటినుంచి పూర్తి స్థాయి జట్టు సాధన చేస్తుంది. మరోవైపు దక్షిణాఫ్రికా జట్టులో కీలక సభ్యులైన రబాడ, యాన్సెన్ తదితరులు పాకిస్తాన్‌తో వన్డే సిరీస్ అనంతరం ఆదివారం రాత్రే కోల్‌కతాలో అడుగు పెట్టగా, ఇప్పటికే 'ఎ' టీమ్ తరఫున మ్యాచ్‌లు ఆడుతూ బెంగళూరులోనే ఉన్న ఇతర ఆటగాళ్లు కూడా జట్టుతో చేరారు. ఈ బృందంలో కెప్టెన్ తెంబా బవుమా, జుబేర్ హమ్జా, అకెర్‌మన్ తదితరులు ఉన్నారు. సఫారీ టీమ్ కూడా సోమవారం సాధన చేయలేదు. 2025లో భారత్, దక్షిణాఫ్రికాలకు ఇదే చివరి టెస్టు సిరీస్ కానుంది. ఈ సిరీస్ తర్వాత వచ్చే జూన్‌లో గానీ (అఫ్గానిస్తాన్‌తో) భారత్‌కు టెస్టు మ్యాచ్ లేదు.

గుజరాత్ ఘనవిజయం

- ఒక్క రోజే 20 వికెట్లు
- సర్వీసెస్ రెండో ఇన్నింగ్స్ 125 ఆలౌట్
- రంజీ ట్రోఫీ రౌండప్

నదియాద్ (గుజరాత్): ఈ రంజీ సీజన్‌లో గుజరాత్ ఎట్టకేలకు నాలుగో మ్యాచ్‌లో బోణీ కొట్టింది. గ్రూప్ 'సి'లో సర్వీసెస్‌తో జరిగిన పోరులో గుజరాత్ 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఒక్క మూడో రోజే మూడు ఇన్నింగ్స్‌లు జరిగాయి. 20 వికెట్లు కూలాయి. మ్యాచ్ ఫలితం కూడా ఓ రోజు ముందే వచ్చింది. సోమవారం 171/4 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన గుజరాత్ 85.4 ఓవర్లలో 256 పరుగుల వద్ద ఆలౌటైంది. క్రితం రోజు బ్యాటర్లు క్షితిజ్ పటేల్ (56; 4 ఫోర్లు, 1 సిక్స్), ఉర్విల్ పటేల్ (48; 5 ఫోర్లు, 1 సిక్స్) ఆడినంత వరకే ఇన్నింగ్స్ సాగింది. తర్వాత వాళ్లిద్దరు అవుటయ్యాక మిగతా వికెట్లు కేవలం 20 పరుగుల వ్యవధిలోనే పడ్డాయి. పులకిత్ నారంగ్ 5, అమిత్ శుక్లా 4 వికెట్లు తీశారు. గుజరాత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 8 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆడిన సర్వీసెస్ 37.3 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. మోహిత్ అహ్లావత్ (56; 5 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే పోరాడాడు. మిగతా బ్యాటర్లెవరూ కనీసం 15 పరుగులను మించి చేయలేకపోయారు. విశాల్ 6, సిద్ధార్థ్ దేశాయ్ 4 వికెట్లు తీశారు. 118 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన గుజరాత్ 21.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి గెలిచింది. క్షితిజ్ (36 నాటౌట్; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడాడు. ఆ 4 వికెట్లు అమిత్ శుక్లాకే దక్కాయి.

పంజాబ్ జయభేరి

చండీగఢ్: గ్రూప్ 'బి'లో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 8 వికెట్ల తేడాతో చండీగఢ్‌పై జయభేరి మోగించింది. ఓవర్‌నైట్ స్కోరు 168/7 మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన చండీగఢ్ 195 పరుగులకే ఆలౌటైంది. మరో 27 పరుగులు చేసి మిగిలిన 3 వికెట్లు కోల్పోయింది. అయుశ్ గోయల్ 4, హర్‌ప్రీత్ 3 వికెట్లు తీశారు. 31 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని పంజాబ్ ముందు 227 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీన్ని పంజాబ్ రెండో ఇన్నింగ్స్‌లో 66.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 227 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ ఉదయ్ (117 నాటౌట్; 15 ఫోర్లు) అజేయ శతకం సాధించగా, జషన్‌ప్రీత్ (57 నాటౌట్; 7 ఫోర్లు) రాణించాడు.

ఇన్నింగ్స్ తేడాతో ముంబై గెలుపు

ముంబై: గ్రూప్ 'డి'లో సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇన్నింగ్స్ 120 పరుగుల తేడాతో హిమాచల్ ప్రదేశ్‌పై భారీ విజయాన్ని సాధించింది. సోమవారం 94/7 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హిమాచల్ జట్టు 187 పరుగుల వద్ద ఆలౌటైంది. వైభవ్ అరోరా (51; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. హిమాన్షు 3, తుషార్, ములాని చెరో 2 వికెట్లు తీశారు. ముంబైకి 259 పరుగుల ఆధిక్యం లభించగా... ఫాలో ఆన్ ఆడిన హిమాచల్ ప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 139 పరుగులకే ఆలౌటైంది. రాజ్‌మన్ (65; 9 ఫోర్లు) రాణించగా, ముంబై బౌలర్లలో ములాని 5, ముషీర్ 2 వికెట్లు తీశారు. హిమాచల్ ఆడిన నాలుగు ఓడగా, ముంబై రెండో విజయాన్ని నమోదు చేసింది.

పోలాండ్‌లోని క్రాకోలో గ్రీకుల ప్రేమ దేవత ఈరోస్ బెండాటో కాంస్య విగ్రహం కంట్లోనుంచి చూస్తున్న ఓ చిన్నారి

రెండో ప్రపంచ యుద్ధం ముగిసి 80 ఏళ్లయిన సందర్భంగా 'వీరులను మర్చిపోమంటూ' బిగ్‌బెన్‌పై సంస్మరణ సందేశం

దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో జియోంగ్ బొక్‌గుంగ్ ప్యాలెస్‌లోని పసుపు వర్ణంలో శరదృతువు శోభ సంతరించుకున్న ఓ వృక్షం

భగ్గున మండుతున్న భూగోళం!

న్యూఢిల్లీ: అడవుల నరికివేత మొదలు శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం, విపరీతంగా వెలువడుతున్న హరిత ఉద్గారాల దాకా మానవుని ప్రతిచర్యా భూతాపోన్నతికి మరింత ఆజ్యం పోస్తూ చివరకు ఏ ఏడాదిని చరిత్రలోనే అత్యంత ఉష్ణమయ సంవత్సరాల్లో ఒకటిగా మారుస్తోందని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) ఆందోళన వ్యక్తంచేసింది. ''అత్యంత వేడిమయ సంవత్సరాల జాబితాలో 2025 ఏడాది అనేది త్వరలోనే రెండు లేదా మూడో స్థానంలో కూర్చోబోతోంది. ఇదే నిజమైతే గత 11 సంవత్సరాలుగా అంటే 2015 ఏడాది మొదలు 2025 ఏడాదిదాకా ఏకధాటిగా 11 ఏళ్లకాలం అత్యంత వేడిగా ఉండటం గత 176 ఏళ్ల నమోదిత గణాంకాల్లో సరికొత్త రికార్డ్''అని డబ్ల్యూఎంఓ వెల్లడించింది. గత మూడేళ్లుగా భూగోళం అత్యధిక వేడివాతావరణాన్ని చవిచూస్తోందని డబ్ల్యూఎంఓ గురువారం తన 'స్టేట్ ఆఫ్ ది గ్లోబల్ క్లైమేట్ అప్‌డేట్'లో పేర్కొంది. ఈ వివరాలతో జర్మనీలో వాతావరణ శాస్త్ర, విధాన నిర్ణయాల సంస్థ 'క్లైమేట్ అనలైటిక్స్'ఒక నివేదికను రూపొందించి గురువారం విడుదలచేసింది.

చరిత్రలో మరో అత్యంత ఉష్ణమయ ఏడాదిగా రికార్డ్లలకెక్కనున్న 2025 సంవత్సరం

- అసాధారణ భూతాపోన్నతికి ఆజ్యం పోస్తున్న వాతావరణ మార్పులు
- ఆందోళన వ్యక్తంచేసిన ప్రపంచ వాతావరణ సంస్థ

పెరిగిన సగటు ఉష్ణోగ్రత

''ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్ట్ కాలంలో భూమికి ఆరడుగుల ఎత్తులో ఉపరితల ఉష్ణోగ్రత 1.42 డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా నమోదైంది. ఇది పారిశ్రామిక విప్లవానికి ముందు నాటితో పోలిస్తే భూమిపై సగటు ఉష్ణోగ్రత కంటే అధికం. ఈ శతాబ్దాంతానికి భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్ లోపునకు పరిమితం చేయాలని 200 దేశాలు 'పారిస్ ఒడంబడిక–2015'లో లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. కానీ ఇప్పటికే 1.3 డిగ్రీ సెల్సియస్ సగటును దాటేసి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతున్నాయి''అని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. డబ్ల్యూఎంఓ గణాంకాల ప్రకారం అత్యంత ఉష్ణమయ ఏడాదిగా 2024 నిలిచింది. గత ఏడాది ప్రపంచ సగటు ఉష్ణోగ్రత చరిత్రలో తొలిసారిగా 1.5 డిగ్రీ సెల్సియస్‌ను దాటింది. ఇక ఏటా 1.5 డిగ్రీ సెల్సియస్ పెరుగుదల అనేది 2030కల్లా మొదలయ్యే ప్రమాదం పొంచి ఉంది''అని నివేదిక అభిప్రాయపడింది.

ఆర్కిటిక్‌లో తగ్గుతున్న మంచు

''చలికాలం తర్వాత ఆర్కిటిక్ సముద్రమంచు విస్తీర్ణం రికార్డ్‌స్థాయిలో కనిష్టానికి పడిపోయింది. అంటార్కిటిక్ సముద్ర మంచు మాత్రం ఏడాదంతా సగటు కంటే తక్కువగా నమోదైంది. విపరీతమైన వాతావరణ మార్పుల పోకడ కారణంగా ప్రపంచ దేశాల్లో కుంభవృష్టి వర్షాలు, వరదలు, కరువు, కార్చిచ్చు ఘటనలు సర్వసాధారణమయ్యాయి. దీంతో జనాభా, ఆవాసం, ఉపాధధి వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఇవి సుస్థిరాభివృద్ధి, ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా తయారయ్యాయి''అని నివేదిక పేర్కొంది. నవంబర్ 10వ తేదీ నుంచి బ్రెజిల్‌లోని బెలెమ్ నగరంలో మొదలు కానుంది. ఈ నేపథ్యంలో నివేదికలోని వివరాలు వెల్లడయ్యాయి.

రెండేళ్ల క్రితం వేడిని పెంచిన ఎల్‌నినో

''వేడిమయ ఎల్ నినో వాతావరణం కారణంగా 2023 ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెచ్చరిల్లాయి. ఇది 2024లోనూ కొనసాగి చివరకు 2025లో తటస్థ లేదా లా నినో పరిస్థితులను తీసుకొచ్చాయి. 2024లో పోలిస్తే 2025లో సమీప భూతల ఉష్ణోగ్రతలు కాస్తంత తక్కువగానే నమోదయ్యాయి. 2024లో ఇది 1.55 డిగ్రీ సెల్సియస్‌కాగా ప్రస్తుత సంవత్సరం 1.42 డిగ్రీ సెల్సియస్‌కు దిగొచ్చింది. 2025 ఫిబ్రవరి నెల ఒక్కటి మినహాయిస్తే 2023 జూన్ నుంచి 2025 ఆగస్ట్‌దాకా ఏకధాటిగా 26 నెలలపాటు ఉష్ణోగ్రత అమాంతం పెరుగుతూ వచ్చింది. రెండేళ్లు కొనసాగిన లా నినా తర్వాత ముగిసి గత మూడేళ్లుగా ఎల్ నినో పరిస్థితులు ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. వీటికి హరిత ఉద్గారాల గాఢత, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత తోడయ్యాయి''అని డబ్ల్యూఎంఓ తెలిపింది.

కొచ్చిలో కూలిన భారీ వాటర్ ట్యాంక్

ఇళ్లను ముంచెత్తిన ఆకస్మిక వరద

కొచ్చి: కేరళలోని కొచ్చి జిల్లాలోని తమ్మనం, వైట్టిలాల మధ్యలో ఉన్న భారీ నీళ్ల ట్యాంక్ కూలిపోయింది. కేరళ వాటర్ అథారిటీ (కేడబ్ల్యూఏ) నిర్వహణలో ఉన్న వాటర్ ట్యాంక్ కూలిపోవడంతో 1.25 కోట్ల లీటర్ల నీరు వరద పాలైంది. ఈ ఘటన సోమవారు తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో జరిగింది. దీంతో గ్రామాలను భారీ వరద ముంచెత్తింది. ఇళ్లలోకి వరద నీరు ప్రవేశించింది. ప్రహరీ గోడలు కూలిపోయాయి. రోడ్లన్నీ కొట్టుకుపోయాయి. బురద, శిథిలాలు ఇళ్లలోకి కొట్టుకొచ్చాయి. కొన్ని ఇళ్ల పైభాగాలు కూలిపోయాయి. ఇళ్ల ముందు నిలిపి ఉన్న వాహనాలు కొట్టుకుపోయాయి. ఈ పరిణామంతో ఒక్కసారిగా స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విధ్వంసం ప్రకృతి వైపరీత్యాన్ని తలపించింది. ఉదయం నాలు గంటలవరకు అధికారులు నీటి ప్రవాహాన్ని నియంత్రించగలిగారు. వాటర్ ట్యాంక్‌లో కొంతభాగం కూలిపోవడం వల్లే ఇలా జరిగిందని అధికారులు తెలిపారు. కొచ్చితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల తాగునీటికి ఇబ్బందులు ఎదురవ్వకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

తుది డేటా అందాకే వివరాలను వెల్లడిస్తాం

తేజస్వీ ఆరోపణలపై స్పందించిన ఈసీ

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ పోలింగ్ మొదటి దశలో ఓటేసిన స్త్రీ, పురుష ఓటర్ల డేటాను వెల్లడించలేదంటూ ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ చేసిన ఆరోపణలపై ఎన్నికల కమిషన్(ఈసీ) స్పందించింది. సాధారణంగా తుది ఓటింగ్ వివరాలను వెల్లడించిన తర్వాత స్త్రీ, పురుష ఓటర్ల డేటాను వెల్లడిస్తారని తెలిపింది. ఈ నెల 6వ తేదీన మొదటి దశలో సుమారు 65.08 శాతం పోలింగ్ నమోదైందని ఈసీ పేర్కొంది. మొదటి దశ ముగిసి నాలుగు రోజులైనా స్త్రీ, పురుష ఓటరు డేటాను వెల్లడించలేదంటూ ఈసీపై తేజస్వీ అనుమానం వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటిది లేదు, ఇదే మొదటి సారని ఆరోపించారు. ఓట్ చోరీని, అక్రమాలను తాము సహించబోమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి భద్రతా బలగాలను రప్పించడం కూడా సందేహాలకు తావిస్తోందని చెప్పారు. దీనిపై స్పందించిన ఈసీ.. ఎన్నికల పరిశీలకులుగా అన్ని రాష్ట్రాలు, పార్టీలకు చెందిన వారిని నియమించామంది. అన్ని స్ట్రాంగ్ రూంల వద్ద కూడా సీసీటీవీలను ఏర్పాటు చేశామని తెలిపింది. పనిచేయని వాటిని తొలగించి, కొత్తవి బిగించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించింది.

బుకర్ ప్రైజ్ అంతిమ పోటీకి ఎంపికైన ఆరుగురు రచయితలు..ఆదివారం లండన్‌లో దిగిన గ్రూప్ ఫొటో.. వీరు ఫ్లాష్‌లైట్ రచయిత సుసాన్ చోయ్, ఆడిషన్ రచయిత కేటీ కిటమురా, ది రెస్ట్ ఆఫ్ అవర్ లైవ్స్ రచయిత బెన్ మార్కో, ది ల్యాండ్ ఇన్ వింటర్ రచయిత ఆండ్రూ మిల్లర్, ఫ్లెష్ రచయిత డేవిడ్ ఎస్‌జలే, ది లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ రచయిత కిరణ్ దేశాయ్(భారత్)(కుడివైపు చివర)

భారత్‌లో అమెరికా రాయబారి ప్రమాణ స్వీకారానికి ట్రంప్

వాషింగ్టన్: భారత్‌లో రాయబారిగా బాధ్యతలు చేపట్టనున్న సెర్గియో గొర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా అధ్యక్షత వహించనున్నారు. వైట్‌హౌస్ విడుదల చేసిన అధ్యక్షుడి కార్యక్రమాల జాబితా ద్వారా ఈ విషయం వెల్లడైంది. ఓవల్ ఆఫీసులో ఈ కార్యక్రమం ఏర్పాటైంది. గొర్ నియామకాన్ని అక్టోబర్ సెనేట్ ధ్రువీకరించడం తెల్సిందే. ప్రెసిడెన్షియల్ పర్సనల్ డైరెక్టర్‌గా ఉన్న గొర్‌ను భారత్‌లో రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల ప్రత్యేక దూతగా ట్రంప్ ఎంపిక చేశారు.

రష్యాకు 70 వేల మంది భారత కార్మికులు

డిసెంబర్‌లో పుతిన్ పర్యటన సందర్భంగా ఒప్పందం

మాస్కో: ఉక్రెయిన్‌తో నాలుగేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం కారణంగా అర్హత కలిగిన, నిపుణులైన కార్మికుల కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రష్యా భారత్ వైపు చూస్తోంది. తమ సమస్య పరిష్కారానికి త్వరలోనే భారత్‌తో ఒప్పందం కుదుర్చుకోనుంది. కనీసం 70 వేల మంది భారతీయులను ఈ ఏడాది చివరికల్లా రష్యాలోని వివిధ ప్రాంతాల్లోని నిర్మాణ, వస్త్ర, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో చేర్చుకోనుంది. వీరికి అవసరమైన ఏర్పాట్లను రష్యా కార్మిక శాఖ చేపట్టింది. డిసెంబర్ మొదటి వారంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో పర్యటనకు రానున్నారు. ఆ సమయంలో ఇరు దేశాలు ఇందుకు సంబంధించిన ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేయనున్నాయి. ఈ ఒప్పందం ఫలితంగా భారతీయ కార్మికులు, సిబ్బందికి రష్యాలో చట్ట పరమైన రక్షణలు లభిస్తాయి. ఈ పరిణామాన్ని మాస్కోలోని ఇండియన్ బిజినెస్ అలయెన్(ఐబీఏ) స్వాగతించింది. భారత్– రష్యా సంబంధాల్లో ఇదో వ్యూహాత్మక మైలురాయిగా మారనుందని ఐబీఏ ప్రెసిడెంట్ సమ్మీ మనోజ్ కొత్వానీ అభివర్ణించారు. భారతీయ నిపుణులకు సురక్షితమైన, గౌరవప్రదమైన ఉపాధిని కల్పిస్తూనే, రష్యా ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవశక్తిని అందనుందన్నారు. భారతీయ సిబ్బందికి అవసరమైన రష్యన్ భాషా నైపుణ్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వారి సంక్షేమానికి, భద్రతకు సంబంధించిన అంశాలపై మాస్కోలోని భారత రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉంటామన్నారు.

అక్రమ వలసలపై ప్రత్యేక ఆపరేషన్

ఢిల్లీలో 260 మంది ఆఫ్రికన్ల అరెస్ట్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో డ్రగ్స్ దందా, విదేశీయుల అక్రమ వలసలపై పోలీసు బలగాలు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆఫ్రికా దేశాలకు చెందిన 260 మందిని అదుపులోకి తీసుకున్నాయి. ఆదివారం ద్వారక, బిందాపూర్, డబ్రి, ఉత్తమ్ నగర్, మోహన్ గార్డెన్, తిలక్ నగర్, నిహాల్ విహార్‌లను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'సందర్భంగా ఎలాంటి పత్రాలు లేని, గడువు దాటిన విదేశీయులను ప్రధానంగా లక్ష్యంగా చేసుకున్నట్లు జాయింట్ పోలీస్ కమిషనర్(పశ్చిమ రేంజ్) జతిన్ నర్వాల్ చెప్పారు. ఒక్క ద్వారకలోనే మహిళలు, చిన్నారులు సహా 20 మంది పట్టుబడ్డారన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేని, వీరివద్ద డ్రగ్స్ కూడా దొరికాయన్నారు. ఎక్కువగా నైజీరియన్లే ఉన్నారన్నారు. వీరితోపాటు ఐవరీ కోస్ట్, సెనెగల్, సియెర్రా లియోన్, కామెరూన్, ఉగాండా, కెన్యా, జింబాబ్వే, ఘనా దేశాలకు చెందిన వారు కూడా పట్టుబడ్డట్లు చెప్పారు. చట్టపరమైన ఎలాంటి నిబంధనలను పాటించకుండా విదేశీయులకు ఇళ్లను అద్దెకు ఇచ్చిన యజమానులను సైతం నిర్బంధంలోకి తీసుకున్నట్లు చెప్పారు.

80 వేల వీసాలు రద్దు

- ఈ ఏడాది అమెరికా రద్దుచేసిన నాన్ ఇమిగ్రేషన్ వీసాలివి
- రాష్ డ్రైవింగ్, దాడులు, దోపిడీలు చేసినవారే అధికం
- 8 వేల విద్యార్థుల వీసాలు రద్దుచేసినట్టు అధికారుల వెల్లడి
- పాలస్తీనాకు మద్దతిస్తే వీసా రద్దు తప్పదని హెచ్చరిక

న్యూఢిల్లీ: రెండోసారి అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పటి నుంచి తన దేశంలోని విదేశీయులను తరిమేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారు డొనాల్డ్ ట్రంప్. చిన్నచిన్న తప్పులకు కూడా వీసాలు రద్దుచేసి బలవంతంగా వారి స్వదేశాలకు పంపేస్తున్నారు. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి 80 వేల వీసాలు రద్దుచేసినట్టు ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉటంకిస్తూ వాషింగ్టన్ ఎగ్జామినర్ సంస్థ పేర్కొంది. మద్యం సేవించి వాహనాలు నడపటం, ఇతరులను ఇబ్బంది పెట్టడం, దొంగతనాల వంటి నేరాలు చేసిన వారి వీసాలను రద్దుచేసి వారిని స్వదేశాలకు పంపినట్టు తెలిపింది. రద్దుచేసిన ఈ 80 వేల వీసాలు నాన్ ఇమిగ్రేషన్ విభాగానివేనని వెల్లడించింది. ఇందులో 8 వేల వరకు విద్యార్థి వీసాలున్నాయి. అమెరికా చట్టాలను ఏమాత్రం ఉల్లంఘించినా వీసా రద్దు తప్పదని అధికారులు హెచ్చరించినట్టు వాషింగ్టన్ ఎగ్జామినర్ పేర్కొంది. 'అమెరికా చట్టాలను ఉల్లంఘించినా, మన దేశ భద్రతకు ముప్పు కలిగించే పనులు చేసినా.. వారి వీసాలు రద్దుచేసేందుకు ట్రంప్ ప్రభుత్వం ఏమాత్రం సంకోచించదు. మా సందేశం సుస్పష్టం. అమెరికాలోకి ప్రవేశించటం హక్కు కాదు. మేం ఎల్లప్పుడూ అమెరికా ప్రజల భద్రత, ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఇస్తాం'అని ఇమిగ్రేషన్ విభాగం ప్రిన్సిపల్ డిప్యూటీ ప్రతినిధి టామీ పిగోట్ తేల్చి చెప్పారు.

వీసాల జారీ కఠినతరం

ఇప్పటికే జారీచేసిన వీసాలను వివిధ కారణాలు చూపి రద్దుచేయటంతోపాటు కొత్తగా వీసాల జారీలోనూ అమెరికా కఠిన విధానాలు అమలుచేస్తోందని రాయిటర్స్ పేర్కొంది. వీసా జారీ కోసం దరఖాస్తుదారుడి సోషల్‌మీడియా యాక్టివిటీని పూర్తిగా అధ్యయనం చేస్తున్నారని తెలిపింది. ఈ ఏడాది రద్దు చేసిన వీసాల్లో డ్రైవింగ్‌లో నిబంధనల ఉల్లంఘనకు సంబంధించినవి 16,000 ఉన్నాయి. దాడులకు పాల్పడినవారికి 12,000, దోపిడీలు చేసినవారికి 8,000 ఉన్నాయి. గడువు దాటిన తర్వాత కూడా దేశంలో ఉన్నవాళ్లు, చట్టాలను ఉల్లంఘించినవాళ్లతోపాటు ఉగ్రవాదానికి మద్దతిచ్చిన దాదాపు 6,000 మంది విద్యార్థుల వీసాలు రద్దుచేసినట్టు గత ఆగస్టులు అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి ఒకరు ప్రకటించారు. కరుడుగట్టిన అమెరికా జాతీయవాది, ట్రంప్ మద్దతుదారుడు చార్లీ కిర్క్ హత్యను సమర్థిస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన ఆరుగురి వీసాలు గత నెలలో రద్దుచేసినట్టు ఓ అధికారి వెల్లడించారు. అమెరికా విదేశాంగ విధానాన్ని వ్యతిరేకించి వేలమంది వీసాలను రద్దుచేసినట్టు గత మేలో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో స్వయంగా ప్రకటించారు.

పాలస్తీనాకు మద్దతిస్తే అంతే సంగతులు..

గాజాపై ఇజ్రాయెల్ దాడిని నిరసిస్తూ కొన్నాళ్లుగా అమెరికాలోని చాలా ప్రాంతాల్లో ఆందోళన జరిగాయి. దీంతో ట్రంప్ యంత్రాంగం ఆ నిరసనల పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. పాలస్తీనాకు మద్దతుగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పనిచేసినా, మాట్లాడినా వీసాలు రద్దుచేయాలని విదేశాంగ శాఖ నుంచి ఇమిగ్రేషన్ విభాగానికి ఆదేశాలు వెళ్లాయని రాయిటర్స్ పేర్కొంది. వీసా దరఖాస్తు దారుల్లో పాలస్తీనా మద్దతుదారులుంటే వారి దరఖాస్తులు తిరస్కరిస్తున్నారు.

మిజోరం సీఎంకు ఈసీ హెచ్చరిక

ఐజ్వాల్: మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమాను ఎన్నికల కమిషన్ మందలించింది. డాంపా నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఈసీ ఆరోపించింది. ఈ ఘటనపై అధికార జోరామ్ పీపుల్స్ పార్టీ చీఫ్ లల్లియన్‌స్వాటా ఇచ్చిన వివరణ, రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) నివేదికను పరిశీలించిన అనంతరం ఈసీ ఈ మేరకు స్పందించింది. లల్లియన్‌స్వాటా వివరణ ఏమాత్రం సహేతుకంగా లేదని, లాల్దుహోమా వైఖరి సరికాదని వ్యాఖ్యానించింది. ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్లు నిబంధనావళికి కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై ఓటర్లలో అనుమానాలు రేకెత్తించరాదని పేర్కొంది. డాంపా సీటుకు ఈ నెల 11న పోలింగ్ జరగనుంది.

న్యాయవ్యవస్థలో ఏఐపై మార్గదర్శకాలు: సుప్రీం

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికత దుర్వినియోగం అవుతుండటంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు గదిలో విచారణ జరుగుతున్న సమయంలో తనపై ఓ లాయర్ షూ విసిరేసిన ఘటనను తప్పుగా చూపిస్తున్న ఒక మార్ఫింగ్ వీడియో సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. న్యాయవ్యవస్థలో ఏఐ వినియోగంపై మార్గదర్శకాలు జారీ చేయాలంటూ అభినవ్ శ్రీవాస్తవ అనే లాయర్ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఆయనీ వ్యాఖ్యలు చేశారు. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లో వాదనలు వింటామన్నారు. వివిధ అంశాలను ఏఐ వ్యవస్థలతో కావాల్సిన విధంగా మల్చుకునే ప్రమాదముందని పిటిషనర్ హెచ్చరించారు. ఏఐ వినియోగంతో అనేక అనూహ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. న్యాయవ్యవస్థ, న్యాయ విధులకు సంబంధించినంత వరకు ఏఐ నిష్పాక్షిక డేటాను కలిగి ఉండాలని, జవాబుదారీతనంతో కూడిన డేటా యాజమాన్యం పారదర్శకంగా ఉండాలని పిటిషన్ పేర్కొంది. లేకుంటే సైబర్ దాడుల ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించింది. అక్టోబర్ 6వ తేదీన రాకేశ్ కిశోర్ అనే లాయర్ విచారణ జరుగుతున్న సమయంలో సీజేఐ వైపు షూ విసరడం తీవ్ర కలకలం రేపింది.

అమృత్‌పాల్ సింగ్ పిటిషన్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ)కింద తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ అతివాద మత ప్రబోధకుడు, ఖదూర్ సాహిబ్ ఎంపీ అమృత్‌పాల్ సింగ్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ అంశంపై పంజాబ్, హరియాణా హైకోర్టు ఆశ్రయించాలని సూచించింది. అదేవిధంగా, ఈ పిటిషన్‌పై ఆరు వారాల్లోగా నిర్ణయం వెలువరించాలని ఆ హైకోర్టును జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాల ధర్మాసనం సోమవారం ఆదేశించింది. వారిస్ పంజాబ్ దే సంస్థ చీఫ్ అయిన అమృత్‌పాల్ సింగ్, మరో 9 మంది అతడి అనుచరులతోపాటు ప్రస్తుతం అసోంలోని డిబ్రూగఢ్ జైలులో ఉన్నాడు. కేవలం ఒకే ఒక్క ఎఫ్ఐఆర్ ఆధారంగా అమృత్‌పాల్‌ను రెండేళ్లుగా నిర్బంధంలో ఉంచారని అతడి తరఫున కొలిన్ గొంజాల్వెజ్ వాదించారు. అయితే, తామీ పిటిషన్‌ను విచారించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. కరడుగట్టిన ఖలిస్తాన్ వాది అయిన అమృత్‌పాల్ సింగ్ 2023 ఫిబ్రవరిలో పంజాబ్‌లోని అజ్నాలా పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి, తన అనుచరుడిని విడిపించుకుని తీసుకెళ్లడం తీవ్ర సంచలనం రేపింది. పట్టుకునేందుకు ప్రయత్నించిన పోలీసుల నుంచి అదే ఏడాది మార్చిలో తప్పించుకున్నాడు. దాదాపు నెల రోజుల పాటు మారువేషాలతో సంచరించిన ఇతడిని ఎట్టకేలకు పట్టుకుని అసోంకు తరలించారు. 2024 ఎన్నికల్లో తరన్ తరన్ జిల్లా ఖదూర్ సాహిబ్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, భారీ మెజారిటీతో గెలుపొందాడు.

జడ్జీలపై ఆరోపణలు చేయడం ట్రెండ్‌గా మారింది

సుప్రీంకోర్టు ఆందోళన

న్యూఢిల్లీ: తమకు అనుకూలంగా తీర్పులు రాని పక్షంలో లాయర్లు, కక్షిదారులు న్యాయమూర్తులపై అవమానకరమైన, అశ్లీలతతో కూడిన ఆరోపణలు చేయడం నేడు ట్రెండ్‌గా మారిపోయిందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి పరిణామాలు న్యాయవ్యవస్థ సమగ్రతను తీవ్రంగా దెబ్బతీస్తాయని, వీటిని అడ్డుకోవాలనిప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. తెలంగాణకు చెందిన కక్షిదారు పెద్ది రాజు, అతడి తరఫున వాదించిన ఇద్దరు లాయర్లపై ధిక్కార చర్యలను నిలిపివేస్తూ ఈ మేరకు పేర్కొంది. ఈ ముగ్గురూ తెలంగాణ హైకోర్టుకు క్షమాపణలు చెప్పడం, న్యాయస్థానం అంగీకరించడం జరిగినందున మళ్లీ విచారణ అవసరం లేదని తెలిపింది. అదేవిధంగా, న్యాయస్థానపు అధికారులుగా ఉన్న లాయర్లు ఈ కోర్టు లేదా ఏ హైకోర్టు న్యాయమూర్తులపై అయినా ఆరోపణలు చేసే పిటిషన్‌దారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. తెలంగాణ హైకోర్టుకు చెందిన జస్టిస్ మౌసుమి భట్టాచార్యపై పెద్ది రాజు, అతడి ఇద్దరు లాయర్లు అనుచిత వ్యాఖ్యలు చేయడం వివాదం రేపింది.

రాష్ట్రాల బార్ ఎన్నికల పర్యవేక్షణకు హైకోర్టు రిటైర్డు జడ్జీలు: సుప్రీం

న్యూఢిల్లీ: రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగేందుకు హైకోర్టు రిటైర్డు జడ్జీలను పర్యవేక్షకులుగా నియమించనున్నట్లు సుప్రీంకోర్టు సోమవారం తెలిపింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు జరిగే ఎన్నికలపై విశ్వసనీయత తగ్గుతోందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ ప్రపంచంలోనే అత్యంత కష్టమైన పని బార్ కౌన్సిళ్లకు ఎన్నికలు జరపడమేనని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు సంబంధిత హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తులను నియమిస్తామంది. సాధ్యమైనంత త్వరగా బార్ కౌన్సిళ్లకు ఎన్నికలు జరిపేందుకు వీలుగా నోటిఫికేషన్ జారీ చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కోరింది. ఇందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ కూడా అయిన సీనియర్ లాయర్ మనన్ కుమార్ మిశ్రా తెలిపారు. ఇప్పటికే పంజాబ్, హరియాణా బార్ కౌన్సిల్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశామని, మరో ఏడు రాష్ట్రాలకు ఈ వారంలోనే విడుదల చేస్తామన్నారు. రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల సభ్యుల పదవీ కాలాన్ని పొడిగించేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఉన్న అధికారాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం పైవిధంగా తీర్పు వెలువరించింది.

మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై కేంద్రానికి సుప్రీం నోటీస్

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు మూడింట ఒక వంతు సీట్లను కేటాయిస్తూ తీసుకువచ్చిన నారీ శక్తి వందన్ చట్టం–2023 అమలుపై స్పందన తెలియజేయాలని సోమవారం సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీస్ జారీ చేసింది. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణతో సంబంధం లేకుండా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా మహిళలకు పార్లమెంట్‌తోపాటు రాష్ట్రాల శాసనసభల్లో తగు ప్రాతినిధ్యం లేదని పిటిషనర్ జయా ఠాకూర్ పేర్కొన్నారు. ప్రస్తుత జనాభా గణాంకాల ఆధారంగా 33 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. ఇప్పటికే చాలా ఆలస్యమైందన్నారు. తాజాగా నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ చేపట్టాక అమలు చేస్తామనడం సరికాదన్నారు. పార్లమెంట్ ఈ మేరకు అవసరమైన చట్ట సవరణ చేయాలని కోరారు. స్పందించిన ధర్మాసనం మన దేశంలో అతిపెద్ద మైనారిటీ వర్గం మహిళలేనని వ్యాఖ్యానించింది. జనాభాలో 48 శాతం వరకు ఉన్న మహిళలకు రాజకీయ సమానత్వాన్ని కల్పించడానికి ఉద్దేశించిన అత్యంత ముఖ్యమైన అంశమని పేర్కొంది. 'చట్టాన్ని అమలు చేసే అధికారం కార్యనిర్వాహక వర్గానికి మాత్రమే ఉంది. ఇలాంటి అంశాలపై ప్రభుత్వానికి మాండమస్ రూపంలో ఆదేశాలను జారీ చేయలేం'అని స్పష్టం చేసింది. అయితే, దీనిపై కేంద్ర ప్రభుత్వ అభిప్రాయం కోరుతామని తెలిపింది.

సర్కారియా కమిషన్ ముఖ్య సిఫార్సులు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

వివాదాలు - సమీక్షా కమిషన్లు

కేంద్ర , రాష్ట్ర సంబంధాల్లో తలెత్తిన వివాదాలను పరిశీలించి, పరిష్కరించడానికి అనేక కమిటీలను, కమిషన్లను నియమించారు. ఈ కమిటీలు వాటికి నిర్దేశించిన పరిధిలో కొన్ని సిఫార్సులు చేశాయి.
వాటిలో ముఖ్యమైనవి...

పరిపాలనా సంస్కరణల సంఘం (1966)

కేంద్ర ప్రభుత్వం 1966లో ఆరుగురు సభ్యులతో మొరార్జీ దేశాయ్ అధ్యక్షతన పరిపాలనా సంస్కరణల కమిషన్‌ను నియమించింది. (మొరార్జీ దేశాయ్ రాజీనామా చేయడం వల్ల కె.హనుమంతయ్య ఈ కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు). ఈ కమిటీ కేంద్ర రాష్ట్ర సంబంధాలను సమగ్రంగా పరిశీలించింది.

కేంద్ర, రాష్ట్ర సంబంధాల కోసం ఎం.సి. సెతల్వాడ్ అధ్యక్షతన ఒక అధ్యయన బృందాన్ని కూడా నియమించారు. పరిపాలనా సంస్కరణ సంఘం తుది నివేదికను 1969లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో 22 సిఫార్సులు చేసింది.

- ప్రకరణ 263 ప్రకారం, అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- ప్రజా జీవితంలో, పరిపాలనలో అనుభవం ఉన్న వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- రాష్ట్రాల కోరిక మేరకే కేంద్ర బలగాలను పంపాలి.
- రాష్ట్రాలకు మరిన్ని ఆర్థిక వనరులను బదిలీ చేయాలి.

అయితే ఈ సిఫార్సులపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

రాజమన్నార్ కమిటీ (1969)

1969లో తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ పి.వి. రాజమన్నార్ అధ్యక్షతన, ఇద్దరు సభ్యులతో కేంద్ర, రాష్ట్ర సంబంధాల పరిశీలనకు ఒక కమిటీని నియమించింది. ఇది 1971లో నివేదికను సమర్పించింది. దీనిలోని ఇతర సభ్యులు లక్ష్మణస్వామి మొదలియార్, పి. చంద్రారెడ్డి.

ఇది దేశంలో ఉన్న ఏక కేంద్ర ధోరణులకు కారణాలను గుర్తించింది. అవి

- రాజ్యాంగం కేంద్రానికి ఇచ్చిన ప్రత్యేక అధికారాలు
- కేంద్రం, రాష్ట్రంలోనూ ఏక రాజకీయ పార్టీ పాలన
- రాష్ట్రాలకు ఆర్థిక వనరులు తగినన్ని లేకపోవడం, కేంద్రం మీద ఆధారపడటం
- కేంద్ర ప్రణాళిక రచన, ప్రణాళికా సంఘం పాలన

సిఫార్సులు

- రాష్ట్ర మంత్రివర్గంతో లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక ఉన్నతాధికార సంఘంతో సంప్రదించి రాష్ట్రపతి, గవర్నర్‌ను నియమించాలి.
- రాష్ట్ర ప్రభుత్వాన్ని తొలగించి, రాష్ట్రపతి పాలన ప్రకటించే ప్రకరణ 356ను రద్దు చేయాలి.
- గవర్నర్ సంతృప్తి ఉన్నంత వరకే మంత్రివర్గ పదవుల్లో ఉండాలన్న ప్రకరణను తీసివేయాలి.
- కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అవలంబించే ఏకపక్ష నియంతృత్వ చర్యలను నిరోధించడానికి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి రాష్ట్రాలకు తగినన్ని రక్షణలను కల్పించాలి.
- ప్రధాని అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- రాజ్య సభలో రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి.
- కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రాల వారీగా ప్రాతినిధ్యం ఉండాలి.
- ప్రణాళికా సంఘం ఒక శాశ్వత సంస్థగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వ నియంత్రణ తగ్గాలి.
- అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను రద్దు చేయాలి.
- అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు బదిలీ చేయాలి.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను ప్రముఖ న్యాయ శాస్త్రవేత్తలు తీవ్రంగా విమర్శించారు.

దేశంలో ఎన్నో వేర్పాటువాద శక్తులు తలెత్తుతుండగా జాతి నిర్మాణం, జాతి సమైక్యతా క్రమంలో విద్య, వ్యవసాయ, ఉత్పత్తి రంగాలను విస్తృతం చేసి సామాన్య మానవుని సమస్యలను తీర్చడంలో ప్రయత్నం చేయాల్సి ఉండగా ప్రాంతీయతత్వాన్ని బలోపేతం చేసే విధంగా సిఫార్సులు చేయడం అవాంఛనీయం అని పేర్కొన్నారు.

ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానం (1973)

1973లో పంజాబ్‌లో అకాలీదళ్ పార్టీ ఆనందపూర్ అనే ప్రాంతంలో ఒక తీర్మానాన్ని చేసింది. రక్షణ,అంతర్జాతీయ సంబంధాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీ మొదలైన విషయాలకే కేంద్ర ప్రభుత్వ పరిధి పరిమితం కావాలని, దేశంలో నిజమైన సమాఖ్య స్ఫూర్తి తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

పశ్చిమబెంగాల్ ప్రభుత్వ మెమొరెండం (1977)

1977లో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై ఒక విజ్ఞాపన సమర్పించింది. అందులోని కొన్ని ముఖ్యాంశాలు.

- రాజ్యాంగంలో యూనియన్ అనే పదాన్ని తొలగించి సమాఖ్య అనే పదాన్ని చేర్చాలి.
- కొత్త రాష్ట్రాల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోనికి తీసుకోవాలి.
- అఖిల భారత సర్వీసులను రద్దు చేయాలి.
- రాష్ట్రపతి పాలన, అలాగే ఆర్థిక అత్యవసర పరిస్థితి అధికారాలను తొలగించాలి.
- కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిని కుదించాలి.
- రాజ్యసభకు లోక్‌సభతో సమానంగా అధికారాలు ఇవ్వాలి.
- జోనల్ కౌన్సిల్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలి.
- శాశ్వత ప్రాతిపదికపై అంతర్రాష్ట్ర ప్రభుత్వ మండలిని ఏర్పాటు చేయాలి.
- జాతీయాభివృద్ధి మండలి పేరును జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిగా మార్చి అస్థిత్వాన్ని పరిరక్షించాలి.
- ఆర్థిక నిపుణులనే ఆర్థిక సంఘ సభ్యులుగా నియమించాలి.
- భారతదేశ సమష్టి సంస్కృతిని సంరక్షించడానికి జాతీయ కార్యక్రమాలను ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేయాలి.



- అవశిష్ట అంశాలపై పన్నులు విధించే శాసన నిర్మాణ అధికారాన్ని పార్లమెంటుకు అప్పగించాలి.
- కార్పొరేషన్ పన్నుల్లో కొంత భాగాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలి.
- రాష్ట్రాలతో సంప్రదించి ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసు, ఇండియన్ హెల్త్ సర్వీస్, ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రాల అనుమతి లేకుండా కేంద్ర బలగాలను పంపొద్దు.
- ఉమ్మడి జాబితాలో చట్టాలను రూపొందించే సమయంలో కేంద్రం రాష్ట్రాలను సంప్రదించాలి.
- గవర్నర్ నియామక సమయంలో ముఖ్యమంత్రిని విధిగా సంప్రదించే విధంగా రాజ్యాంగ సవరణ చేయాలి.
- త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు గట్టి ప్రయత్నం చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయం ప్రతిపత్తి అవసరం లేదు. అయితే వాటి పని తీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థిక సంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దాన్ని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంట్ నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

గాడ్గిల్ ఫార్ములా

సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సిన ఆవశ్యకత ఉంది. కేంద్ర ప్రణాళికా సహాయాన్ని రాష్ట్రాలకు అందించే ప్రాతిపదికను ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ డి.ఆర్.గాడ్గిల్ పేరుతో 1971లో ఓ ఫార్ములాను రూపొందించారు. దీన్ని 1981లో ఒకసారి, తిరిగి 1992లో మరోసారి సమీక్షించారు. డి.ఆర్.గాడ్గిల్ ఫార్ములా అనుసరించి జనాభా ఆధారంగా 60 శాతం, తలసరి ఆదాయం ఆధారంగా 25 శాతం, ఆదాయ, వ్యయాలను సరిచూసుకుని విత్తలోటు తగ్గించినందుకు 7.5 శాతం, ఇతర సమస్యల (ఎడారి ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, శిశు మరణాలు, ఆరోగ్యం మొదలైనవి) ఆధారంగా 7.5 శాతం కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు సహాయాన్ని అందిస్తుంది. అయితే వెనకబడ్డ, పేద రాష్ట్రాలకు ఈ ఫార్ములా అంత ఉపయోగకరంగా లేదు. విత్త రంగంలో చూపిన క్రమశిక్షణను ఈ ఫార్ములా ప్రోత్సాహపరుస్తున్నట్లుగా లేదని కొందరు విమర్శిస్తున్నారు.

సర్కారియా కమిషన్ సిఫార్సులు (1987)

1983లో కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్.ఎస్. సర్కారియా అధ్యక్షతన బి.శివరామన్, ఎస్.ఆర్.సేన్ సభ్యులుగా, కార్యదర్శిగా ఆర్.ఎం. సుబ్రహ్మణ్యం, రాజ్యాంగ సలహాదారుడుగా ఎల్.ఎన్.సిన్హాతో ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ 1987 అక్టోబర్ 27న 247 సిఫార్సులతో కూడిన 1600 పేజీల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. 1988 జనవరిలో ప్రభుత్వం సర్కారియా కమిషన్ నివేదికను విడుదల చేసింది. అందులో 230 సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలను తీసుకుంది. మొత్తం సిఫారసుల్లో 170 సిఫార్సులను అమలు చేసింది.

ముఖ్య సిఫార్సులు

- గవర్నర్‌ల నియామకంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులను సంప్రదించాలి.
- రాజకీయేతర రంగాలను చెందిన, వివాదాస్పదం కాని వ్యక్తులను, ప్రముఖులను మాత్రమే గవర్నర్‌లుగా నియమించాలి. రాష్ట్రేతర వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- ముఖ్యమంత్రి నియామకం, రాష్ట్రమంత్రి మండలి కొనసాగింపు విషయంలో విధాన సభ మెజారిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకోవాలి. అరుదైన సందర్భాల్లో రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టాలి.
- అఖిల భారత సర్వీసులను మరింత బలోపేతం చేసి, మరిన్ని కొత్త సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లోనే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయంప్రతిపత్తి అవసరంలేదు. అయితే వాటి పనితీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థికసంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దీనిని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంటు నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ ఇండోర్‌లో వివిధ ఉద్యోగాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), ఇండోర్‌లో ఎస్ఆర్ఎఫ్, జేఆర్ఎఫ్, ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 05.
» **ఖాళీల వివరాలు:** జూనియర్ రీసెర్చ్ ఫెలో-03, సీనియర్ రీసెర్చ్ ఫెలో-01, ప్రాజెక్ట్ ఇంజనీర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్), పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. గేట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారు.
» **స్టైపెండ్:** నెలకు సీనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.42,000, జూనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.37,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్: vbhatia@iiti.ac.in**
» **దరఖాస్తులకు చివరితేది:** 12.11.2025.
» **వెబ్‌సైట్: https://www.iiti.ac.in**

ఐఐటీ మద్రాస్‌లో ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) మద్రాస్ తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బీటెక్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.11.2025.
» **వెబ్‌సైట్: https://icsrstaff.iitm.ac.in**

బిట్స్, పిలానీలో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులు

బెంగళూరులోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-సైన్స్, పిలానీ ఒప్పంద ప్రాతిపదికన రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఎంబీఏ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2025
» **వెబ్‌సైట్: www.bitspilani.ac.in**

విద్యార్థులకు ర్యాంకులను ఇవ్వడం దేన్ని సూచిస్తుంది?



మెథడాలజీ (మాదిరి ప్రశ్నలు)

1. జీవశాస్త్ర శాఖలకు సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
ఎ. ఏరోబయాలజీ - ప్రాథమిక శాఖ
బి. జీవ ఖగోళ శాస్త్రం - అనువర్తిత శాఖ
సి. వ్యవసాయ శాస్త్రం - సంబంధిత శాఖ
డి. జీవసాంకేతిక శాస్త్రం- సంబంధిత శాఖ
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
2. విజ్ఞానశాస్త్రం చదివిన రాగిణి రోజూ గడపకు పసుపు పూస్తోంది. విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు చేయడం వల్ల రాకేష్ నిజాయతీ అనే లక్షణాన్ని అలవరచుకున్నాడు. వీరిలో పెంపొందిన విలువలు?
1) రాగిణి - నైతిక విలువ, రాకేష్ - సృజనాత్మక విలువ
2) రాగిణి - సాంస్కృతిక విలువ, రాగిణి - బౌద్ధిక విలువ
3) రాగిణి-ఉపయోగాత్మక విలువ, రాకేష్ - సాంస్కృతిక విలువ
4) రాగిణి - సాంస్కృతిక విలువ రాకేష్ - నైతిక విలువ
3. వైద్యపరమైన ఎన్‌సైక్లోపీడియాలను ఎవరి కాలంలో తయారుచేశారు?
1) అరబ్బులు 2) గ్రీకులు
3) రోమన్లు 4) హిబ్రూలు
4. రోహన్ పుస్తకాలు చదవడం ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం భవిష్యత్తులో జరిగే సంఘటనను ఊహించాడు. అతనిలో నెరవేరిన లక్ష్యం ఏది?
1) ప్రాగుక్తీకరణ 2) బహిర్గీశనం
3) వినియోగం 4) విశ్లేషణ
5. జానీ వాతావరణ శాఖ ఆఫీసులో ఉన్న గ్రాపులను చూసి ప్రస్తుత సంవత్సరకాలం వర్షపాతాన్ని వివరించాడు. అతడిలో ఏ లక్ష్యం సాధించినట్లుగా చెప్పవచ్చు?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) అభినందన
6. నిశితంగా పరిశీలించడం అనే లక్షణం విజ్ఞానశాస్త్ర అధ్యయనాల వల్ల వస్తుంది. ఇందు లో పరిశీలన దేనికి సంబంధించింది?
1) అవగాహన 2) జ్ఞానం
3) నైపుణ్యం 4) అభిరుచి
7. వివేక్ అనే విద్యార్థికి విజ్ఞానశాస్త్ర ప్రదర్శన లో పాల్గొనడం,శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు చదవడం, శాస్త్ర ప్రసంగాలు వినడం అలవాట్లు ఉన్నాయి. అతడిలో సాధించిన లక్ష్యం, దానికి చెందిన రంగానికి సంబంధించి సరైన జత ఏది?
1) జ్ఞానాత్మక రంగం - అభినందన
2) భావావేశ రంగం - అవగాహన
3) మానసిక చలనాత్మక రంగం- అభిరుచి
4) భావావేశ రంగం- అభిరుచి
8. 'విద్యార్థులు ప్రయోగం చేస్తే ప్రమాదాలు జరుగుతాయి' అనే భ్రమ, భయం కల్గిన అనిల్ అనే జీవశాస్త్ర ఉపాధ్యాయుడికి అనుకూలమైన బోధనా పద్ధతి ఏది?
1) ప్రయోగ పద్ధతి 2) ప్రదర్శనా పద్ధతి
3) అన్వేషణ పద్ధతి 4) శాస్త్రీయ పద్ధతి
9. కృత్రిమ బోధనోపకరణాలను ఉపయోగించడం ద్వారా కాకుండా, సహజ పరిస్థితుల పరిశీలన ద్వారా జీవశాస్త్రం నేర్చుకోవాలనుకునే ఉపాధ్యాయునికి అత్యంత అనుసరణీయమైన పద్ధతి ఏది?
1) ప్రదర్శనా పద్ధతి 2) అన్వేషణ పద్ధతి
3) ప్రకల్పన పద్ధతి 4) ప్రయోగ పద్ధతి
10. కిందివాటిలో దేంట్లో నిగమన ఉపగమాన్ని అనుసరించినట్లుగా చెప్పవచ్చు?
1) ముందుగా ఉదాహరణ ఇచ్చి తర్వాత సూత్రాన్ని రాబట్టడం
2) సాధారణీకరణాలు ప్రతిపాదించడం
3) ముందుగా సూత్రం చెప్పి తర్వాత ఉదాహరణలు చెప్పడం
4) విద్యార్థులకు ఉదాహరణలను మాత్రమే తెలియజేయడం
11. హెర్బర్ట్ విధానంలోని దశ కానిది?
1) హాజరు పరచడం 2) సన్నాహం
3) సాధారణీకరణం 4) పునర్బలనం
12. యూనిట్ పథక దశల్లో ఉపసంహారక సోపానానికి సంబంధించింది ఏది?
1) బోధనా పద్ధతి ఎంపిక
2) ప్రేరణ కల్గించడం
3) బోధనోపకరణాల వినియోగం
4) మూల్యాంకన పద్ధతులు
13. ప్రతి విషయానికి ఆధారాలను చూపించమని, ఆధారాలుంటేనే నమ్ముతాను అని జీవశాస్త్ర ఉపాధ్యాయుని అడుగుతున్న 'ప్రజ్ఞ' అనే 9వ తరగతి విద్యార్థినిలో ఏ లక్ష్యం సాధించినట్లు?
1) మొండితనం 2) అభిరుచి
3) శాస్త్రీయ దృక్పథం 4) నైతిక విలువ
14. పాఠ్యపథక రచనలో హెర్బర్ట్ విధానం పరిమితి కానిది?
1) ఉపాధ్యాయుని పాత్ర ఎక్కువ
2) అన్ని సబ్జెక్టుల బోధనకు అనుకూలం
3) జ్ఞాపకశక్తికే ప్రాధాన్యం
4) సగటు విద్యార్థులకు మాత్రమే పనిచేస్తుంది
15. ప్రయోగశాలలో 10'×4' కొలతలతో ఉండే ది ఏది?
1) ఉపాధ్యాయుడి ప్రదర్శనాబల్ల
2) ప్రయోగశాల కిటికీ
3) అక్వేరియం 4) నల్లబల్ల
16. 'సైన్స్ న్యూస్ అండ్ పేపర్' అనే గోడపత్రికను ముద్రిస్తున్న సంస్థ ఏది?
1) మోక్షగుండం విశ్వేశ్వరయ్య మ్యూజియం
2) NCERT
3) విక్రం సారాభాయ్ సమాజ విజ్ఞాన కేంద్రం
4) NCSTC
17. కిందివాటిలో ఏది ప్రత్యేక అభిరుచి సంఘం?
1) భౌతిక శాస్త్ర సంఘం
2) వృక్ష శాస్త్ర సంఘం
3) వ్యవసాయ సంఘం
4) జంతు శాస్త్ర సంఘం
18. కిందివాటిలో సరైన జత ఏది?
ఎ. విజ్ఞానశాస్త్ర దినోత్సవం - జూన్ 5
బి. ధరిత్రీ దినోత్సవం - ఏప్రిల్ 22
సి. పర్యావరణ దినోత్సవం - జూన్ 5
డి. ధరిత్రీ దినోత్సవం - ఫిబ్రవరి 28
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
19. విద్యార్థులకు ర్యాంకులను ఇవ్వడం దేన్ని సూచిస్తుంది?
1) ప్రత్యక్ష మాపనం 2) సాపేక్ష మాపనం
3) మూల్యాంకనం 4) పరోక్ష మాపనం
20. మంచి పరీక్షకు విశ్వసనీయత ఉండాలి. విశ్వసనీయత అంటే?
1) ఒక సమాధాన పత్రాన్ని ఏ ఇద్దరు ఉపాధ్యాయులు దిద్దినా ఒకే మార్కులు రావాలి
2) ఉపాధ్యాయుడు వ్యక్తినిష్ఠతకు ప్రాధా న్యం ఇవ్వాలి, వస్తునిష్ఠతకు కాదు
3) పూర్తి లక్ష్యాలను పరిగణనలోకి తీసుకొని పరీక్ష నిర్వహించాలి
4) విద్యార్థికి వేర్వేరు సమయాల్లో ఒకే పరీ క్ష నిర్వహిస్తే ఒకే మార్కులు రావాలి
21. బ్లూ ప్రింట్ తయారు చేసేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల్లో ఉపాధ్యాయుడు కిందివాటిలో దేన్ని సరిగా అంచనా వేయలేడు?
1) లక్ష్యాలు 2) పాఠ్యాంశ విషయం
3) కాఠిన్యత స్థాయి 4) ప్రశ్నల రకాలు
22. జీఎంసీ బాలయోగి మ్యూజియం ఎక్కడ ఉంది?
1) రాజమండ్రి 2) విజయవాడ
3) ఏలూరు 4) విశాఖపట్నం
23. ఎడ్గర్‌డేల్ అనుభవ శంకువులో కదలని చిత్రాల స్థానం?
1) పై నుంచి మూడో స్థానం
2) కింది నుంచి 5వ స్థానం
3) టెలివిజన్ కింద 4)చలనచిత్రాల కింద
24. ప్రత్యేక పరిస్థితుల్లో జీవించే జంతువుల గురించి అధ్యయనం చేయడానికి దోహదపడే ఉపకరణం ఏది?
1) టెర్రేరియం 2) వివేరియం
3) హెర్బేరియం 4) అక్వేరియం
25. కిందివాటిలో కృత్యరూప బోధనోపకరణాలేవి?
ఎ. డయారమా బి. ఎపిడయాస్కోపు
సి. కంప్యూటర్ డి. ఫీల్డ్ ట్రిప్
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
26. కన్నింగ్ హామ్ పాఠ్య ప్రణాళికకు ఇచ్చిన నిర్వచనంలో పోలికలకు సంబంధించి సరైన జత ఏది?
ఎ. స్టూడియో - తరగతి గది
బి. కళాకారుడు - విద్యార్థి
సి. అభిరుచికి అనుగుణంగా - లక్ష్యాలు నెరవేరేటట్లు
డి. ఉపయోగించే సాధనం-పాఠ్యప్రణాళిక
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
27. బ్రూటేకర్ అభిప్రాయం ప్రకారం పాఠ్య ప్రణాళిక ఎలా ఉండాలి?
1) పాఠ్యప్రణాళిక ముందుగా చేసి అందు లో విద్యార్థిని జాగ్రత్తగా ఇమడ్చాలి
2) పాఠ్యప్రణాళిక చేసి అందులో సిలబస్ పొందుపరచాలి
3) ఉపాధ్యాయుడు చేయడానికి వీలుగా పాఠ్యప్రణాళిక రూపొందించాలి
4) విద్యార్థికి అనుగుణంగా పాఠ్యప్రణాళిక తయారుచేయాలి
28. పాఠ్యపుస్తకం తయారుచేసే రచయితకు ఉండాల్సిన కనీస అర్హత?
1) ఏ తరగతి పాఠ్యపుస్తకం తయారు చేస్తున్నాడో ఆ తరగతికి కనీసం అయిదేళ్ల బోధించిన అనుభవం ఉండాలి
2) ఉపాధ్యాయ వృత్తిలో కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలి
3) SCERTలో కనీసం 5 సంవత్సరాలు పని చేసిన అనుభవం అవసరం
4) సర్వశిక్ష అభియాన్‌లో పనిచేసిన అనుభవంతో పాటు ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో రెండేళ్ల పని అనుభవం
29. కిందివాటిలో ఏది ప్రత్యక్ష అనుభవానికి దగ్గరగా ఉండే ఉపకరణం?
1) రేఖీయ చిత్రం 2) రేడియో
3) డయారమా 4) శబ్దిక చిహ్నం
30. 1959లో మొట్టమొదటి బిర్లా పారిశ్రామిక సాంకేతిక ప్రదర్శనశాలను ఎక్కడ స్థాపించారు?
1) కోల్‌కతా 2) ముంబై
3) అహ్మదాబాద్ 4) ఢిల్లీ
31. జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఒకరు హెర్బేరియం ఉపయోగించి, మరొకరు మాతృక స్పెసిమన్‌ను ఉపయోగించి బోధించారు. వారు అందించిన అనుభవాలు వరుసగా..
1) ప్రత్యక్ష, ప్రతినిధిత్వం
2) ప్రతినిధిత్వం, ప్రతినిధిత్వం
3) ప్రత్యక్ష, పరోక్ష 4) ప్రత్యక్ష, ప్రత్యక్ష
32. భావన ఏర్పడటానికి కనీసం రెండు కిందివాటిలో ఏవి కావాలి?
1) నియమాలు 2) సిద్ధాంతాలు
3) సత్యాలు 4) సాధారణీకరణలు
33. 'విజ్ఞానశాస్త్ర అంధయుగం'గా పేర్కొన్న శతాబ్ద కాలాలు ఏవి?
1) క్రీ.శ. 18-19 2) క్రీ.శ. 15-17
3) క్రీ.శ. 16-18 4) క్రీ.శ. 12-14
34. ఇకో క్లబ్‌లు కిందివాటిలో దేనికి సంబంధించినవి?
1) ఎయిడ్స్ 2) జలచరాల పరిరక్షణ
3) పర్యావరణం
4) అంతరించిపోతున్న జీవులు
35. కార్యాకారణ సంబంధం గుర్తించడం అనేది ఏ లక్ష్యానికి సంబంధించింది?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
36. అక్షయ తృతీయ రోజు బంగారం కొంటే శుభం కలుగుతుంది అని నమ్మే వ్యక్తిలో నెరవేరని లక్ష్యం ఏది?
1) అవగాహన 2) అభిరుచి
3) శాస్త్రీయ దృక్పథం 4) వినియోగం
37. ప్రయోగ పరికరాలు శుభ్రం చేయడం, భద్రపరచడం అనేవి మానసిక చలనాత్మక రంగ సోపానాల్లో దేనికి సంబంధించినవి?
1) అనుకరణ 2) హస్తలాఘవం
3) సమన్వయం 4) సహజీకరణ
38. అవగాహనలోని వివేచనం చేయడం అనే స్పష్టీకరణకు సంబంధించింది ఏది?
1) రెండు అంశాల మధ్య భేదాలను గుర్తించడం
2) పెద్ద అంశాన్ని చిన్న చిన్న అంశాలుగా విడగొట్టడం
3) దశలవారీగా ఒక అంశం గురించి తెలుసుకోవడం
4) లక్షణాల ఆధారంగా సమూహాలుగా చేయడం
39. విద్యార్థులు నమూనాలు తయారు చేయుడానికి సంబంధించి ఏ రకమైన పరీక్షలు నిర్వహించాలి?
1) నిష్పాదన పరీక్ష 2) ప్రజ్ఞా పరీక్షలు
3) సహజ సామర్థ్య పరీక్షలు
4) అంచనా మాపని
40. ఉపాధ్యాయుడు ప్రొజెక్టర్‌ను ఉపయోగించి విద్యార్థులకు బోధించాడు. ఆయన ఉపయోగించిన బోధనా పద్ధతి?
1) అన్వేషణ పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
3) ప్రదర్శనా పద్ధతి 4) ప్రకల్పన పద్ధతి

సమాధానాలు

1) 2	2) 4	3) 1	4) 2	5) 2
6) 3	7) 4	8) 2	9) 3	10) 3
11) 4	12) 4	13) 3	14) 2	15) 4
16) 3	17) 3	18) 2	19) 2	20) 4
21) 3	22) 3	23) 1	24) 2	25) 3
26) 3	27) 4	28) 1	29) 3	30) 1
31) 2	32) 3	33) 4	34) 3	35) 2
36) 3	37) 2	38) 3	39) 1	40) 3

భారతదేశం- పేదరికం

ఏ దేశంలోనైతే అధిక జనాభా, పేదరికంతో బాధపడుతుంటారో ఆయా దేశాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగలేవని అర్థశాస్త్ర పితామహుడు ఆడమ్ స్మిత్ 1776లో **Wealth of Nations** గ్రంథంలో పేర్కొన్నాడు. ప్రపంచంలో రోజుకు ఒక డాలర్ కూడా ఆదాయం లభించని ప్రజానీకం సుమారు **1.2** బిలియన్లని అంచనా.

- **ఎవరైతే కనీస జీవన ప్రమాణాన్ని పొందలేక పోతున్నారో వారిని పేదవారుగా పరిగణించవచ్చు.**
  – ప్రపంచ బ్యాంకు.
- **'పేదరికం అనుభవించేవారి బాధను గుడ్డివారు కూడా చూడగలరు"**
  – ఆర్థికవేత్త, నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్యసేన్
- **'పేదరికమనే సముద్రపు దీవుల్లో మనం ఎంతమాత్రం సంతోషంగా జీవించలేం'**
  – ఎం.ఎస్. స్వామినాథన్
- **పేదరికం అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన**
  జస్టిస్. కె.జి. బాలక్రిష్ణన్ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

పోషకాహార లోపం, అనారోగ్యం, నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి మౌలిక సమస్యలతో అభివృద్ధి చెందుతున్న దేశాలు సతమతమవుతున్నాయి. ఆయా దేశాల్లో ఎంతో కొంత అభివృద్ధి జరిగినా, దాని ప్రతిఫలం మాత్రం అతి కొద్ది మందికే దక్కడం వల్ల ఆదాయ అసమానతలు అధికమవుతున్నాయి. దేశంలో భూమి, మూలధనం వంటి ఆస్తులు, ఆదాయ పంపిణీలో తీవ్రమైన అసమానతల వల్ల అధిక సంఖ్యాక ప్రజలు పేదరికానికి గురవుతున్నారు.

పేదరికాన్ని కేవలం ఆర్థికపరమైన సమస్యగానే కాకుండా సాంఘిక సమస్యగా కూడా పరిగణించాల్సి ఉంటుంది. మానవాభివృద్ధి నివేదిక ప్రకారం.. 'దీర్ఘకాలం ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు కావాల్సిన సౌకర్యాలు, స్వేచ్ఛ, స్వాభిమానం, ఇతరుల నుంచి గౌరవం కొరవడటమే పేదరికం'. 'అధిక పేదరికం, అధిక సంపదలు సమాజంలో వ్యక్తిత్వ వికాసానికి అడ్డంకి అవుతాయి, ప్రపంచంలో గొప్ప వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులంతా మధ్య తరగతి నుంచి వచ్చినవారే. అందుకే ఆర్థిక శక్తులు సమానంగా, సంతులితంగా సమాజంలో సర్దుబాటు కావాలి' అని స్వామి వివేకానంద పేర్కొన్నారు.

పేదరికాన్ని రెండు రకాలుగా పేర్కొనొచ్చు. అవి..

1. నిరపేక్ష పేదరికం 2. సాపేక్ష పేదరికం.

1. **నిరపేక్ష పేదరికం:** దేశంలోని ప్రజలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని, జీవనాధార వ్యయాన్ని కూడా చేయలేని పరిస్థితిని నిరపేక్ష పేదరికం అంటారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ రకమైన పేదరికం ఉంటుంది.
2. **సాపేక్ష పేదరికం:** వివిధ వ్యక్తులకు లేదా గ్రూపులకు అందుబాటులో ఉన్న వనరులు, వేతనం, సంపద తదితర అంశాల ఆధారంగా దీన్ని లెక్కిస్తారు. సమాజంలో 5%. నుంచి 10% మంది సంపన్న వర్గాల ప్రజల జీవన ప్రమాణంతో పోల్చితే కింది స్థాయిలోని 5% నుంచి 10% ప్రజల జీవన ప్రమాణం తక్కువగా ఉంటుంది. సంపన్న వర్గంలోని ప్రజల ఆదాయాలతో పోల్చితే దిగువ వర్గంలోని వారి ఆదాయాలు తక్కువగా ఉన్నప్పటికీ వారు దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నవారు కాదు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ రకమైన పేదరికం ఉంటుంది. దీన్ని లారెంజ్ వ్యతిరేక లేదా గిని గుణకం ద్వారా లెక్కిస్తారు.

భారతదేశం పేదరికం - అంచనాలు

స్వాతంత్ర్యానికి పూర్వం దాదాబాయ్ నౌరోజీ తన గ్రంథమైన "Poverty and Unbritish Rule in India" లో జైళ్లలోని ఖైదీల కనీస పౌష్టికాహారం ఆధారంగా పేదరికాన్ని అంచనా వేశారు. స్వాతంత్ర్యానంతరం అనేక మంది ఆర్థికవేత్తలు పేదరికాన్ని అంచనా వేశారు. వారిలో పి.డి. ఓఝా, దండేకర్, నీలకంఠ రాథ్, మిన్హాస్, పీకే బర్ధన్, మాంటెక్‌సింగ్ ఆహ్లూవాలియా, గౌరవదత్, రావెల్లిస్, లక్డవాలా (D.T. Lakdawala- Expert Group Chairman 1989) తదితరులు ముఖ్యులు.

1960 పూర్వం పేదరికానికి సంబంధించిన అంచనాల్లో వ్యత్యాసాలున్నాయి. ఆయా అంచనాలు వరుసగా.. మిన్హాస్ 37.1% , ఆహ్లూవాలియా 56.5%, పీకే బర్ధన్ 54% , దండేకర్, నీలకంఠ రాథ్ 40% (1968-69). ఈ వ్యత్యాసాలకు ప్రధాన కారణం వారు తీసుకున్న గణాంకాల్లో తేడా లేనప్పటికీ వారు గణించే పద్ధతుల్లో తేడా ఉండడమే.

- **పేదరిక రేఖ (Poverty Line):** ఒక వ్యక్తి జీవించడానికి కావాల్సిన కనీస జీవన వ్యయం ఆధారంగా పేదరిక రేఖను నిర్ణయిస్తారు. దీని కోసం ప్రణాళికా సంఘం 1989, సెప్టెంబర్‌లో డి.టి. లక్డవాలా అధ్యక్షతన నిపుణుల సంఘాన్ని నియమించింది. ఆ కమిటీ 1993 జూలైలో తమ నివేదికను సమర్పించింది. పౌష్టికాహార నిపుణుల సలహా మేరకు లభ్యమయ్యే కేలరీల శక్తిని బట్టి కనీస పోషకాహార స్థాయిని, గ్రామీణ ప్రాంతాల్లో 2400 కేలరీలు, పట్టణ ప్రాంతాల్లో 2100 కేలరీలను ప్రాతిపదికగా తీసుకొన్నారు.

1973-74ను ఆధార సంవత్సరంగా తీసుకొని నెలసరి తలసరి వినియోగ వ్యయాన్ని (Monthly Per Capita Consumption Expenditure - MPCE) గ్రామీణ ప్రాంతానికి రూ. 49, పట్టణ ప్రాంతానికి రూ. 56 నిర్ణయించారు. 2004-05కు గానూ గ్రామీణ ప్రాంతానికి రూ. 356.30, పట్టణ ప్రాంతానికి రూ.538.60, 2009-10 నాటికి గ్రామీణ ప్రాంతానికి (రోజుకు–రూ. 22.42) రూ. 672.80, పట్టణ ప్రాంతానికి (రోజుకు–రూ.28.65) రూ.859.60 నెలసరి తలసరి వినియోగ వ్యయాలుగా ఉన్నాయి. దీన్ని గమనిస్తే కాలానుగుణంగా నెలసరి తలసరి వినియోగ వ్యయం పెరుగుతూ వస్తున్నట్టు తెలుస్తోంది. మన దేశంలో ప్రతి ఐదేళ్లకోసారి నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ Large Sample Survey ద్వారా కుటుంబం వ్యయాన్ని అంచనా వేస్తున్నారు.

నిపుణుల సంఘం 1973-74 నుంచి 1987-88 వరకు14 ఏళ్ల కాల వ్యవధిలో రూపొందించిన పేదరిక అంచనాలు కింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

సంవత్సరం	గ్రామీణ పేదరికం మిలియన్లలో	పట్టణ పేదరికం మిలియన్లలో	మొత్తం పేదరికం మిలియన్లలో	గ్రామీణ పేదరిక శాతం	పట్టణ పేదరిక శాతం	మొత్తం పేదరిక శాతం
1973-74	261.3	60.3	321.6	56.4	49.2	54.9
1977-78	264.3	67.7	332.0	53.1	47.4	51.8
1983	251.7	75.3	327.0	45.6	42.2	44.8
1987-88	229.4	83.3	312.7	39.1	40.1	39.3

కింద టేబుల్‌ను పరిశీలిస్తే గ్రామీణ పేదరికం 56.4% నుంచి 39.1% నికి తగ్గగా, పట్టణ పేదరికం 49.2% నుంచి 40.1% నికి మాత్రమే తగ్గింది. 1987-88 నాటికి గ్రామీణ పేదరికం కంటే పట్టణ పేదరికమే ఎక్కువగా ఉంది. ఈ 14 ఏళ్ల కాలంలో మొత్తం పేదరికం 54.9% నుంచి 39.3% నికి తగ్గింది. అంటే పేదరికం 15.6% తగ్గగా సాలీనా ఇది 1.2% తగ్గింది.

1993లో లక్డవాలా అధ్యక్షతన పేదరికంపై నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీ రాష్ట్రాల మధ్య ఉండే ధరల వ్యత్యాసాన్ని బట్టి ఆయా రాష్ట్రాల ప్రత్యేక వినియోగ ధరల సూచీ ఆధారంగా పేదరికాన్ని లెక్కించాలని సూచించింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

సురేశ్ టెండూల్కర్ కమిటీ

పేదరిక అంచనా పద్ధతిని సమీక్షించేందుకు నియమించిన సురేశ్ టెండూల్కర్ కమిటీ తన నివేదికను 2009లో ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో కమిటీ పేదరిక రేఖను నిర్ణయించడానికి మన్నిక గల వస్తువులతోపాటు విద్య, ఆరోగ్యంపై చేసే వ్యయాన్ని కూడా పరిగణనలోనికి తీసుకోవాలని, పేదరిక రేఖను నిర్ణయించడానికి కేలరీల బదులు జీవన వ్యయ సూచీని ఉపయోగించాలని సిఫార్సు చేసింది. వాటితోపాటు ప్రస్తుతమున్న Uniform Recall Period బదులు Mixed Recall Period పద్ధతిని అనుసరించాలని పేర్కొంది. 2004-05గాను నెలసరి తలసరి వినియోగ వ్యయం గ్రామాల్లో రూ.446.68 కాగా, పట్టణాల్లో రూ. 578.-80. దీని ప్రకారం గ్రామీణ పేదరికం 41.8%గా, పట్టణ పేదరికం 25.7%గా నమోదైంది. భారతదేశ పేదరికాన్ని 37.2%గా లెక్కించారు.

- ప్రస్తుతం ప్రణాళిక సంఘం అనుసరిస్తున్న సురేశ్ టెండూల్కర్ కమిటీ సూచించిన పేదరిక అధ్యయన పద్ధతిని సమీక్షించేందుకు 2012లో రంగరాజన్ అధ్యక్షతన కమిటీని నియమించారు. ఈ కమిటీ తన రిపోర్టులో ప్రతి పది మందిలో ముగ్గురు పేదరికంలో ఉన్నట్లు అంచనా వేసింది. దాంతోపాటు సురేశ్ టెండూల్కర్ కమిటీ నిర్ణయించిన పట్టణ రోజువారీ వినియోగ వ్యయాన్ని రూ. 33 నుంచి రూ. 47లకు, గ్రామీణ రోజువారీ వినియోగ వ్యయాన్ని రూ.27 నుంచి రూ.32 లకు పెంచింది.
- సురేశ్ టెండూల్కర్ కమిటీ ప్రకారం 2011-12 లో పేదరిక జనాభా 21.9% కాగా, రంగరాజన్ కమిటీ ప్రకారం 29.5%. రెండు కమిటీలు తీసుకున్న రోజువారీ, నెలవారీ, తలసరి వినియోగ వ్యయ వ్యత్యాసాలను ఈ కింది పట్టికలో గమనించవచ్చు.

కమిటీ	సంవత్సరం	రోజువారీ తలసరి వినియోగ వ్యయం		నెలవారీ తలసరీ వినియోగ వ్యయం		సగటు కుటుంబ నెలవారీ వినియోగ వ్యయం	
		గ్రామీణ	పట్టణ	గ్రామీణ	పట్టణ	గ్రామీణ	పట్టణ
రంగరాజన్	2011-12	32.4	46.9	972	1407	4760	7035
	2009-10	26.7	39.9	801	1198	4005	5990
టెండూల్కర్	2011-12	27.2	33.3	816	1000	4080	5000
	2009-10	22.4	28.7	673	860	3365	4300

నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్.. వివిధ రౌండ్లల్లో ఇచ్చిన జనాభా శాతం, పేదరిక జనాభా వివరాలు..

- 50వ రౌండ్ (1993-94) పేదరికం 36% , పేదల జనాభా 32 కోట్లు
- 55వ రౌండ్ (1999-2000) పేదరికం 26%, పేదల జనాభా 26 కోట్లు
- 61వ రౌండ్ (2004-05) పేదరికం 27.5%, పేదల జనాభా 30 కోట్లు
- 66వ రౌండ్ (2009-10) పేదరికం 29.8%, పేదల జనాభా 35 కోట్లు

2004-05లో NSSO 61వ రౌండ్‌లో పేదరికాన్ని రెండు రకాలుగా లెక్కించారు. అవి..

1. **URP (Uniform Recall Period):** దీనిలో అన్ని వస్తువులపై చేసే వ్యయాన్ని 30 రోజుల రీకాల్ పద్ధతిలో తీసుకుంటారు. అంటే మొదటి నెలలో చేసిన వ్యయాన్ని ప్రతి నెలా చేస్తారని భావించి లెక్కిస్తారు.
2. **MRP (Mixed Recall Period):** ఇందులో తరచుగా కొనుగోలు చేయని వస్తువులైన వస్త్రాలు, పాదరక్షలు, మన్నిక గల వస్తువులు, విద్య, ఆరోగ్యం తదితర 5 రకాలవాటిపై చేసే వ్యయాన్ని 365 రోజులు ప్రాతిపదికపైన, మిగిలినవాటిని 30 రోజుల ప్రాతిపదికపైన పరిగణనలోకి తీసుకొని పేదరికాన్ని అంచనా వేశారు.

2004–05లో URP పద్ధతి ప్రకారం పేదరికం 27.5% కాగా, MRP పద్ధతి ప్రకారం 21.8% . 2012, మార్చి 19న ప్రణాళికా సంఘం NSSO 66వ రౌండ్ గణాంకాలను విడుదల చేసింది. పేదరిక రేఖ నిర్ధారణకు గ్రామీణ ప్రాంతంలో రూ. 672.80 నెలసరి వినియోగ వ్యయం (రోజుకు రూ. 22.40) కాగా, పట్టణ ప్రాంతంలో నెలసరి వినియోగ వ్యయం రూ. 859.60 (రోజుకు రూ.28.60)గా నిర్ణయించారు. దీని ప్రకారం 2009-10లో మన దేశంలో 29.8% జనాభా పేదరికంలో ఉంది. ఇందులో గ్రామీణ పేదరికం 33.8% కాగా, పట్టణ పేదరికం 20.9%గా నమోదైంది.

Towards which direction is A from R?

BANK EXAMS
REASONING

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): In each question below are given two statements followed by two conclusions numbered I and II. You have to take the given statements to be true even if they seem to be at variance with commonly known facts and then decide which of the given conclusions logically follows from the given statements, disregarding commonly known facts.

Give answer:
1) If only conclusion I follows
2) If only conclusion II follows
3) If either conclusion I or II follows
4) If neither conclusion I nor II follows
5) If both conclusions I and II follow

1. Statements:
All doctors are graduates.
All professors are graduates.
All engineers are graduates.
Conclusions:
I) Some professors can be doctors.
II) Some engineers may be doctors.

2. Statements:
Some cats are pens.
Some pens are big.
Some big are costly.
Conclusions:
I) No cat is costly.
II) Some big are definitely not cats.

3. Statements:
Some Benches are magazines.
All magazines are novels.
Some novels are papers.
Conclusions:
I) All benches being magazines is a possibility.
II) All papers being novels is a possibility.

4. Statements:
All cats are fans.
All fans are guns.
Some guns are hats.
Conclusions:
I) No fan is hat.
II) Some fans are hats.

5. Statements:
All tables are rats.
Some rats are chairs.
Some chairs are desks.
Conclusions:
I) Some desks are not tables.
II) All desks are tables.

Directions (Q. No. 6 - 10): Each of the questions below consists of a question and two statements marked I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and

Give answer:
1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statements II alone are not sufficient to answer the question, while the data in statement II alone are sufficient to answer the question.
3) If the data either in statement I or in statement II alone are sufficient to answer the question.
4) If the data even in both the statements I and II together are not sufficient to answer the question.
5) If the data in both statements I and II together are needed to answer the question.

6. Towards which direction is A from R?
I) A is exactly to the south east of M.
II) R is exactly to the south of M.

7. How many daughters does A have?
I) P and Q are the only daughters of B.
II) D is brother of P and son of A.

8. Among P, Q, R, S and T sitting in a straight line facing north, who sits exactly in the middle of the line?
I) P sits third to the left of S. T is second to the left of R and an immediate neighbour of S.
II) P is second to the left of T who is second to the left of R.

9. Who amongst P, Q, R, S, T and U is the tallest?
I) P is taller that S and T but shorter than R. Q is taller than R.
II) T is taller than S. P is not the tallest.

10. Is C the grandmother of M?
I) C is the mother of D. D is the brother of M's father.
II) M is son of N, who is daughter of C.

Directions (Q. No. 11-15): Read each statement carefully and answer the following questions:

11. Which of the following expressions will be true if the expression D ^{3} E > F, R ^{3} B >T = D is definitely true?
1) R ^{3} D 2) B ^{3} D
3) F > R 4) T > F
5) R ^{3} E

12. which of the symbols should be placed in the blank space from left to right respectively to complete the expression in such a manner that T > B, C > T and D > F are definitely true?
D £ T _ X, D _ B, C = X, F _ B
1) <, >, < 2) >, >, <
3) =, <, > 4) =, <, <
5) >, =, <

13. Which of the following symbols should replace the question mark (?) in the given expression to make the expression A > N and K ^{3} N definitely true?
A ? K ^{3} L ? M ? N < O
1) <, >, = 2) >, ^{3}, =
3) >, £, ^{3} 4) >, =, £
5) None of these

14. which of the following symbols should be placed in the blank spaces respectively from left to right to complete the given expression in such a manner that the expression B > W is definitely false and the expressions Z ^{3} B and Y ^{3} V are definitely true?
Z _ Y _ X ^{3} W = V _ B
1) ^{3}, ^{3}, ^{3} 2) £, £, ^{3}
3) >, ^{3}, > 4) ^{3}, =, <
5) None of these

15. In which of the following expressions is 'P > Q' not definitely true?
1) Q > C £ R < P
2) Q £ R < S £ P
3) P > S = T ^{3} Q
4) P > S = T ^{3} Q
5) None of these

Directions (Q. No. 16–20): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement:

Input: desk caring 32 18 today for 58 78
Step I: 18 desk caring 32 today for 58 78
Step II: 18 today desk caring 32 for 58 78
Step III: 18 today 32 desk caring for 58 78
Step IV: 18 today 32 for desk caring 58 78
Step V: 18 today 32 for 58 desk caring 78
Step VI: 18 today 32 for 58 desk 78 caring

And Step VI is the last step.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate Step for the given input.

16. Input: year 24 far 32 17 12 wide goal
Which of the following will be Step V of the above input?
1) 12 year 17 wide 24 goal 32 far
2) 12 year 24 wide far 32 17 goal
3) 12 year 24 far 32 17 wide goal
4) There will be no such step
5) None of these

17. Step IV of an input: 13 honk 29 father 83 76 door eye. Which of the following will be Step VI?
1) 13 honk 29 father 76 door 83 age
2) 13 honk 29 father 76 age 83 door
3) 13 honk 29 father 76 83 door age
4) 13 honk 29 father 76 eye 83 door
5) None of these

18. Step III of an input: 17 water 32 85 73 tax break home. How many more steps will be required to complete the rearrangement?
1) Five
2) Four
3) Six
4) Two
5) Three

19. Step III of an input: 37 xmas 42 61 53 violet green red. How many more steps will be required to complete the rearrangement?
1) 3 2) 4 3) 5 4) 6

20. Step II of an input: 28 sure 72 63 height over 42 lamp. Which of the following is definitely the input?
1) height 28 sure 72 63 over 42 lamp
2) 72 63 28 sure height over 42 lamp
3) 63 28 sure 72 height over 42 lamp
4) Cannot be determined
5) None of these

Solutions

1. As the given statements are affirmative both the positive possibilities follow. **Ans: 5**
2. As the given statements are affirmative both the negative definite conclusions don't follow. **Ans: 4**
3. As the given statements are affirmative both the positive possibilities follow. **Ans: 5**
4. Both the conclusions form a complementary pair. So, either I or II follows. **Ans: 3**
5. Both the conclusions form a complementary pair. So, either I or II follows. **Ans: 3**
6. The distance between A and M as well as between R and M is not given. Hence, we cannot find out the direction. **Ans: 4**
7. By combining both the statements, it can be concluded that A and B are married couple, and P and Q are the only daughters of A and B. **Ans: 5**
8. Either statement I or statement II is sufficient to answer the question. **Ans: 3**
   <u>**P Q T S R**</u>
9. Only statement I is sufficient.
   Q > R > P > S & T **Ans: 1**
10. Only statement I is sufficient. C's gender is not known in the second statement. **Ans: 1**

(11-15) Answers: 11) 4; 12) 1; 13) 2; 14) 1; 15) 1.

(16-20): The illustration clearly shows that numbers and words are arranged alternatively in such a way that numbers in ascending order and words in reverse order.

16. Input: year 24 far 32 17 12 wide goal
Step I: 12 year 24 far 32 17 wide goal
Step II: 12 year 17 24 far 32 wide goal
Step III: 12 year 17 wide 24 far 32 goal
Step IV: 12 year 17 wide 24 goal far 32
Step V: 12 year 17 wide 24 goal 32 far
Ans: 1

17. Step IV: 13 honk 29 father 83 76 door eye
Step V: 13 honk 29 father 76 83 door eye
Step VI: 13 honk 29 father 76 eye 83 door
Ans: 4

18. Step III: 17 water 32 85 73 tax break home
Step IV: 17 water 32 tax 85 73 break home
Step V: 17 water 32 tax 73 85 break home
Step VI: 17 water 32 tax 73 home 85 break
To complete the rearrangement there will be 3 more steps.
Ans: 5

19. Step III: 37 xmas 42 61 53 violet green red
Step IV: 37 xmas 42 violet 61 53 green red
Step V: 37 xmas 42 violet 53 61 green red
Step VI: 37 xmas 42 violet 53 red 61 green
Hence to complete the rearrangement 3 more steps will be required. **Ans: 1**

20. Previous steps cannot be determined. **Ans: 4**